# గోరువెచ్చని సూరీడు

---కొమ్మనాపల్లి గణపతిరావు

“హెన్స్ ది ఇండస్ట్రియల్ గ్రోతాఫ్ ఎనీ కంట్రీ డిపెండ్స్ ఆన్ ది ఎకనామికల్ పోలసీస్ ఆఫిట్ గవర్నమెంట్...”

న్యూయార్క్ నగరం నడిబొడ్డున వున్న సెంటినరీ హాల్లో ‘న్యూ డీల్ షేర్ కన్సల్టెన్సీ’ ప్రతినిధిగా మాట్లాడుతున్న కృషి ఆగింది క్షణంపాటు...

ఆమెకు అభిముఖంగా సుమారు వందమంది దాకా అమెరికాలోని వివిధ వృత్తుల్లో సెటిలైన నాన్ రెసిడెంట్ ఇండియన్స్ కూర్చుని వున్నారు. భారత ప్రభుత్వం ఆహ్వానంపై ఇండియన్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలనుకుంటున్న వ్యక్తులు వాళ్ళంతా. వారిలో సైంటిస్టులూ డాక్టర్లూ ఇంజనీర్లు మాత్రమే కాక ఇండియన్ ఎంబసీ ఉద్యోగులూ వున్నారు.

సూర్యాస్తమయ వేళ లాగార్డియా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి పక్షుల్లా ఎగిరే విమానాల్ని కాని, సమీపంలో నింగిని తాకుతున్నట్టుగా కనిపిస్తున్న మిస్ లిబర్టీ స్టేట్యూను గాని గమనించడం లేదు- ఇరవై మూడేళ్ళ కృషినే చూస్తున్నారు. ఆమెది మామూలు అందం కాదు. చూపుల భూపాలంతో సూర్యుడ్ని ఉదయింప చేసి ఆ కిరణాల కాంతిలో ప్రాణం పోసుకున్న అశేష తైలవర్ణ చిత్రం ఆమె.... రెప్పల పరదాల క్రింద ఏ అస్పష్టపు ఆర్తినో అదిమిపెడుతూ నా నివాసమ్ముతొలుత గంధర్వలోక మధుర సుషమా సుధాగాన మంజువాటి అని చెప్పే నిద్రాముద్రిత స్వప్న రహదారులు ఆమె నేత్రాలు...

నిజానికి వారిని ఆకట్టుకుంటున్నది ఆమె అందమో లేక ఇరవై మూడేళ్ళ వయసుకే కృషి ప్రదర్శించే మెచ్యూరిటీయో స్పష్టంగా తోచడం లేదు. కాని ప్రపంచంలో మోస్ట్ కమ్యూనికేటివ్ పీపుల్‌గా పేరు పొందిన అమెరికన్స్‌తో సమాన స్థాయిలో నిలబడి విషయాన్ని వ్యక్తం చేయగలుగుతోంది. ఆమె పుట్టింది భారతదేశంలోని తెలుగు రాష్ట్రంలో అయినా ఎంబియే పూర్తి చేసింది హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో కావడమో ఆమె ప్రజ్ఞకి కారణమని కొందరంటే ఆమె వచ్చింది ప్రముఖ పారిశ్రామిక వేత్త కుటుంబం నుంచి కావటమే అని మరికొందరి అభిప్రాయం.

“షేర్స్ వ్యాపారం నిజానికి రేస్ కాదు. గేంబ్లింగ్ కాదు. అలాంటిది కాదని నిరూపిస్తూ లాభాలని ఆర్జించాలంటే ముందు మార్కెట్‌పై అవగాహన కావాలి. మీరు పెట్టుబడి పెట్టే కంపెనీల సమాచారాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని వుండాలి. షేర్ వ్యాపారంలో కోటాను కోట్ల రూపాయలు ఆర్జించిన వాళ్ళకీ సామాన్యమైన ఇన్వెస్టరులకీ భేదం ఒక్కటే- పరిశీలన, పరిశోధన ఉదాహరణకి... ప్రేక్షకులవేపు దృష్టి సారిస్తూ పాలభాగంపై నర్తిస్తున్న ముంగురుల్ని సవరించుకుంది సుతారంగా.

“ఇండియా బడ్జెట్‌లో ప్లాస్టిక్ కిటికీలు, తలుపులు తయారీపై ఎక్సైజు సుంకాన్ని పూర్తిగా

మినహాయించారు. దానితో ప్లాస్టిక్ కిటికీలు, తలుపులతో బాటు ప్లాస్టిక్ వాటర్ టాంకుల్ని తయారు చేసే సింటెక్స్ షేర్ మార్కెట్ ధర విపరీతంగా పెరిగింది. భారతదేశంలో విద్యుచ్ఛక్తి కొరత అధికంగా వుంది. కాబట్టి అనేక పరిశ్రమలు భారీ డీజిల్ జనరేటర్స్‌ని సమకూర్చుకోవటం అవసరమైది. అలాంటప్పుడు డీజిల్ జనరేటర్స్‌ని ఉత్పాదకంగా తయారుచేసే కంపెనీల షేర్స్‌కి డిమాండ్ వుంటుంది. ఈ పరిశీలనే ఇన్వెస్టర్స్‌కి చాలా అవసరం.”

“ఎక్స్‌క్యూజ్మీ మాడమ్” ప్రేక్షకుల్లోంచి ఓ ఇండియన్ డాక్టర్ అడిగాడు. “బాంకు రుణాలపై వడ్డీ పెరిగితే అది మార్కెట్ పై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది?”

“ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయమూ మార్కెట్‌పై తప్పకుండా ప్రభావం చూపుతుంది. అంతే కాదు. ప్రకృతి సిద్ధమైన మార్పులూ మార్కెట్‌ని శాసిస్తుంటాయి. ఉదాహరణకి భారతదేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే పంటలు సరిగ్గా పండక ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏర్పడినప్పుడు దేశంలోని విదేశీ ద్రవ్యపు నిధులు తిరిగి ధరలు అదుపు తప్పి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అలాగే బ్యాంకు రుణాలపై వడ్డీరేట్లు పెరిగితే ఫైనాన్సు కంపెనీలు అందించే రుణాన్ని అనుసరించి అమ్మకం జరిగే కార్లు, ట్రక్కులు జీపుల ధర పెరుగుతుంది. అంటే వాటి షేర్సు ధర తగ్గుతుంది. అంతే కాదు. ఆటోమొబైల్స్ విడిపరికరాలు తయారుచేసే కంపెనీల, ఇంకా టైర్ల కంపెనీల షేర్ల ధరలు పడిపోతాయి...”

భారతదేశపు ఎగ్జిం పాలసీ మొదలుకొని ప్రస్తుతం మార్కెట్ స్థితిగతుల గురించి ప్రతి ప్రశ్నకీ తడబాటులేకుండా జవాబులు చెప్పింది కృషి.

వయసుకి మించిన పరిపక్వత అసాధారణమైన విశ్లేషణతో కృషి అక్కడ సమావేశమైన భారతీయుల్ని ఎంతగా ఆకట్టుకుందీ అంటే ఆమె తమ దేశలో పుట్టిన ఆడపిల్లయినందుకు మనస్ఫూర్తిగా అభినందించారంతా. . .

మరో అరగంటకల్లా సెమినార్ ముగిసింది.

అంతసేపూ డయాస్‌పై ఆమె పక్కనే కూర్చున్న ‘న్యూ డీల్ కన్సల్టెన్సీ’ అధిపతి స్టీఫెన్ సీగల్ ఫోర్డు కారు వేపు నడుస్తూ అన్నాడు. “ఇట్స్ మార్వెలెస్ మిస్ కృషి సెమినార్‌ని అద్భుతంగా జయప్రదం చేశారు.”

సుమారు ఇరవై అయిదు సంవత్సరాల వయసున్న సీగల్ స్వతహాగా బిలియనీర్ మాత్రమేగాక స్టేట్స్‌లో చాలా పేరున్న షేర్ కన్సల్టెంట్. కృషి అతడి దగ్గర జాబ్‌లో చేరింది కేవలం రెండు నెలల క్రితం మాత్రమే అయినా అతడ్ని చాలా ఆకట్టుకుంది.

ఫోర్డ్ కారు రూజ్‌వెల్ట్ టైం స్క్వేర్‌లో వెళ్తుండగా అన్నాడు పక్కనే కూర్చున్న కృషిని తదేకంగా గమనిస్తూ. “ఇట్స్ రియల్ మిస్ కృషి. మీ విశ్లేషణ, మీ ఆలోచనల్లో క్లారిటీ నన్నే కాదు చాలా మందిని ఆశ్చర్యపరుస్తోంది. అయామ్ ష్యూర్. మీ అండతో నా కన్సల్టెన్సీ ఫర్మ్ మరింత పెరుగుతుంది”.

“అయామ్ ఫీలింగ్ ప్రౌడ్” అంది మొహమాటంగా నవ్వుతూ.

"నేను ఎగ్జాగరేట్ చేసి మాట్లాడం లేదు. చాలా మంది అభిప్రాయం విన్నాక అంటున్నాను."

ఇది తొలిసారి కాదు. ఇదే అభిప్రాయాన్ని ఈ మధ్య అతడు చాలాసార్లు వ్యక్తం చేశాడు.

అది అతడి వయసుకి సహజమైన పారవశ్యమో లేక ఆమెపై అతడు పెంచుకుంటున్న మక్కువకి తార్కాణమో. ఆమె సమక్షంలో చాలా ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుంటాడు. "భారతదేశంపై ఒకనాడు పెద్ద సదభిప్రాయంలేదు కృషి. కాని మిమ్మల్ని చూశాక మీ దేశంపై ఆరాధన పెరిగింది."

"మీ కాంప్లిమెంట్‌కి ఆనందిస్తున్నాను మిస్టర్ సీగల్..... కాని వేదాంత పరమైన ఆలోచనల్లో మీ దేశవాసులచేత కూడా అభినందించబడ్డ వివేకానందుడ్ని, అహింసా సిద్ధాంత రీత్యా మీ లూథర్‌కింగ్‌కే ఆదర్శప్రాయుడైన గాంధీని మరిచిపోయి నాతో నా దేశాన్ని కొలవాలని ప్రయత్నిస్తున్నారు."

"పేట్రియాటిక్‌గా ఆలోచిస్తున్నారనుకుంటాను."

"లేదు" నిర్మొహమాటంగా అంది కృషి. "నా దేశం ఓ భగవద్గీతగా ప్రపంచ దేశాలే గుర్తించిన తరుణాన ఆ దేశం గురించి తక్కువగా అంచనా వేయటం మీలాంటి మేధావులకి సరికాదంటున్నాను. . ."

"యూ మేడ్‌మి షట్ మై మౌత్" నవ్వేశాడు సీగల్. "నేనంటున్నది అది కాదు మిస్ కృషి..... మీరో కోటీశ్వరుడికి గ్రాండ్ డాటర్ అయ్యుండీ ఇలా మీ కాళ్ళపై మీరు నిలబడడం, దేశం కాని దేశంలో ఇలా బ్రతకాలనుకోవటం మీ దేశవాసుల అభిరుచికి, అలవాట్లకి భిన్నంగా అనిపించి అలా మాట్లాడాను."

"బహుశా మా దేశంలోని మనుషుల సోమరితనం రాజీపడి బ్రతికే అలవాటుని ఉద్దేశించి ఇలా అంటున్నారనుకుంటాను. అయితే నా అభిప్రాయమూ వినండి. ఐక్యూ స్థాయి పరంగా చూస్తే భారతదేశ ప్రజలు మీ దేశం కన్నా ఉన్నత స్థాయి గలవారు. ఇది మీరూ అంగీకరించే సత్యమేగా. కాకపోతే విడిగా మేధావులుగా గుర్తించబడిన నా మనుషులు ఉమ్మడిగా అవకాశవాదులుగా ప్రవర్తిస్తుంటారు. దీనికి కారణాలు కలుషిత రాజకీయాలు, పొంతనలేని కొన్ని సాంఘికమైన సాంప్రదాయాలు కూడా. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అక్కడ ప్రజల సెంటిమెంట్స్ మేధావుల ఆలోచనల్ని శాసించి పురోభివృద్ధిని కుంటు పరుస్తుంటాయి."

విస్ఫారిత నేత్రాలతో చూస్తూ అన్నాడు "హి మిస్డ్ యు"

"ఎవరు" అంది టక్కున.

"మీ గ్రాండ్ ఫాదర్. . . నిజం కృషి! మీలాంటి ఇంటెలిజెంట్ గాళ్‌ని తను మిస్ చేసుకుని నన్ను అదృష్టవంతుడ్ని చేశారు."

అతడు ఏ ఉద్దేశ్యంతో ఆ మాట అన్నాగాని ఉన్నట్టుండి ఆమె మొహంలో రంగులు మారిపోయాయి.

అది పట్టుదలలో పలాయన వాదమో తెలీకుండా తాతయ్యకి దూరంగా బ్రతుకుతున్న కృషిని ఇప్పుడు తాతయ్య ఆలోచన ఎంతగా కలవర పరిచిందీ అంటే తల పక్కకు తిప్పి బయటికి చూస్తూ ఉండిపోయింది.

ఆ క్షణంలో ఆమెకు తెలీదు. . .

ఏ తాతయ్య గురించి ఆమె ఆలోచిస్తుందో అతడిప్పుడు ప్రాణాపాయ స్థితిలో హాస్పిటల్లో అడ్మిట్ చేయబడ్డాడు కొన్ని గంటల క్రితమే.

0 0 0 0

భారతదేశంలోని హైద్రాబాదు నగరం.

సాయంకాలం అయిదు గంటల సమయాన అపోలో హాస్పిటల్ విఐపి రెస్ట్ రూంలో బడలికగా కూర్చుని వున్నాడు డాక్టర్ మహంతి.

అప్పటికే శ్రీ ఉపాధ్యాయకి సర్జరీ జరిగి ముప్పై ఆరుగంటలయ్యింది.

అరవై అయిదు సంవత్సరాల వయసున్న శ్రీ ఉపాధ్యాయ తెలుగువాడిగా రాష్ట్రంలోనేగాక పారిశ్రామికవేత్తగా జాతీయస్థాయిలోనూ ప్రముఖుడే. . . కాబట్టి ఫేక్టరీ ఎమ్డి ఛాంబర్ ప్రొడక్షన్ మీటింగ్‌లో వున్నట్టుండి కొలాప్స్ కాగానే అపోలోలో అడ్మిట్ చేయబడ్డాడు. ఒకరూ ఇద్దరూ కాదు నగరంలో ప్రముఖ వైద్య నిపుణులంతా అటెండ్ అయ్యారు. ఇంచుమించు ఉపాధ్యాయ వయసున్న డాక్టర్ మహంతి ఆయన ఫేమిలీ డాక్టరుగా సర్జరీ మొదలైన దగ్గర్నుంచీ హాస్పటల్లోనే వుండిపోయాడు. నిజానికి డాక్టర్ మహంతి శ్రీ ఉపాధ్యాయ పర్సనల్ డాక్టర్ మాత్రమే కాదు మంచి స్నేహితుడు కూడా.

దేశంలోని వైద్య విజ్ఞానాన్నంతా కొనేయగల శ్రీ ఉపాధ్యాయకి బ్రెయిన్ సర్జరీ అవసరమని నిర్ధారించబడ్డాక డాక్టర్ మహంతి ప్రెసిడెంట్ ఆనరరీ సర్జన్ గోపీనాథ్‌ని రప్పించాడు. ఆపరేషన్ జయప్రదంగా ముగిసినా ఇప్పటికీ ఏమవుతుందో తెలీని పరిస్థితి. ఇంకా స్పృహలోకి రాని ఉపాధ్యాయ అనుమతితో అవసరం లేనట్టు స్టేట్స్‌లో వున్న కృషికి ఫోన్ చేశాడు.

కృషి వస్తుందన్న నమ్మకం లేదు.

పట్టుదలలో, మొండితనంలో ఆ తాతయ్యకి మనవరాలిగా కృషి ఎందుకు దూరమైనా కాని ఇప్పుడు వస్తే బాగుణ్నని మనస్ఫూర్తిగా కోరుకున్నాడాయన.

డబ్బు వ్యక్తిగత గౌరవాన్ని పెంచడమే గాక అదే డబ్బు వ్యక్తుల అభిమానాన్నే గాయపరుస్తుంది. ఈ ప్రపంచంలో డబ్బు, పరపతి, దాన్ని కాపాడుకోవాలనే ఆలోచన తప్ప మరొకటి లేని శ్రీ ఉపాధ్యాయకి తన వాళ్ళంటూ ఎవ్వరూ లేరు కృషి తప్ప. . . ఆ విషయం గుర్తించనట్టు బ్రతకడం ఉపాధ్యాయకి అలవాటుగా మారితే అలాంటి తాతయ్యతో తనకు పనిలేదన్నట్టు కృషి ఆలోచిస్తోంది.

రెండు భిన్న ధోరణుల్ని వేరుచేసే చిన్న సరళ రేఖ అది. అసలు ఉపాధ్యాయ

దృష్ట్యా బెడ్‌మీద వుండడం ఇదే తొలిసారి. ఒక పారిశ్రామికవేత్తగా ఉపాధ్యాయ రోజూ రెండు గంటలకి మించి నిద్రపోడు. ప్రతి నిమిషాన్ని ఉత్పాదకంగా మార్చుకునే ఉపాధ్యాయ ఎక్కువగా విశ్రాంతి తీసుకునేది విమాన ప్రయాణాల్లోనే. . . పరిశ్రమ అన్న పదానికి, అవిశ్రాంత పోరాటం అన్న విశేషణానికి నిజమైన ఉదాహరణ ఆయన.

"అంకుల్"

ఆలోచనల నుంచి తేరుకున్న డాక్టరు మహంతి తల పైకెత్తి చూశాడు.

కృషి నిలబడి వుంది అతడికి అభిముఖంగా.

ముందిది కలేమో అనుకున్నాడు.

ఫోన్ లేదు- వస్తానన్న సూచనలేదు. కాని ముప్పై ఆరు గంటల్లో కృషి ఇండియా వచ్చింది.

ఇది అనూహ్యమైన సన్నివేశమే అయినందుకేమో ఉద్వేగ్నంగా పైకిలేచి ఆప్యాయంగా తల నిమిరాడు.

"గ్రాండ్ పా ఎలా వున్నారు"

ముందాయన గొంతు పెగల్లేదు. . . "ప్రమాదం నుంచి బయటపడ్డారు."

అనేశాడు కాని ఆయనకీ ఇంకా నమ్మకం లేదు. ఒకవేళ ఉపాధ్యాయ స్పృహలోకి వచ్చి మామూలు మనుషుల మధ్య తిరిగినా అది తాత్కాలికమే అని డాక్టర్ గోపీనాథ్ అన్న మాటలు అతడికింకా గుర్తున్నాయి.

ఇద్దరూ నిశ్శబ్దంగా ఐసియులోకి వెళ్ళారు.

ఒక అసాధారణమైన పారిశ్రామిక సామ్రాజ్యాన్ని శాసిస్తున్న తాతయ్య-నలభై సంవత్సరాల కాలంలో తన మెదడును వుపయోగించి ఆ స్థాయిని చేరుకున్న వ్యక్తి- ఇప్పుడు బ్రెయిన్ సర్జరీలో ఈ క్షణంలో అయినా తనొక నిస్సహాయుడ్నని అంగీకరించినట్లు కనిపిస్తున్నాడు.

డబ్బు కీర్తి ప్రతిష్టలనే సరిహద్దు రేఖల్లో బ్రతకడమే అలవాటైన ఓ వ్యక్తి ఇదిగో ఇక్కడ మరో తెరుచుకున్న కొత్త డైమెన్షన్‌కి ఉదాహరణగా కనిపిస్తున్నాడు.

కృషి ఫోం చేయలేదు ఇంటికి వెళ్ళలేదు.

అపరాత్రిదాకా హాస్పిటల్ లాన్‌లో పచార్లు చేస్తూ గడిపింది. చుట్టూ ఆవరించిన చీకటి. . . ఆకాశంలో నిర్వికారంగా చిరుకాంతుల్ని వెదజల్లుతున్న నక్షత్రాలు. . . సమూహం మధ్య ఏకాంతం లాంటి ఒంటరితనం. . . అలసటగా అర్ధనిమీలితాలౌతున్న నేత్రాలు. . . బాల్యంలోనే దూరమైన తల్లిదండ్రులు- ఇంపోర్టెడ్ కార్లు రెసిడెన్షియల్ స్కూల్స్, విదేశాల్లో చదువు- కలల హవేలీలో పరిమళం కోల్పోతున్న పూలకొమ్మలాంటి జీవితం- ఆకుపచ్చని యౌవన వనంలో వాడిగా రగులుతున్న వెన్నెల రెక్కల కోసం సంకీర్ణంగా సాగిస్తున్న ఒంటరి ప్రయాణం- అసలిది బ్రతుకో లేక వూపిరి ఉద్వేగాల్ని రంగులుగా అద్ది ఆనందించు కోవాలనుకునే శూన్యపు కేన్వాసులాంటి భ్రమో తోచడంలేదు.

"మేడమ్" ఎవరో వచ్చారు ఉద్విగ్నంగా. "మీ గ్రాండ్ పా స్పృహలోకి వచ్చారు-"

క్షణం ఆనందం. వెనువెంటనే అదోలాంటి ఆందోళన.

సన్నగా కంపిస్తూ ఐసియులో అడుగుపెట్టింది.

తననే చూస్తున్నాడో లేక చూస్తూ ఆలోచిస్తున్నాడో అర్థం కావడం లేదు.

"గ్రాండ్ పా" అంది శక్తిని కూడగట్టుకుంటూ.

ఆయన మొహం విభ్రమం. . . చాలా సేపటి నిశ్శబ్దం తర్వాత అన్నారు "ఐ నెవ్వర్ ఎక్స్‌పెక్టెడ్"

అది ఆనందమో లేక వచ్చినందుకు అయిష్టతో ఆమెకు బోధపడలేదు. కాని అలాంటి ప్రతిస్పందన ఆమె కోరనిది.

అంతకన్నా "నువ్వు వస్తావని ఊహించలేదు బేబీ" అంటే ఎక్కువ ఆనందించేదేమో.

పదాల్ని కూడగట్టుకుంటున్నట్టుగా అంది."యూ ఆర్ ఓకే గ్రాండ్ పా"

"సైనికుడు మరణించాలనుకునేది యుద్ధ రంగంలోనే కృషి- "

ఉక్రోషంగా చూసిందామె. సెంటిమెంట్స్‌కి అతీతంగా బ్రతకడమే ధ్యేయంగా పెట్టుకున్న ఉపాధ్యాయ సిద్ధాంతాలకీ ఆమెకూ మధ్య ఘర్షణ ఈనాటిది కాదు. . . "మీరు రిలాక్స్ కండి"

ఆమె బయటికి నడిచేదే. . .

"ఆగు" ఆయన కంఠం మృదువుగా పలికినా అందులో అణువంత మొండితనమూ ధ్వనించింది. "పెళ్ళి చేసుకునే ప్రసక్తే లేదన్నావు. శాశ్వతంగా స్టేట్స్‌లోనే సెటిలవ్వాలని వెళ్ళావు కదూ."

"ఇప్పటికీ ఆ అభిప్రాయంలో మార్పులేదు"

"మరిప్పుడెందుకొచ్చావ్"

"అది మీకు అర్థం కాదు గ్రాండ్ పా- " అందామె కళ్ళు నీళ్ళు పర్యంతమవుతుంటే ఇలాంటి ఆహ్వానాన్ని అందుకున్నందుకు బాధగా బయటికి వచ్చేసింది.

ఎంతసేపు చీకటిలోకి చూస్తూ నిలబడిందో ఆమెకే గుర్తులేదు.

"బాధ పడుతున్నావా" డాక్టర్ మహంతి గొంతు వినిపించింది.

"మీ గ్రాండ్ పా తత్వం నీకు తెలుసు"

ఇక నిభాయించుకోలేక పోయిందామె. "తెలుసు అంకుల్- జీవితమంటే వ్యాపార బంధాలే తప్ప అనురాగ బంధాలు కావని గ్రాండ్‌పా ఆలోచిస్తారని తెలుసు. అది నిరూపించటానికి ఏ స్థాయికయినా వెళ్ళగలడు నా గ్రాండ్ పా అని నాకు తెలుసు. కాని ఇన్ని నెలల తర్వాత, అభిమానం చంపుకుని చూడడానికి వచ్చిన నన్ను 'ఇంత సాదరంగా ఆహ్వానిస్తారని మాత్రం తెలుసు కోలేకపోయాను."

ఏ గతపు స్మృతి శకలాలు కదిలి ఆమెను కలవర పరుస్తున్నాయో ఆమె కళ్ళు నీటి కుండలయ్యాయి.

"పిచ్చి పిల్లా- తాతయ్యపై అభిమానం వుండాలే కాని స్వాభిమానం ఏమిటమ్మా- నిజమే ఉపాధ్యాయ దశాబ్దాల కృషిలో చాలా అనుబంధాలకి దూరమయ్యాడు. సామ్రాజ్య విస్తరణే ధ్యేయంగా పెట్టుకుని ఈ ప్రపంచంలో తనకున్నది నువ్వొక్క ర్తివే అన్న విషయాన్నీ విస్మరించాడు. అంత మాత్రం చేత నీ మీద ఆయనికి అభిమానం లేదని ఎలా అనుకుంటున్నావు"

"వద్దు అంకుల్- ఇక ఆ విషయాలను మనం చర్చించుకోవద్దు"

చాలా సేపటి నిశ్శబ్దం తర్వాత అడిగాడు "ఇప్పుడేం చేయాలనుకుంటున్నావ్"

"స్టేట్స్‌కి వెళ్ళిపోతాను. ఇక మళ్ళీ జన్మలో ఈ దేశంలో అడుగుపెట్టను."

"అప్పుడు నీకూ మీ తాతయ్యకీ తేడా ఏముందీ! ఓ భ్రాంతిని జీవితంగా మార్చుకుని బ్రతుకుతున్న మీ తాతయ్యకి నువ్వు తప్ప ఎవరూ లేరమ్మా. 'నా కెవరున్నారూ' అని కాదు, 'తాతయ్యకి నేను తప్ప ఎవరున్నారూ' అని ఆలోచించగలిగితే నీ జీవితానికి ఓ కొత్త లక్ష్యమూ గమ్యమూ దర్శనమిస్తాయి. నీకు తెలీదు కృషి! మీ తాతయ్య ప్రపంచంలో దేన్నయినా కొనగలననే స్థాయికి ఎదిగాడేమో కాని మృత్యువుని బేరం చేయగలననేటంతగా మాత్రం కాదు"

ఇంతకు మించి అవకాశం రాదన్నట్టుగా చెప్పుకుపోయాడాయన.

"ఇప్పుడు మీ తాతయ్య ఏ స్థితిలో వున్నదీ నీకు తెలీదు. అసలు మానసికంగా అతడెంత కృంగిపోతున్నది నీకు అర్థం కాదు. ప్రభుత్వం మారింది. ఆ ప్రభుత్వం మీ తాతయ్య ప్రత్యర్థులకి అనుకూలంగా వుంది. దానితో మీ తాతయ్య బిజినెస్ ఎంపైర్‌లో సమస్యలు మొదలయ్యాయి. ఆ సమస్యలే ఈ రోజు మీ గ్రాండ్ పా కొలాప్స్ కావటానికి కారణమైంది కూడా. ఇదంతా నీకు చెప్పకూడదనుకున్నాను కృషి! మీ గ్రాండ్‌పాకి సైతం చెప్పని అనారోగ్యం వివరాలు నాలోనే సమాధి చేసేసుకోవాలనుకున్నాను."

చెప్పాడు ఉపాధ్యాయ అనారోగ్యం గురించి వివరంగా. "మెదడులోని స్పెసిఫిక్ ఏరియాకి రక్తాన్ని తీసుకుపోయే ఆర్టరీ బ్లాకయ్యే స్థితి TIA (TRANSIENT ISCHAEMIX ATTACK)

హెమరెంజ్‌కి దారి తీయవచ్చు. సర్జరీలో బ్లాకేజ్‌ని తీసేయడం సకాలంలో జరగడంతో ఉపాధ్యాయ ఇప్పుడు యధాస్థితికి రాగలిగాడు కాని మరోసారి యిలాంటి అటాక్ రాదన్న గ్యారంటీ లేదు. వస్తే ఇక బ్రతికే అవకాశమూ లేదు.

"మీ తాతయ్య కోసం నిన్ను శాశ్వతంగా ఇక్కడే వుండి పొమ్మనడం లేదు కృషి! ఈ స్థితిలో ఆయన్ని విడిచి వెళ్ళడం న్యాయం కాదంటున్నాను. నిజానికి ఉపాధ్యాయకి సెంటిమెంట్స్ పై నమ్మకం వున్నా లేకపోయినా ఇప్పుడాయనకి కావలసింది అటాచ్‌మెంట్. ఒకవేళ ఆయన కోరిక ప్రకారం నువ్వు పెళ్ళి చేసుకుని వుంటే బహుశా ఆయన. . ."

అర్ధోక్తిగా అంది కృషి "అసంభవం అంకుల్"

ఉద్విగ్నంగా కదిలిపోయింది. "ఇక ఈ జన్మకి అలాంటి ఆలోచన లేదు. ఉండబోదు."

అచేతనంగా వుండిపోయాడు డాక్టర్ మహంతి.

0 0 0 0

రాత్రి ఎనిమిది గంటలు కావస్తూంది. శూన్యాకాశపు కేన్వాసుపై పేరుకున్న నక్షత్రాలు హుస్సేన్ సాగర్‌లో ప్రతిఫలిస్తుంటే నిశ్శబ్దంగా చూస్తుంది కృషి.

గ్రాండ్ పా సింగపూర్ వెళ్ళి రెండు రోజులైతే ఆయన హాస్పిటల్ నుండి విడుదలై నాలుగు రోజులైంది. పట్టుదలలో ఆ తాతయ్యకి మనవరాలైన ఇదే టెన్షన్‌లో ఆయన పని చేస్తే ఇక ఎక్కువకాలం బ్రతకడన్న ఆలోచన ఆమెను తాత్కాలికంగా ఇక్కడే వుండేట్టు చేసింది కూడా.

ఏం చేయాలో ఇదమిత్థంగా నిర్ణయించుకోలేదామె. తాతయ్య ముభావం బాధ పెడుతున్నా నిగ్రహించుకుంటోంది. హాస్పిటల్ నుంచి విడుదలయ్యాక మళ్ళీ వ్యాపారంలో మునిగిపోయాడు. తన స్థితి ఏమిటి అన్నది ఆయనకి తెలీదు. తెలిసినా పట్టించుకుంటాడన్న నమ్మకం లేదు.

కృషి ఇక ఇంటికి బయలుదేరింది.

సరిగ్గా అప్పుడు జరిగిందో అనుకోని సంఘటన. . . ఆదమరచి కూర్చున్న కృషి చేతిలోని వేలెట్‌ని లాక్కుని పరుగెత్తాడో వ్యక్తి.

ఆమె కేకలు పెట్టలేదు.

కాని దొంగ దొంగ అంటూ మరో వ్యక్తి అటుగా దూసుకుపోయాడు.

చుట్టూ చేరిన జనం అనవసరమైన సానుభూతిని ప్రదర్శించడాన్ని యిష్టపడనట్టు మెట్లెక్కి టాంక్‌బండ్ పైకి వచ్చింది ఆమె.

ఓ వారగా పార్క్ చేయబడిన కారులో కూర్చోబోయింది.

"మేడమ్" పిలిచారెవరో.

సమీపంలో నిలబడి వున్నాడో యువకుడు. సుమారు ఆరడుగుల పొడవులో పోతపోసిన విగ్రహంలా అనిపిచాడు. మాసిన గెడ్డం, విషాదాన్ని మోస్తున్నట్టు కనిపించే చూపుల్తో చేతిని ముందుకు చాచాడు.

"ఈ వేలెట్ మీదే అనుకుంటాను"

విస్మయంగా అందుకుంది "అఫ్‌కోర్స్"

"మీరీ వూరికి కొత్తో లేక వయసులో వుండడంలో కలల్లోకి జారి అజాగ్రత్తగా వున్నారో నాకు తెలీదు కాని ఇక ముందైనా కేర్‌ఫుల్‌గా వుండండి."

నిర్మొహమాటంగా అతడు మాట్లాడగలిగినదుకు అభినందించింది కాని కలలూ జాగ్రత్తలూ అంటూ అతడు చనువు తీసుకోవడాన్ని అంగీకరించలేకపోయింది. "యూ సీ మిస్టర్"

"కోపం తెచ్చుకోకండి మేడమ్" ఇందాక దొంగ వెంట కేకలు వేస్తూ పరిగెత్తిన వ్యక్తి ఇప్పుడు అతడి తరపున వత్తాసుగా అన్నాడు. "ధూర్జటిగారి తీరే అంత- దొంగలకి పక్కలో బల్లెంలా వుండడంతో బాటు అజాగ్రత్తగా వ్యవహరించే వ్యక్తుల మీద కూడా ఇలా విరుచుకుపడుతుంటాడు."

కదలబోయిన ధూర్జటిని చూస్తూ అంది "ఎక్స్ క్యూజ్మీ. . . మరోలా అనుకోకపోతే" వెయ్యి రూపాయలు అందించబోయింది.

ధూర్జటి నేత్రాలలో రవ్వంత ఆవేశం కనిపించింది. "అంటే నేను చేసిన చిన్న సహాయానికి ఇలా ఖరీదు కట్టాలనుకుంటున్నారా."

"సారీ. . . ఈ వేలెట్లో ఇరవై వేలు సేఫ్‌గా వెనక్కి తెచ్చారు కాబట్టి చిన్న రివార్డ్." ఆమె నొచ్చుకుంటున్నట్టుగా అంది.

వెళ్ళిపోతున్నాడు ధూర్జటి.

"మేడమ్" ఇంకా సమీపంలోనే నిలబడ్డ యిందాకటి వ్యక్తి అన్నాడు. "ధూర్జటిగారు ఓ అనాధ నిరుద్యోగి మాత్రమే కావచ్చు. ఆపదలో వున్న వాళ్ళపై సానుభూతి చూపించడం ఆయన బలహీనత కావచ్చు అంత మాత్రం చేత డబ్బుకాయన లొంగిపోతాడని ఎలా అనుకున్నారు? అంతకన్నా ఆయన పసి పిల్లల కోసం నడిపే శరణాలయానికి డొనేషన్ అని ఇచ్చి వుంటే బాగుండేది."

ఆ వ్యక్తి ఇంకా మాట్లాడుతూనే వున్నాడు. కారులో కూర్చున్న కృషి వేగంగా ముందుకు పోనిచ్చి నడుస్తున్న ధూర్జటి పక్కన ఆపింది. అతడు అబ్బురంగా చూస్తుండగానే అయిదు వేల రూపాయిల బోట్లకట్టని అతడికి అందించింది. "యిది మీ కష్టానికి నేను కడుతున్న ఖరీదు కాదు. మీరు ప్రేమగా పెంచే పసి పిల్లలకి డొనేషన్"

డబ్బు తీసుకున్న ఆ యువకుడు ఆశ్చర్యంగా చూస్తుండగానే కారుని ముందుకు పోనిచ్చింది.

ఆ సంఘటనని సైతం కృషి మరిచిపోయేదే.

కాని కొన్ని పరిచయాలు మరికొన్ని విచిత్రమైన సన్నివేశాలకి కారణమౌతుంటాయి.

మరుసటి రోజు సాయంకాలం బంజారా రెస్టారెంట్‌కి వెళ్ళిన కృషి అనుకోకుండా చూసింది నిన్నటి ధూర్జటిని

అతడ్ని మాత్రమే కాదు. అతడితో బాటు నిన్న అతడి ఔనత్యం గురించి మాట్లాడిన వ్యక్తిని, తన చేతిలోని వేలెట్ లాక్కుపోయిన దొంగని కూడా.

ముగ్గురూ ఓ టేబుల్ ముందు కూర్చుని ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు.

బహుశా తనను ఫూల్ చేసిన శుభ సందర్భంలో పార్టీ చేసుకుంటున్నారేమో.

ఆ సంఘటన్ని మామూలుగ తీసుకునే మూడ్‌లో లేదామె. డబ్బు పోయినందుకు కాదు. - ఈ దేశంలో యువత ఎంత నిర్వీర్యమైపోయింది అర్ధమైనట్టు ఆవేశంగా కౌంటర్ దగ్గరకి నడిచి పోలీసులకి ఫోన్ చేసింది.

అంతే-

పది నిముషాల్లో జీపులో వచ్చారు పోలీసులు.

ఇదేమీ గమనించని ఆ మిత్రత్రయం ఇంకా ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు ఇంకా టేబుల్ ముందే కూర్చుని.

యస్సయ్‌కి ఎదురు వెళ్ళిన కృషి తన కుటుంబ వివరాలు చెప్పకుండా తనను తాను పరిచయం చేసుకుంది.

టేబుల్ దగ్గర కూర్చున్న ధూర్జటిని, మిగతా ఇద్దర్నీ చూపిస్తూ నిన్న సాయంకాలం తనతో జరిపిన "ఫౌల్ ప్లే" గురించి వివరించింది.

ఉన్నింటి యువతి పైగా చాలా అందమైన అమ్మాయి తన సహాయాన్ని అర్థించడంతో ఉత్సాహపడిన యస్సయ్ వెంకట్రావ్ "అరెస్ట్ హిమ్ " అన్నాడు తన వెంటవున్న పోలీసుల్తో.

అప్పుడు చూశాడు ధూర్జటి కృషిని. జరగబోయేదేమిటో గ్రహించిన ముగ్గురిలో ఇద్దరు పరుగు లంకించుకోగా ధూర్జటి మాత్రం మొహంపై నవ్వు పులుముకుంటూ ముందుకొచ్చాడు. అంత పర్సనాలిటీ వుండి పారిపోవటం పరువు తక్కువన్నట్టుగా.

"హలో" పలకరించాడు కృషిని చూస్తూ. "పోలీసులతో వచ్చావేమిటీ" అన్నాడు చాలా పరిచయమున్నట్టుగా.

"ఎందుకొచ్చిందీ స్టేషన్‌లో డిసైడవుతుంది నడు" కృషిని మరింత ఇంప్రెస్ చెయ్యాలనుకున్న యస్సయ్ ఇంచుమించు నెడుతూ ధూర్జటిని జీపు దగ్గరికి నడిపించాడు.

ధూర్జటి నిర్లక్ష్యంగానే కాదు నిర్భీతిగా ప్రవర్తించడం కృషికి విస్మయంగా వుంది.

జీపు ఎక్కుతూ అన్నాడు కృషిని చూస్తూ "ఓకే. త్వరలో కలుస్తాను."

అతడలా అన్నందుకు కాదు గాని జీపులోంచి ధూర్జటి సీరియస్‌గా తనను ఆపాదమస్తిష్కం గమనించడాన్ని ఈజీగా తీసుకోలేకపోయింది.

తను అనవసరమైన రొంపిలో అడుగు పెట్టిందా.

ధూర్జటి చూపే ఇంకా ఆమెను వెంటాడుతూ ఆందోళన కల్గిస్తూంది.

0 0 0 0

బయట కుండపోతగా కురుస్తున్న వర్షం. . . వున్నట్టుండి మొదలైన ఈదురుగాలి. అయినా ఆమె పట్టించుకోలేదు. 'ప్రోడిగల్ డాటర్' నవల్లోని ప్రతి కథా ఆమెకు విచిత్రమైన స్ఫూర్తిని అందిస్తుంటే తెల్లవారేలోగా పూర్తి చేయ్యాలనుకుంది.

మరో పావుగంట గడిచిందో లేదో యుద్ధభేరిలా పిడుగులు పడుతున్న చప్పుడు. అంతకు మించి చీకటిని విద్యుత్ ఖడ్గాల్లా చీల్చుతున్న మెరుపులు. . . ఏకాగ్రత భగ్నమైపోయింది. ఏ దావానలపు ఉష్ణోగ్రతా వలయాలో ప్రపంచాన్ని చుట్టుముడుతున్నట్టు ప్రకృతి భీతావహంగా మారిపోయింది.

నవలని ఓ మూల నుంచిన కృషి గదిలో వుండలేనట్టుగా బయటకు నడిచింది.

కుడి ప్రక్కనున్న బెడ్ రూంలో గ్రాండ్ పా లేడు.

బయట నిశీధి సముద్రం ఉప్పెనలా విరుచుకుపడుతున్నంత ఆందోళన్ని కలిగిస్తోంది.

నైటీ దిగువున వూరువుల్ని తాకుతున్న యోక్స్కర్ట్ బరువుగా అనిపిస్తూంటే కారిడార్లో నుంచి దిగువ హాల్ దాకా వచ్చింది.

నౌకర్లంతా నిద్రలోకి జారినట్టున్నారు. వుడ్ ఫ్లోరింగ్పైనున్న కార్పెట్ మాత్రమే కాదు, ఇటాలియన్ ఆర్కిటెక్టు ప్రత్యేకంగా డిజైన్ చేసిన మాన్సార్డ్ రూఫ్ కూడా సన్నగా కంపిస్తున్న అనుభూతి.

ఆ రోజెందుకో మరింత ఒంటరితనంగా వుంది.

రోబ్స్లో వున్న ఏంటిక్స్ గోడలకున్న ఖరీదైన తైలవర్ణ చిత్రాల్ని చూస్తుంటే ఇది తన సామ్రాజ్యం అనిపించడంలేదు. తనకోసం ప్రత్యేకంగా తయారుచేయబడిన బంగారు పంజరంలా కనిపించింది.

ఆమె ఆలోచనల నుంచి ఇంకా తేరుకోలేదు.

భళ్ళుమన్న చప్పుడు వినిపించింది.

అర్థమైపోయింది ఆ శబ్దం ఎక్కడనుంచో.

ఒక్క ఉదుటున స్టెయిర్ కేస్ పైనుంచి బెడ్ రూంలోకి పరుగుతీసింది.

ఫ్రెంచి విండో పగిలి వుంది.

సెంట్రల్లీ ఎయిర్ కండీషన్డ్ గది కాబట్టి కిటికీ రెక్కలు మూసే వుంటాయి. గాలికి కొట్టుకునే అవకాశం లేనప్పుడు ఎలా పగిలిందది.

వెల్వెట్ కార్పెట్పై ముత్యాల్లా మెరుస్తున్న గాజు ముక్కలు.

ఇప్పుడు ఈదురుగాలి గదిలోకి ప్రభంజనంలా దూసుకొస్తూ ఆమె నైటీని వానతో తడిపేస్తోంది.

"గాడ్"

కృషి వేగంగా పక్కకి జరగబోతూ అప్పుడు చూసింది.

"నువ్వు" తడబడిపోయింది ధూర్జటిని చూస్తూ. "హౌడేర్ యూ ఆర్. . . ఎలా లోపలికి వచ్చావ్"

కెవ్వుమనబోతూ ఆగిపోయింది.

"లీవ్‌మి. . . వదులు" అతడి పట్టు సడలించాలని విఫలప్రయత్నం చేస్తుందామె.

"కృషి" అగ్నిరేఖల్లా కనిపిస్తున్న ఎర్రజీరలు అతడి కళ్ళల్లో "నన్ను చాలా తక్కువగా అంచనా వేసావ్"

ఇన్నాళ్ళూ కాపాడుకున్న యవ్వన పొంకానికి చరమాంకంలా అతడి చేతులు ఎక్కడో స్పృశిస్తున్నాయి.

"బా. . .స్ట. . . ర్డ్. . ." విరుగుతున్న వంతెనలా ఆమె మాటలు తడబడుతున్నాయి. "ఐ విల్ కిల్యూ."

నవ్వుతున్నాడు తోడేలులా.

పాయలుగా చీలుతున్న ఓ కన్య దు:ఖోద్విగ్నతని సేడిస్టిక్‌గా ఆనందిస్తున్నట్టు ఆమె శరీరంపై నైటీని చింపేసాడు అప్పటికే.

ఆమె గావు కేక ఆ భవంతి ప్రతిధ్వనించేదే. . .

కాని పెదవులతో ఆమె నోరు నొక్కేసాడు.

శిక్షగా మారుతున్న అక్షరాల అంత: స్వరాలహరులు. . .పగులుతున్న శతసహస్ర ప్రాకారాల సరిహద్దులు. . . అతడి చేతి వేళ్ళు ఉద్వేగంగా దేహంపై నర్తిస్తుంటే. . .

అప్పుడు చూసుకుంది.

తను పూర్తిగా నగ్నంగా మారింది.

కాదు అతడు మార్చేసాడు.

మండుతున్న గోళంలా ముందు నిలబడ్డ అతడి చూపుల్ని తాళలేనట్టు గభాలున పక్కకి జరిగి బెడ్‌పై వున్న బ్లాంకట్‌ని అందుకోబోయింది. అడ్డం పడ్డాడు.

పోరాటంలో గెలవటానికి ఆమె వజ్రాయుధం కాదు. వజ్రసంకల్పం కలదైనా ఓ బలవంతుడి బాహు పంజరాన్న నలిగిపోతున్న యువతి.

అంతే. . .

బాత్‌రూంలోకి పరుగెత్తింది.

గడియ పెట్టేదే కాని ఆమె చేతికన్నా ముందే అతడే కదిలి బాత్‌రూంలోకి దూసుకొచ్చాడు.

కృషి కంపించిపోతూంది "అవుట్"

ఆమె కేక బయటి ఉరుముల చప్పుడులో సమాధైంది.

"గెట్‌లాస్ట్" అశ్రుసిక్త నయనాలతో అరుస్తూ మరోదారి లేనట్టు చేతులు జోడించింది. వెనువెంటనే తన స్థితి గుర్తొచ్చినట్టు చేతులతో శరీరాన్ని కప్పుకుంది. "ప్లీజ్"

భావుకుడిలా చూసాడు "రిలాక్స్ బేబీ. . ."

ఖజురహో శిల్పంలా ఓమూల గోడకి అతుక్కుపోయిన కృషిని చూస్తూ అన్నాడు "ఎస్

నన్ను పోలీసులకి అప్పచెప్పావ్ దారుణమైన హింసకి గురిచేసావ్. అవును బేబీ. పోలీసులు నన్ను చాలా టార్చర్ చేశారు. నిన్ను అంతకన్నా టార్చర్ చేయాలని ఈ అర్ధరాత్రి వేళ ఇలా వచ్చాను."

"ఇప్పుడేం చేద్దామని"

"నిన్ను రేప్. . ." క్షణం ఆగాడు. "చేయను. అది నా కేరెక్టర్‌కే విరుద్ధం. కాబట్టి నిన్ను ఓ రెండు నిముషాలపాటు ఏకాగ్రతగా చూడాలనుకుంటున్నాను."

మొగ్గలా ముడుచుకుపోతూ అంది "ఎందుకు"

"నీ నగ్నదేహాన్ని చూసిన తొలిమగాడిగా నీకు కలకాలం గుర్తుండిపోవాలనుంది."

ఆ స్థితిలో సైతం ఆమె ఆశ్చర్యపడకుండా వుండలేకపోయింది. "దాని వలన నీకు కలిగేదేమిటి"

"సింపుల్"నవ్వాడు మృదువుగా "అందమైన నీ శరీరాన్ని రేపటి నుంచి నువ్వు చూసుకునేటప్పుడు గాని లేదు రేపు నిన్ను కట్టికున్నవాడు నిన్నూ నీ అందాన్ని బెడ్‌రూంలో అభినందించేటప్పుడు గాని ముందు నేను గుర్తుకొస్తాను. ఆ శిక్ష చాలు నీకు. . ."

ఇలాంటి శిక్ష కూడా ఒకటుంటుందని ఇప్పుడే తెలుసుకున్న కృషి అవాక్కయి చూస్తూండగానే వచ్చిన పనైనట్టు వెళ్ళిపోతున్నాడు.

వచ్చిన కిటికీలో నుంచి దర్జాగా రాజమార్గంలోనే.

ఇక నిభాయించుకోలేకపోయింది కృషి.

ఇంతసేపు అదిమి పెట్టుకున్న ఆ అవమానభారానికి గండిపడింది. వున్నట్టుంది గావుకేకలు పెట్టింది. "కేచ్ హిమ్ పట్టుకోండి"

ఒక్కసారి కాదు మూడుసార్లు. . .

"ఏమైందమ్మా" ఎవరో పలకరిస్తున్నారు.

పట్టుకోమంటుంటే ఏమైందీ అని ఆరా తీస్తున్నారేం.

"అతడ్ని ఆపండి"

"ఎవరతను"

అప్పుడు కళ్ళు తెరచింది కృషి.

అంతే కాదు.

సమీపంలో నిలబడివున్న నౌకర్లని చూస్తూ ఉలికిపాటుగా లేచింది.

బయట వర్షం లేదు. కిటికీ పగల్లేదు. . . అంతా ప్రశాంతంగా వుంది.

"పీడకలా అమ్మాయిగారూ" వృద్ధ నౌకరు శరభయ్య అడుగుతున్నాడు వినయంగా.

బ్లేంకెట్ కిందనుంచే శరీరం తడిమి చూసుకుంది. 'తను నగ్నంగా లేదు అంటే ఇంతసేపూ తనుపడిన సంఘర్షణ కలలోనే'

టీపాయ్‌పై వున్న నీళ్ళను అందుకుని గడగడా తాగేసింది.

"ఏదో కల. మీరు వెళ్ళండి"

"అంత ఘోరమైన కలా తల్లీ. మరేం లేదు. చాలా గట్టిగా కేకలు పెట్టావమ్మా" శరభయ్య మరింత వినయాన్ని ప్రదర్శించాడు.

"మీరు వెళ్ళండి"

"మరేం లేదమ్మా తెల్లవారుజామున వచ్చే కలలు నిజమవుతాయంటారు అంచేత అదేదో చెబితే"

ఆ స్టేట్‌మెంట్‌తో మరింత ఆవేశపడిన కృషి "వెళ్ళమని చెబుతుంటే మీక్కాదూ" అంది ఉక్రోషంగా.

వెళ్ళిపోయారు.

ఇప్పుడామెకి గుర్తుకొస్తున్నది కలగాదు. తెల్లవారుజామున వచ్చిన కలలు నిజమవుతాయన్న శరభయ్య స్టేట్‌మెంట్.

జుగుప్సగా వుంది.

సహజంగా ధైర్యవంతురాలయిన తనకిలాంటి కల వచ్చిందేం?

ధూర్జటి గురించి భయపడుతోందా?

అమెరికాలాంటి దేశంలో వుంటూ ఆత్మస్థయిర్యంతో చాలా సమస్యల్ని ఎదుర్కొగలిగిన తను ఇలా పిరికిదానిలా ఆలోచించడమేమిటి?

టు హెల్ వితిట్. . .

మరో అరగంటలో తయారయిన కృషి బ్రేక్ ఫాస్ట్ పూర్తయ్యాక మళ్ళీ నవల అందుకోబోతుంటే ఫోన్ రింగయ్యింది.

"ఎస్"

"కృషి" ఉపాధ్యాయ కంఠం వినిపించింది "నేను"

కృషి మొహంలోని రంగులు మారిపోయాయి. "చెప్పండి గ్రాండ్ పా"

"సింగపూర్ నుంచి మాట్లాడుతున్నాను. బహుశా రావటానికి మరో రెండు మూడు రోజులు పట్టొచ్చు"

తనకు అవసరం లేనివి వినాలని ఉత్సాహపడని విషయం చెబుతున్నాడు. అక్కడితో ఆ చర్చ ఆగినా బాగుండేది.

"స్టేట్స్‌కి వెళ్ళిపోయావనుకున్నాను"

అది చెక్ చేయడానికే తాతయ్య ఫోన్ చేసాడని తెలీడంతో మనస్సు చివుక్కుమంది.

"వెళ్ళమని నేను అనటం లేదు కృషీ. మనిషి తను కోరినట్టు జీవించేదే నిజమైన జీవితం అని నమ్మేవాడిగా నీ నిర్ణయాన్ని అభినందిస్తానని చెబుతున్నాను."

“థేంక్స్ గ్రాండ్‌పా- ” ముక్తసరిగా అంది “మీ ఆరోగ్యం జాగ్రత్త”

“ఆరోగ్యం గురించే ఆలోచిస్తే స్వయం కృషితో సాధించిన సామ్రాజ్యాన్ని కాపాడుకోలేను.”

“సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలి అంటే ముందు మిమ్మల్ని మీరు కాపాడుకోవటం నేర్చుకోవాలి”

“నా స్థానంలో వున్నవాళ్ళకి తప్ప నేను అర్థం కాను కృషీ” జవాబు నాశించనట్టుగా ఫోన్ క్రెడిల్ చేశాడు.

ఏదో కసి, ఉక్రోషం-

నవలని పక్కన పడేసిన కృషి ఉద్వేగంగా పైకిలేచింది.

ఓ మేజర్ సర్జరీ కూడా మార్చలేకపోయింది తాతయ్యని. ఇలా కొనసాగితే తాతయ్య ఏమవుతాడు.

అది గ్రాండ్‌పా ఏటిట్యూడ్ మూలంగా రగిలిన క్రోధమో లేక విశ్రాంతిని మరిచి ఇంకా ఎప్పటిలాగే బ్రతకటాన్ని ఇష్టపడే ఉపాధ్యాయపై కోపమో వెంటనే హోండ కారులో బయలుదేరింది యునివర్శిటీ లైబ్రరీకి.

బాల్యం నుంచి ఒంటరిగా బ్రతకడమే అలవాటైన కృషికి ఇష్టమైన విషయం పుస్తకాలు సంగీతం ఇవి రెండే.

0 0 0 0

ఉదయం

తొమ్మిదిన్నర కావస్తోంది.

భాగ్యనగరం రోడ్లు రద్దీగా వున్నాయి.

ఆకాశంలో ఎండ క్రమంగా తీవ్రమవుతోంది.

కారులో స్టీరియో ఆన్‌చేసింది కృషి. మడోన్నా ‘లైక్ ప్రేయర్’ మనస్సుకేదోలాంటి ఆహ్లాదాన్ని అందిస్తోంది.

అయోధ్య హోటల్‌దాటి లక్డీకాపూల్ చేరుకుంటూ అలవోకగా ఫుట్‌పాత్‌వేపు చూసిన కృషి అదిరిపడింది.

నెమ్మదిగా నడుచుకుంటూ వెళుతున్నాడు ధూర్జటి.

నిన్న సాయంకాలం పోలీసులు అరెస్ట్ చేస్తే అప్పుడే బయటకెలా వచ్చాడు.

పట్టించుకోకుండా ముందుకు వెళ్ళిపోయేదే కాని వున్నట్టుండి నిన్న రాత్రి కలతో పాటు ట్రాఫిక్ ఐలాండ్ దగ్గర రెడ్ లైట్ వెలగడంతో కారాపింది.

సరిగ్గా ఇదే అవకాశం కోసం చూస్తున్నాడేమో ధూర్జటి గభాలున ఫ్రంట్ డోర్ తెరిచి ఆమె పక్కసీటులో కూర్చున్నాడు.

అతడిలో తొట్రుపాటు లేదు. యథాలాపంగా అన్నాడు. "గ్రీన్ లైట్ పడింది ట్రాఫిక్ జామ్ చేయక కారు ముందుకు పోనివ్వండి"

"అసలు నువ్వు" కారుని పోనిచ్చిన కృషి ఆవేశంగా అడిగింది "కారెందుకు ఎక్కావ్"

అతడు జవాబు చెప్పలేదు. అసలా ప్రశ్నే వినబడనట్టు బయటికి చూస్తున్నాడు.

అతడి నిర్లక్ష్యానికి మండిపడుతూ రవీంద్ర బారతి దాటుతుండగా అంది "ప్లీజ్ గెటవుట్"

అనడమే కాదు రేడియో స్టేషన్ ముందు ఆపేసింది కూడా.

"వెరీ బేడ్" చిరుకోపంగా అన్నాడు.

"ఏమిటి"

"సరిగ్గా ఆకాశవాణి ముందు మీరు కారాపడం"

"ఆపితే ఏమవుతుంది"

"ఈ విషయం ఆలిండియా రేడియో గమనిస్తుంది. ఆనక మధ్యాహ్నం న్యూస్‌లో మన విషయం ప్రసారం చేస్తుంది. అది సింగపూర్‌లో వున్న మీ గ్రాండ్ పాకి తెలిసి. . ."

అప్రతిభురాలైంది. అంటే తన గురించి చాలా వివరాలు సేకరించాడు.

"మిస్టర్ ధూర్జటీ" వ్యంగ్యంగా అంది "నా గురించి నీకెలా తెలుసూ అని నేను ఆశ్చర్యపోవడం లేదు. అది నీ ఐక్యూకి ఓ పెద్ద గుర్తుగా నేను భావించడమూ లేదు. కాని ఇంత తెలుసుకున్న నువ్వు నా స్థాయి మనిషితో ఇలా ప్లే చేయడం మంచిది కాదని నీ శ్రేయస్సు కోరి సలహా ఇస్తున్నాను"

"ఆ విషయం నిన్న సాయంకాలమే నాకు అర్థమైంది."

"పాపం" సర్కాస్టిక్‌గా అంది కృషి. "రాత్రంతా పోలీసులు చాలా హించించి వుంటారు.'

"కలగన్నారా. . ."

ఆ క్షణంలో ధూర్జటి 'కల'నే పదాన్ని వాడటం కాకతాళియమే అయినా నిన్నరాత్రి కల గుర్తుకు రాగానే నుదుట చెమట పట్టేసింది.

"నిన్న మీరు నన్ను పోలీసులకి పట్టించగానే బాగా తోమి తాటవలిచేసి వుంటారని మీరు అనుకుని వుంటారు. కాని మీ నుంచి నేను సంపాదించిన అయిదువేలలో ఓ వెయ్యి వాళ్ళ మొహాన కొట్టి బయటకొచ్చేసాను. ఏమిటి అలా తెల్లమొహం వేసుకుని చూస్తున్నారు."

"నమ్మలేక పోతున్నాను."

"ఏమిటి" నిశ్చలంగా అన్నాడు "నాలాంటి అందమైన ఓ యువకుడు ఇలా టోపీవేసే కార్యక్రమంలో నిమగ్నం కావటాన్నా లేక పోలీసులు డబ్బు తీసుకుని నన్ను విడిచిపెట్టడాన్నా"

నిశ్చేష్టితగా చూస్తుంది కృషి.

"ఇక్కడ మోసం చేయడం మనుషుల హాబీ. అవకాశవాదంతో పరిస్థితుల్ని అనుకూలంగా మలుచుకోవటం వ్యక్తుల నైజం. ఈ దేశంలో సక్సెస్ అన్న పదానికి అర్థం బ్రతకగలగడం. ఎలాగైనా పర్వాలేదు. ఉదాహరణకి మిమ్మల్ని పబ్లిక్‌గా. . . మరోలా అనకోకండి. మిమ్మల్ని దోచుకోగలను. అంటే మీ ఒంటిమీద వున్న నగా నట్రాలాంటిదే సుమండీ. అందులో కొంత పోలీసుల చేతిలో వుంచి నన్ను నేను రక్షించుకోగలను. . . మీ పరిభాషలో ఈ వ్యవస్థ అంతగా తగలబడి పోయింది."

"షేమ్. . ."

"మిమ్మల్ని దోచుకోవడమా."

"కాదు. బ్రతకటానికి మరోదారి లేనట్టు నీలాంటి వాళ్ళు ఇలా దోపిడీలు చేస్తూ అదే జీవనోపాధిగా మార్చుకోవడం ఆనక దోచుకున్నది పంపిణీ చేసి నిన్ను నువ్వు రక్షించుకొంటూ ఈ వ్యవస్థే ఇలా తగలబడిపోయిందని వాపోవడమూనూ"

"అద్దాలమేడలో బ్రతికే నీలాంటి అమ్మాయికి కొన్ని సమస్యలలోతు అర్థం కాదు"

"పెసిమిస్ట్ పరిస్థితులకి నెగిటివ్‌గా రియాక్టయి మోసగాడవుతాడు. ఆప్టిమిస్ట్ అలా బ్రతకడాన్ని అయిష్టపడుతూ అవసరమైతే ఆటో నడిపి పొట్టపోసుకుంటాడు."

ఫకాల్న నవ్వాడు.

"ఎందుకా నవ్వు"

"నేను ఆటోయే నడుపుకుంటే మీలాంటి అందమైన అమ్మాయి పరిచయమయ్యే అవకాశం వుండేదికాదుగా"

అతడేమిటో ఆ వ్యక్తి ఆలోచనలేమిటో పూర్తిగా అర్థం కాక ఇక అతడితో మాట్లాడే పనిలేనట్టు "ముందు కారు దిగు" అంది బింకంగా.

"పెనాల్టీ చెల్లించు"

"దేనికి" నివ్వెరపోయింది కృషి.

"నిన్న పోలీసులకి అప్పచెప్పి నా పరువు తీసినందుకు."

"నీకో పరువు. దానికో పెనాల్టీ"

"వెయ్యి రూపాయలు అనవసరంగా నష్టపోయాను కృషి. మర్యాదగా ఆ డబ్బిచ్చేయ్"

కృషి రెచ్చిపోయింది "ఇవ్వకపోతే"

రెండు క్షణాల పాటు రెప్పలార్పకుండా చూసాడు "ఏం చేసేదీ చెప్పమంటారా కృషి. అటు చూడండి. అక్కడున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓ వారగా ఆపివున్న ఈ ఇంపోర్టెడ్ కారుని పదినిముషాలుగా చూస్తున్నాడు. ఇక్కడ పార్క్ చేయకూడదని తెలిసినా ఎవరో పెద్దింటి అమ్మాయిగా భావించి మిమ్మల్ని అడగలేక చాలా మధన పడుతున్నాడు. . ."

కానిస్టేబుల్ చూపులు ఇంచుమించు అలాగే కనిపిస్తుంటే కోపాన్ని అదిమి పెడుతూ అంది "అయితే"

"ఇప్పుడు మీరు వెయ్యిరూపాయలు ఇవ్వకపోతే నేను మీ వేలెట్లోని డబ్బుని బలవంతంగా తీసుకు వెళతాను. అదిగో గట్టిగా అరుస్తాననకండి. ఒకవేళ అరిచాక బస్‌స్టాపులో వున్న జనం కాని కానిస్టేబుల్‌కాని పరుగెత్తుకొస్తే నన్ను ఓ దొంగని చెప్పగలరా. . .

"ఎందుకు చెప్పలేను"

"అప్పుడు ఇరుక్కునేది మీరే" ఓ అద్భుతమైన తర్కాన్ని ప్రయోగించాడు. "అవును కృషి దొంగే అయితే పది నిముషాల పాటు కారు డోర్స్ మూసుకుని ఎందుకు కూర్చున్నారూ అంటూ వాళ్ళు ప్రశ్నిస్తారు. బోయ్‌ఫ్రెండ్‌తో ఏదో రాచకార్యం వెలగబెట్టాలని కాకపోతే ఇంత సేపు గుసగుసలేమిటబ్బా అంటూ బుగ్గలు నొక్కేసుకుంటారు. అది మీకెంత డెలికేట్‌గా వుండేదీ మీరు కాకపోయినా నేనూహించగలను."

ఆమె కూడ ఊహించేసిందేమో ఆవేశంగా వేలెట్‌లోని వెయ్యి రూపాయలు తీసి అతడి

గలుగుతున్నాడు.

"థాంక్స్ మిస్ కృషి. ఆడపిల్ల కలల్లోకి చొచ్చుకురాగల అందగాడివయ్యుండీ నీకీ డబ్బు వ్యామోహం ఏమిటీ అన్నది బహుశా మీ మొహంలోని ఎక్స్‌ప్రెషన్‌కి అర్థమనుకుంటాను. దానికి నా జవాబు ఒక్కటే. డబ్బునే ఓ అస్త్రంతో ప్రపంచాన్నే గెలిచేయగలనన్న థియరీనమ్మే మనిషిన్నేను."

క్షణంపాటు కేరక్టర్ విషయంలో తనూ 'గ్రాండ్‌పా' లాంటివాడ్నే అన్న విషయాన్ని సగర్వంగా వ్య క్తం చేసి కారు దిగి వెళ్ళిపోయాడు ధూర్జటి.

స్థాయీ భేదం తప్ప ఇద్దరి ఆలోచనల్లో ఒక్కటే.

తాతయ్య విషయంలో అనుసరించే స్తబ్ధత ఈ వ్య క్తితో ఎందుకు పాటించాలనే అనుకుందో లేక ఇత దారుణంగా ఓడించిన ఈ వ్య క్తికి శాశ్వతంగా బుద్ధి చెప్పాలనుకుందో కారుని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషనుకి పోనిచ్చింది.

నిజానికి తానెవరన్నది స్పష్టంగా తెలియచెప్పి అటు ధూర్జటిని విడిచి పెట్టిన పోలీసులకి ఇటు ధూర్జటికి బుద్ధి చెప్పటం కష్టం కాదు.

పది నిముషాలలో కారు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆగింది.

కారు దిగిన కృషిని చూస్తూ ముందుకు ఉరికి వచ్చాడు యస్సై. నిన్న ధూర్జటిని అరెస్ట్ చేసిన వెంకట్రావ్.

"గుడ్ మార్నింగ్ మాడమ్" చాలా వినయాన్ని ప్రదర్శించాడు యస్సై. "మీరిద్దరూ లవర్స్ అన్న విషయాన్ని దాచేసి మమ్మల్ని భలే ఫూల్స్‌ని చేసేసారు. బహుశా జరిగిందానికి క్షమాపణలు చెప్పటానికి వచ్చారనుకుంటాను."

"వ్వాట్" దిగ్భ్రాంతిగా చూసింది కృషి.

"మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు" సీరియస్‌గా అంది కృషి.

ఆమె ముఖకవళికల్ని చూస్తూ చాలా ఇబ్బంది పడిపోయాడు యస్సై వెంకట్రావ్. "ఏదో తొందరపాటులో వివరాలు అడక్కుండా మీ బోయ్‌ఫ్రెండ్‌ని అరెస్ట్ చేశామే అనుకోండి. అంతమాత్రం చేత ఇండియన్ పోలీసులంతా ఫూల్సని మీరు తేల్చేయడం న్యాయం కాదు."

వచ్చింది ధూర్జటిని ఎలా వదిలిపెట్టారో తెలుసు కోవడానికైతే ఇక్కడ మరోటి వింటూంది ఆమె.

"నిజమే. . ." తన తప్పిదాన్ని ఒప్పుకుంటున్నట్టుగా చెప్పాడు యస్సై వెంకట్రావ్. "రూల్ ప్రకారం మీ దగ్గరనుంచి ముందు రిటెన్ కంప్లెయింట్ తీసుకోవాలి. ఆ తర్వాతే నేరస్తుడ్ని స్టేషన్‌కి రప్పించి పరిశోధన ప్రారంభించాలి. కాని నా పొరపాటెక్కడంటే మీరు చెప్పగానే రియాక్టయిపోవడం, మీ మాటమీద విశ్నుగార్ని అరెస్ట్ చేయడం. . ."

"విశ్ను ఎవరు. . ."

"మీ బోయ్‌ఫ్రెండ్"

ఇదంతా ఏమిటో ఆమెకు బోధపడకపోయినా ధూర్జటి చాలా తెలివిగా పోలీసుల్ని ఫూల్స్‌ని చేసి తప్పించుకున్నాడని అర్థమైపోయింది.

“అతనేం చెప్పాడు మీకు.” సాలోచనగా అడిగింది.

“మీరు పుట్టింది ఇండియాలోనే అయినా పెరిగింది స్టేట్స్‌లో అన్నాడు. మీ మధ్య తరుచుగా ఇండియన్ పోలీసుల తెలివి తక్కువ తనం గురించి వాగ్యుద్ధం జరుగుతుండేదని వివరంగా చెప్పేశాడు. ఈ దేశంలో పోలీసులు నిజాయితీ గురించి మేధస్సు గురించి నీకేం తెలుసని మొన్నెప్పుడో మిమ్మల్ని నిలదీసిన విషయమూ డిటైల్డ్‌గా వివరించాడు.”

“తర్వాత” ప్రశ్నార్థకంగా చూసింది కృషి.

మొత్తం వివరాలన్నీ తన చేతనే ఆమె చెప్పించడం బొత్తిగా నచ్చలేదు యస్సైకి. “అసలు ఛాలెంజ్ చేసింది మీరేనన్నాడు”

“ఏ విషయంలో”

“పోలీసులు ఫూల్సని నిరూపించడంలో”

ఆమె నిశ్చలంగా చూసింది.

“అసలు మీరు మమ్మల్ని పిలవడమేమిటి, మీ బోయ్‌ఫ్రెండ్‌ని ఓ మోసగాడిగా మాకు చెప్పడమేమిటి, వెనక ముందూ చూడకుండా ఓ కోటీశ్వరుడికి కాబోయే అల్లుడ్ని మేం అరెస్టు చేయడమేమిటి. ఛ ఛ. మీ నమ్మకాన్ని నిజం చేసేసాను, తప్పు నాదే”

“అయినా కరెక్టు చేసుకున్నారుగా” ధూర్జటి ఎంత తెలివిగా తప్పించుకుపోయింది మననం చేసుకుంటూ అంది కృషి. “మరి తను ఏ కోటీశ్వరుడికి కాబోయే అల్లుడో చెప్పాడా.”

“మీరు ఉపాధ్యాయ గారి మనవరాలని తెలిశాక ఇక మీ తండ్రిగారితో మాకు పనేముంది చెప్పండి”

నిర్విణ్ణురాలైంది కృషి.

“సరే.” తదేకంగా చూస్తూ అందామె-

“ఛాలెంజ్‌లో ఎవరుగెలిచినా మీకు శ్రమ కలిగించినందుకు కొన్ని ఫార్మాలిటీస్ పాటించటానికి డబ్బిచ్చాను మీకు అందజేయమని.”

చక్కలిగిలి పెట్టినట్టు మెలి తిగిగిపోయాడు వెంకట్రావ్.

“సిగ్గుపడకండి. స్టేట్స్‌లోనూ పోలీసులు ఇలాంటి ఫార్మాలిటీస్‌ని కాదనరు.”

“మరే. ఎక్కడయినా ఇంతే అనుకుంటాను మేడమ్” బోలెడంత సిగ్గుపడుతూ ఎంత తీసుకున్నదీ చెప్పకపోయినా మొత్తానికి డబ్బు తీసుకున్నట్టు పరోక్షంగా తెలియచెప్పాడు.

“అద్సరే. . .” చివరిగా అడిగింది కృషి.

“నా ఛాలెంజ్ ప్రకారం మిమ్మల్ని తప్పుదోవ పట్టించాను. కాని తన అసలు పేరు ధూర్జటి అని చెప్పకుండా మరోటి చెప్పి ఆయని మిమ్మల్నెందుకు మిస్‌లీడ్ చేసాడు?”

“ధూర్జటా... ఆయన అసలుపేరు విశ్వనాథ్‌గా”

"అలా అని చెప్పాడా"

"చెప్పడమేమిటి మేడమ్. లెటర్‌లో స్పష్టంగా విశ్వనాథని వుందిగా పైగా మీరుకూడా ముద్దుగా 'విశ్శు' అని పిలుస్తుంటారటగా" అతను కూడా ఇందాక 'విశ్శు' అని అడ్రస్ చేసింది ఆమెను ప్లీజ్ చేయాలనే అన్న విషయం చెప్పలేదు వెంకట్రావ్.

మరో కొత్త విషయం వింటున్నట్టుగా అడిగింది కృషి "లెటరేమిటి"

"అదే మేడమ్. ఈ రోజు సాయంకాలం అరుగంటలకి ఉస్మానియా యూనివర్శిటీ ఆడిటోరియంలో ఐక్యూ కాంపిటీషన్ వుందిగా. దానికి అటెండ్ కమ్మని 'కోలా' కంపెనీ వాళ్ళు రాసింది"

ఆమె భృకుటి ముడిపడింది.

"అసలా ఆ కాంపిటీషన్‌కి ఆయన అటెండ్ కావడం మీకిష్టం లేకనే ఛాలెంజ్ పేరిట మీరాయన్ని అరెస్ట్ చేయించిన విషయమూ ఆయన చెప్పేశాడు."

ఈ అభియోగమూ ఆమెకు నచ్చలేదు. "మరి నాకెందుకు ఇష్టం లేదో అదీ చెప్పాడా"

"ఆయనలాంటి జీనియస్‌లు పోటీల్లో పాల్గొంటే పైకొచ్చే యువతకి అవకాశం ఉండదన్నారటగా. . ."

చిర్రెత్తుకొస్తున్నా నిభాయించుకుంది. అతనో జీనియస్ అవునో కాదో గాని ఖచ్చితంగా ఈ పోలీసాఫీసరు మాత్రం ఫూలని బోధపడిపోయింది.

అతని పేరు నిజంగా విశ్వనాథేనా లేక ఏదో ఉత్తరాన్ని చూపించి తెలివిగా తప్పించుకున్నాడా.

ఆలోచిస్తూ కారు దగ్గరికి వచ్చింది.

అతడి ఐక్యూ స్థాయి ఏదయినా గాని డబ్బు ఇచ్చో లేక సమయస్ఫూర్తిని ప్రదర్శించో చాలామందితో మాత్రం సులభంగా ఆడుకోగలుగుతున్నాడు.

ఇంటికి తిరిగివచ్చిన కృషి అతడిపై ఆసక్తిని ప్రదర్శించడం అనవసరం అనుకుంటూనే సాయంకాలం దాకా గడిపింది.

ప్రత్యేకించి ఓ వ్యాపకం అంటూ లేకపోవడం కృషి ఎంత అసహనానికి గురిచేసింది అంటే యూనివర్శిటీకి వెళ్ళకుండా వుండలేకపోయింది.

అతడ్ని చూడాలని కాదు.

విశ్వనాథ్ అతడవునో కాదో తెలుసుకోవాలని.

అంతకు మించి ఐక్యూ కాంపిటీషన్స్‌పై ఆమెకున్న ఆసక్తి కూడా అప్పటికి ఆమెను ప్రేరేపించింది.

0 0 0 0

"డియర్ ఫ్రెండ్స్" యూనివర్శిటీ ఆడిటోరియంలోని ప్రేక్షకులను ఉద్దేశిస్తూ మాట్లాడుతున్నాడు 'కోలా' కంపెనీ ప్రతినిధి "సాఫ్ట్ డ్రింక్ కంపెనీ ఆధ్వర్యంలో

నిర్వహించబడుతున్న పోటీ ఇది. గత మూడు సంవత్సరాలుగా కోలా క్విజ్ కింగ్‌గా ఛాంపియన్‌షిప్ కాపాడుకుంటున్న యూనివర్శిటీ విద్యార్థి రాజేంద్ర ఈ రోజు మరో ఛాలెంజ్ ఎదుర్కోబోతున్నాడు. ఇద్దరి మధ్యా జరుగుతున్న ముఖాముఖీ పోటీలో గెలిచిన వ్యక్తి ఛాంపియన్ షిప్ ట్రోఫీతో బాటు ఇరవై వేల రూపాయల క్యాష్ ప్రైజ్ సాధించగలుగుతాడు. ఇప్పుడు ఇద్దరు యువకుల్నీ మీకు పరిచయం చేస్తున్నాను. మిస్టర్ రాజేంద్ర. . . డిఫెండింగ్ ఛాంపియన్"

సుమారు ఇరవై రెండేళ్ళ వయసున్న రాజేంద్ర ఉత్సాహంగా డయాస్‌పై అడుగుపెట్టగానే విద్యార్థుల చప్పట్లతో అభిమానమో లేక పని గట్టుకుని ఏర్పాటు చేయబడిన బృందమో- రాజేంద్రకి అనుకూలంగా నినాదాలు ప్రారంభించారు.

“నో” కోలా ప్రతినిధి అన్నాడు. “ఇరవై వేల రూపాయల పెట్టుబడితో పోటీకి సిద్ధమైన ఛాలెంజర్ మిస్టర్ విశ్వనాథ్. . .”

ఉన్నట్టుండి ఆడిటోరియంలో నిశ్శబ్దం ఆవరించింది.

మసక వెలుతురులో ఓ మూల కూర్చున్న కృషి చూస్తుండగానే డయాస్ పైకి వచ్చాడు విశ్వనాథ్- కొన్ని గంటల క్రితం దాకా కృషి ధూర్జటిగా అనుకుంటున్న వ్యక్తి.

ఒక మోసగాడిగా పరిచయమైన వ్యక్తి ఇప్పుడో మేధావిలా ఇలాంటి పోటీలో పాల్గొనటాన్ని ఆమె ఊహించలేక పోయింది.

ప్రేక్షకుల నుంచి రెస్పాన్స్ లేదు. అయినా అదేమీ పట్టించుకోనంత నిశ్చలంగా తన సీటులో సెటిలయ్యాడు ధూర్జటి అలియాస్ విశ్వనాథ్.

“దూరదర్శన్‌లో తరచుగా క్విజ్ కాంపిటీషన్స్ నిర్వహించే వాసు ఇప్పుడు క్విజ్ మాస్టరుగా వ్యవహరిస్తారు”

క్విజ్ మాస్టరు వాసు స్కోర్ కౌంట్ చేసే ఓ అమ్మాయితో బాటు వేదిక పైకి వచ్చి ప్రేక్షకులకి నమస్కరించాడు.

చప్పట్లు కేకల్తో ఆడిటోరియం హోరెత్తిపోయింది.

“డియర్ ఫ్రెండ్స్” ప్రేక్షకుల్నే గాక పోటీలో పార్టిసిపేట్ చేస్తున్న రాజేంద్ర, విశ్వనాథ్‌ల్ని ఉద్దేశిస్తూ అన్నాడు వాసు “క్విజ్ కాంపిటీషన్‌లో చాలా నియమాలున్నా ఈ పోటీని స్పాన్సర్ చేసే కోలా కంపెనీ నిబంధనల ప్రకారం పోటీ డ్యూరేషన్ మొత్తం గంట యాభై నిముషాలలో చెరో అయిదు నిముషాలు ఒక్కొక్కర్ని ప్రశ్నించడం జరుగుతుంది. ఒక్కో జవాబుకి నిర్దేశించబడిన మార్కులు పది. ప్రశ్న అడిగిన తర్వాత ఆలోచించడానికి వ్యవధి కేవలం ముప్పై సెకండ్లు మాత్రమే. ముప్పై సెకండ్లు వ్యవధి పూర్తి కాగానే ఆ అసిస్టెంట్ బజర్ నొక్కుతుంది. జవాబు చెప్పే అవకాశం రెండో వ్యక్తికి దక్కుతుంది. ఐ థింక్ అయామ్ క్లియర్....”

అంగీకారంగా తలలు పంకించారు రాజేంద్ర, విశ్వనాథ్‌లు.

సరిగ్గా ఏడు గంటలకి రిస్ట్‌వాచ్ చూసుకున్న క్విజ్ మాస్టరు వాసు పోటీ ప్రారంభిస్తూ రాజేంద్రతో అన్నాడు “ది ఫస్ట్ క్వెశ్చన్ ఈజ్ ఫర్యూ మిస్టర్ రాజేంద్ర. . . రిఫ్లెక్సాలజీ అంటే ఏమిటి?”

“ఇదో కొత్త వైద్య విధానం. కాలు లేక చేతి బొటనవేలుకి సంబంధించిన రిఫ్లేక్స్ భాగాల్ని వత్తి శరీర రుగ్మతల్ని నయం చేసే ప్రక్రియని రిఫ్లెక్సాలజీ అంటారు.”

“రైట్. . .మిస్టర్ విశ్వనాథ్. . . రిఫ్లెక్సాలజీ గురించి పరిశోధించిన వ్యక్తి ఎవరు”

“అమెరికాకి చెందిన డాక్టర్ విలియం ఫిడ్జిగెరాల్డ్” టక్కుమని చెప్పాడు విశ్వనాథ్.

“రైట్ మిస్టర్ విశ్వనాథ్. . . ఈ మధ్యనే చనిపోయిన ప్రభుత్వ అమెరికన్ రచయిత ఇర్వింగ్ వేలెస్ మొదటి నవల ఏది?”

“1959లో అతడు రాసిన నవల ది సిన్నాఫ్ ఫిలిప్ ఫ్లెమింగ్”

“వండర్‌ఫుల్” అభినందించిన క్విజ్ మాస్టర్ ఇప్పుడు రాజేంద్రని చూస్తూ అడిగాడు. “బ్రిటన్‌లోని కొందరు వృద్ధ మహిళల్లో ఇప్పటికీ వున్న ఓ మూఢనమ్మకం డిశెంబరు ఇరవై ఎనిమిదో తేదిన బట్టలు ఉతక కూడదని. . . కారణం ఏమిటో చెప్పగలరా?”

రాజేంద్ర ఉత్సుకతగా అన్నాడు. “హీరో చక్రవర్తి క్రీస్తు ఎక్కడో జన్మించాడన్న భయంతో మగ బిడ్డల్ని హతమార్చమన్నది డిసెంబరు ఇరవై ఎనిమిదో తేదీన. కాబట్టి ఆ రోజున బట్టలు ఉతికే కుటుంబానికి చెందిన ఓ పురుషుడికి ప్రాణ హాని జరుగుతుందని ఇప్పటికీ వున్న మూఢ నమ్మకం.”

విద్యార్థులు చప్పట్లు కొడుతూంటే “యూ ఆర్ రైట్ మిస్టర్ రాజేంద్ర. వన్ మోర్ క్వెశ్చన్ టూ యు. బి.ఆర్. చోప్రా మహాభారత్‌లో టెలికాస్ట్ చేయటానికి బిబిసి చెల్లించిన మొత్తం ఎంత” అడిగాడు రాజేంద్రని చూస్తూ.

నిశ్శబ్దంగా వుండిపోయాదు రాజేంద్ర.

పది సెకండ్లు గడిచేక “లక్ష పౌండ్‌లు” అనేశాడు.

“రాంగ్”

ఆడిటోరియం ఆసక్తిగా గమనిస్తుండగా ముప్పై సెకండ్లు గడిచినట్లు బజరు మోగింది.

“ఇప్పుడు మీరు జవాబు చెప్పాలి మిస్టర్ విశ్వనాథ్” అన్నాడు క్విజ్ మాస్టర్ వెంటనే.

“డెబ్బై రెండు వేల ఎనిమిది వందల పౌండ్లు”

“రైట్ మిస్టర్ విశ్వనాథ్” రెండు సెకండ్ల వ్యవధి తర్వాత అడిగాడు “తుమ్ములన్నవి మనిషికి సహజంగా వస్తాయి. ఎవరైనా తుమ్మితే మనం తెలుగులో అయితే నూరేళ్ళ ఆయుష్షు అంటూ ఆశీర్వదిస్తాం. ఇంగ్లీషులో అయితే ‘బ్లెస్ యు’ అంటాం. ఈ సాంప్రదాయానికి మూలం చెప్పగలరా?”

“పదిహేడో శతాబ్దంలో బ్రిటన్‌లో ప్లేగు వ్యాధి మూలంగా వేలమంది ప్రాణాలు కోల్పోయారు”

ఆసక్తిని మించిన విస్మయంతో చూస్తూంది ఆడిటోరియంలో కూచున్న కృషి.

“ప్లేగు వ్యాధికి గురైన మనిషి తప్పకుండా చనిపోతాడనుకోటానికి కనిపించే ముఖ్యమైన సిమ్టమ్ తుమ్మడం. కాబట్టి ఈ వ్యాధికి గురైన ఏ వ్యక్తి అయినా తుమ్మగానే యిక మరణం తథ్యమని తెలిసిన వ్యక్తులు ‘బ్లెస్ యు’ అనేవారు. ఆ సాంప్రదయం బ్రిటన్ పాలన ద్వారా మనకీ వచ్చింది.”

పలచగా వినిపించాయి చప్పట్లు క్రమంగా విశ్వనాథ్ సైతం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న సూచనగా.

“మిస్టర్ రాజేంద్ర. తాజ్‌మహల్ నిర్మాణానికి ప్రేరణగా చరిత్రలో మిగిలిన ముంతాజ్ కి షాజహాన్‌కి పిల్లలెంతమంది”

“పధ్నాలుగుమంది”

“రైట్. మెజిషియన్ అఫ్ ఐరన్ అనే టైటిల్ గల వ్యక్తి ఎవరు?”

రాజేంద్ర వెంటనే చెప్పడం ప్రారంభించాడు. “రాట్ ఐరన్‌తో సుమారు మూడు వందల మీటర్ల పొడవున్న ఈఫిల్ టవర్‌ని నిర్మించిన ఫ్రెంచ్ ఇంజనీర్ అలెగ్జాండర్ గుస్తావ్ యీఫెల్‌ని మెజీషియన్ ఆఫ్ ఐరన్ అంటారు.”

“వెరీ కరక్ట్. నౌ. . . ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్. . . ఓ మనిషికుండే ఎముకలెన్ని?”

వెంటనే జవాబు చెప్పలేదు విశ్వనాథ్. “బాల్యంలోనా, యవ్వనంలోనా.”

క్విజ్ మాస్టర్ కంగారుపడటాన్ని గమనించింది కృషి.

విశ్వనాథ్ ప్రశ్నకి ఎగతాళిగా ఓ మూల నుంచి విద్యార్థి బృందం కేకలు పెడుతుంటే విశ్వనాథ్ రియాక్టు కాలేదు. క్విజ్ మాస్టర్ ప్రశ్నకి జవాబులా అన్నాడు. “ఏ మనిషికైనా బాల్యంలో వుండేవి మూడువందల ఎముకలు. కాని వయసు పెరిగేకొద్దీ తొంభై నాలుగు ఫ్యూజయి యవ్వనంలో అడుగుపెట్టేసరికి రెండు వందల ఆరుదాకా మిగులుతాయి.”

సాలోచనగా తల పంకించాడు క్విజ్ మాస్టర్ “యూ ఆర్ రైట్ మిస్టర్ విశ్వనాథ్. నిజమే నా ప్రశ్న ఇంకా క్లియర్‌గా వుండాల్సింది.”

కేవలం కృషి మాత్రమే అసంకల్పితంగా చప్పట్లు కొట్టి తలతిప్పి తనవేపే అంతా చూస్తుంటే యిబ్బందిగా కదిలింది క్షణం పాటు.

“సిగ్గుతో మొహం ఎర్రబడడం అంటే మీకు తెలుసుగా. . . దానికి శాస్త్రీయమైన కారణం చెప్పండి”

“ఇది పుట్టుకతో వచ్చే రియాక్షన్ కాదు. రెండు నుంచి నాలుగేళ్ళ వయసు మధ్యలో అలవడే రిఫ్లెక్స్ యాక్షన్. ఏదన్నా అవమానం జరిగినప్పుడు మెదడు నెర్వ్‌సిగ్నల్స్ పంపుతుంది. పెప్టయిడ్ అనే రసాయనాన్ని విడుదల చేస్తుంది. ఆ రసాయనం మొహానికి సంబంధించిన బ్లడ్ వెస్సెల్స్‌పై పనిచేసి మోహం ఎర్రబడేట్టు చేస్తుంది” ఇందాక తన మొహం ఎరుపెక్కిన క్విజ్ మాస్టర్ ముఖ కవళికల్ని గమనిస్తూ చెప్పాడు విశ్వనాథ్.

“నౌ మిస్టర్ రాజేంద్ర. . . నెలకి సగటున ఓ మనిషి జుట్టు పెరిగే పొడవెంత?”

“పది మిల్లీ మీటర్లు”

“రైట్. మెదడులో ఎక్కువ భాగం శరీరంలోని ఏ అవయవాన్ని నియంత్రించటానికి ఉపయోగించబడుతుంది.”

“బొటనవేలుని”

“రైట్. నౌ మిస్టర్ విశ్వనాథ్- సీజర్‌కి సిజేరియన్‌కి గల సంబంధం ఏమిటి?”

“సీజర్ రోమన్ చక్రవర్తి. తల్లి కడుపుని కోసి బిడ్డను తీయడన్ని సిజేరియన్ అంటారు. సీజర్ పుట్టిందీ అలాగే కాబట్టి ఈ ఆపరేషన్‌కి సిజేరియన్ అనడం ఓ చరిత్రగా మారింది

అంతకుమించి లాటిన్ భాషలో CAEJARE అంటే TO CUT అన్న అర్థం కూడా వస్తుంది"

అవసరానికి మించి జవాబు చెబుతున్న విశ్వనాథ్ విషయంలో ఆసక్తికన్నా అసహనం ఎక్కువైనట్టు చూసాడు క్విజ్ మాస్టర్. "అనూహ్యమైన షాక్ మూలంగా ఒక్క రాత్రికే జుట్టు తెల్లబడటం గురించి మీరు వినే వుంటారు. ఇదెలా సాధ్యం."

"నిజానికి అనుకోని షాక్‌తో జుట్టు తెల్లబడదు. నల్ల వెంట్రుకలన్నీ రాలిపోయి వాటి మరుగున వున్న తెల్లవెంట్రుకలు మాత్రం మిగులుతాయి . ఇది సైన్స్ చెప్పే సత్యం."

"రైట్- నౌ మిస్టర్ రాజేంద్ర ప్రపంచలో మొట్టమొదటిసారిగా రోడ్డుపై మనం వాడే 'తారు'ని కనిపెట్టిందెవరు."

"స్కాట్ లాండ్‌కి చెందిన ఇంజనీర్ పద్దెనిమిదో శతాబ్దంలో పుట్టిన జాన్ లాడెన్ మెక్ ఆడమ్"

"రైట్. . . ఇంతవరకూ అసాసినేషన్‌లో ప్రాణాలు కోల్పోయిన బ్రిటీష్ ప్రధానులెంతమంది, ఎవరెవరు?"

"1812 మే పదకొండవ తేదీన హౌసాఫ్ కామన్స్ లాబీలో అసాసినేట్ చేయబడిన ప్రధాని ఒక్కరే. అతని పేరు స్పెన్సర్ పర్సినల్"

"వెరీ కరెక్టు - మిస్టర్ విశ్వనాథ్. . . స్త్రీలకి ఓటు హక్కు నిచ్చిన మొదటిదేశం ఏది, ఏ సంవత్సరంలో?"

"న్యూజిలాండ్. . .1893లో"

"రైట్. . . దేశంలో ఆడపిల్ల పెళ్ళి ఓ సమస్య అయితే అమ్మాయి పుట్టకముందే పెళ్ళి కుదుర్చుకునే సాంప్రదాయం గల ఓ ప్రాంతం వుంది. అది ఏది?"

"ఆస్ట్రేలియాకి చెందిన మెలివిల్లి దీవిలోని ప్రజల్లో వున్న ఆచారమది. ఓ యువతికి పెళ్ళి జరుగుతున్న సమయంలోనే పుట్టబోయే ఆడపిల్లని కోడలుగా చేసుకునేట్టు కాంట్రాక్టులు రాసుకుంటారు."

పోటీలో మొదటి ఏభై నిముషాలు పూర్తికావటంతో క్షణం ఆగాడు క్విజ్ మాస్టర్.

క్విజ్ మాస్టర్ అసిస్టెంట్ స్కోర్ తెలియచేసింది.

"మిస్టర్ విశ్వనాథ్ నూరుశాతం స్కోర్ చేసి నూరు మార్కులతో మొదటి స్థానంలో వున్నారు. ఒక ప్రశ్నకి జవాబు చెప్పలేకపోయిన మిస్టర్ రాజేంద్ర స్కోర్ తొంభై మార్కులు."

ఓ మూల రాజేంద్ర బృందం మినహా ఆడిటోరియం మొత్తం చప్పట్లతో అభినందించింది విశ్వనాథ్‌ని.

"ఇప్పుడు. . ." క్విజ్ మాస్టర్ వాసు అన్నాడు రాజేంద్రని చూస్తూ "ముందు వివరించిన నిబంధన ప్రకారం మీకు అయిదు నిముషాలు కేటాయించి పది ప్రశ్నల్ని అడగబోతున్నాను.

ప్రారంభిస్తున్నాను”

రాజేంద్రలో మునుపటి ఉత్సాహం లేదు. సీరియస్‌గా విశ్వనాథ్ వేపు చూశాడు.

ఇదేమీ పట్టించుకోనట్టు విశ్వనాథ్ ఆడిటోరియంలోకి చూస్తున్నాడు ఎవర్నో వెదుకుతున్నట్టుగా.

ఆ క్షణాన విశ్వనాథ్ గెలుపుని కోరుకోవడం కృషిలో అనాలోచితంగా జరిగిన చర్య కావచ్చు. కాని ఇందులో నిజాయితీ వుంది. ముందు ఓ మోసగాడిలా అనిపించినా ఇప్పుడు వచ్చిన మార్పుతో దానిని ఆకతాయితనంగా భావించాలని మనసు ఉబలాట పడుతోంది. అదికూడా కాదు ప్రేక్షకుల నుంచి అతడి మేధస్సుకి పెద్ద రెస్పాన్స్ లేకపోయినా అతడు సాగిస్తున్న ఒంటరి పోరాటానికి తనైనా అండ నిలవాలనిపిస్తూంది. అంతే.

“మిస్టర్ రాజేంద్రా- ఎల్ సాల్వడార్ కరెన్సీ పేరు”

“కోలన్స్”

“థాయ్‌లాండ్ భాష పేరు”

“థాయ్“

“హంగరీ రజధాని”

“బుడాపెస్ట్”

“గ్రీక్స్ సిటీ ఆఫ్ సర్‌గా పిలిచే లెబనాన్ సిటీ”

“బాల్‌బెక్”

“జమ్మూకాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ నాయకుడెవరు”

“అమానుల్లాఖాన్”

“ఏభై సంవత్సరాలపాటు ప్రపంచానికి దూరంగా ఒంటరితనంలో గడిపి ఈ మధ్యనే చనిపోయిన నటి పేరు”

“గ్రేటా గార్బో”

“మనిషి కిడ్నీ సగటున నిముషానికి ఫిల్టర్ చేసేబ్లడ్ ఎంత?”

“వన్ పాయింట్ త్రి లీటర్స్”

“గ్రీక్ వేదాంతి ప్లేటో భార్య పేరు?”

“ప్లేటో అవివాహితుడు”

“ప్లేటో లాగే పెళ్ళి చేసుకోని ప్రముఖ ఫ్రెంచ్ దార్శనికుడు”

“జీన్ పాల్ సార్త్రె”

“సిగ్మండ్ ఫ్రాయిడ్ భార్య పేరు?”

“మార్తా బెర్నేస్”

ఆడిటోరియం కరతాళ ధ్వనులతో నిండిపోయింది రాజేంద్ర పది ప్రశ్నల్ని నూరు శాతం ఆన్సర్ చేసిన సందర్భంగా

"కంగ్రాట్స్ మిస్టర్ రాజేంద్ర. పది ప్రశ్నలకి సరైన జవాబులు చెప్పి మొత్తం నూట తొంబై మార్కుల్ని స్కోర్ చేశారు" క్విజ్ మాస్టర్ రాజేంద్రని అభినందిస్తూ విశ్వనాథ్ వేపు చూసాడిప్పుడు. "నౌ ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్. భార్యకాక సిగ్మండ్ ఫ్రాయిడ్ని అమితంగా ప్రభావితం చేసిన యువతి ఎవరు?"

"మిన్నా. . . ఫ్రాయిడ్ భార్య మార్తా చెల్లెలు."

"రైట్. పదిహేనేళ్ళ వయసులో ఇంట్లో నుంచి పారిపోయి ద్రాక్షతోటలో పని చేయడంతో పాటు అంట్లు తోమేవాడుగా, ఆటోమెకానిక్గా పనిచేసిన ఓ వ్యక్తి అమెరికన్ ప్రెసిడెంట్ అయ్యాడు" క్విజ్ మాస్టర్ ప్రశ్న పూర్తి కాలేదు జవాబు చెప్పాడు విశ్వనాథ్.

"లిండా జాన్సన్"

"గాంధీని పెళ్ళి చేసుకునేసరికి కస్తూరిబాయి వయసెంత?"

"పదమూడేళ్ళు"

"సిఫిలిస్, తలనొప్పిలాంటి రుగ్మతలతో జీవితమంతా బాధపడిన ఫ్రెంచి రచయిత ఎవరు?"

"మెపాసా"

"షెర్లాక్ హోమ్స్ రచయిత సర్ ఆర్థర్ కానన్ డోయల్ పోస్టులో పోగొట్టుకున్న తొలి రచన పేరు."

నిశ్శబ్దంగా వుండిపోయాడు విశ్వనాథ్.

ఒకటి రెండు మూడు. . . ఇరవై సెకండ్లు గడిచాయి.

కృషిలో టెన్షన్ ఉధృతమైంది.

ముప్పై సెకండ్లు పూర్తయిన సూచనగా బజర్ మోగగానే 'ది నెరేటివ్ ఆఫ్ జాక్స్మిత్' అన్నాడు క్విజ్ మాస్టర్.

రాజేంద్ర రిలాక్స్‌డ్‌గా చూశాడు. అతడి అభిమానుల్లో ఉత్కంఠ అధికమైంది. విశ్వనాథ్ మరో ప్రశ్నకి జవాబు చెప్పకపోతే చాలు రాజేంద్ర గెలుస్తాడు.

"మార్క్ ట్వయిన్ అసలు పేరు?"

"సామ్ క్లమెన్స్"

"అబ్రహాం లింకన్ సెక్రటరీ పేరు?"

"కెన్నడీ"

"కెన్నడీ సెక్రటరీ పేరు?"

"లింకన్"

"ఎలక్షన్‌తో అవసరం లేకుండా మూడేళ్ళు అమెరికా ప్రెసిడెంట్‌గా వున్న వ్యక్తి?"

"గెరాల్డు ఫోర్డ్"

"ది లాస్ట్ క్వెశ్చనాఫ్ ది క్విజ్ కాంపిటీషన్" చెప్పాడు క్విజ్ మాస్టర్ వాసు విశ్వనాథ్‌ని తదేకంగా చూస్తూ "కళ్ళకేదో మబ్బు కమ్మినట్టుంటాది. నిదరల్లె నా వొళ్లు నీరసిస్తున్నాది. తెలుగులో ఓ ప్రముఖ జానపద గీతంలోని పంక్తులివి. . . ఆ గీతం రాసిన కవి ఎవరు."

జవాబు చెప్పలేదు విశ్వనాథ్.

ఆలోచిస్తున్నట్టుగా కళ్ళుమూసుకున్నాడు.

గెలుపూ ఓటములు నిర్ణయించే ఆఖరి ప్రశ్న అది.

విశ్వనాథ్‌లో చలనం లేదు. . .

అప్పటికే ఇరవై అయిదు సెకెండ్లు గడిచాయి. జవాబు చెప్పటానికిక మిగిలింది అయిదు సెకెండ్లు మాత్రమే.

కృషి పాలభాగం పై స్వేధం పేరుకుంది.

ఆడిటోరియంలో చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దం పేరుకుంది.

ముప్పై సెకెండ్లు పూర్తయిన సూచనగా బజర్ మోగింది.

ఉన్నట్టుండి ఆడిటోరియం కరతాళ ధ్వనులతో హోరెత్తిపోయింది.

“ఐ పిటీ యు మిస్టర్ విశ్వనాథ్” ఓడిన విశ్నుని చూస్తూ సానుభూతిగా అన్నాడు క్విజ్ మాస్టర్ వాసు. “డిఫెండింగ్ చాంపియన్‌తో చివరిదాకా అద్భుతంగా పోరాడిన మీరు ఆఖరి ప్రశ్నకి జవాబు చెప్పలేకపోయారు. . . ఆ జానపద గీతం రాసింది నండూరి.”

“కొందరు విద్యార్థులు డయాస్ పైకి దూసుకుపోయి విజేత రాజేంద్రని పైకెత్తేసారు.

అవాక్కయి చూస్తూంది కృషి.

ఓడిన విశ్నులో ఓటమి తాలూకు బాధలేదు. ముందుకొచ్చి తనూ రాజేంద్రని అభినందించాడు. “కంగ్రాట్స్”

ఆ తర్వాత వచ్చిన పదైనట్టు చకచకా డయాస్‌పై నుంచి క్రిందకి నడిచి అందరూ చూస్తుండగానే ఆడిటోరియం దాటి చీకటిలోకి వచ్చాడు. . .

అక్కడ కారు దగ్గర నిలబడ్డ కృషిని చూడడం కాకతాళీయమో లేక ముందునుంచీ ఆమెను గమనిస్తున్నాడో ఆమెకు తెలీదు. ఆమె అతడి కోసమే వెయిట్ చేస్తున్నట్టు “హల్లో” అని పలకరించి కారులో కూర్చున్నాడు.

ఆ క్షణందాకా అతడిపై ఏర్పడిన అణువంత సదభిప్రాయం ఏమన్నా వుంటే అదికాస్తా చెదిరిపోయింది.

అందరూ తననే గమనించడాన్ని చూసిన కృషి వెంటనే కారుని ముందుకు పోనిచ్చింది రాద్ధాంతం చేయకుండా.

రోడ్డు కిరుపక్కలా బారుల్లా వున్న విద్యుద్దీపాల కాంతి ఆమె చెంపలపై వెలుగు నీడల్ని అద్దుతుంటే అన్నాడు విశ్ను.

“థేంక్స్ మిస్ కృషి”

“దేనికి”

“పిలవకుండా వచ్చినందుకు” ఆమె జవాబు చెప్పలేదు.

ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని మభ్యపెట్టి అతడు తప్పించుకున్న పద్ధతి గురించి ఆలోచిస్తూంది అ క్షణంలో.

“యూ సీ మిస్టర్.”

“విశ్ను. . .” టక్కున చెప్పాడు.

“నీ పేరేమిటో ముందే తెలుసుకున్నాను.”

“తెలుసుకున్నాకనే యిలా వచ్చారని నాకు తెలుసు”

“ఎలా”

"ఎనాలిసిస్. . ." నిశ్చలంగా చూశాడు విశ్వ "అవును కృషి. . . ఉదయం మీరు నా విషయంలో హర్ట్ కావటాన్ని గమనించాను నేను కారు దిగేక మీరు సరాసరి పోలీస్ స్టేషన్‌కి వెళ్తారని వూహించాను. . . కాబట్టే మీరు పోలీస్ స్టేషన్‌కి చేరకముందే మీరు వస్తున్నట్టు యస్సై వెంకట్రావ్‌కి ఫోన్ చేసి చెప్పాను కూడా."

దిగ్భ్రాంతిగా చూసింది కృషి. . .

"మొత్తానికి నా అంచనా మేరకి మీరక్కడికి వెళ్ళారు. యస్సై ద్వారా అంతా విన్నారు. నా ఎనాలిసిస్ ప్రకారం పోటీకి వచ్చారు."

"ఎన్ని గట్స్ నీకు- " సీరియస్‌గా అంది. "నన్ను నీ లవర్‌గా చెప్పటానికి నీకెన్ని గుండెలు?"

"అమ్మాయి స్థాయిని బట్టి గుండెల సంఖ్య పెంచుకోవాలంటారా"

అతడి పరిహాసం ఆమెను మరింత ఉద్రేకపరిచింది. "ఎస్ మిస్టర్ విశ్వ. . . లవ్ మాట అటుంచితే అసలు నా స్థాయి అమ్మాయిని లవర్‌గా చెప్పుకోటానికైనా చాలా గుండెలు కావాలి."

విశ్వ మౌనం మాత్రమే కాదు..... అతడి మృదు మందహాసాన్నీ ఆమె భరించలేకపోయింది. "ఒక మోసగాడిగా, డబ్బు కోసం ఎంత నీచానికైనా దిగజారే ఓ లోఫర్‌గా పరిచయమైన నువ్వు ఆలోచనల్లో సైతం నాకు దగ్గర కావాలనుకోవడం దారుణం, క్షమించరాని నేరం కూడా. "

"మీరు అవసరానికి మించి ఎక్కువగా రియాక్టవుతున్నారు కాని అసలు ఏ మనిషి ఆలోచనల్నయినా మరో వ్యక్తి ఎలా ఆపగలడు. . . ఉదాహరణకి మన విషయం తీసుకుందాం.... పక్కన కూర్చున్నాను. మిమ్మల్ని ఫిజికల్‌గా ముట్టుకోవడం నేరం కావచ్చేమో కాని ఆలోచనల పరంగా ఏవన్నా చేయగలను. చీకటి నవ్విన చిరు వెలుగులా మీ కనుపాపల్లో మెరిసే కాంతి నాలో ఇప్పుడు కలవరం రేపుతోందన్న విషయం మీకు చెప్పకుండా అలాగే మీ కళ్ళను చూస్తూ వుండిపోగలను. . . దాన్ని మీరు అడ్డుకోలేరుగా. మీ మౌనం నా ఆలోచనల అడుగున వున్న కోరికల తీగల్ని కదిలిస్తూ సంజె యెరుపు సెలయేటిపై పరుచుకున్న తొలి సిగ్గులాంటి మీ చెంపల్ని స్పృశించమని ప్రేరేపిస్తుంది. మానసికంగా ముట్టుకొన్నాను కాని అది మీకు తెలీదుగా..... మీ కనుకొలకుల కాంతి సంగీతాన్ని వింటూ నిమ్నోన్నతాల జాగ్రఫీని నిశిరాత్రి వేళ చదవాలని నా మనసు వువ్విళ్ళూరుతూంది. ఆలోచనల వర్షా గగనాన్ని పరుపుగా మార్చి అల్లసాని రాయని పిచ్చెక్కిన ప్రవరాఖ్యుడిలా రెచ్చిపోతూ మీ క్రీగంట సరఫరా అయ్యే విద్యుచ్ఛక్తిని ఒంటిలోకి రప్పించుకోవాలని వుంది. ఇప్పటికే ఆలోచనల్లో రప్పించుకున్నాను కూడా. అది మీకు తెలీదుగా."

"స్టాపిట్" అరిచింది కృషి. ఆమె ఫాలభాగంపై పేరుకున్న స్వేదం ఉక్రోషంగా కానీ మనసులోని ఏ ద్వారాల్నో తెరిచి చాలా ఇబ్బంది పెట్టినా వాస్తవాన్ని ఋజువు చేస్తుంటే కారుని ఓ మూల ఆపింది. "దిగిపో"

"హృదయ సింహాసనంపై నుంచా"

వ్యంగ్యంగా నవ్వింది "ఇంత భాషా పరిజ్ఞానం వున్న వాడివి క్విజ్‌లో ఆ చివరి జానపద గీతం రాసిన వారి గురించి చెప్పలేకపోయావేం. . ."

అదోలా చూశాడు ముందు. . . వెంటనే అన్నాడు "ఓడిపోవాలని"

మళ్ళీ నవ్వింది ఎగతాళిగా "మరో కథ చెబుతావనుకుంటాను"

భావుకుడిలా అప్పటి జానపద గీతపు వాక్యాల్ని ఉచ్ఛరించాడు.

"కళ్ళకేటో మబ్బు కమ్మినట్టుంటాది. నిదరల్లె నా వొల్లు నీరసిస్తున్నాది. . . దూరాన నారాజుకే రాయిడౌనో ఈ రోజు నా రాతలే రాలపాలౌనో"

ఆగేడు క్షణం పాటు. . .

ఆమె విస్మయంగా చూస్తుంటే కవితలా చెప్పుకుపోయాడు విశ్వ. . .

"ఆవు లంబాయంట అడవి పోతుంటాయి. . . గుండెల్లో వుండుండి గుబులు దిగులౌతాది-"

కృషి యిక నిభాయించుకోలేకపోయింది.

"ఇక్కడ మిగతా చరణాల్ని చెప్పగలుగుతున్న నువ్వు అక్కడ మరి పెదవి విప్పకుండా పందెంగా ఒడ్డిన ఇరవైవేలునీ ఎందుకు పోగొట్టుకున్నట్టు."

నండూరి నాయుడు బావ ఎంకిని చూసినట్టు చూశాడు. వెనువెంటనే అన్నాడు "మరో ముప్పై వేలు అప్పళంగా కొట్టేయాలని."

"వ్వాట్" విస్మయంగా అంది.

"అవును కృషీ. . . నేను ఓడిపోతే మరో ముప్పైవేలు ఇస్తానన్నాడు రాజేంద్ర. ఎందుకో తెలుసా? ఇంకా ఛాంపియన్‌గా తనే కొనసాగాలని. . ." యధాలాపంగా నవ్వేశాడు విశ్వ. "నీలాగే ఓ డబ్బున్న అబ్బాయి తన గెలుపుకి మరో ముప్పయివేలు ఉదారంగా ఖర్చు చేస్తానంటే ఆ డబ్బు కోసం నేను ఓడిపోతేనేం."

నిజమనిపిస్తున్నా ఈ నిజాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతూంది. "నమ్మమంటావ్"

"ఇది నిజమే అని నిరూపించబడాలీ అంటే రేపు సాయంకాలం ఆరు గంటలకి బ్లూ లాగూన్ రెస్టారెంట్‌కి రా."

"ఎందుకు"

"రాజేంద్రనీ, నన్నూ అక్కడ చూడటానికి"

ఆమె నిశ్శబ్దంగా వుండిపోయింది చాలా సేపటిదాకా. . .

విశ్వ ఇప్పుడు మోసగాడిగానే కాదు మరింత దిగజారిన వ్యక్తిగా కనిపిస్తున్నాడు.

డబ్బు కోసం వ్యక్తిత్వాన్ని సమూలంగా నాశనం చేసుకోగలనని ధీమాగా చెప్పగలుగుతూ నిర్వీర్యమైపోతూన్న ఈ దేశపు యువతకి అసలు సిసలయిన ఉదాహరణలా కనిపిస్తున్నాడు.

“ఏమిటి ఆలోచిస్తున్నారు” అడిగాడు విశ్ను.

“డబ్బు తీసుకుని హత్యలు సైతం చేయగల హంతకుడికీ డబ్బు కోసం ఎలాంటి గడ్డినయినా కరిచే ఓ యువకుడికీ తేడా ఏమిటా అని.”

“అద్భుతమైన ఆలోచన కృషీ. సస్యశ్యామలమైన దేశంగా ప్రస్తుతించబడే యీ నేలపై పచ్చగా పెరుగుతున్నది గడ్డి మాత్రమే . . . గడ్డి ఒక్కటే కాదు ఆ గడ్డి కోసం ప్రాకులాడే పశువుల సంతతీ ఇక్కడ ఎక్కువే. ఆ పశువుల్లో రాజకీయ నాయకులున్నారు. పోలీసులున్నారు, మేధావులూ వున్నారు. అయితే అందరిలో ఒకడిగా నేనూ బ్రతకటానికి కారణం ఏదన్నా కాని ఒకటి మాత్రం స్పష్టంగా చెప్పగలను. నేను మీరనుకున్న కాలుష్యంలో బ్రతుకుతున్నా యింకా కాలుష్యం పూర్తిగా అంటని వాడ్ని. కాబట్టే నా అవసరానికి డబ్బు సంపాదించే ప్రోసెస్‌లో అప్పుడప్పుడూ యిలాంటి ప్రయత్నాలు చేస్తుంటాను.”

“ఏం చేస్తావా డబ్బుని”

“ఈ ప్రశ్న ఇంత సంపాదించినా ఇంకా సంపాదించాలనుకునే మీ తాతయ్యని అడగాల్సింది.”

ఉలిక్కిపడింది కృషి.

“పరపతి అంటే కేవలం గెలుపు మాత్రమే అనుకునే రాజేంద్ర తండ్రి రామనాథ చౌదరి లాంటివాళ్ళని అడాగాల్సింది.”

ఆమె చూస్తుండగానే కారు దిగుతూ అన్నాడు. “సరే. . . రెండో సారి కారు లిఫ్టు ఇచ్చారుగా, ఇంతడబ్బు నేనేం చేసేదీ చెప్పడం నా కనీస ధర్మం కాబట్టి చెబుతున్నాను. మరేంలేదు. నాకు చాలా ఖరీదయిన కాల్‌గర్ల్స్‌తో సంబంధం వుంది. సంపాదించిన డబ్బుని ఆ సుఖాలకి ఖర్చు చేస్తుంటాను.”

కృషి మొహంలో కదలాడిన జుగుప్సలాంటి భావాన్ని గమనించకుండా వెళ్ళిపోయాడు విశ్ను.

చివరిగా అతడు చెప్పిన విషయంలోని నిజానిజాలు కాదు ఆమె ఆ క్షణంలో ఆలోచిస్తున్నది.

డబ్బులో పుట్టి డబ్బులో పెరిగిన కృషి డబ్బుకి సంబంధించిన కొత్త నిర్వచనాలు వింటూంది.

అసలు గెలుపంటే. . .

డబ్బు సంపాదించడమా . . . లేక. . .

డబ్బు కోసం ఓటమికి సిద్ధపడ్డమా . . .

కొడుకు గెలుపుకోసం కొంత డబ్బుని ఓడిన తండ్రికీ డబ్బుకోసం తనకు తానే ఓటమికి సిద్దపడిన విశ్నుకీ తేడా ఏమిటి.

ఇద్దరిలో గెలిచిందెవరు

కొడుకుని ఓ మేధావిగా సంఘానికి పరిచయం చేయాలని డబ్బుని వెచ్చించే యీ రామనాథ చౌదరి

ఎవరు . . .

0 0 0 0

"సంఘంలో శాఖోప శాఖలుగా విస్తరించిన ఓ క్రిమినల్ రామనాథచౌదరి" చెప్పాడు డాక్టర్ మహంతి.

అపరాత్రివేళ స్తంభించిన గాలికి సాక్ష్యంలా కిటికీ ఆవలి ఫేరన్ మొక్క స్థబ్దతగా కనిపిస్తుంటే ఆసక్తిగా వింటూది కృషి.

"ఒకప్పుడు ఒక మామూలు లేబర్ లీడర్ రామనాథచౌదరి, ఆ తరువాత కేపిటలిస్టుగా ఎదిగిపోయాడు. కోట్ల ఆస్థి సంపాదించాడు. రాజకీయపరమైన పలుకుబడిని సంపాదించుకుని చాలా వ్యాపారాలు ప్రారంభించి ఓ పెద్ద మాఫియా లీడర్‌గా చలామణీ అవుతున్నాడు. ఇల్లీసిట్ లిక్కర్‌ని తయారు చేయడం మొదలుకుని రాజకీయ నాయకులకి గూండాలను సరఫరా చేస్తుంటాడు. అధికారంలో వున్న పార్టీ అండ, సంఘంలో వున్న పరపతి అక్రమంగా సంపాదించిన డబ్బు ఇవన్నీ అతడి స్టేటస్‌ని కాపాడుతుంటాయి. కాబట్టే యిప్పుడు తన కొడుకు ఓడిపోకుండా వుండటానికి డబ్బు ఖర్చు చేయటానికి సిద్ధపడ్డ చౌదరి తన గెలుపుకి స్థాయి భేదం లేదన్నట్టు చాలా కాలం నుంచి మీ తాతయ్యని ఢీకొంటూ మెంటల్‌గా టార్చర్ చేయగలుగుతున్నాడు కూడా."

దిగ్భ్రాంతిగా చూసింది. . . "అంటే"

“ఏదో తెలుసుకోవాలని ప్రయత్నించిన కృషి ఇప్పుడు మరో కొత్త విషయం వింటున్నట్టు ఆసక్తిగా ” గ్రాండ్‌పాకి, చౌదరికీ గొడవలున్నాయా”

“ఉపాధ్యాయగారి స్థాయినిబట్టి తనంతట తానుగా చౌదరితో గొడవపడే అవకాశంగాని అవసరంగానీ లేవు కృషి. . . కానీ చౌదరి తానే కోరి మీ తాతయ్యతో గొడవ ప్రారంభించాడు” డాక్టర్ మహంతి సంకోచించలేదు చెప్పడానికి. ఒకనాడు తాతయ్యకి సంబంధించిన చాలా విషయాలు వినడానికి ఆసక్తి చూపించని కృషి యిప్పుడు యిలాంటి సంయమనాన్ని ప్రదర్శించడం ఆనందంగా వుంది. “ఫ్యాక్టరీ కార్మికుల కోసం ఓ హాస్పిటల్ కట్టించాలని సరిగ్గా పదేళ్ళ క్రితం ఫ్యాక్టరీ దగ్గరగా పదెకరాల భూమి కొన్నారు మీ గ్రాండ్‌పా. . . కన్‌స్ట్రక్షన్ ప్రారంభం కావటానికి కొన్ని ఫార్మాలిటీస్ వుంటాయిగా. . . ఈ లోగా ఆ లేండ్ కావాలన్నాడు చౌదరి.”

“దేనికి”

“తను ఓ హోటల్ కట్టించాలని- డబ్బు ఎంత చెల్లిస్తానన్నాడన్నది కాదు సమస్య..... అదే లేండ్ కావాలని చౌదరి అడగటంతో తాతయ్య తిరస్కరించాడు. పొలిటికల్‌గా చాలా ఒత్తిడి తెచ్చాడు కూడా. అయినా మీ తాతయ్య వీల్లేదని ఖండితంగా చెప్పేశాడు. అంతే. . . ఓ అర్ధరాత్రి అక్కడ గుడిసెలు వేయించాడు. దాన్ని బడుగు వర్గాల కాలనీగా ప్రభుత్వం గుర్తించాలని నిరహార దీక్షలాంటిది చేసి పెద్ద రాద్ధాంతానికి కారణమయ్యాడు.”

“తాతయ్య లీగల్‌గా ఎదుర్కోలేడా?”

“ఈ దేశానికి ఇలాంటి కేసులు దశాబ్దాల తరువాత గానీ ఓ కొలిక్కి రావు కృషి. కేసు నడుస్తూంది. ఇక ముందూ నడుస్తుంది. ఐతే ఆ తర్వాత మీ గ్రాండ్ పా ఫ్యాక్టరీలో చౌదరి కార్మికుల ద్వారా సృష్టించిన, ఇంకా సృష్టిస్తున్న అల్లర్లు కాని, ప్రభుత్వ పరంగా ఎలక్ట్రిసిటీ వాటర్ సప్లయ్ విషయంలో కలిగిస్తున్న విఘాతాలు కాని నువ్వూహించలేవు. ఒక్కమాటలో చెప్పాలీ అంటే మీ తాతయ్య అనారోగ్యానికి ఖచ్చితంగా ఈ సమస్యలే కారణం కాకపోయినా ఈ సమస్యలు కూడా ఆయన్ని మానసికంగా కృంగదీస్తున్నాయని మాత్రం చెప్పగలను.”

ఆ తర్వాత కృషి ఇక మాట్లాడలేదు.

డాక్టర్ మహంతి చెప్పిన విషయాల్లోని ఆ చివరి పంక్తులు ఆమె ఎంత కలవరపరిచాయీ అంటే అవే మాటల్ని పదేపదే మననం చేసుకుంది. . .

ఒక నేరస్తుడు - ఒక దళారి - ఒక సంఘ విద్రోహకశక్తి తాతయ్యపై విజయం సాధించాడు. ఆ ప్రభుత్వాన్ని పాలిస్తున్నది దళారీలు, గూండాలు కావడంతో వేలమంది నిరుపేదలకి ఉపాధిని కల్పించగలుగుతున్న తాతయ్య ఉనికిని ప్రశ్నిస్తూంది.

పేదల సంక్షేమ న్యాయంగా సంపద పంపిణీ సర్వం సహకారాలు గల రాజ్య వ్యవస్థ అనే సూత్రాల్ని వల్లెవేసే బ్యూరోక్రాట్స్, రాజకీయ దళారులు ఆశ్రిత వ్యాపార గణానికి

సంపద సృష్టికి అవకాశాలు మృగ్య మై పోతున్నాయి.

పారిశ్రామిక విస్తరణ, ఆరోగ్యప్రదమైన పోటీతత్వం, అధునాతన టెక్నాలజీకి ఆహ్వానం - ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడాల్సిన అవకాశాల్ని కాక అవినీతి విస్తృతం కావటానికి ఆర్థిక దుస్థితిలో ద్రబ్యోల్బణం పెరగడానికి కొందరు స్వార్థపరులు కారణమౌతున్నారు.

ఇవన్నీ కాదు - చాలా గర్వంగా బ్రతుకుతున్నాడనుకున్న తాతయ్య కూడా ఓటమిలాంటి స్థితిలోనే కూరుకుపోయారు. దానికి కారణం చౌదరి. ఈ వ్యవస్థలోని కాలుష్యాన్ని మొత్తం కడిగేయగల శక్తి తనకు లేదు. కాని చౌదరిలాంటి ఓ దుష్టశక్తిని ఎదుర్కోవాలనుంది.

చాలా చిన్న విషయాలు ఒక్కోసారి మనసుని ఎంత కలవరపరిచేదీ ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నట్టుగా అంది. "స్టేట్స్‌కి వెళ్ళిపోదామనుకున్న నేను ఎందుకు వున్నదీ ఇప్పటిదాకా ఖచ్చితంగా నాకూ తెలీదు అంకుల్. కాని వున్నందుకు ఏదో చేయాలనిపిస్తుంది."

ఓ చిన్న ప్రారంభానికి అంకురార్పణలా ఆ క్షణాన ఆమె గుర్తు చేసుకుంది. చౌదరిని కాదు. . .

డబ్బు కోసం ఏదన్నా చేయగల విశ్నుని . . .

0 0 0 0

"హల్లో"

మంద్రంగా వెలుగుతున్న బ్లూ లాగూన్ రెస్టారెంటు విద్యుద్దీపాల కాంతిలో కృషి మెరుస్తున్న తారకలా కనిపించింది.

రాజేంద్రతో ఉత్సాహంగా మాట్లాడుతున్న విశ్ను ముందు ఉలికిపడ్డాడు. మరుక్షణం పలకరింపుగా నవ్వి వెంటనే ఆహ్వానంలా కూర్చోమన్నట్టుగా చూశాడు.

ఏదో మాట వరసకి అన్నాడే కాని ఇలా ఆమె వస్తుందని ఊహించలేక పోయాడు.

"ఇండస్ట్రియలిస్టు ఉపాధ్యాయగారి గ్రాండ్ డాటర్ కృషీ- ఇతను రాజేంద్రని" విశ్ను పరిచయం చేస్తుంటే అర్థోక్తిగా ఖండించాడు.

"మిస్టర్ రామనాథ్ చౌదరి ఒక్కగానొక్క కొడుకు, నిన్న మీతో ఐక్యూలో పోటీపడ్డ డిఫెండింగ్ ఛాంపియన్- ఇప్పుడు మీ ఓటమికి ధర చెల్లిస్తూ. . ."

"స్టాపిట్" ఆవేశంగా అరిచాడు రాజేంద్ర. "మీరు నన్ను ఇన్సల్టు చేస్తున్నారు"

"వందలమంది ప్రేక్షకుల్ని మోసం చేసిన మీ మీద గౌరవం ఉంటుందని ఎలా అనుకుంటున్నారు".

"వాట్ నాన్సెన్స్ ఆర్యూ టాకింగ్"

"సన్నివేశాన్ని ఎదుర్కొనే నైతిక శక్తి లేనివాడు ఇలాగే అరుస్తాడు మిస్టర్ రాజేంద్ర" సూటిగా విషయానికి వచ్చింది. "చెప్పండి నిజంగా మీరు మరోసారి ఐక్యూ కాంపిటీషన్‌లో మరో ప్రత్యర్థిని ఎదుర్కోగలరా. . . అఫ్‌కోర్స్- చేతకాదు అంటే వెంటనే చెప్పండి"

పైకి లేచాడు రాజేంద్ర

"పారిపోతున్నారేం-"

ఒక అందమైన అమ్మాయి పైగా తన తండ్రికి ప్రత్యర్థి అయిన ఉపాధ్యాయ మనవరాలు ఇలా దారుణంగా అవమానిస్తుంటే తట్టుకోలేకపోతున్నాడు "వాట్ డూయూ మీన్"

"ఓకే. . . మీరు వెళ్ళొచ్చు" అంది కృషి.

"దమ్ముంటే పోటీ ఏర్పాటు చేయండి" అన్నాడు ఉక్రోషంగా. "ఒక్క విశ్వనాథ్‌నే కాదు అలాంటి వందమందితో ఛాలెంజ్ చేయమనండి"

"వెల్‌కమ్"

"కాని ఈ సారి ఇరవై వేలు కాదు" గుర్తుచేశాడు రాజేంద్ర.

"లక్ష రూపాయలు- సరేనా" అంది కృషి.

రాజేంద్ర మొహం వివర్ణమైపోయింది. "అంత పెట్టుబడి పెట్టబోతున్నారా?"

"నాలక్ష్యం నీ ఓటమి. . . కావాలంటే రెండు లక్షల పెట్టుబడికైనా సిద్ధం."

"ఓకే- నేను రడీ" ఆవేశంగా విజిటింగ్ కార్డు టేబుల్‌పై గిరాటేసి వెళ్ళిపోయాడు.

అప్పటికి చాలా ఇబ్బందిగా కూర్చున్న విశ్వ ఓపిక నశించినట్టుగా అన్నాడు "మీరిలా చేయాల్సింది కాదు."

నవ్వింది అవహేళనగా "ఏది చెయ్యకూడదో, ఏది చెయ్యొచ్చో డబ్బు కోసం ఏదన్నా చెయ్యగల నువ్వు మాట్లాడ్డం దారుణం"

చురుక్కుమంది. ఐనా తమాయించుకున్నాడు. "రాజేంద్ర బేక్‌గ్రౌండ్ మీకు అంతగా తెలీదనుకుంటాను."

"అలా ఆలోచించాల్సింది గాలివాటుగా బ్రతికేవాళ్ళు."

ఈ వాక్యమూ తగలకూడని చోటనే తగిలింది.

డబ్బున్న ఓ అమ్మాయి ఇక్కడ అవసరానికి మించిన స్వాతిశయాన్ని ప్రదర్శిస్తూంది.

"నేనూ రాజేంద్రని మించిన ఆస్థిపరురాలినే విశ్వా. కాబట్టి రెండు లక్షలు ఖర్చు చెయ్యడం నాకు శ్రమ కాదు."

"గెలుపు అంత సులభం కాదు."

"నీకూనా"

రెచ్చగొడుతున్నట్టుగా చూసింది.

"మాట్లాడు విశ్వా. . . నీకు చేతకాదంటే చెప్పు- మరో సమర్థుడ్ని రంగంలోకి దింపుతాను. ఏమిటి అలా తెల్లమొహం వేసుకు చూస్తున్నావు. ఐనా డబ్బుకోసం స్వాభిమానం చంపుకోగల నీలాంటివాడు ఇలా రియాక్టు కావడం ఘోరం."

ఉన్నవాళ్ళ భేషజం అతడికి సరిపడదు. ఇప్పుడు కృషి అదే వ్యక్తం చేస్తూంది.

ఏ అభిజాత్యాన్ని అతడు సహించలేడో కృషి అదే ఎగ్జిబిట్ చేస్తూ అతడ్ని దారుణంగా

"నిజంగా మీరు రెండు లక్షలు పెట్టుబడి పెడతారా"

"యస్. . . గెలవగల సమర్థుడికి"

"ఒకవేళ మీరనుకుంటున్న సమర్థుడు ఓడితే. . ."

"ఊరుకోను. రెండు లక్షలు నాకు చెల్లించమంటాను."

"చెల్లించే శక్తి లేకపోతే. . ."

"ఆరు నెలలపాటు మాయింటి గూర్ఖాగా వూడిగం చేయించుకుంటాను. ఓ గూర్ఖాకి అంత జీతం యిస్తారా అని అడక్కు. అది నా స్టేటస్‌కి సంబంధించింది. చెప్పు. నువ్వు పోటీకి సిద్దపడతావా. . .మరో సమర్థుడ్ని వెదుక్కోమంటావా. . ."

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

"అక్కర్లేదు. నేనే పోటీ పడతాను."

"కాని మరో ఏభైవేలు రాజేంద్ర నుంచి ఎక్కువ తీసుకుని ఓడిపోకూడదు."

ఆవేశంగా పైకి లేచిన విశ్వ బార్ కౌంటర్ దగ్గరికి వెళ్ళి ఓ కాగితంపై చకచకా రాసేడు. "ఇది మీ దగ్గర వుంచుకోండి" అన్నాడు కాగితాన్ని అందిస్తూ.

"ఏమిటిది" అంది కాగితాన్ని అందుకోకుండా. . .

"మాట పట్టింపు వున్నవాళ్ళకే కాదు లేనివాడికీ వుంటుందని నిరూపించే మోరల్ అగ్రిమెంట్. నేను ఓడితే మీ ఇంట ఆరునెలలు గూర్ఖాగా పనిచేస్తానని రాసిన పేపరు. కాని నేను గెలిస్తే."

"చెప్పు"

"నాక్కావాల్సింది రెండు లక్షలు కాదు"

"మరి. . ."

"మీరు నాతో ఒక రాత్రి గడపాలి"

ఉలిక్కిపాటుగా చూసింది. మెదడు పొరల్లో పేలిన విస్ఫులింగాలు ఆమె కళ్ళలో క్రోధాన్ని నింపుతుంటే నిశ్శబ్దంగా వుండిపోయింది చాలా సేపటిదాకా. . .

"బలవంతం లేదు మిస్ కృషి. . . మీరు సరేనంటేనే ఈ పందేనికి సిద్ధపడదాం..... ఆలోచించుకోండి. సరే అని నోటితో అనాల్సిన పనిలేదు. ఈ కాగితాన్ని అందుకుంటే అది మీ అంగీకారమనుకుంటాను."

రెండు యుద్ధాల మధ్య ప్రశాంతతలాంటి విరామం.

కోరిన గెలుపు కోసం చాలా మూల్యాన్ని కోరుతున్న ఓ అనామకుడు యిప్పుడు తన వునికినే ప్రశ్నిస్తున్నాడు.

రెండు నిముషాలు గడిచాయి.

అంతే. కాగితాన్ని అందుకుంది ఉద్విగ్నంగా

ఆరాత్రి విశ్వ నిద్రపోలేదు.

నగర పొలిమేరల్లో వున్న ఓ అనాథాశ్రమపు గదిలో పడుకుని అటూ యిటూ పొర్లుతున్నాడు.

మనో ఆకాశంపై కదలాడుతున్న జ్ఞాపకాల మేఘాలు. . . అబద్ధాన్ని ఆశ్రయించిన సుఖాలవంటి ఆలోచనలు వూపిరాడక గిజగిజలాడుతున్న నిశబ్దం నీరసం. . . సరుగుడు చెట్ల నీడలలో ఉల్లాసంగా తిరిగే వయసు మిగిల్చిన చేదు వాస్తవాలు అతడ్ని అనూహ్యమైన అసహనానికి గురిచేస్తుంటే పైకి లేచాడు.

పక్కన ఆదమరిచి నిద్రపోతున్నాడు సూరి. విశ్వకి స్నేహితుడు. ఆ రోజు కృషి వేలెట్‌ని కాజేసిన వ్యక్తి.

సూరిని క్షణంపాటు తదేకంగా చూసి గదిదాటి బయటకి వచ్చాడు విశ్వ.

శాటిన్ తెరలా కప్పిన చీకటి - సమాధిలో ముందొక పర్ణశాలలాంటి కుటీరం, దానికి ఆనుకుని వున్న అనాథ బాల శరణాలయం, దాని ప్రక్కన స్త్రీ సేవాసదన్. . . ప్రపంచం నుంచి విడదీస్తున్న ఫెన్సింగ్‌కి ఆవల దట్టంగా ఆవరించిన చెట్లు.

పిచ్చిగా తిరిగాడు తెల్లవారేదాకా.

ఎక్కడో మొదలైన జీవితం హఠాత్తుగా ఇక్కడ ముగిసి మరో ఆరంభానికో గుర్తుగా మారిపోయింది.

మధ్యలో ఆగిన చదువు సగంలో విరిగి స్వప్నమై ఇక్కడి అనాథలకి ఆసరా కమ్మని శాసిస్తే యిదే జీవితం అంటూ యిలా రాజీపడిపోతున్న విశ్వాకి ఆ క్షణాన ఏం గుర్తుకొచ్చిందో స్త్రీ సేవాసదన్ దాకా నడిచాడు.

ముందు ఓ గది. ఆ గది కిటికీ దగ్గరే నిలబడ్డ ఓ మధ్య వయస్కురాలు అతడ్ని గమనించలేదు. గమనించినా అతడెవరన్నదీ గుర్తుపట్టనట్టు బయటికి చూస్తోంది ఎవరి ఆగమనం కోసమో నిరీక్షిస్తున్నట్టు.

"అమ్మా" పిలిచాడు ఆర్తిగా .

జవాబు లేదు.

తన పిలుపికి ఆమె స్పందించింది ఎన్ని నెలల క్రితమో అతడికి గుర్తులేదు. మరెన్ని యుగాల తర్వాత తనను గుర్తుపట్టి పరవశంగా దగ్గరకు తీసుకుంటుందో అంతకన్నా అర్థం కాదు.

ఏ శూన్యం ఆమె మస్తిష్కపు పొరల్ని కప్పి ఆమెను మతిభ్రమించిన స్త్రీగా మార్చిందో గాని ఆమెను మళ్ళీ వాస్తవానికి రప్పించగలనన్న నమ్మకం లేదు.

అలాగే నిలబడ్డాడు ఓ తపస్సులోలా చలనం లేనట్టుగా.

ఎంతసేపు అలాగే వుండిపోయాడో అతడికి గుర్తులేదు.

భుజంపై చేయిపడటంతో తేరుకుని వెనక్కి చూశాడు.

భానుడిలా అనిపించే బాబా చైతన్యానంద.

ఆజానుభాహుడైన చైతన్యానంద ఎక్కడివాడో తెలీదు. కాని అక్కడ ప్రతి అనాథకీ తండ్రి..... వయస్సు ఏభై దాటిందో లేదో కాని నూరేళ్ళ వృద్ధుడిలా అనిపిస్తాడు. శరణాలయాన్ని నడుపుతున్నది అతడే అయినా అందరితో ఒకడిలా వుంటాడే తప్ప అందరికీ తను అధిపతినన్న ఆలోచన లేనివాడు.

శూన్యంలా నవ్వగలడు. అనంతలా అనిపిస్తాడు. నీరవంలా వుంటాడు. మనుషుల సమస్యల్ని గట్టెక్కించే తీరంగా దర్శనమిస్తాడు.

మొహంపై ముడతలు ఏ గతానికి చిహ్నాలో తెలీదు కాని ఆ ముడతల్ని కప్పిన గెడ్డం జీవిత సారానికి వచ్చిన వయసులా అనిపిస్తుంటే అందర్నీ అక్కున చేర్చుకుంటాడు. మక్కువతో మాటలాడి ఓదార్చగలడు.

"తెల్లవారింది వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి" మృదువుగా పలికాడాయన. "ఇంకా చీకటిలో వున్నట్టు ఆ నిర్వేదం ఏమిటి. . ."

నర్మగర్భంగా ఏ జీవిత సత్యాన్నో చెబుతున్నట్టుగా అన్నారు "పసిపిల్లల చేత ప్రార్థనా గీతం పాడించాలి విశ్వా. . . వెళ్ళిరా. . ."

తలవంచుకున్నాడు విశ్వా.

"రాత్రి నిద్రపోలేదు కదూ" పరామర్శగా అడిగాడాయన.

"చాలా రాత్రులుగా నిద్రపోవటం లేదు బాబా" విశ్వ గొంతులో నిట్టూర్పు.

"అంటే ఇంకా గతంలోనే బ్రతుకుతున్నావన్న మాట" జవాబు చెప్పలేదు విశ్వ.

"జీవితమంటే గతం కాదు. వర్తమానం."

"రాజీపడలేకపోతున్నాను."

"అంటే ప్రకృతికి భిన్నంగా ఆలోచిస్తున్నావన్నమాట" ఆప్యాయతగా విశ్వ తల నిమిరాడు చైతన్యానంద. "మనిషి జీవితానికి అర్థం గతమే అయితే నువ్వింకా అమ్మ పొత్తిళ్ళలో పసికందుగానే వుండిపోవాలి విశ్వా. నడక నేర్చావు, నవ్వు నేర్చావు. . . ఇంత వాడివయ్యావు. . . మరి ఇంకా గతంలోనే బ్రతుకుతానంటే ఎలా..... బ్రతకాల్సింది వయసు మనసు పెరగని పసిబిడ్డలా కాదు. అహంకార అభిమాన రహితుడైన పసికందు ఆలోచనలతో... "

"బాబా. . ." ఉద్విగ్నంగా తలపైకెత్తాడు "మీ ఆధ్యాత్మిక చింతనల గురించి మీ కార్యాచరణ చర్చల గురించి నాకు అవగాహన లేదు. మీ దృష్టాంతాల లోతుల గురించి గాని వేదోపనిషత్తుల వితరణ గురించి తెలుసుకోగలిగే శక్తి నాకు లేదు. నాకు తెలిసింది ఒక్కటే. . . నాకు జన్మ నిచ్చీ నేలరాలిన నా తండ్రి పిచ్చిదైన నా తల్లి పగిలిన నా స్వప్నాలు మిగిలిన శకలం లాంటి గతం. . . అంతే. . ."

స్వప్నంలో నిలబడి స్వప్నాన్ని ప్రశ్నిస్తున్న విశ్వ ఆవేశాన్ని ప్రేక్షకుడిలా గమనిస్తూ వుండిపోయాడు చైతన్యానంద . . .

కాలం చెప్పాల్సిన జవాబులకి తను దగ్గ కాదేమో అనుకున్నాడు బాబు శరణాలయం వేపు

నడుస్తున్న విశ్వని చూస్తూ.

సరిగ్గా అదే సమయానికి . . .

రామనాథచౌదరి తన భవంతిలో కూర్చుని ఆ రోజు దిన పత్రిక చదువుతున్నాడు.

అతడికి అభిముఖంగా వున్నాడు అతని కొడుకు రాజేంద్ర.

"క్విజ్ కిడ్ రాజేంద్రపై ఛాలెంజ్. . .

రెండు లక్షల రూపాయల్ని వెచ్చించటానికి సిద్ధపడుతూ మొన్న ఓడిన విశ్వనాథ్ మళ్ళీ విసిరిన సవాల్. . .

ఆదివారం సాయంకాలం ఆరు గంటలకి యూనివర్శిటీ ఆడిటోరియంలో నిర్వహించబడే ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేస్తున్నది కృషి ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఛైర్మన్ శ్రీ ఉపాధ్యాయ. . ."

ఇదే వార్తని అప్పటికి చాలాసార్లు చదివాడు రామనాథ్‌చౌదరి. అది కాదు చౌదరిని అంతగా కదిలించింది.

ఎక్కడో స్టేట్స్‌లో చదువుకుంటూ యీ మధ్యనే ఇండియా వచ్చిన కృషి తన కొడుకుని అవమానించి తన వునికిని ప్రశ్నించింది.

తిరుగులేని తన సార్వభౌమాధికారానికి ఓ ఆడపిల్ల విఘాతం కలిగిస్తానంటూంది.

పడకటింటికి పరిమితం కావాల్సిన ఓ అమ్మాయి తన కొడుకుపై కాదు తన మగతనంపై ఓ సవాల్ విసిరింది.

అధికార పార్టీకి ఆత్మీయుడిగా చాలా పరిశ్రమలకి అధిపతిగా నేర ప్రపంచాన్ని సైతం శాసించగల ప్రముఖుడిగా తనకున్న పరపతి తెలిసి వుండీ తాతయ్యకి బాసటగా నిలిచి తన ప్రత్యేకతని నిరూపించు కోవాలనుకుంటుంది.

చౌదరి ఆలోచనల్లో మునిగి వుండగానే లోపలికి దూసుకొచ్చాడు లాయరు రంగధాంతో పాటు ఎమ్మెల్యే రాజారావు. . .

సుమారు పాతికదాకా హత్యా నేరల్తో సంబంధంగల రాజారావు యిప్పటికీ గూండాల నాయకుడిగానే చలామణీ అవుతున్న వాడైతే ఆ కూటమి చేసే ప్రతి హత్యాకాండకి చట్టబద్ధమైన గైడెన్స్ యిచ్చే ప్రముఖ క్రిమినల్ లాయరు రంగధాం. . .

పేపరు చూడగానే తాను ఫోన్ చేయడంతో పది నిముషాలకల్లా అక్కడ ప్రత్యక్ష మైపోయి స్నేహితుల్ని చూస్తూ అన్నాడు చౌదరి.

"ఇది నిజానికి ఓ పెద్ద సమస్యగా నేను భావించడం లేదు"

ప్రతి సమస్య గురించీ ఇలాగే చర్చించడం చౌదరికి అలవాటు. "అయితే చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలనే ఆలోచన గలవాడ్ని కావడంతో మిమ్మల్ని పిలిచాను..."

చెప్పాడు క్లుప్తంగా . . .

కార్మిక నాయకుడిగా వున్న ఫ్యాక్టరీలో స్ట్రయికు చేయించడం గానీ అయితే ఉత్సాహంగా రియాక్టయ్యేవాడు కాని యిలాంటి పోటీల గురించి పెద్ద అవగాహన లేదు. లాయరు రంగధాం కేసి చూశాడు యీ వ్యవహారంలో తన బాధ్యతేమిటో సలహా యిమ్మన్నట్టుగా.

"అసలు ఈ సమస్య విషయంలో మీరెందుకింత ఆందోళన పడుతున్నదీ నాకు అర్థం కావడం లేదు. ఎందుకంటే రాజేంద్రని ఐక్యూ పోటీలో ఓడించడం అంత సులభం కాదు కాబట్టి.... " రంగధాం యధాలాపంగా అన్నాడు చర్చకి ఉపోద్ఘాతంలా.

"రంగధాం. . . నాకు గెలుపంటే చాలా యిష్టం" సాలోచనగా చూసాడు చౌదరి.

"కాబట్టే మొన్న గెలిచారుగా"

"కాని అది డబ్బుతో. . ." చాలా అయిష్టంగానే చెప్పాడు విశ్వని ఎలా కొనేసింది...

"ఈ సారి కూడా కొనేస్తే సరి."

"కాని అంత సులభం కాదు. ఎందుకంటే విశ్వ డబ్బుకు అమ్ముడుపోయే మనిషిగా కృషి గుర్తించింది. కాబట్టి, ఏదో నమ్మకమే లేకపోతే పోటీకి అతడ్ని దింపే అవకాశం లేదు కాబట్టి"

"రాజేంద్ర గట్టిగా ప్రిపేరైతే బెటరనుకుంటాను"

"ఈ బోడి సలహాలు నాకు అక్కర్లేదు రంగధాం"

ఇంచుమించు కసురుకుంటున్నట్టుగా అన్నాడు చౌదరి "ఆ రోజు ఆ చివరి ప్రశ్నకి గాని విశ్వ జవాబు చెప్పి వుంటే రజేంద్ర ఓడేవాడు.

"అసలు ఆ చివరి ప్రశ్న దాకా విశ్వ తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు అంటే అర్థం ఏమిటి. . . తను మేధావినని పరోక్షంగా తెలియచెప్పడమేగా. తెలియచెప్పడమే కాదు రంగధాం. విశ్వ సామాన్యుడు కాడు. నిజంగా మేధావి. ఆ విషయంలో సందేహంలేదు. కాబట్టే కృషి కూడా పనిగట్టుకుని అతడ్ని రంగంలోకి దింపిందని నా అనుమానం. "

ఆవేశాన్ని నిభాయించుకోలేనట్టు పచార్లు చేస్తూ అన్నాడు "ఇక్కడ నేను ఆలోచిస్తున్నది రెండు లక్షల రూపాయల గురించి కాదు. . . ఓటమిలేని నా ప్రతిష్ట గురించి. ఒకవేళ రాజేంద్ర ఓడితే నా ఉనికి మాత్రమే కాదు రామనాథ చౌదరి కొడుగ్గా- రాష్ట్రంలో ఏ ఒక్కడూ ఓడించలేని ఏకైక ఛాంపియన్‌గా మూడేళ్ళనుంచి రాజేంద్రకున్న పేరు ప్రఖ్యాతలూ మంట కలిసిపోతాయి. అదొక్కటే కాదు రంగధాం. . . ఉపాధ్యాయ ముందు తల వంచుకోవటం ఈ చౌదరి కోరనిది, జరగకూడనిది. . ."

మరో గెలుపు కోసం ముఖ్యంగా ఉపాధ్యాయపై గెలుపు కోసం చౌదరి ఎంత కలవరపడుతున్నదీ అర్థమైంది రంగధాం ఏదో చెప్పబోతుండగానే అక్కడ ఫోన్ రింగయింది.

మామూలుగా అయితే చౌదరి ఆ క్షణంలో ఫోన్ గురించి పట్టించుకునేవాడు కాదు కాని రింగవుతున్నది తన పర్సనల్ ఫోన్. చాలా కొద్ది మంది మాత్రమే మాట్లాడే కాన్ఫిడెన్షియల్

రిసీవర్ అందుకున్నాడు అసహనంగా “ఎవరది”

“నేను. . . కృషి . . . ఉపాధ్యాయ గ్రాండ్ డాటర్ని”

ఉన్నట్టుండి చౌదరి మొహం జేవురించింది. ఓ పిల్ల కాకి సరాసరి పులితో మాట్లాడే సాహసం చేస్తుంది. “చెప్పు నాకెందుకు ఫోన్ చేసావ్”

“చాలా టెన్షన్లో వున్నట్టున్నారు”

చౌదరి పిడికిలి బిగుసుకుంది “ఏ విషయంలో”

“మీ ముందున్న పేపరులో రాయబడింది దాని గురించి”

సన్నగా వినిపించిన కృషి నవ్వు చౌదరి రక్త ప్రసరణ వేగాన్ని పెంచింది. “నువ్వు మాట్లాడుతున్నదెవరితోనో తెలుసనుకుంటాను”

“యస్. తెలుసు. ఒకప్పుడు పారిశ్రామిక వేత్తతో. ఓటమి అంటే భయపడుతూ డబ్బుతో గెలుపును కొనుక్కోగల ఓ సూడో ఇంటెలెక్చువల్ రాజేంద్ర తండ్రితో. . .”

ఇదో విచిత్రమైన అనుభవం అతడికి. . .

అత్యున్నత స్థానంలో వున్న బ్యూరో క్రాట్స్ రాజకీయ నాయకులు సైతం భయపడే తనతో మామూలుగా మాట్లాడ్డం లేదు కృషి. ఆకతాయిగా ఆడుకుంటూంది. “ఇప్పటికీ నేను నీపై గెలుపు సాధించగలను కృషి”

“మీ కృషి చాలదు”

“ఏమిటి నీకంత నమ్మకం”

“హైస్కూలు స్థాయి పరిజ్ఞానం గల మీ అబ్బాయి రాజేంద్రని ఇంతకాలం తెలివితోగాని డబ్బు విరజిమ్మి మొదటి స్థానంలో నిలబెట్టారని నాకు తెలుసు కాబట్టి.”

“ఈ రోజూ విరజిమ్మగలను”

“కాని విశ్వనాథ్ లొంగడు”

“అంత పెట్టుబడి పెట్టావా”

“యస్. . . మీరు ఊహించలేనంత ధర చెల్లించబోతున్నాను”

“అంతకు పది రెట్లు నేనూ చెల్లిస్తాను”

“నేను చెల్లించేది నీ దగ్గర లేనిది. . .” . . . “నా దగ్గర మాత్రమే వున్నద”నలేదు కృషి..... ఎగతాళిగా నవ్వింది “సో. . .మీ జీవితంలో తొలిసారి ఓటమిని టేస్ట్ చేయబోతున్నారు . . . అదీ ఉపాధ్యాయ మనవరాలి మూలంగా”

“నో. . .” చౌదరి గావుకేకతో ఆ హాలు ప్రతిధ్వనించిపోయింది. “నేనే గెలుస్తాను”

“గావుకేకలతో గెలుపు గురించి మాట్లాడితే చాలదు మిస్టర్ చౌదరీ. . . మేధస్సంటే గూండాలూ దళారీలతో మెట్లెక్కడం కాదు.”

“మిస్ కృషి. . .”

ప్రిపేరవ్వండి. అంతవరకు ఆగలేకపోతే ఆది నిష్ఠూరం నయమనిపించేలా మీ అబ్బాయిని పోటీ నుంచి తప్పించండి”.

“అసంభవం...” ఉక్రోషంగా కంపించిపోతున్నాడు చౌదరి “వాడు నా కొడుకు”

“నిరూపించు కోవాల్సిన సమయం ఆసన్న మైంది చౌదరిసాబ్...”

చౌదరికి చురుక్కు మనిపించేట్టు నిగూఢంగా మాట్లాడిన కృషి చివరిగా అంది “అందుకే నా మాట విని రాజేంద్రని పోటీ నుంచి విత్‌డ్రా కమ్మనండి. లేదూ అంటే వేలమంది విద్యార్థుల సమక్షంలో మీ పరపతికి వస్త్రాపహరణం తప్పదు...ఓకే...”

ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు...

అప్పటికే స్వేదంతో తడిసిపోయిన చౌదరి రిసీవరు విరిగేట్టు నేలపైకి విసిరేశాడు.

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

అంతసేపూ మాట్లాడిందెవరితోనో అందరికీ తెలిసిపోయింది. పైగా ఎంతగా కృషి రెచ్చగొట్టిందీ అన్న విషయమూ బోధపడి పోయింది.

“రంగధాం” గొంతు నాళాలు పగిలేట్టుగా అరిచాడు చౌదరి “నా కొడుకు గెలవాలి...”

“గెలుస్తాడు” ధీమాగా హామీ యిచ్చాడు రంగధాం.

“ఎలా...”

“ఆ విషయం నాకు వదిలిపెట్టండి” ఎలాగో అర్థం కాలేదు చౌదరికి.

కాని అన్నాడు అంటే ఏదన్నా చేయగల రంగధాంపై చాలా గురి వుండటంతో నిశ్శబ్దంగా వుండిపోయాడు.

“రాజేంద్ర...” పైకి లేస్తూ అన్నాడు రంగధాం “యథాప్రకారం ఆదివారం సాయంకాలం ‘ఐక్యూ’ కాంపిటీషన్‌కి నువ్వెళుతున్నావు... నువ్వే గెలుస్తున్నావ్”

0 0 0 0

ఆదివారం సాయంకాలం అయిదున్నర గంటల సమయం...

ఆకాశం మేఘావృతమై వుంది...

అప్పటికే యూనివర్శిటీ ఆడిటోరియం విద్యార్థులతో నిండిపోయి వుంది.

రాజేంద్ర గెలుపుకి సాక్ష్యంగా వుండాలనుకున్న రెండు వందల మంది విద్యార్థులు ఓ పక్క సెటిలై ఆసక్తిగా డయాస్‌వేపు చూస్తున్నారు.

చాలా అరుదైన పోటీ అది. నిజానికి అది రాజేంద్ర - విశ్వనాథ్‌ల మధ్య కాదు. రెండు పెద్ద సంస్థల మధ్య ఇద్దరు శక్తివంతులైన కోటీశ్వరుల మధ్య పోరాటం.

ఆ విషయం నగరం నలుమూలలా ప్రాకడంతో కేవలం యూనివర్శిటీ విద్యార్థులే కాక పత్రికా విలేకర్లు కూడా అక్కడికి చేరుకున్నారు.

డయాస్‌కి అభిముఖంగా ముందు వరుసలో కూర్చున్న కృషి యిదేమీ

రాజేంద్రని గమనిస్తుంది.

క్విజ్ పోటీ నిర్వహణకి ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా ఆహ్వానించిన సత్యేంద్రబసు అతడి సహాయకురాలితో చర్చిస్తున్నాడేదో.

రిస్ట్‌వాచ్ చూసుకుంది కృషి.

అయిదు గంటల నలభై అయిదు నిముషాలు. . .

ఇంకా మిగిలింది పదిహేను నిముషాలు మాత్రమే.

ఖచ్చితంగా ఆరు గంటలకల్లా పార్టిసిపెంట్స్ యిద్దరూ క్విజ్ మాస్టర్ సమక్షంలో వుండాలి.

ఒక్క నిముషం ఆలస్యం జరిగినా పోటీలో పాల్గొనటానికి అనర్హులైపోతారు.

కొద్దిపాటి అసహనంతో ఆడిటోరియం బయటికి వచ్చి నిలబడింది కృషి.

మిగిలింది పది నిముషాలు మాత్రమే.

విష్ణూ జాడలేదు. . .

ఏమైంది. . .

కృషి యిక్కడ నిలబడి విశ్ను గురించి ఆలోచిస్తున్న సమయానికి ఆటోలో వస్తున్నాడు విశ్ను.

ఆటో బర్కత్‌పురా చౌరస్తా దాటుతూంది.

యూనివర్శిటీ చేరుకోటానికి ఇంకా పది నిముషాలు కావాలి.

అసలు ముందే వచ్చేవాడు కాని సెంట్రల్ లైబ్రరీలో ఆలస్యమైంది. ఎన్‌సైక్లోపిడియాలతో నాలుగు రోజులుగా సాగిస్తున్న కుస్తీ ఓ అరగంట క్రితంగాని పూర్తి కాలేదు.

ఫీవర్ హాస్పిటల్ దాటుతుండగా హఠాత్తుగా ఆగిపోయింది ఆటో.

ఏం జరిగిందీ విశ్ను ఆలోచించే లోగానే ఆటోకి అడ్డంగా వున్న టాక్సీలో నుంచి నలుగురు దృఢకాయులు దిగారు.

మనసేదో కీడు శంకించిన విశ్నూకి తనను తాను రక్షించుకునే అవకాశం సైతం లేకపోయింది.

ట్రాఫిక్ మొత్తం దిగ్భ్రాంతిగా చూస్తుండగానే ఆ నలుగురూ విశ్నూని బయటికి లాగారు.

ముందొక మెరుపు. మరుక్షణం కత్తి విశ్ను పొట్టలో దిగింది.

కెవ్వుమన్న ఆర్తనాదానికి ముందే రక్తం ఫౌంటెన్‌లా బయటికి చిమ్మింది.

ఆ క్షణంలో విశ్ను చేసిన పొరపాటు వెళ్ళబోతున్న నలుగుర్నీ ప్రతిఘటించాలని ప్రయత్నించటం.

అంతే. . .

మరోసారి గాలిలోకి లేచిన కత్తి యీ సారి కూడ పొట్టని చీరింది నిర్దాక్షిణ్యంగా.

అ. . . మ్మా. . .

సన్నని మూలుగు వెలువడింది విశ్నూ నోటి నుంచి.

మరుక్షణం నిస్త్రాణగా రక్తపు మడుగులోకి జారిపోయాడు.

అప్పుడు సమయం అయిదు గంటల ఏభయిరెండు నిముషాలు.

ఆరు గంటలు కావటానికి మిగిలింది మరో నిముషం.

అప్పటికే క్విజ్ మాస్టర్ సత్యేంద్రబసుతో పాటు రాజేంద్ర కూడా వేదికపై కూర్చుని వున్నారు.

క్విజ్ కాంపిటీషన్ స్పాన్సర్ చేసే కృషి ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మైకు ముందు నిలబడి ఆదేశం కోసం అన్నట్టుగా ముందు వరుసలో కూర్చున్న కృషి వేపు చూశాడు.

ఆమెలో సంచలనం లేదు.

భావరహితంగా. . .

ఆలోచిస్తూంది.

విశ్వా గెలిస్తే తను ఓడిపోతుంది. . . విశ్వా ఓడినా తను చౌదరితో గెలుపు సాధించలేక అదో ఓటమే అవుతుంది. . .

ఆరు గంటలకి మిగిలింది మరో ముప్పై సెకండ్లు. . .

విశ్వ రాలేదు. . .

ఇక రాజేంద్ర గెలిచినట్టుగా అనౌన్స్ చేయడమే మిగిలిన కార్యక్రమం. . .

పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌ని చూస్తూ సంజ్ఞ చేసింది కృషి.

"డియర్ ఫ్రెండ్స్" చెప్పడం ప్రారంభించాడు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు "పోటీ రెగ్యులేషన్స్ ప్రకారం ఇద్దరు పార్టిసిపెంట్స్ క్విజ్ మాస్టరు ముందు నిర్ణీత సమయానికి హాజరుకావాలి. కాని ఒక్క రాజేంద్ర మాత్రమే అటెండ్ కావడంతో. . ."

అతడు చెప్పబోతున్నది యింకా పూర్తికానేలేదు, విద్యార్థులు విజయోత్సాహంతో రాజేంద్రకి అనుకూలంగా చప్పట్లు కొట్టడం ప్రారంభించారు.

అదిగో సరిగ్గా అప్పుడు వినిపించింది. . .

"ప్లీజ్. . . వెయిట్"

ఆ గావు కేకతో అంతా ద్వారం వేపు చూశారు. . .

శరీరానికి ఓ షాల్‌లాంటిది చుట్టుకుని నిలబడి వున్నాడు విశ్వ. . .

కళ్ళలో ఎరుపు జీరలతో తూలిపోతున్న శరీరాన్ని బలంగా కూడగట్టుకుంటూ ఒక్కో అడుగూ వేస్తున్న విశ్వ పోటీకి వచ్చినట్టు లేదు. . . వధ్య శిలవేపు నడుస్తున్న బలిపశువులా కనిపిస్తున్నాడు.

రాజేంద్ర మొహంలో నిశ్చేష్టత. . .

అప్పటికే ఏం జరిగిందీ తెలుసుకున్న రాజేంద్ర విశ్వ యిక రాడూ అనుకున్నాడు. బ్రతికే అవకాశంలేని విశ్వ ఒకవేళ బ్రతకాలనుకున్నా వెళ్ళాల్సింది హాస్పిటల్‌కి కాని యిక్కడకు కాదు.

కేవలం అతనే స్థితిలో వున్నదీ ఒక్క రాజేంద్రకి మాత్రమే తెలుసు. . . అందుకే ముందు వరుసలోని లాయరు రంగధాం కేసి చూశాడు.

రంగధాం కంగారు పడలేదు. . . ఏ క్షణంలో అయినా స్పృహ తప్పే విశ్వనే గమనిస్తున్నాడు మృదువుగా నవ్వుతూ. . .

కళ్ళు మసకలుబారుతుంటే డయాస్ పైకి వచ్చి తన సీటులో కూర్చున్నాడు విశ్వ...

"నౌ ఇటీజ్ ఎగ్జాక్ట్లీ సిక్స్. . . డయాస్‌ని క్విజ్ మాస్టర్‌కి హేండోవర్ చేస్తున్నాను." అంటూ సత్యేంద్రబసుకి మైక్‌ని అప్పచెప్పి పక్కకి జరిగాడు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్. . .

సూటిగా అసలు విషయానికి వస్తూ సత్యేంద్రబసు అన్నాడు. "ఐ వెల్‌కమ్ మై అదర్

.ఇప్పుడు పోటీ నిబంధనలకి సంబంధించి కాంపిటీషన్ గడువు అరవై నిముషాలు. . .  మొదటి ఏభై నిముషాలు సుమారు ముప్పై ప్రశ్నలు అడగడం జరుగుతుంది. . . అంటే చెరో పదిహేను ప్రశ్నలు . . . ఆలోచించుకోటానికి యివ్వబడే వ్యవధి ముప్పై సెకండ్లు. . . ఒక్కో జవాబుకీ పది మార్కులు. . . ఏ వ్యక్తయినా జవాబు చెప్పలేకపోతే అదే ప్రశ్న రెండో పార్టిసిపెంట్ని అడుగుతాను. . . అతడూ చెప్పలేనప్పుడు ఆ మార్కులు క్విజ్ మాస్టర్కి చెందుతాయి." క్షణం ఆగి సాలోచనగా ఆడిటోరియం వేపు చూశాడు. "చివరిగా మిగిలిన పది నిముషాల్ని చెరో అయిదు నిముషాలుగా విభజించి ఒక్కో వ్యక్తినీ వరుసగా పది ప్రశ్నలు అడగడం జరుగుతుంది. ఒక్కో జవాబుకీ కేటాయించబడిన మార్కులు అయిదు. . . సో మిస్ రీటా. . ." డయాస్ పై ఓ మూల కూర్చున్న తన అసిస్టెంట్ రీటా కేసి చూశాడు సత్యేంద్రబసు. . .

రీటా స్కోరు రికార్డ్ చేయడానికి ఉద్యుక్తురాలౌతూ స్టాప్ వాచ్ బటన్ ప్రెస్ చేసింది.

"మిస్టర్ రాజేంద్ర. . . మెదడుని శరీరంలో రక్తాన్ని చల్లబరిచే పదార్థంగా పొరపాటు పడిన వేదాంతి ఎవరు?"

"అరిస్టాటిల్"

"రైట్. . నౌ ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్. సైంటిఫిక్ అయిడియాల్ని ప్రయోగాత్మకంగా నిర్ధారిస్తే తప్ప నమ్మకూడదని ప్రపంచానికి తెలియ చెప్పిన తొలి శాస్త్రజ్ఞుడెవరు?"

"ఫ్రాన్సిస్ బేకన్"

"రైట్. . . నౌ మిస్టర్ రాజేంద్ర. . .దూరాన్ని నిర్ధారించే 'మైలు' అనే పదానికి మూలం ఏమిటి?"

"లాటిన్ భాషలోని మిల్లెపాస్సుయ్.  అంటే థౌజండ్ పేసెస్"

"వెరీ కరెక్టు. . ." విశ్వని చూస్తూ అడిగాడు సత్యేంద్రబసు.

"మిస్టర్ విశ్వనాథ్. . .సముద్రంలో అతి లోతైన ప్రాంతం ఏ సముద్రంలో ఎక్కడ వుంది?"

"పసిఫిక్ మహా సముద్రంలోని యారియానాస్ ట్రెంచ్. . . అక్కడ లోతు ముప్పై ఆరువేల నూట అరవై అడుగులు."

"రైట్. . . నౌ మిస్టర్ రాజేంద్ర. . . అన్ని సముద్రాలనీ ఉప్పుగా మార్చితే ఎంత పరిమాణం గలదవుతుంది."

"అన్ని ఖండాలనీ నూట ఏభై మీటర్ల దళసరి ఉప్పుతో సమాధిచేయవచ్చంటూంది సైన్స్..."

"వెరీ కరెక్టు"

విద్యార్థులు కరతాళ ధ్వనులతో హోరుతో ఆడిటోరియం ప్రతిధ్వనించిపోయింది...

"నౌ మిస్టర్ విశ్వనాథ్. . . సుమారు ఇరవై నాలుగు సంవత్సరాల పాటు సముద్రంలోని

డాల్ఫిన్ ఏ ప్రాంతంలో వుండేదో చెప్పగలరా?"

"1888 నుంచి 1912 దాకా సుమారు పది కిలో మీటర్ల దూరం ఓడలని ఎస్కార్ట్ చేస్తూ సముద్రంలో నుంచి సన్నని చానల్ ద్వారా పోర్టుకి తీసుకువచ్చే యీ డాల్ఫిన్ న్యూజిలాండ్ ప్రాంతంలోనిది."

"వండర్‌ఫుల్. . .మిస్టర్ రాజేంద్ర 1970 లో ఓ పత్రికా సంపాదకుడు ఓ రచయితకి ఆవు శరీరంపై చెక్ రాస్తే దాన్ని ఆనర్ చేసింది ఓ బేంక్. . . ఇది జరిగింది ఏ దేశంలో. . .ఆ రచయిత ఎవరు?"

రాజేంద్రలో చలనం లేదు.

కణతలు నొక్కుకుంటూ ఆలోచించాడు. . .

బజర్ మోగింది ముప్పై సెకండ్లు పూర్తయినట్టుగా.

"మిస్టర్ విశ్వనాథ్. ఇట్స్ యువర్ టర్న్ నౌ. . ."

"బ్రిటిష్ హ్యూమర్ మేగజిన్ 'పంచ్'కి చెందిన ఎడిటర్ రాసిన ఆ చెక్కు రచయిత ఏ పి హెర్బర్ట్‌కి చెందినది."

ఆడిటోరియంలో రెస్పాన్స్ లేకపోయినా అభినందనగా విశ్వుని చూశాడు సత్యేంద్రబసు "ఇట్స్ మార్వలస్ మిస్టర్ విశ్వనాథ్. . నౌ ది క్వశ్చన్ గోస్ టు రాజేంద్ర అగైన్. . . మిస్టర్ రాజేంద్ర మలేరియా అనే పదం ఏ భాష నుంచి వచ్చింది."

"ఇటాలియన్. MALARIA మనం తరచూ వాడే పదం మలేరియాకి మూలం. . . అంటే చెడుగాలి అని అర్థం. . ."

"నైస్. నౌ మిస్టర్ విశ్వనాథ్. ప్రముఖ హాలీవుడ్ నటుడు డస్టిన్ హాఫ్‌మేన్ నటుడిగా ఆస్కార్ అవార్డు సాధించిన చిత్రం పేరు రైన్‌మేన్. అందులో అతడు పేషెంట్‌గా నటించాడు. . . ఆ జబ్బు పేరేమిటి"

నిశ్శబ్దం. . .

జవాబు తెలీక కాదు. . . జవసత్వాలుడిగి పోయినట్టు శరీరం పట్టు తప్పుతోంది. . . బడలికగా కుర్చీ హేండిల్‌పై వాలిపోతుంటే ఉద్విగ్నంగా అతడ్ని సమీపించాడు సత్యేంద్రబసు "మిస్టర్ విశ్వనాథ్. . ."

కనురెప్పల్ని బరువుగా పైకి లేపుతూ అన్నాడు విశ్వ "SAVANT SYNDROME"

"యు ఆర్ రైట్. . . ఆర్యూ ఓకే" నెమ్మదిగా అడిగాడు అనుమానంగా చూస్తూ.

"ప్లీజ్ గో ఎహెడ్" శక్తిని కూడగట్టుకుంటూ అన్న విశ్వని చూసి అంతసేపూ పట్టించుకోని కృషి అనుమానంగా డయాస్‌వేపు నడిచింది.

ఒకవేళ కృషి మరింత లోతుగా జరిగిందేమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి వుంటే శాల్‌కి

“మిస్టర్ రాజేంద్ర. సవంత్ సిండ్రోమ్ లక్షణాలు చెప్పండి.”

ఏ క్షణంలో అయినా నేల కూలేట్టున్న విశ్వని గమనిస్తూ ఉత్సాహంగా చెప్పుకుపోయాడు రాజేంద్ర. “సవంత్ అంటే తెలివైనవాడూ అని అర్థం. అరుదైన ఈ జబ్బులోని ప్రత్యేకత యీ జబ్బుగల మనిషి నలభై వేల సంవత్సరాల క్రితం ఓ తేదీని బట్టి క్షణాల్లో అది ఆదివారమో సోమవారమో చెప్పగలడు. కాని రెండూ ప్లస్ రెండూ ఎంతో చెప్పలేడు”

“యూ ఆర్రై ౯ట్ నౌ మిస్టర్ విశ్వనాథ్. క్రీస్తుశకం 1773 నుంచి 1873 దాకా అమెరికాలోని డాక్టర్లు రక్తానికి బదులు రోగులకి ఎక్కించిన ద్రవం ఏది?”

“పాలు”

“ఫైన్. నౌ మిస్టర్ రాజేంద్ర. . . ముఖ్యంగా మంచినీళ్ళ చెరువుల్నుంచి పట్టిన పచ్చి చేపల్ని లేక సరిగా వుడకబెట్టని చేపల్ని తింటే జరిగే అనర్థం ఏమిటి”

“జీర్ణం కాదు” టక్కున అన్నాడు రాజేంద్ర.

“సైంటిఫిక్‌గా జవాబు కావాలి”

తెల్లమోహం వేసుకు చూస్తూ ఉండిపోయాడు రాజేంద్ర.

“అలాంటి చేపల్ని తిన్న వ్యక్తి కడుపులో టేప్‌నార్మ్స్ చేపల ద్వారా ప్రవేశించి సుమారు పదమూడు సంవత్సరాలపాటు స్థావరం ఏర్పరచుకొని పది అడుగుల పొడవుదాకా పెరుగుతాయి. ఆ వ్యక్తిని రక్తలేమికి గురిచేస్తాయి” చెప్పాడు విశ్వ మగతగా.

“ఇంకా ముప్పై సెకండ్లు పూర్తికాలేదు” జోక్యం చేసుకున్నాడు రాజేంద్ర.” కాబట్టి చెప్పింది చెల్లదు.”

రాజేంద్రకి వత్తాసుగా అతడి బలగానికి చెందిన విద్యార్థులంతా ఆడిటోరియంలో కేకలు పెట్టడం ప్రారంభించారు. “యస్. . . ఇది చెల్లదు.”

ఏ స్థితిలో విశ్వా ఈ నియమాన్ని ఉల్లంఘించిందీ తెలీని సత్యేంద్ర క్షణం అతడ్ని చూసి అన్నాడు. “యస్. ఇప్పటి పది మార్కులు క్విజ్ మాస్టర్‌కి చెందుతాయి.”

“ఓకే” అన్నాడు విశ్వ నిస్త్రాణంగా చేతిని పైకెత్తి.

“సో. మిమ్మల్నే మరో ప్రశ్న అడుగుతున్నాను. మనిషిలో మరుపుకి కారణమైన ఆల్జిమీర్స్ డిసీజ్‌ని మొదట గుర్తించిన వ్యక్తి ఎవరు?”

“అలోయిస్ ఆల్జిమీర్ అనే జర్మన్ నెర్వ్ ఎక్స్‌పర్ట్ 1907లో ఇది గుర్తించారు.”

“రైట్. నౌ మిస్టర్ రాజేంద్ర. ప్రపంచంలో అత్యధిక సర్క్యులేషన్‌గల దిన పత్రిక ఏది.”

“అమెరికాకి చెందిన న్యూయార్క్ టైమ్స్.”

“రాంగ్” టక్కున ఖండించిన సత్యేంద్ర ఈ సారి ముప్పై సెకండ్లు పూర్తయ్యేదాకా ఆగి బజర్ మోగగానే విశ్వనాథ్‌ని చూస్తూ అన్నాడు “నౌ. ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్.”

“జపాన్‌కి చెందిన దినపత్రిక యమూరీ షింబున్. 1874లో ప్రారంభమైన ఈ పత్రిక

సర్క్యులేషన్ పథ్నాలుగున్నర మిలియన్‌లు. అంటే ముప్పై ఎనిమిది శాతం ప్రజలు దీన్ని రోజూ చదువుతుంటారు."

"రైట్" రాజేంద్ర మొహంలో పెరుగుతున్న టెన్షన్ని చూస్తూ అడిగాడు సత్యేంద్ర. "మిస్టర్ రాజేంద్ర గజెట్ అనే పదానికి మూలం ఏది?"

"GAZETTE అనే పదానికి మూలం ఇటాలియన్ GAZETTA"

"మిస్టర్ విశ్వనాథ్. 'గజెట్టా' అనే పదానికి ఓ మూలం వుంది అదేమిటి?"

"1563లో ఇటలీకి చెందిన వెనిస్ నగరంలో ప్రజలు బహిరంగంగా చదివే వార్తలకి ఓ కాపర్ నాణేన్ని చెల్లించేవారు. ఆ నాణెం పేరు గజెట్టా"

"వండర్ ఫుల్. నౌ మిస్టర్ రాజేంద్ర. ఓ ప్రపంచ ప్రముఖ శాస్త్రజ్ఞుడు ప్రారంభించిన దినపత్రిక పేరు గ్రాండ్ ట్రంక్ హెరాల్డు. ఎవరా శాస్త్రజ్ఞుడు. ఆ పత్రిక ప్రత్యేకతేమిటి."

రాజేంద్ర మొహం వివర్ణమైపోయింది.

ఈ ప్రశ్నకి జవాబు తెలియకపోవడంతో ఉక్రోషంగా దిగువనున్న రంగధాం కేసి చుశాడు. తప్పదు. తను ఓడిపోతున్నాడు. తప్పదు తన తండ్రి పరపతి సైతం మట్టికొట్టుకుపోతుంది.

బజర్ మోగిన చప్పుడు వినిపించింది.

ఆ క్షణాన రంగధాం లేచి బయటకి వెళ్ళటాన్ని రాజేంద్ర తప్ప అక్కడెవరూ గమనించలేదు.

"మిస్టర్ విశ్వనాథ్. జవాబు చెప్పాల్సింది ఇక మీరే"

"గ్రాండ్ ట్రంక్ హెరాల్డుని ప్రారంభించింది ప్రముఖ శాస్త్రజ్ఞుడు థామస్ అల్వా ఎడిసన్. ఈ దిన పత్రిక ప్రత్యేకత ఇది ప్రతిరోజూ నడుస్తున్న ట్రైన్‌లో ప్రింటయ్యేది."

"మార్వలెస్. నౌ మిస్టర్ రాజేంద్ర. ప్రపంచంలో యింతవరకూ జరిగిన అంత్యక్రియల్లో అతి ఖరీదైనదిగా చెప్పుకునేదెవరిది"

"1989వ సంవత్సరం ఫిబ్రవరి ఇరవై నాలుగున చనిపోయిన జపాన్ చక్రవర్తి హీరో హిటో అంత్యక్రియలకి ఖర్చుచేసింది సుమారు ఎనభై మిలియను డాలర్లు. ప్రపంచంలో యింతవరకూ అత్యధిక మొత్తం ఖర్చు చేయబడిన అంత్యక్రియ ఇదే."

"రైట్, నౌ మిస్టర్ విశ్వనాథ్. క్రీస్తు శకం 1772 వ సంవత్సరానికి చెందిన ఓ రిపోర్టు ప్రకారం ప్రపంచంలోని ఓ ప్రాంతానికి చెందిన స్త్రీలు ప్రసవిస్తుండగా నొప్పులు మగవాళ్ళకి వచ్చేవి. అలా రావడానికి కారణం మంత్రసాని తన శక్తితో ఆ నొప్పిని భర్తకి ట్రాన్స్‌ఫర్ చేయడమే. ఇది సైన్సుకి అందని ఓ మిస్టరీ అయినా అసలు ఆ ప్రాంతం ఏది."

"స్కాట్‌లాండ్‌కి చెందిన డంప్రైస్."

"రైట్. మరో మూఢనమ్మకానికి చెందిన ప్రశ్న మిస్టర్ రాజేంద్ర. ప్రాచీన కాలం నుంచీ ఓ దేశంలోవున్న నమ్మకం ఏ బిడ్డయినా పుట్టేటప్పుడు గోడ గడియారం మూడు, ఆరు, తొమ్మిది లేక పన్నెండు గంటలు కొడితే ఆ బిడ్డకి దెయ్యాల్ని చూసే శక్తి వస్తుందట. అది ఏ దేశం?"

"బ్రిటన్"

"రైట్. నౌ మిస్టర్ విశ్వనాథ్. దృష్టిదోషం నుంచి తప్పించుకోటానికి పెళ్ళితంతు పూర్తి అయ్యేంత దాకా వధువు కళ్ళు మూసుకునే వుంటుంది. ఈ ఆచారం ఏదేశానికి చెందింది."

"మొరాకో"

"రైట్ మిస్టర్ రాజేంద్ర. ప్రపంచంలో మంత్రిపదవినలంకరించిన తొలి మహిళ"

"సియావో బండారు నాయకే"

"రాంగ్"

రాజేంద్ర మొహం పాలిపోయింది.

బజర్ చప్పుడు వింటూ విశ్వనాథ్‌ని అడిగాడు సత్యేంద్ర "ఇట్స్ యు టు ఆన్సర్ మిస్టర్ విశ్వనాథ్"

"పార్డన్మీ"

"మీరు జవాబు చెప్పాలి

మొహంపై అలుముకుంటున్న ప్రేతకళ అతడి ఆలోచనాశక్తిని హరించివేస్తుంటే "ఏం జరిగింది మీకు" అన్నాడు సత్యేంద్ర ఆందోళనగా "ప్రపంచ రాజకీయాలలో మంత్రి పదవిని అలంకరించిన తొలి మహిళ ఎవరు?"

"1917లో..." పదాల్ని కూడబలుకుతున్నాడు విశ్వ. అదికాదు. తెలిసింది కూడా సరిగా జ్ఞప్తికి రావడం లేదు. "లెనిన్ బోల్షివిక్ గవర్నమెంట్‌లో. . ."

"కేరీ ఆన్ " ఉత్సాహ పరిచాడు సత్యేంద్ర. "కమాన్ - మీరు కరెక్టుగానే ఆలోచిస్తున్నారు"

"ఇది అన్యాయం" అరిచాడు రాజేంద్ర ఆవేశంగా లేచి. . . "చెప్పలేనివాడిచేత క్లూ యిచ్చి మరీ చెప్పించాలని ప్రయత్నిస్తున్నాడు క్విజ్ మాస్టర్"

"ప్లీజ్ బీ సిటెడ్" ఆదేశంలా అన్నాడు సత్యేంద్ర రాజేంద్రని చూస్తూ "ఈ పోటీలో క్విజ్ మాస్టర్ న్యాయ నిర్ణేత. నన్ను నిలదీయటం నియమాల్ని ఉల్లంఘించటం అవుతుంది"

రాజేంద్ర అవాక్కయిపోవడంతో అతడికి వత్తాసుగా చప్పట్లు కొట్టాలనుకున్న విద్యార్థులూ నిశ్శబ్దంగా వుండిపోయారు.

ఈ చర్చలకీ చప్పట్లకీ అతీతంగా ఓ భ్రాంతి లాంటి స్థాయికి ఎప్పుడో చేరిపోయిన విశ్వ కూడ బలుక్కుంటూ అన్నాడు "లెనిన్ గవర్నమెంటులో సోషల్ వెల్ఫేర్ మినిస్టర్‌గా పనిచేసిన అలెగ్జాండ్రా కొలంతాయ్ తొలి మహిళ."

"యూ ఆర్ వెరి కరెక్ట్ మిస్టర్ విశ్వనాథ్. . . ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ రాజేంద్ర - ప్రపంచంలో అరవై శాతం లాయర్లు వున్న దేశం ఏది."

"ఇండియా. . ."

"రాంగ్. .."

"చైనా"

"రాంగ్"

"బ్రిటన్"

బజర్ మోగడంతో విశ్వనాథ్‌ని అడిగాడు సత్యేంద్ర. ఈసారి గొడవకి అవకాశం లేకుండా ప్రశ్నని రిపీట్ చేశాడు. "మిస్టర్ విశ్వనాథ్. ప్రపంచంలోని అరవై శాతం లాయర్లున్న దేశం. . ."

"అమెరికా"

"కరెక్ట్- " క్షణం రాజేంద్రకేసి చూసి అడిగాడు "ప్రపంచంలో తొలి స్టంట్ మేన్ ఎవరు"

"పాస్" ఉక్రోషంగా అరిచాడు రాజేంద్ర. . .

బజర్ మోగగానే చెప్పాడు విశ్వనాథ్ "1908లో ది గ్రేట్ ట్రెయిన్ రోబరీలో నటించిన

ఫ్రేంక్ హానేల్”

“రైట్. . .” క్షణం ఆగిన క్విజ్ మాస్టర్ సత్యేంద్రబసు వున్నట్టుండి పాకెట్‌లో నుంచి కొన్ని కార్డ్స్ తీశాడు. “ఇప్పుడు మన దేశానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలు అడగబోతున్నాను. మిస్టర్ రాజేంద్రా. . .”

అలర్టయ్యాడు రాజేంద్ర. నష్టపోయింది తిరిగి రాబట్టుకోవడానికిదో అవకాశంలా వుత్సాహంగా చూశాడు. “పులికాట్ సరస్సు మధ్యలో వున్న ద్వీపం ఏది”

టక్కున చెప్పాడు రాజేంద్ర “శ్రీహరి కోట”

“మిస్టర్ విశ్వనాథ్. . . పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష నిర్వహించింది ఎవరి ఇంటిలో?”

“బలుసు సాంబమూర్తిగారి ఇంటిలో. . .”

“రైట్. . . నౌ మిస్టర్ రాజేంద్రా. . . వ్యవహారిక భాషోద్యమానికి నాయకత్వం వహించిందెవరు. . .”

“పానుగంటి లక్ష్మీనరసింహరావు.”

“రాంగ్”

“వీరేశలింగం పంతులుగారు”

“నో. . .”

ముప్పై సెకండ్లు గడిచిపోయింది.

“మిస్టర్ విశ్వనాథ్. . . వ్యవహారిక భాషోద్యమానికి నాయకత్వం వహించిందెవరు?”

“గిడుగు. . .” హెలూసినేషన్‌లో తేలిపోతున్నట్టు నిస్సత్తువగా గొణుగుతున్నాడు విశ్వ... రామమూర్తో వేంకట రామమూర్తో స్ఫురించడం లేదు. “యస్. . . గిడుగు వెంకట రామమూర్తి పంతులు”

“వెరీ కరెక్టు. . నౌ మిస్టర్ రాజేంద్ర. . . తెలుగు ప్రసిద్ధ చిత్రకారుడు ఎవరు?”

“దామెర్ల రామారావు. . .”

“రైట్. . .” క్షణం ఆగి అన్నాడు క్విజ్ మాస్టర్ “ది లాస్ట్ క్వశ్చనాఫ్ ది ఫస్ట్ సెషన్ - మిస్టర్ విశ్వనాథ్ శబ్ద రత్నాకరం అనే నిఘంటువుని రచించింది ఎవరు.”

“బహుజనపల్లి సీతారామాచార్యులు”

“నౌ మిస్ రీటా మొదటి సెషన్‌కి సంబంధించిన స్కోర్ తెలియచేస్తుంది” అన్నాడు సత్యేంద్రబసు-

“మొత్తం ఏభై నిముషాలలో అడిగిన ప్రశ్నలు ముప్పై. మిస్టర్ విశ్వనాథ్ పందొమ్మిది ప్రశ్నలకి నూరు శాతం జవాబు చెప్పి నూట తొంభై మార్కులు స్కోరు చేయగా పది ప్రశ్నలకి జవాబులు చెప్పిన రాజేంద్ర వంద మార్కుల్ని సాధించగలిగారు - క్విజ్ మాస్టరు దక్కించుకున్నది పది మార్కులు. . . .”

సగానికి పైగా ఆడిటోరియం నిశ్శబ్దంగా చూస్తుండగా మేధస్సుని నిజాయితీగా హర్షిస్తున్న విద్యార్థులు, పత్రికా విలేకర్లు విశ్వనాథ్‌కి అనుకూలంగా చప్పట్లు కొడుతుంటే కృషి సైతం తనను తాను మరిచి పోయింది-

ఆ క్షణంలో విశ్వ విధించిన షరతు ఆమెకు గుర్తు రాలేదు.

సైనికుడిలా అతడు సాగిస్తున్న పోరాటాన్నే గమనిస్తోంది.

"నౌ- లెట్స్ గో టు ది ఫైనల్ సెషనాఫ్ ది కాంపిటీషన్"

మిగతా పదినిముషాల కార్యక్రమాన్ని కొనసాగించాలనుకుంటుండగా కనిపించింది-

పోలీసులు దూసుకొస్తున్నారు లోపలికి.

ఏం జరుగుతున్నదీ అర్థంకాక అందరూ నిశ్చేష్టులవుతుండగానే డయాస్‌పైకి వచ్చేశారు-

"ఏం జరిగింది. ఏమిటిదంతా" అడిగింది కృషి వారికి అడ్డంగా నిలబడి-

"సారీ మేడమ్ - ఈ కాంపిటీషన్ జరగటానికి వీల్లేదు- " జవాబు చెప్పిన పోలీసాఫీసర్ దూకుడుగా విశ్వనాథ్‌వైపు నడిచాడు-

జారిన షాల్ వెనుక రక్తసిక్తమైన విశ్వ శరీరం ఆమెలో ఎంతటి ఆందోళన రేపిందీ అంటే కెవ్వుమనబోతూ ఆగింది-

అంతసేపూ ప్రాణాలను ఉగ్గబట్టుకుని క్షతగాత్రుడయిన సైనికుడిలా పోరాడిన విశ్వ యిక ఓపిక నశించినట్టు తలవాల్చేశాడు.

హఠాత్తుగా ఆడిటోరియంలో హోరు మొదలయింది . . . జనం పదులు వందల సంఖ్యలో డయాస్ పైకి తోసుకొస్తుంటే "వాట్ హేపెండ్" కంగారుగా అడిగింది.

ఆ క్షణంలో కూడని షరతు విధించిన విశ్వపై కోపం లేదు- గెలుపు కోసం అతడు సాగించిన సంగ్రామానికి అసాధారణంగా స్పందించిపోతూ అతడికి చేయూతనివ్వాలన్న వివశత్వానికి లోనైంది.

"చూశారుగా మేడమ్- హి యీజ్ స్టేబ్డు - ఇతడిపై హత్యా ప్రయత్నం జరిగింది. ఈ స్థితిలో ఈ వ్యక్తికి కావాల్సింది ప్రాణం నిలుపుకోవడమా పోటీలో నెగ్గడమా-"

యస్సైస్ అన్న మాటల్లో విశ్వపై సానుభూతి కన్నా పోటీలో నెగ్గకూడదన్న ఆలోచనే ధ్వనించింది.

ఇలా జరగటానికి కారణం ఏమిటీ అన్నది తెలుసుకోవడానికి తర్క శాస్త్రంలో ప్రావీణ్యత అవసరం లేదు. మామూలు అవగాహన చాలు. ఓ పథకం ప్రకారం విశ్వ పోటీకి రాకుండా ఏర్పాటు జరిగితే గాయపడి యిటు వచ్చాడు.

అది యిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ఆలోచనో లేక గెలిచి తీరాలన్న దృఢ సంకల్పంతో చేసిన సాహసమో ఆమెకి తెలీదు. కాని విశ్వని అభినందించకుండా వుండలేకపోయింది.

వెంటనే చేయాల్సిన కార్యక్రమం మరొకటుంది.

చరిత్రలో చాలా ట్రేజడీలకి కారణం మంచికీ, చెడుకీ జరిగిన పోరాటాలు మాత్రమే కాదు, చెడుకీ చెడుకీ జరిగిన యుద్ధాలు కూడా. . . విశ్వ వ్యక్తిగతంగా ఎలాంటి వాడయినా గాని చాలా శత్రువులున్నాగాని మరో శత్రువు చేత గాయపరచబడినవాడు .... అదీ కూడని సమయంలో.

ఏ కథకయిన ఓ గమ్యం నిర్ధేశించబడటానికి కథానాయకుడు అవసరమన్న సత్యమే నిజమయితే ఈ రోజు విశ్వ హీరో. అది అందరికీ తెలియ చెప్పాలి. . .

అక్కడున్న పత్రికా విలేకర్లను గుర్తించిన కృషి అవకాశాన్ని జారవిడుచుకోలేదు.

క్విజ్ మాస్టర్ సత్యేంద్రబసు ఆధ్వర్యంలో ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసింది అదే ఆడిటోరియంలో.

ఆ విషయాన్ని గుర్తించకపోవడం ఇంత తెలివినీ ప్రదర్శించిన లాయర్ రంగధాం పొరపాటు.

0 0 0 0

అపరాత్రి దాటుతోంది. . .

చీకటి కాటుక క్రీ నీడల్లో నగరానికి ఓ మూల విద్యుద్దీపాలనడుమ అపోలో హాస్పిటల్.

ఆపరేషను థియేటరు బయట కూర్చుని వుంది కృషి. . .

ప్రెస్ కాన్ఫరెన్స్ ముగించి సరాసరి ఇటు వచ్చిన కృషి మూడు గంటలుగా అక్కడే కూర్చుని వుంది.

స్పృహ కోల్పోయిన విశ్వ రూపం ఒక్కటే కాదు - మొన్నెప్పుడో కారులో కూర్చుని బెదిరించి మరీ డబ్బు లాక్కుపోయిన విశ్వ - ఆ తర్వాత మేధావిలా కనిపించి గెలిస్తే ఒక రాత్రి నాతో గడపగలవా? అన్న విశ్వ కళ్ళలో చిలిపితనమూ గుర్తుకొస్తుంటే బడలికగా కళ్ళు మూసుకుంది.

విశ్వ బ్రతుకుతాడా. . .

అసలు తను బ్రతకాలనే కోరుకుంటుందా.

అలా కోరుకోని నాడు తన స్థాయి దిగి ఇలా ఎందుకు వచ్చింది.

మొన్న అతడు విధించిన షరతు కన్నా లక్ష్యం కోసం ప్రాణాలు సైతం ఒడ్డగల అతడి మొండితనమే జ్ఞప్తికి వస్తుంటే. . .

ఎవరీ మనిషి అనుకుంది. . .

ఎందుకు తనకు పరిచయమయ్యాడు. ..

పదేపదే తన గురించి ఆలోచించే పరిస్థితినెందుకు సృష్టిస్తున్నాడు.

ఇన్ని సార్లు కలవడం కాకతాళీయమా లేక కావాలని జరుగుతుందా. . .

నిద్రలాంటి నిశ్శబ్దంలో మేమున్నామంటూ కదిలే ఆలోచనల పొరల్లో. . . ఎక్కడో,

మరకల్లో ఆమె సతమతం అవుతుండగానే ఎవరో పిలిచినట్టయి కళ్ళు తెరిచింది.

ఎదురుగా డాక్టర్ శమంత్. . . అంతసేపూ విశ్వకి సర్జరీ చేసిన డాక్టర్. . .

“హౌ ఈజ్ హి డాక్టర్” అడిగింది ఉద్విగ్నంగా.

“నిజానికి అంత బ్లీడ్ అయ్యేక ఏ పేషెంటూ బ్రతికే అవకాశం లేదు మిస్ కృషి. కాని మృత్యువుతో చాలా మొండిగా పోరాడుతూ ప్రాణం నిలుపుకున్నాడు. . .”

“థాంక్స్ డాక్టర్” మనసు తేలిక పడుతుంటే కృతజ్ఞతగా అంది.

“కాకపోతే మరో నాలుగైదు రోజులపాటు అంటే స్పృహలోకి వచ్చేదాకా చాలా జాగ్రత్తగా అతడ్ని కాపాడుకోవాలి.”

“ఆ బాధ్యత మీకే వదిలి పెడుతున్నాను డాక్టర్ . . . ఎన్ని లక్షలు ఖర్చయినా ఫర్వాలేదు.... హి మస్ట్ బి సేవ్డ్-”

సాలోచనగా చూశాడు డాక్టర్.

ఓ కోటీశ్వరుడి మనవరాలైన కృషికి అతడేమవుతాడో ఎందుకు అతడిపై అంత ఆసక్తిని ప్రదర్శిస్తుందో అర్థం కాకపోయినా నెమ్మదిగా అన్నాడు “మరో పది నిముషాలు ఆలస్యమైతే అతడికి నూరేళ్ళూ నిండిపోయేవి మిస్ కృషి. . . అప్పుడు మీరెంత డబ్బు ఖర్చు చేసినా లాభం లేకపోయేది.”

“అయినా సరే. . .” ఓ బ్లేంక్ చెక్ అతడికి అందించింది కృషి. “దయుంచి ఫార్మాలిటీస్ గురించి నన్ను ఇబ్బంది పెట్టకండి. . . ఈ చెక్ మీ దగ్గరుంచుకొని అన్ని ఏర్పాట్లూ పూర్తి చెయ్యండి - ఇలా ఎందుకంటున్నానూ అంటే ట్రీట్‌మెంట్‌కి సంబంధించి నా పేరు గోప్యంగా వుండాలి కాబట్టి, ఇది నా కండిషన్ కాదు. . . రిక్వెస్ట్ మాత్రమే.”

ఆమె ఎవరో తెలిసిన డాక్టర్ శమంత్ ఆమెను ఇబ్బంది పెట్టకుండా చెక్ అందుకున్నాడు.

“ప్లీజ్ డాక్టర్” బయలుదేరుతూ మరోసారి అభ్యర్థించింది. “నేను డబ్బు ఇచ్చిన విషయం ఎవ్వరికీ తెలియనివ్వకండి. . . ముఖ్యంగా పేషెంటుకి. ప్లీజ్.”

కృషి మరో అర నిముషానికల్లా లాంజులో నుంచి హాస్పిటల్ కార్ పార్కింగ్ ఏరియాకి వచ్చింది.

“మేడమ్”

ఆమెను చూస్తూనే ఓ మూల కూర్చున్న సూరి ముందుకొచ్చాడు. గుర్తుపట్టిందామె. ఆ రోజు తన చేతిలోని వేలెట్‌ని లాక్కుపోయిన విశ్వ స్నేహితుడు.

ఇంతచేసినా యింకా విశ్వ ప్రాణాల కోసం ఆమె తీసుకున్న శ్రద్ధకే కళ్ళు చెమ్మగిల్లాయో లేక విశ్వ అదృష్టానికి ఆనంద భాష్పాలు రాలాయో కృతజ్ఞతగా చేతులు జోడించాడు మాటలు రానట్టుగా.

ఆ క్షణంలో ఆమె ఆలోచిస్తున్నది ఒక్కటే. . . ఏదైనా గోప్యంగా వుంచాలనుకుందో అది సూరికి తెలిసిపోయింది.

“క్షేమంగా తిరిగి వచ్చాక మీ స్నేహితుడికి చెప్పు. . .బ్రతకటానికీ, జీవించటానికీ చాలా తేడా వుంది. . .ఏదోలా బ్రతికేయటం కాదు జీవితమంటే... దానికి ఓ అర్థం కావాలి. కనీసం ఈ పునర్జన్మతోనైనా కొత్త మనిషిగా దర్శనమిస్తే సంతోషిస్తానని చెప్పు.”

సూరి జవాబుని ఆశించనట్టుగా కారువేపు నడిచింది.

కారు నడుపుతూ అనుకుంది. సూరి తననే చూశాడేమో. కాని తను డాక్టర్‌తో అను

మాటలు వినలేదుగా . . .

కాబట్టి తను డబ్బు ఖర్చు చేసిన విషయం అతడికి తెలిసే అవకాశం లేదు.

ఇంటికి వచ్చాక బెడ్ రూంలో అడుగుపెడుతూనే రేక్‌లోని ఓ డైరీలాంటి పుస్తకాన్ని తీసింది. బోర్లా పడుకుని అరమోడ్పులుగా చూస్తూ వుండిపోయింది. నిజానికి అది డైరీ కాదు.

చాలా అపురూపమైన ఆలోచనల్ని మాత్రం రాసుకునే ఓ పుస్తకం. . .

తిలక్‌నీ, కృష్ణశాస్త్రినీ ఎంత చదివిందో కేవలం ఆమెకి మాత్రమే తెలుసు. ఏ దేశంలో చదివినా, ఏ స్థాయిలో పెరిగినా ఆమె ఎంతటి భావుకత్వం కలదో చెప్పగలిగే ఉదాహరణ ఆమె రాసిన వాక్యాలు. రాసింది ఏకాగ్రతగా. . .

“నేనొక గాయపడ్డ తరంగాన్ని. స్వప్నంలా కరిగిన గతాన్ని చారికలా మార్చుకుని ఎప్పుడో విరిగి మహార్ణవంలో కలిసిన ఆడపిల్లని. అయినా ఓ అంతరంగ విహంగంలా ప్రత్యక్షమయ్యాడు - పిలవని పిలుపుకీ, తలవని తలపుకీ తొలి సాక్ష్యంలా, మనో గ్రహాంతరంలో చొరబడి ఆలోచనల పొగ మంచుతో కప్పి ఉక్కిరి బిక్కిరి చేశాడు ఎవరితను. . . వెలుగే వద్దనుకున్న చీకటి కోనలో కాంతుల తూణీరాల్ని సంధించే ఈ మనిషి నాకు మిత్రుడా లేక ఆర్ధ్ర సంగీతఝురిలా అనిపిస్తూ సైతం హాని చేయగల శత్రువా.”

రాస్తున్న కృషి ఆగింది అరక్షణం పాటు.

ఏమిటిది. . .అతడి గురించి ఎందుకింతలా ఆలోచిస్తోంది. . .

“ఎందుకమ్మా కాలమా - అతనెక్కడ నేనెక్కడ అనుకుంటూనే ఇక్కడున్న నేను మరెక్కడో వున్న అతడి గురించి యింతగా స్పందించే లిప్తల్ని నాకెందుకిస్తున్నావు. అతడి పరిచయాన్ని చీకటిలో కనుసైగగా భావించగల శక్తిని హరించేస్తూ వున్న చోట వుండనివ్వక వెన్నెల్ని నా కన్నుల నింపాలని ఎందుకు ప్రయత్నిస్తున్నావ్.”

రాస్తూ ఆలోచిస్తూ ఆలోచనలకి అక్షర రూపం ఇస్తూ అలాగే నిద్రలోకి జారిపోయింది.

0 0 0 0

“రంగధాం ఇది సామాన్యురాలు కాదు”.

తన పర్సనల్ ఛాంబర్‌లో చాలా అసహనంగా పచార్లు చేస్తున్నాడు రామనాథ్ చౌదరి.

ఓ మూల నిలబడ్డ రంగధాం ఉదయాన్నే చౌదరి దగ్గరికి వచ్చింది ఎమ్మెల్యే రాజారావుతో కాదు . . . ఓ దినపత్రికతో.

అసలు చౌదరి ఫోన్ చేసి రమ్మంది ఒంటరిగా కాదు. ఆ రోజు దిన పత్రికతో - అప్పటికే పేపరులో పడిన ప్రెస్ కాన్ఫరెన్స్ వివరాల్ని చదివిన రంగధాంకి బోధపడి పోయింది అతడెందుకు రమ్మన్నదీ.

కృషి చాలా సులభంగా తమ ఎత్తుని చిత్తు చేసింది.

“పేపరులో న్యూస్ చదివావు కదూ”

“చదివేను”

“ఏ న్యూస్”

“రాజేంద్ర క్విజ్ కాంపిటీషన్‌లో ఓడిపోయిన న్యూస్”

“కాని అది ఓటమి ఎలా అవుతుంది”

జవాబు చెప్పలేదు రంగధాం.

“అసలు పోటీయే పూర్తికానప్పుడు ఓడే సమస్యెక్కడ”

ఉక్రోషాన్ని తర్కంగా మార్చి అడిగాడు చౌదరి.

“లాభం లేదు - నా కొడుకు ఓడాడూ అని పత్రికలో పడడం నేను ఓడేనని చెప్పటం లాంటిది. మనం వెంటనే ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయాలి.”

ఇబ్బందిగా కదిలిన రంగధాం అన్నాడు “లాభం లేదనుకుంటాను”

“ఎందుకని”

“క్విజ్ మాస్టరు సత్యేంద్రబసు విజేత విశ్వనాథ్ అని తేల్చి చెప్పేశాడు కాబట్టి”

“వాడు చెబితే సరిపోతుందా”

“మామూలుగా అయితే నేనూ వదిలిపెట్టే వాడ్ని కాదు. కాని లాజికల్‌గా నిరూపించాడు. . . అవును సర్. . . మొదటి సెషన్‌లో విశ్వకి వచ్చిన మార్కులు నూట తొంభై. రాజేంద్ర స్కోర్ చేసింది నూరు మాత్రమే. మిగతా సెషన్‌లో రాజేంద్రకి మిగిలింది పది ప్రశ్నలు అంటే ఏభై మార్కులు. అంటే రాజేంద్ర అన్నీ కరెక్టుగా చెప్పినా మొత్తం స్కోర్ చేయగలిగేది నూట ఏభై మార్కులేగా . ఆ మొత్తం అప్పటికే విశ్వ స్కోర్ చేసిన నూట తొంభైకన్నా తక్కువేగా. . . అంచేత మనం ప్రోగ్రాంని మధ్యలో ఆపించినా రూలు ప్రకారం విజేత విశ్వ. . .”

“నో. . . అలా జరగటానికి వీల్లేదు.” గొంతు చించుకున్నాడు చౌదరి. “జరగనివ్వను. వెంటనే నేను ఏదో చేయాలి. . .ఓటమిని అంగీకరించలేను.”

ఏం చేసినా ఇక లాభం లేదని చెప్పలేక రంగధాం సందిగ్ధంలో వుండగానే ఫోన్ రింగయింది.

ఉద్విగ్నంగా అందుకున్నాడు చౌదరి. “యస్”

“నేను” వినిపించింది కృషి కంఠం.

“ఎందుకు” మొన్నలానే ఈ రోజు కూడ పని గట్టుకుని ఎగతాళి చేయటానికి ఫోన్ చేసిందనిపించడంతో నిభాయించుకోలేకపోయాడు. “ఎందుకే నీకేమైంది”

“నీకేమైందో తెలుసుకోవాలనిపించింది” వ్యంగ్యంగా జవాబు చెప్పింది కృషి. “నాకు తెలుసు చౌదరీ. . . పబ్లిక్ ఫిగర్సు అనుకుంటున్న వాళ్ళ దిన చర్య మొదలయ్యేది పేపరు పఠనంతోనే అని నాకు తెలుసు కాబట్టి పనిగట్టుకుని నీ మూడేమిటో తెలుసుకుందామని ఫోన్ చేశాను.”

“నీకు మూడింది”

ఫకాలున నవ్వు వినిపించింది. “...

"ఏమని"

"ఓ చిన్న ఓటమికే తట్టుకోలేక నువ్వు యిలాంటి మరో ఓటమి ఎదురయితే గుండె ఆగి చస్తావని. . ."

"ఒసేవ్. . . నేను చావను. . .చంపుతాను"

"తెలుసు చౌదరీ. కాబట్టే ఓటమికి భయపడి విశ్వనాథ్‌పై అఘాయిత్యం చేయించావనీ తెలుసు. . . కాని చూసేవా. . .టైం నీకు అనుకూలంగా లేదు. అందుకే కాంపిటీషన్‌కి పోలీసుల్ని ఆలస్యంగా పంపావు. ఫలితం అప్పటికే నిర్ణయమైపోయింది కాబట్టి నీ ఆలోచనలకి కౌంటర్‌లా నేను అక్కడ ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి నీ కొడుకుని పరాజితుడిగా నిలబెట్టాను. . ."

క్షణం నిశ్శబ్దం.

"ఏమిటి చౌదరీ. నిశ్శబ్దంగా వుండిపోయావేం."

తోడేలులా నవ్వాడు. "నా ఓటమి గురించి కాదు కృషీ. . .

ఆడపిల్లగా నువ్వెంత ఓడే అవకాశమున్నదీ ఆలోచిస్తున్నాను."

"నన్ను ఓడించడానికి నీ శక్తి చాలదు చౌదరీ. . .గూండాలతో దళారీలతో పెంచుకునే శక్తి మేధస్సుకన్నా చాలా తక్కువ."

"నాకు మేధస్సు కూడా వుంది"

"కాని నా మేధస్సుని జయించగలిగేటంతగా కాదు"

"చూస్తావా"

"చూడటానికి సిద్ధపడే నీకు తొలిసారి ఓటమిని రుచి చూపించాను చౌదరీ... ఇంతకాలం నువ్వెలా బ్రతికినా నాకు అనవసరం. ఇకముందు మా ఎంపైర్ కేసి కన్నెత్తి చూడకు. చూస్తే. . ."

"చెప్పు"

"ఇప్పుడు నీకు ప్రత్యర్థిగా వున్నది వృద్ధుడైన ఉపాధ్యాయ కాదు. ఈ సామ్రాజ్యానికి వారసురాలైన కృషి అని గుర్తుంచుకో"

"కృషీ. . ." ఓ ఆక్రోశంలా అరిచాడు చౌదరి. "నేనంటే ఏమనుకుంటున్నావ్."

"ఎదుటి మనిషి ఎదుగుదలని భోంచేయాలనుకునే పేరసైట్ వనుకుంటున్నాను.. . ఆ పదానికి అర్థం తెలీకపోతే నీ పక్కనున్న నీ భృత్యుడు అదే నీకు ఉచిత సలహాలనిచ్చే ఆ రంగధాని అడుగు. . . ఓ.కే." క్షణం ఆగి అంది "చివరిగా ఒక్క మాట. . . నేను పోటీ ఏర్పాటు చేసింది రెండు లక్షలు నీ దగ్గర నుంచి గెలవాలని కాదు కాబట్టి ఇప్పుడు నువ్వా డబ్బు ఇచ్చినా తీసుకోను- నేను కోరింది నీ మీద గెలుపు. తొలి గెలుపు. . . కాబట్టి గెలిచిన నా శక్తికి జోహార్లు అంటూ నన్ను అభినందించి తలవంచు. లేదూ అంటే నీ సామ్రాజ్యం పునాదులు కదిలిపోతాయ్. బై మిస్టర్ చౌదరీ. . . మరోసారి నేనిలా ఫోన్ చేసే అవకాశం కలిగించుకోకు. ఉంటా."

ఫోన్ క్రెడిల్ చేసిన వసుంధర

ఆపాదమస్తకం కంపించిపోతున్నాడు చౌదరి. మొగలి పొదలా పెంచుకున్న సువిశాల సామ్రాజ్యంలో త్రాచులా బుసకొడుతూ బ్రతికిన చౌదరి ఈ అవమానాన్ని భరించలేక పోతున్నాడు. అనుభవంతో కాకలు తీసిన ఉపాధ్యాయే ఏమీ చేయలేక తలవంచితే మేధస్సుతో పిచ్చుకలాంటి ఓ అమ్మాయి బ్రహ్మాస్త్రాలతో తనను ప్రశ్నించి అల్లరి పెడుతూంది.

ఇరవై నాలుగు గంటల్లో కృషిని నామరూపాలు లేకుండా చేయాలనుకున్నాడు కాని ఆ సాయంకాలం తెలిసింది.

కృషి ఇప్పటికే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి, ముఖ్యమంత్రికి, హోం సెక్రెట్రీలకీ లెటర్సు పంపింది.

చౌదరి మూలంగా తనకు ప్రాణహాని ఉందని, తనకేదన్నా జరిగితే చౌదరిగాని, ఆయన మనుషులుగాని కారణమని ఆ లెటర్స్ సారాంశం.

ఆ విషయం తెలియ చెప్పింది సాక్షాత్తు నగర పోలీస్ కమీషనరే.

అప్రతిభుడైపోయాడు చౌదరి.

కృషి ఎత్తుకి పై ఎత్తులు వేయడం లోనే కాదు అసలు ఎత్తు వేయకుండా సైతం అవాంతరాలు సృష్టించగలదు.

అంతే. . .

ఏ మూలనుంచి దెబ్బతీయాలో నిర్ణయించుకున్నాడు ఆ రాత్రే.

ఎమ్మెల్యే రాజారావ్‌ని పిలిచాడు అర్జెంటుగా.

"ఉపాధ్యాయకి నగరంలో ఎన్ని ఫ్యాక్టరీలున్నా అతడికి చాలా లాభాల్ని తెస్తున్న సంస్థ కృషి ఫార్మాస్యూటికల్స్. అందులో రేపు ఉదయానికల్లా కార్మికులు తిరుగుబాటు చేయాలి - నోటీసు అవసరం లేకుండా సమ్మె ప్రారంభించాలి."

"కాని ఎలా" కంగారుగా చూశాడు రాజారావు.

"ఎలాగో నాకు తెలీదు" ఆవేశంగా అన్నాడు చౌదరి. "కాని జరిగితీరాలి. అక్కడ యూనియన్ ప్రెసిడెంట్ నీ మనిషే కాబట్టి యిదంతా నువ్వు మేనేజ్ చేయాలి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు."

0 0 0 0

"ఏమిటిదంతా"

హఠాత్తుగా కార్మికులు ప్రారంభించిన సమ్మె మూలంగా నగరానికి తిరిగివచ్చిన ఉపాధ్యాయ కృషి ఫార్మాస్యూటికల్స్ జనరల్ మేనేజరునీ, పర్సనల్ మేనేజరునీ ఇంటికి పిలిపించాడు. "వున్నట్టుండి ఈ సమ్మె ఏమిటి"

"సర్" చెప్పాడు జనరల్ మేనేజరు "సరైన కారణం మాకూ కనిపించడం లేదు. ఉదయం షిఫ్టు ప్రారంభమైన అరగంటకి పేకింగ్ సెక్షనులో పదిమంది ఎంప్లాయీస్ గుంపుగా

మందీ అతడ్ని కొట్టారు. యాజమాన్యం జులుం నశించాలి అంటూ యూనియన్ ప్రెసిడెంట్‌తో బాటు ఫ్యాక్టరీ బయటికి నడిచారు మొత్తం కార్మికులంతా. సెక్యూరిటీ సిబ్బంది ఫోన్ చేయగానే వచ్చాను. అప్పటికే గేటు ముందు స్లోగన్స్‌తో అల్లరి చేస్తుంటే ప్రెసిడెంట్‌ని చర్చలకి రమ్మన్నాను. రానన్నాడు. నేనే వెళ్ళాను. సూపర్వైజరు ఓ కార్మికుడ్ని కొట్టాడు కాబట్టి అతడ్ని ఉద్యోగంలో నుంచి టెర్మినేట్ చేయమని అడిగాడు ప్రెసిడెంట్. అంతవరకూ ఫ్యాక్టరీలో అడుగుపెట్టమని రభస చేశాడు."

నిశ్శబ్దంగా వింటున్నాడు ఉపాధ్యాయ . . . చాలా చిన్న కారణం అది.

"అప్పటికే జరిగింది ఎంక్వయిరీ చేసి నిర్ణయించేక సూపర్వయిజరు నేరస్థుడైతే చర్య తీసుకుంటామన్నా వినడం లేదు. అతడ్ని ఉద్యోగంలో నుంచి ముందు సేక్ చేస్తే తప్ప చర్చలకి అవకాశం లేదన్నారు" పర్సనల్ మేనేజరు చెప్పాడు వివరంగా. "సమ్మెకి నోటీస్ ఇవ్వకుండా ఇలా చేయడం ఇల్లీగల్ అని స్పష్టం చేశాను కూడా."

"సమస్య అది కాదు" అసహనంగా కణతలు నొక్కుకున్నాడు ఉపాధ్యాయ "రెండు నెలల్లోగా స్టేట్స్‌కి పంపాల్సిన పదిహేను కోట్ల విలువచేసే మెటీరియల్ పంపలేకపోవడం ఒక్కటే కాదు. ఈ సమ్మె మూలంగా అన్న టైంకి సప్లయి చేయలేమన్న అపవాదుతో రేపు రాబోతున్న యురప్ కంట్రీస్ ఆర్డర్సు చేజారిపోయాయి."

జనరల్ మేనేజర్ చెప్పాడు గొణుగుతున్నట్టుగా "ఆ సూపర్వైజర్‌పై చర్య తీసుకుందామన్నా మేన్ హేండిలింగ్ జరిగింది. అతడిపైనే తప్ప అతడు ఏ కార్మికుడిపైనా చేయి చేసుకోలేదని ప్రాథమిక దర్యాప్తులో రుజువైంది."

సహనాన్ని కోల్పోతున్నట్టుగా అన్నాడు ఉపాధ్యాయ "లాకౌట్ ప్రకటించండి. లెట్ ది పీపుల్ గో టూ డాగ్స్"

సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించిన ఉపాధ్యాయకి తెలీదు కృషి వారి చర్చనంతా విందని. . .

బెడ్ రూంలో బడలికగా కూర్చుని మానసిక గ్లానితో నలిగిపోతున్న గ్రాండ్‌పాని సమీపించింది కృషి "గ్రాండ్‌పా"

ఆ సమయంలో అతడు ఒంటరితనాన్ని కోరుకుంటున్నాడు.

"నిజానికి ఇది సమస్య కాదు - ఓ సవాల్." క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి అవగాహన గల కృషి నెమ్మదిగా అంది. "అసాధారణమైన మీ అనుభవం ముందు నా ఆలోచన శక్తి స్వల్పమని అంగీకరిస్తున్నాను గ్రాండ్‌పా - కానీ రిస్క్ తీసుకుని కదలాల్సిన యిష్యూలో రేష్‌గా నిర్ణయం తీసుకోవడం మేనేజ్‌మెంట్ సైన్స్ అనిపించుకోదు."

అవాక్కయినట్టుగా చూశాడు ఉపాధ్యాయ- ఆయనకి తెలిసీ కృషి తనకు సంబంధించిన ఏ విషయంలో అయినా ఇలా జోక్యం చేసుకోవడం తొలిసారి. అదికాదు ఆయన ఆలోచిస్తున్నది. కృషి విశ్లేషణ చాలా సృజనాత్మకంగా అనిపించింది.

"నువ్వు చెప్పాలనుకుంటున్నది ఏమిటి"

"ఫ్యాక్టరీ లాకౌట్ దాకా వెళితే ప్రత్యర్థి అనుకున్నది సాధించినట్టు అవుతుంది."

ఉపాధ్యాయ భృకుటి ముడివడింది "ఎవరా ప్రత్యర్థి"

"రామనాథ చౌదరి"

హఠాత్తుగా ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

"నీకు చౌదరి తెలుసా"

"డబ్బుతో సమకూర్చుకున్న ఆయుధాలు గొప్పవనుకునే చౌదరి నాకు తెలుసు గ్రాండ్‌పా. . . కాని ఆలోచనా శక్తి మరింత బలమైన అణ్వాయుధమనే నా గురించి చౌదరి తెలుసుకోవాలి."

"అంటే" సాలోచనగా అన్నారాయన "ఈ సమ్మెకి కారణం ఖచ్చితంగా చౌదరేనంటావ్"

అనుమతిస్తే-"

అర్థం కాలేదు ఉపాధ్యాయకి.

"కాదనకండి గ్రాండ్‌పా - నేర వ్యవస్థ చదరంగపు గళ్ళపై తోచిన పావుల్ని కదిలిస్తూ తాను గ్రాండ్ మాస్టర్‌ని అనుకొంటున్న చౌదరికి చెక్ చెప్పాలీ అంటే మీ సహాయం కావాలి - కనీసం ఈ ఒక్క సారికి. . ."

కృషి గొంతులోని నిజాయితీ ఆయన్ని అమితంగా కదిలించిందేమో "చెప్పు.. . ఏం కావాలి"

"అధికారం"

విస్మయంగా చూశాడు.

"యస్ గ్రాండ్‌పా . . . కేవలం ఇరవై నాలుగు గంటలు మీ అధికారాన్ని నాకిచ్చి మీరు విశ్రాంతి తీసుకోండి. అది చాలు"

"కాని-"

"నేను మీ మనవరాల్ని గ్రాండ్‌పా. . ."

ఆ వాక్యం మనసులోని ఏ పొరల్ని తాకిందో ఉదాసీనంగా చూశారాయన.

"కాబట్టే ఇరవై నాలుగు గంటలు మీ అధికారాన్ని నాకిమ్మంటున్నది. మీ శక్తి తక్కువగా అంచనా వేసి కాదు గ్రాండ్‌పా. నా శక్తేమిటో చౌదరికి తెలియచెప్పాలని."

ఒక సుదీర్ఘ మైన తపస్సుతో నిర్మించుకున్న సామ్రాజ్యాన్ని ఆమెకు ధారాదత్తం చేస్తున్నట్టుగా అన్నారాయన "ఓ.కె. . .ఎక్సెప్టెడ్."

తన దక్షత, కార్యదీక్ష తెలియాల్సింది తాతయ్యకో లేక చౌదరి అనబడే బలమైన ప్రత్యర్థికో ఖచ్చితంగా కృషికీ తెలీదు.

రాత్రి తొమ్మిదిన్నర గంటల కల్లా పర్సనల్ మేనేజరు శరత్ చంద్రని ఇంటికి రప్పించింది కృషి సూటిగా అడిగింది "ఫ్యాక్టరీలోని రూలింగ్ యూనియన్‌తో సరిపడని వ్యక్తుల వివరాలు చెప్పగలరా."

చాలా చిన్న ప్రశ్నది - కాని ఆ ప్రశ్నతోనే ఆమె ఆంతర్యం స్పష్టంగా అర్థ మైపోయింది. అదికాదు కృషిలో అతడు గమనించింది. సౌందర్యపు గ్రహాంతరాల లోతులనుంచి మేధస్సు రేడియం అక్షరాలై కనిపించి అతడ్ని క్షణంపాటు వివశుడ్ని చేసి కంగారు పెట్టింది.

ఫ్యాక్టరీలో కార్మిక సంఘాలను విభజించి పాలించాలనే సంకల్పానికి అనుగుణంగా కార్మికుల్లోని అసంతృప్తిని ఆధారం చేసుకుని కొందరు ఏక్టివ్ మెంబర్లని తయారు చేయడమో లేక తయారైవున్న వాళ్ళని గమనించడమో యజమాన్యపు బాధ్యతల్లో ఒకటిగా తెలిసిన శరత్ చంద్ర నెమ్మదిగా అన్నాడు. . ."చాలా కాలం నుంచి యూనియన్ ఆధిపత్యాన్ని సొంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న వాళ్ళలో సుధీర్ కుమార్ ఒకడు. సుమారు పదిహేనేళ్ళుగా మెషిన్ ఆపరేటర్‌గా వుంటున్న సుధీర్ కుమార్ రెండు సార్లు జనరల్ సెక్రటరీగా కాంటెస్ట్ చేసి

ఓడిపోయాడు. . . కార్మికుల్లో చాలా మంది అతడికి అనుకూలంగా వుంటున్నా గెలిచే మెజారిటీ మాత్రం సంపాదించలేకపోతున్నాడు. . . అతడ్ని కొనేసో లేక బెదిరించో తన మనిషిగా మార్చుకోవాలని రాజారావు రాయబారాలు పంపుతున్నా కొరుకుడు పడనివ్వడంలేదని ఇంటెలిజన్స్ రిపోర్టు ద్వారా తెలిసింది."

తల పంకించింది సాలోచనగా "ప్రతి మనిషీ అమ్ముడుపోతాడు మిస్టర్ శరత్ చంద్ర. . . కాకపోతే కొనడానికి ఉపయోగించాల్సింది కరెన్సీయా లేక మరొకటా అన్నది మన మేధస్సుకి సంబంధించింది. . . మీరు వెంటనే అతడి పర్సనల్ ఫైలు నాకు పంపించండి."

ఓ కార్మికుడు ఫ్యాక్టరీలో చేరినప్పటి అపాయింట్‌మెంటు ఆర్డరు మొదలుకుని అతడికి సంబంధించిన ప్రమోషన్స్, అతడి నడవడికకి సంబంధించిన మెరిట్ రేటింగ్, అతడిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యల వివరాలుండేదే పర్సనల్ ఫైల్.

ఇరవై నాలుగు గంటల్లో తేల్చాల్సిన ఓ విషయం గురించి కృషి పోరాటం ప్రారంభించిందని తెలియని శరత్ చంద్ర అరగంట వ్యవధిలో ఫ్యాక్టరీ నుంచి తనే స్వయంగా సుధీర్ కుమార్‌కి చెందిన పర్సనల్ ఫైల్ తెచ్చిచ్చాడు. . . ఆమె ఆదేశంపై అదే రాత్రి సుధీర్ కుమార్‌ని తీసుకురావడానికి తనే వెళ్ళాడు కూడా. ఓ మామూలు కార్మికుడి కోసం ఫ్యాక్టరీ ఎగ్జిక్యూటివ్స్ అలాంటి మర్యాదలు పాటించడం ఆనవాయితీ కాకపోయినా కనీసం వందల సంఖ్యలో కార్మికుల్ని అనుకూలురుగా మార్చుకున్న సుధీర్‌కుమార్‌లాంటి అస్త్రం కోసం యిది తప్పనిసరి.

ఆ విషయాన్ని చెప్పింది కూడా కృషే.

రాత్రి పదకొండున్నరకల్లా సుధీర్ కుమార్ వచ్చాడు. కృషి కూర్చున్న ఛాంబర్‌లో అడుగుపెడుతూనే ఆశ్చర్యపోయాడు సుధీర్ కుమార్. నిజానికి అతడు ఊహించింది తను ఉపాధ్యాయగార్ని కలుసుకోబోతున్నానని.

అప్పటికే అతడి పర్సనల్ ఫైలంతా స్టడీ చేసిన కృషి సుధీర్ కుమార్‌ని ఆపాదమస్తకం పరిశీలిస్తూ "ప్లీజ్ బీ సీటెడ్" అంది సాదరంగా.

ధైర్యంగా ఆమె ముందున్న సీటులో కూర్చున్న సుధీర్‌కుమార్ మోచేతిని టేబుల్‌పై ఆనించబోయి మళ్ళీ వెనక్కి తీసుకున్నాడు. అది చాలు అతడి ప్రస్తుత మానసిక స్థితేమిటో గ్రహించేయటానికి.

తను దేనికీ జంకనని చెబుతూనే శరీరం సహకరించక తన ఇన్‌ఫీరియారిటీని ప్రదర్శించే బాడీ లాంగ్వేజ్ అది.

కృషి మనస్తత్వ శాస్త్రాన్ని క్రోడీకరించుకుంటూ నిశ్శబ్దంగా వుండిపోయింది చాలా సేపటిదాకా. అలాంటి సన్నివేశాలలో మాటలకన్నా మౌనం ఏ మనిషినైనా ఎంతటి ఆందోళనకి గురిచేసేదీ ఆమెకు తెలుసు. "మిస్టర్ సుధీర్ కుమార్. . . మనం ప్రోస్పరిటీలో వున్నప్పుడు

గుర్తుకొస్తారంటారు. నిజానికి యిది బాధాకరమైన స్టేట్‌మెంట్ అయినా ఎవరూ కాదనలేని సత్యం. ఇప్పుడు మిమ్మల్ని యింత అర్జెంటుగా రప్పించింది ఓ స్నేహితుడిగా మాకు సహకరించమనే తప్ప మిమ్మల్ని అవకాశవాదంతో కొనేయాలనీ, ప్రలోభ పెట్టాలనీ కాదు."

ఆ చివరి వాక్యం సుధీర్‌నెంత బలంగా ఆకట్టుకుందీ అంటే కొన్ని క్షణాల క్రితం దాకా అతడిలో వున్న అనుమానం చెదిరిపోయింది.

"దీక్ష గల వ్యక్తులే తెలివైనవాళ్ళూమూ లేక సమర్ధులమూ అనుకున్న వ్యక్తులకన్నా ఎక్కువ గెలుపు సాధించగలరన్న నిజాన్ని మీరు నమ్మి తీరాలి. . ." ప్రతి వాక్యాన్నీ కేవలం సుధీర్ కుమార్‌కే అన్వయించినట్టుగా చాలా జాగ్రత్తగా సంధిస్తూంది కృషి. "ఎప్పుడో ఒకనాడు తండ్రి మరణించిన ఓ అబ్బాయి తన చిన్న యింటికి సమీపంలో వున్న గోల్ఫ్ కోర్సుని చూస్తూ ఎప్పటికైనా గోల్ఫ్ నేర్చుకోవాలని కలలు కనేవాడు. పేదరికంతో చదువుని సెవెంత్ స్టాండర్డ్ దగ్గరే ఆపేసిన ఆ అబ్బాయికి ఖరీదయిన గోల్ఫ్ కోర్సులో అడుగుపెట్టడమే కష్టమైన పని కావడంతో నిరుత్సాహపడలేదు. పట్టుదల, దీక్ష అతడ్ని వెంటాడుతుంటే తోటమాలిగా ఆ గ్రౌండ్‌లో అడుగుపెట్టాడు. ఖరీదయిన వ్యక్తులు ఆడే గోల్ఫ్‌ని గమనిస్తూ చిన్న బంతిని సంపాదించి సోడా బాటిల్స్‌తో కొడుతూ తన స్కిల్ పెంచుకున్నాడు."

తండ్రి లేకుండా పెరిగిన సుధీర్ కుమార్ సెవెంత్ స్టాండర్డు దగ్గరే చదువు ఆపేశాడు. ఫ్యాక్టరీలో రోజు కూలీకి చేరి సీనియర్ వర్కర్‌గా ఎదిగిన ఆ వ్యక్తి చాలా ఏకాగ్రతగా వింటున్నాడు కృషీ చెబుతున్న విషయాన్ని.

"ఒకనాడు" ఇందాకటి చర్చని కొనసాగిస్తూ అంది కృషి "చాలామంది చేత నిరసించబడిన ఆ అబ్బాయి పట్టుదలతో గార్డెనర్‌గా గోల్ఫ్ కోర్సులో ప్రవేశం సంపాదించిన ఆ వ్యక్తి ఇప్పుడు ప్రపంచంలోని ప్రముఖ గోల్ఫర్స్‌లో ఒకడు. తనే లీట్రెవినో. అమెరికాకి చెందిన ప్రముఖుడు నాకు పరిచయమైన వ్యక్తి కాబట్టే అతడి జీవితం గురించి మీకు చెప్పాలనిపించింది.... " క్షణంపాటు సుధీర్‌కుమార్ కళ్ళల్లోకి చూసింది.

అతడు పూర్తిగా ట్రాన్స్‌లోకి వెళ్ళకపోయినా ఆమె మాటలకి బలంగా స్పందించిన విషయం అతడి ముఖకవళికలే తెలియజెపుతున్నాయి.

"ప్రత్యేకించి ఇదంతా మీకు మాత్రమే చెప్పడంలో నా వుద్దేశ్యం మీరు దీక్ష దక్షతగల కార్మికుడు మాత్రమే గాక కొన్ని వందల మందిని ఇన్‌ఫ్లుయెన్స్ చేయగల సమర్ధుడైన నాయకుడిగా కూడా మీకు చరిత్ర వుంది. యాజమాన్యాన్ని బద్ధశత్రువులుగా భావించే అందరు కార్మిక నాయకుల్లో మీరు ఒకరు కాదు. . . మీరు అలాంటి వ్యక్తే అయితే యీపాటికే సూడో లీడర్ అయిన రాజారావుతో చేతులు కలిపేవారు. మీరు కోరేది మీ తోటి కార్మికుల ఎదుగుదల. . . అలాంటి మీరు. . ." తను చెప్పాల్సిన అతి ముఖ్యమైన విషయాన్ని చాలా జాగ్రత్తగా అతడి మనసు పొరల్లోకి ఇంజెక్టు చేసింది. "ఇంత జరిగినా నిశ్శబ్దంగా వూరుకోవడం నా

అంటే ఖచ్చితంగా కార్మికులే అంటాన్నేను.  ఓ ఫ్యాక్టరీ లాకౌట్ అయితే ఉపాధ్యాయ కుటుంబానికి అదో ఆర్థికమై యిబ్బంది కాదు.  నిజం మిస్టర్ సుధీర్‌కుమార్...
ఎన్ని తరాలు గడిచినా తరగని సంపదవున్న మా తాతయ్య ఆలోచిస్తున్నది మీ జీవితాల గురించే. . . ఓ రాజకీయ నాయకుడు స్వార్థంతో మొదలుపెట్టిన సమ్మె అతడి ఇమేజ్‌ని పెంచుతుంది కాని ఫ్యాక్టరీ నష్టాలకి గురిచేస్తుంది. అంటే కార్మికులు న్యాయబద్ధంగా సాధించాల్సిన చాలా డిమాండ్స్‌ని అంటే. . .సొంత యిళ్ళు, కార్మికుల కుటుంబాలకోసం మేం కట్టించాలనుకుంటున్న హాస్పిటల్స్, మీ పిల్లల చదువులకి మేం కేటాయించాలనుకుంటున్న ఉపకారవేతనాలు అన్నీ మీరు కోల్పోయే అవకాశమిది".

విభ్రమంగా చూస్తున్నాడు సుధీర్ కుమార్ . . . ఇంతకాలం రాజారావులాగే తనూ నాయకుడు కావలనుకుంటున్నాడు తప్ప కృషి చెప్పిన శాశ్వతమైన లాభాల నాశించే కార్మిక శ్రేయస్సు కోసం తనూ ఆలోచించలేదు.

"బహుశా మిమ్మల్ని డబ్బిచ్చి కొనాలని యిలా పిలిపించి వుంటారేమో అని మీరు పొరపాటు పడి వుండొచ్చు.  కాని దురదృష్టవశాత్తూ నేను ఆ సంస్కృతిలో పెరిగిందాన్ని కాదు. . . అలాంటి తాత్కాలికమైన పరిష్కారాలు నాకిష్టం వుండదు."

"కృతజ్ఞుడ్ని మేడమ్. . . మీరు నన్నిలా గుర్తించినందుకు అదృష్టవంతుడ్ని ... వెళతాను"

ఆమె వారించలేదు.  సుధీర్ కుమార్ వెళ్ళిపోయాడు.  అతడు వెళ్ళటానికి కారు ఏర్పాటు చేయడమూ ఆమె మరిచిపోలేదు.

అలాంటి చిన్న విషయాలే వ్యక్తుల్ని ఎంత బలంగా ఆకట్టుకునేదీ అన్న విషయంతో బాటు ఆ తర్వాత ఓ ఉద్యమంలా సుధీర్ కుమార్ ఎంత శ్రమపడేదీ ఆమెకు తెలుసు.

"ఎందుకు పిలిచినట్టు.  ఏం సాధించినట్టు" రాత్రి పన్నెండు గంటలు దాటుతుండగా అడిగాడు ఉపాధ్యాయ "కేవలం ఉపదేశాలతో అతడు ఇన్‌స్పైరై నీకు సహకరిస్తాడనుకున్నావా"

"లేదు గ్రాండ్‌పా - అందరిలో నేనూ ఒకదాన్ని కాలేక ఇక్కడే బేరసారాలు మొదలు పెట్టలేదు.  కాని అతడ్ని కొనేయబోతున్నాను మోరల్‌గా"

అర్థంకానట్టు చూశాడు ఉపాధ్యాయ - ఇంకా పాతికేళ్ళు సైతం నిండని ఓ అందమైన అమ్మాయి తన అనుభవాన్ని ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించింది.

"మీ స్థాయిలో మీరు చూడాల్సింది గెలుపే తప్ప అయిన ఖర్చు కాదు" నిశ్చలంగా అంది కృషి. ఆ ఖర్చుకూడ మీ యిమేజ్‌ని శాశ్వతంగా పెంచేదిగా మీ ప్రత్యర్థిని బలంగా దెబ్బతీసేదిగా మారేటప్పుడు ఖర్చుకి అసలు వెనికాడకూడదు కదా గ్రాండ్‌పా".

ఉపాధ్యాయ భృకుటి ముడిపడింది "నువ్వు దేని గురించి మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడంలేదు"

"ప్రతిష్ట, పరపతి కోసం అహోరాత్రులు శ్రమించే మీరు చౌదరి ముందు ఓడిపోవడం మీ

కట్టించాలనుకున్న హాస్పిటల్ లేండ్‌లో చౌదరి గుడిసెలు వేయించి మిమ్మల్ని మానసికంగా దెబ్బతీయటాన్ని నేను అంగీకరించలేక సుధీర్ కుమార్‌ని ట్రాప్ చేసే ప్రయత్నం చేశాడు ఇప్పుడు తిరుగులేని గెలుపు సాధించబోతున్నాను."

"ఎలా?"

"చౌదరి పదెకరాల మన లేండ్‌లో గుడిసెల్ని వేయించింది తాత్కాలికంగా మీ మీద గెలుపు సాధించాలని, ఆ తర్వాత తను సొంతం చేసుకోవాలని. నిజానికి ఆ గుడిసెల్లో చౌదరిని సపోర్టు చేసే మన ఫ్యాక్టరీ కార్మికులూ వున్నారు."

"అయితే. . ."

"ఇప్పుడు అర్జెంటుగా వాళ్ళకి మనం పట్టాలను పంపిణీ చేయబోతున్నాం. ఆ విధంగా చౌదరి ఆట కట్టించి జాగాని మనమే సొంతం చేసుకోబోతున్నాం. ఎలా అనకండి. ఆ విషయం నాకు వదిలేయండి."

అప్రతిభుడై చూస్తూ ఉండిపోయాడు ఉపాధ్యాయ.

పసిపిల్లల్ని తక్కువగా అంచనా వేయడం ఎంత పొరపాటో పెద్ద వాళ్ళని ఎక్కువగా అంచనా వేయడం అంతే పొరపాటుగా అర్థమైందో లేక ఎక్కడో స్టేట్స్‌లో పెరిగిన తన మనవరాలిలో తన వూహకందని మేధావే కనిపించిందో కోర్టులో నడుస్తున్న కేసుని ఇలా ముగించి చౌదరిపై విజయాన్ని సాధించే కృషిని అభినందించకుండా వుండలేకపోయాడు-

కృషి ఊహ తప్పుకాలేదు.

మరుసటి రోజు మధ్యాహ్నానికే గుడిసెలకి పట్టా పంపిణీ ఏర్పాటు చేసిన కృషి అప్పటికే కార్మికుల్లో చిన్న కదలికకి కారణమైన సుధీర్‌కుమార్ ప్రయత్నానికి చాలా బలాన్ని అందించింది.

0 0 0 0

"డేమిట్"

ఇంచుమించు గుండెలు బాదుకున్నట్టుగా కలవరపడిపోయాడు రమానాథచౌదరి...

కొన్ని రోజులపాటు తన గెలుపుని ఎంజాయ్ చేయాలనుకున్న చౌదరి ఇప్పుడు కార్మికుల్లో వచ్చిన మార్పుని తట్టుకోలేకపోయాడు కేవలం గంటల వ్యవధిలో కార్మికుల్ని విభజించడమే గాక జరిగిన పొరపాటుకి అంతా పశ్చాత్తాప పడి ఇక ముందు తొందరపడమని 'అండర్ టేకింగ్స్' రాయించుకుని మరీ ఫ్యాక్టరీలో అడుగుపెట్టేట్టు చేసింది.

ఎదురుగా దేభ్యం మొహాలు వేసుకుని నిలబడ్డ రాజారావుని లాయరు రంగధాంల్ని చూస్తూ అరిచాడు ఆవేశంగా "వెళ్ళండి - ఓ ఆడపిల్ల తెలివిముందు చవటల్లా నిలబడాల్సి వచ్చినందుకు వెళ్ళి హుస్సేన్‌సాగర్‌లో దూకి చావండి. అసలు నీకైనా సిగ్గు లేదటయ్యా" రాజారావుతో అన్నాడు "పెద్ద మొనగాడ్ని మగాడ్ని అంటావే, ఫ్యాక్టరీలో అడుగుపెట్టే లేబర్‌ని గూండాలతో తరిమేయక ఏం చేసినట్టు."

"పోలీసు బలగాన్ని దింపిందండీ - వాళ్ళ రక్షణతోనే యిన్ని ఏర్పాట్లు చేసేసింది."

"ఏం - మనం పోలీసుల్ని అదుపు చేయలేమా"

"అసలు కార్మికుల్లో ఏ వర్గమైనా మన పక్క నిలబడి వుంటే పోలీసులు, గూండాలు ఎందుకండీ వాళ్ళలో వాళ్ళే తలలు బద్దలు కొట్టుకునేట్టు ప్లాన్ చేసేవాడ్ని" ఉద్వేగంగా అన్నాడు రాజారావు. "కాని నిన్న గాక మొన్నటి దాకా మీరిచ్చిన గుడిసెల్లో వుండి మీకు జిందాబాద్ అనే మన గ్రూపు కార్మికులు కూడా పట్టాలు దొరికేసరికి చెట్టాపట్టాలేసుకుని చక్కా ఫ్యాక్టరీలో అడుగుపెట్టారు. పైగా కృషీ జిందాబాద్ అంటూ.."

"స్టాపిట్" ఇక నిభాయించుకోలేకపోయాడు చౌదరి.

ఏదో చేయాలి. కాని ఏం చేయాలో వెంటనే తోచలేదు.

సరిగ్గా ఆ సమయంలో ఫోన్ రింగయింది.

చిరాగ్గా ఫోన్ రిసీవర్ అందుకున్న రామనాథచౌదరి మొహంలో రంగులు మారిపోయాయి

చాలా వేగంగా.

"బాగున్నారా చౌదరీ సాబ్. . ." కృషి మాట్లాడుతోంది "ఇక ఆ లేండ్ గురించి కోర్టులో గొడవలూ శతృత్వాలూ లేకుండా సెటిల్ చేసేశానుగా."

"నా కెందుకు ఫోన్ చేశావ్"

"ఇది నా నుంచి నీకు మూడో ఓటమి అని గుర్తుచేయటానికి"

". . . . . . ."

"ఏం నిశ్శబ్దంగా వుండిపోయారు. మూడోది ఎలా అవుతుందని ఆలోచిస్తున్నారా - మొదటిది మీ క్విజ్ కిడ్‌ని గెలిపించాలని మీరు చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టి విశ్వని గెలిచినట్టుగా నేను స్టేట్‌మెంటివ్వడం. రెండోది మీదీ అనుకున్న లేండ్ మీది కాకుండ చేయడం. . . మూడోది మీరు రగిల్చిన సమ్మెని చల్లబర్చి కార్మికులు సమ్మె ఉపసంహరించుకునేట్టు చేయడం - లెక్కసరిపోయిందా."

"ఇంతటితో ఇది గెలుపుగా సంబరపడకు కృషీ. . ."

"అలా నేను పొరపాటు పడడం లేదు చౌదరీ. . . నాకు తెలుసు మీరు వూరుకోరని. ఇప్పుడు నేను మీకు స్పష్టం చేయాలనుకున్నదేమిటంటే నేనూ అంతే మొండిఘట్టాన్నని నేనీ దేశంలో వున్నంత కాలం మీ ఆటలు సాగనివ్వనని. . . ఓ.కే."

ఫోన్ క్రెడిల్ చేసింది.

నిశ్శబ్దంగా సోఫాలో కూర్చుండిపోయాడు చౌదరి.

తను ఎదగడం ప్రారంభించి ఎంతకాలమైనా కాని ఇంతకాలానికి తనకో అసలు సిసలైన ప్రత్యర్థి ఎదురైంది.

పైగా తను ఈ దేశంలో ఉన్నంతకాలం తనను ఓడించటమే ధ్యేయమంటూ సవాల్ విసురుతూంది.

నవ్వేశాడు చౌదరి.

అలాంటి మూడ్‌లో నవ్వడం చౌదరికి అలవాటు లేదు. సామాన్యంగా అతడు నవ్వేది గెలుపులోనే తప్ప ఓటమి తర్వాత కాదు. ఆ విషయం అతడి ముందు నిలబడ్డ రంగధాం రాజరావులకిద్దరికీ తెలుసు. అయినా ఎందుకు నవ్వాడో కారణం అడగలేకపోయారు.

"మొత్తానికి కృషి చాలా గట్టిపిండమయ్యా రంగధాం"

మరింత ముచ్చటగా అన్నాడు "ఎక్కడో చదువుకొని వచ్చిన ఆడపిల్ల నా అంతవాడ్ని అల్లరిపెట్టడమే గాక నా పరంగా ప్రమాదాన్ని వూహించి ముందే పోలీసులకి, హోం సెక్రెట్రీకి తెలియపరచి అన్ని మార్గాల్నీ మూసేసింది. ఇంకా నవరంధ్రాల్నీ మూసేస్తానంటూంది - శభాష్."

అది ఓటమిని జీర్ణించుకోలేని ఉన్మాదంతో పేషెంటు డేలీరియం స్టేజ్‌లోని మాటల్లా అనిపిస్తున్నాయి

అవకాశం వున్నప్పుడు రాజమార్గాల్లోనూ సాధ్యం కాకపోతే దొడ్డితోవల్లోనూ ప్రయాణం చేస్తూ ఆ స్థాయికి ఎదిగిన చౌదరికి మనస్తత్వ శాస్త్రం గురించి తెలీదు గాని సంఘాన్ని క్షుణ్ణంగా చదివేసాడు. . . అలా పెంచుకున్న సామ్రాజ్యంలో ఇంతకాలం సజావుగా సుఖంగా బ్రతుకుతున్న ఆయనకి చాలా రోజుల్నుంచి ఓ విషయం అర్థం కావడం లేదు.

అసలు కృషి లాంటి ఆడపిల్లకి మామూలు స్థితిలో బ్రతికే విశ్వకి పరిచయం ఏమిటి - అది విశ్వ కోసం రెండు లక్షలు ఖర్చుచేసేదాకా ఎలా పెరిగింది - ఒక మామూలు మనిషికి భిన్నంగా ఆలోచించగల చౌదరికి ఆ క్షణంలో యిదే విషయం మనసులో మెదలడం యాదృచ్ఛికం కాదు. ఓ చిన్న అవకాశం తీసుకుంటేనేం అనుకుంటూనే రంగధాం చూశాడు.

"హాస్పటల్లో వున్న విశ్వ పరిస్థితేమిటి"

ఓ రహస్యంలా అన్నాడు రంగధాం "ఈ రోజు ఉదయం స్పృహలోకి వచ్చాడు"

"తనపై అటాక్ చేసిందెవరో చెప్పగలుగుతున్నాడా."

"ఉదయం యస్సై ఇన్వెస్టిగేషన్‌కి వెళ్ళి అడిగితే ఖచ్చితంగా చెప్పలేకపోయాడట."

మృదువుగా నవ్వాడు చౌదరి.

అలా నవ్వేది నవ్వగలిగేది తిరుగులేని ఓ పథకం స్ఫురించినప్పుడే అని తెలిసిన రంగధాం ఉత్సుకతగా అడిగాడు "తమరో ప్రణాళికను సిద్ధం చేసినట్టున్నారు".

"ఉపాధ్యాయకి మామూలు స్థాయి మనుషులంటే చాలా అసహ్యం అని తెలిసిన రంగధాం - కాబట్టి ఒకనాడు పేద కుటుంబానికి చెందిన అబ్బాయిని ప్రేమించిన చెల్లిని యింటినుంచి గెంటేశాడు. ఆమె చివరి దశలో కేన్సర్‌తో చనిపోతున్నా పట్టించుకోకుండా దిక్కుమాలిన చావుకి కారణమయ్యాడు. కారణం ఓ అలగా మనిషికి భార్య అయ్యిందన్న కోపం."

ఉన్నట్టుండీ యిదంతా చౌదరి ఎందుకు చెబుతున్నదీ అర్థంగాని రంగధాం నిశ్చేష్టుడై చూస్తుండగానే "కాబట్టి ఈ రోజు కృషి ఓ సామాన్య కుటుంబానికి చెందిన విశ్వ వెంట పడుతుంటే తట్టుకోలేక అలా గూండాల్ని ప్రయోగించాడు. విశ్వపై హత్యాప్రయత్నం చేశాడు" కంక్లూడ్ చేశాడు చౌదరి.

రంగధాంకి మతి పోయింది.

సముద్రంలో ఉప్పుకి చెట్టుమీద కాయకి లింకుపెట్టి అద్భుతమైన కథనల్లి ఆలోచిస్తున్నాడు. దటీజ్ చౌదరి.

అదేరోజు రాత్రి విశ్వ వున్న హాస్పిటల్‌కి వెళ్లాడు. చౌదరికి చాలా చాలా ఆత్మీయుడయిన ఓ పోలీసాఫీసరు. వెళుతూ ఆ రోజు విశ్వపై అటాక్ చేసిన ఓ గూండా ఫోటో పట్టుకు వెళ్ళాడు. అది పోలీసాఫీసరుకి ఇచ్చింది చౌదరీయే.

"ఆ రోజు మీ మీద అటాక్ చేసిన వ్యక్తుల్లో ఇతడున్నాడా" ఫోటో చూపిస్తూ అడిగిన పోలీసాఫీసరుకి [illegible] జవాబిచ్చాడు విశ్వ.

"రెండు రోజులుగా తోమి వదిలిపెడితే చెప్పాడు. అతనిని మీ మీద ప్రయోగించిందెవరో - అసలు ఉపాధ్యాయ స్థాయి మనిషి ఇలా దిగజారడం నా వూహాకందనిది. మీకూ ఆయనకీ మధ్య గొడవలేమన్నా వున్నాయా?"

విశ్వ అప్రతిభుడయ్యాడు.

అలాంటి అవసరం ఉపాధ్యాయకన్నా కృషికే ఎక్కువగా వుందని చెప్పలేదు విశ్వ. తొందరపడి తన శీలాన్ని కోల్పోయే పరిస్థితి తెచ్చుకున్న కృషీ ఇలాంటి సాహసానికి పూనికొని వుంటుందన్న ఏ ఆలోచనో విశ్వ అలాంటి నిర్ణయానికి వచ్చేటట్టు చేస్తే అలా ఆలోచించడం తప్పు కాదు - చౌదరి ప్రదర్శించిన అమోఘమైన తెలివి అది.

సగం గెలిచాడు చౌదరి.

"క్రిమినల్ ప్రస్తుతం కస్టడీలోనే వున్నాడు కాబట్టి మీరు వీడ్ని గుర్తించినట్టు స్టేట్‌మెంటిస్తే మొత్తం డొంక కదిలిస్తాను . . . ఉపాధ్యాయ గారిపై లీగల్‌గా. . ."

పోలీసాఫీసరు వాక్యాల్ని అర్ధోక్తిగా ఖండించాడు విశ్వ. "అవసరం లేదు ఇన్‌స్పెక్టర్ - ఇది నాకు నేనుగా తేల్చుకోవాల్సిన సమస్య."

చౌదరి విశ్వాసపాత్రుడయిన ఆ పోలీసాఫీసరు విశ్వని ఒప్పించాలని సిన్సియర్‌గా ప్రయత్నించాడు. "ఉపాధ్యాయగారిస్థాయి మీకు తెలుసు - మీ అంత మీరుగా ఆయనతో పోరాడలేరు."

"ప్లీజ్ ఇన్‌స్పెక్టర్" విశ్వ కళ్ళలో ఎర్ర జీరలు చోటు చేసుకున్నాయి. "దయుంచి నన్ను వదిలిపెట్టండి - ఈ విషయాన్ని ఇంకా ప్రొలాంగ్ చేయడానికి ప్రయత్నించకండి. మీరు తప్పదని అంటే అసలు ఈ ఫోటోలో వున్న వ్య క్తి ఎవరో నాకు తెలీదంటాను."

ఇన్‌స్పెక్టర్ షాక్ తిన్నట్టుగా చూసాడు.

ఓ చిన్న ప్రయత్నంలో అవసరమైతే తన మనిషిని జైలుకి పంపి అయినా ఉపాధ్యాయని అన్‌పాప్యులర్ చేద్దామనుకున్న చౌదరి ప్రయత్నానికి విశ్వ సహకరించలేదు.

జరిగిందంతా పోలీసాఫీసరు ద్వారా తెలుసుకున్న ఆయన అలాగా అని సరిపెట్టుకోలేదు. . . సరిపెట్టుకుంటే అతడు చౌదరి కాడు.

మరి కాస్త లోతుగా విషయాన్ని శోధించాలనుకున్నాడు.

కృషికీ, అతడికీ వున్న పరిచయం ఏమిటో వివరంగా తెలుసుకోవాలనుకుంటూ ఓ పావుని చేజిక్కించుకున్నాడు రాజేషు ద్వారా.

ఆ పావు విశ్వ స్నేహితుడు సూరి.

మామూలుగా అయితే బయటికి కక్కేవాడు కాదేమో కాని ఖరీదయిన మందు తాగాక మొత్తం కక్కేసాడు సూరి.

అంతే - చౌదరిలాంటి వాడు సైతం అప్రతిభుడైపోయాడు.

శరీరాన్ని పెట్టుబడిగా పెడతాననడం అతడి వూహాకందనిది.

0 0 0 0

అసురసంధ్యవేళ. . . .

ఫ్రెడరిక్ ఫోర్ సేత్ 'ది నెగోషియేటర్' చదువుతున్న కృషి ఫోను రింగవుతుంటే యధాలాపంగా రిసీవర్ అందుకుంది " కృషి హియర్"

"నేనే" విశ్వ కంఠం వినిపించింది.

మనసున గుచ్చుకున్న తలపుల మొగలి పువ్వులా కదిలిందామె. హాస్పిటల్లో వున్న విశ్వ గురించి ఏ రోజు కారోజు తెలుసుకుంటూనే వుంది. ఈ రోజు ఉదయమే డిశ్చార్జి అయిన విశ్వ తప్పకుండ ఫోను చేస్తాడనీ అనుకుంది.

"గుర్తుపట్టేరనుకుంటాను" అడిగాడు విశ్వ మళ్ళీ.

ఎన్ని కోట్ల లిప్తల దూరమో పగిలి శరత్పూర్ణిమల చల్లదనాన్ని మనసు లోయల్లో దోసిళ్ళతో పోసినంత వివశత్వంతో పలకరించాలనుకుంటూనే మూగపోయింది."

"ఆశ్చర్యపోతున్నారా కృషీ"

"దేనికి"

"నేను బ్రతికే వున్నందుకు"

మనస్సు చివుక్కుమంది. ఇంకా అదే ఆకతాయితనాన్ని ప్రదర్శిస్తాడేం.

"నేను క్విజ్ కాంపిటీషన్లో గెలిచాను కదూ"

"తెలుసు"

"మీకు తెలియాల్సింది మరొకటుంది కృషీ."

"ఏమిటి"

"మన ఒప్పందం ప్రకారం మీరు నాతో ఓ రాత్రి గడపాలి"

పేర్చుకుంటున్న కలల పుప్పొడిరాలినట్టు ఆమె ఫాలభాగాన్ని ఆక్రమించిన స్వేద బిందువులు చెంపలపైకి జారేయి. తను మరిచిపోయింది వున్నట్టుండి గుర్తు చేస్తున్నాడు.

"మీరు జవాబు చెప్పడం లేదు"

"గుర్తుంది" గొణుగుతున్నట్టుగా అంది "కాని. . ."

"అదంత ముఖ్యమా అన్నది మీ ప్రశ్ననుకుంటాను కృషీ. చాలా అవసరం అన్నది నా జవాబు"

కృషి మొహంలో రంగులు మారాయి "నేను కాదంటే. . ."

"మన ఒప్పందం పత్రికలదాకా వెళుతుంది. ఎలా అని అనకండి. డబ్బున్న వాళ్ళ అభిజాత్యాల గురించి తెలిసినవాడిగా మన చర్చ చిన్న పాకెట్ రికార్డర్లో టేప్ చేశాను."

ఇంత జుగుప్సగా మాట్లాడుతున్నాడేం.

. . వాయిస్ అనలిస్ట్‌లకి అది మీ గొంతో కాదో తెలుసుకోవడం కష్టం కాదు. . . అది మీ గొంతు కాదని నిరూపించుకునే పిచ్చి ప్రయత్నం మీరు చేసినా అప్పటికే మీరు పదిమంది ముందూ అల్లరైపోతారు.. . ఎంతైనా రాయల్ ఫేమిలీ అమ్మాయిగా మీకు అది అప్రతిష్ఠేగా . . . సో . . . రమ్మంటారా"

ఆమె జవాబు చెప్పలేకపోతూంది.

"మీ అనుమతి నాకు అవసరం లేదు కృషీ. . . దేనికైనా సిద్ధపడే మనస్తత్వం నాది. కాబట్టే మీ మీద గెలుపు కోసం ప్రాణాలకే తెగించాను. . ."

ఆ క్షణంలో 'మీరు ప్రయోగించిన గూండాల మూలంగానే' అనలేదు విశ్వ. . . తన పొందాలనుకున్న ఆనందం గూండాల గురించి మాట్లాడికాదు ఒప్పందాన్ని గుర్తుచేసి. . .

"రేపురాత్రి పదిగంటలకి వస్తున్నాను కృషి. మన తొలి రాత్రికి సిద్ధంగా వుండండి... మరోసారి తెలివి ప్రదర్శిస్తే మర్యాదగా వుండదు."

ఆ చివరి వాక్యం అర్థమేమిటో బోధపడలేదు.

"ఆశ్చర్యపోతున్నారా కృషీ . . . మీ శీలానికి ప్రమాదం జరక్కుండా పోటీ చివరి క్షణంలో మీరు నా మీదకి పంపిన గూండాల గురించి పోలీసులే నాకు స్వయంగా తెలియపరిచారు"

ఆమె మాట్లాడే అవకాశమివ్వకుండా ఫోన్ క్రెడిల్ చేశాడు విశ్వ.

మనసదోలా అయిపోయింది.

చౌదరి అవకాశం తీసుకున్నాడు. . . తమ మధ్య ఒప్పందం ఎలా గ్రహించినా గాని తిరుగులేని అభియోగాన్ని మోపాడు.

అదికాదు ఆమె ఆ క్షణంలో అంతగా కదిలించింది. తన మూలంగా ఓడిన చౌదరి ఇలాంటిదేదో చేస్తాడని ఆమె ఊహించిన విషయమైనా విశ్వ ఇంత మూర్ఖుడిలా అతడి ట్రాప్‌లో చిక్కుకుంటాడని అనుకోలేకపోయింది.

ఎవరీ విశ్వ-

ముగ్ధగా పేర్చుకున్న ప్రేమరాసుల్ని విధి క్రూరంగా కాలితో తన్ని చెల్లాచెదురు చేస్తే మనస్సు శరపంజరాన్ని ఛేదించుకుని నా మనిషే అనిపించేట్టు నడుచుకు వచ్చాడే - ఇలా ప్రవర్తిస్తున్నాడే.

కలల బ్రతుకు పాటల కోకిల గొంతుకి ఉరిబిగించి జీవితాన్ని హంస చివరిగీతంగా మార్చుకుని సాగిపోతుంటే మానసాకాశాన ప్రత్యక్షమైన విద్యున్మేఘమాలగా అరుదెంచాడనిపించాడే - ఇప్పుడు యిలా కుంచించుకుపోతున్నాడేం.

ఏ జ్ఞాపకాల పొరలు కదిలి మనసుని కలిచివేశాయో ఎప్పుడో ఘనీభవించిన అశ్రువులు ఆర్ద్రంగా ఆమె కనుపాపల్ని తడిపాయి.

మరోసారి -

ఇక కూడదనుకుంటూనే ఇంకోసారి మరో మనిషికి దగ్గర కావాలని ఎందుకు కోరుకుంది.

కౌశిక్ గుర్తుకొచ్చాడు.

పాతికేళ్ళ వయసొచ్చినా ఆడపిల్లలా బిడియంగా తలవంచుకు నిలబడేవాడు. అంత పిరికివాడిలాగే కనుమరుగైపోయాడు.

సూట్‌కేసులోంచి ఓ ఉత్తరాన్ని తీసింది కృషి.

కౌశిక్ రాసిన చివరి ఉత్తరం.

"కృషీ-

నొప్పించేటంత దుర్మార్గుడ్నయ్యానని వూహించలేక పోయాను. ఎవర్ని నేను మీ ఫ్యాక్టరీలో పనిచేసే ఓ మామూలు ఉద్యోగికి కొడుకుని. మీ తాతయ్య దయాదాక్షిణ్యాలతో యింజనీరు అయినవాడ్ని. నా తాహతేమిటో నేను గుర్తించకుండా మీ కెందుకు మానసికంగా దగ్గరయ్యానో ఇప్పటికీ నాకు అర్థం కాని విషయమే- ఇప్పుడు నేను ఉద్యోగాన్ని పోగొట్టుకున్నందుకు బాధపడడం లేదు. ఉపాధ్యాయ దృష్టిలో కృతఘ్నుడిగా మిగలాల్సి వచ్చినందుకు కుమిలిపోతున్నాను అందుకే బ్రతుకు మీద ఆసక్తిని కోల్పోయి మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను

కౌశిక్"

ఉపాధ్యాయ ఫ్యాక్టరీలో ఓ మామూలు ఉద్యోగికి కొడుకైన కౌశిక్ యింజనీరింగ్ దాకా చదివింది, ఉపాధ్యాయ ఫ్యాక్టరీలో చేరింది ఉపాధ్యాయ ఆశీస్సులతోనే అయినా కౌశిక్ జీవితాన్ని వూహించని మలుపు తిప్పింది అతడి అమెరికా ప్రయాణం.

కంపెనీ కొలాబరేటర్స్ దగ్గర ఏడాది ట్రయినింగ్ కోసం స్టేట్స్‌కి పంపబడ్డ కౌశిక్ కృషికి పరిచయమైంది స్టేట్స్‌లోనే - చాలా స్వల్ప వ్యవధిలో మానసికంగా ఇద్దరూ దగ్గరయ్యారు.

తను కోరుకున్న మగాడిలో ఎలాంటి వ్యక్తిత్వం ఉండాలనుకుందో కౌశిక్‌లో చూడగలిగిన కృషి తాతయ్యకి వెంటనే ఫోన్ చేసి చెప్పింది.

తన పెళ్ళి విషయంలో తాతయ్య చూపిస్తున్న శ్రద్ధని గమనించి తెలియచేసింది కౌశిక్ గురించి.

అంతే-

కౌశిక్ ఇండియాకి రప్పించబడ్డాడు-

ఒక శుభవార్తకోసం ఎదురు చూస్తున్న కృషికి ముందు కౌశిక్ రాసిన ఉత్తరం అందింది.

స్వయంగా తాను నిర్ణయం తీసుకునే అవకాశమున్నా తాతయ్యకి తెలియచేసి ఎంత పొరపాటు చేసిందీ గ్రహించిన కృషి ఇండియాకి వచ్చింది వెంటనే. . .

కౌశిక్ ఏక్సిడెంటులో చనిపోయాడని అప్పటిదాకా ఆమెకి తెలీదు.

ఉద్యోగాన్ని కోల్పోయిన బాధతో ఆత్మహత్యే చేసుకున్నాడో లేక ఉపాధ్యాయగారి దృష్టిలో కృతఘ్నుడైన వేదనలో మనఃస్థిమితం కోల్పోయి ప్రమాదంలో చిక్కుకున్నాడో ఆమెకి తెలీదు.

కాని తొలిసారి ఆమె కంటతడి పెట్టుకుంది.

అది డబ్బు పరపతి ప్రతిష్టలనే పదాలతో కాపరం చేసే తాతయ్య చేసిన హత్యగానే భావించింది. జీవితంలో మొట్టమొదటిసారి ఉపాధ్యాయని నిలదీసింది-

ఆ క్షణంలో సైతం ఉపధ్యాయ జరిగిన దానికి చింతించలేదు.

ఓ సామాన్యుడ్ని ప్రేమించి తనకు దూరమైన చెల్లి చివరి క్షణాల్లో కేన్సర్‌తో బాధపడుతున్నా డబ్బు సాయం చేయకుండా తనెలా తిరస్కరించిందీ గర్వంగా చెప్పిన తాతయ్యని ద్వేషించడం ప్రారంభించింది అప్పుడే.

తమ మధ్య వున్న సున్నితమైన బంధం తెగిపోయిన దుఃఖంతో యిక జీవితంలో పెళ్ళే చేసుకోనంది. అసలు ఇండియాకే తిరిగి రానంది.

మూడేళ్ళపాటు అదే పట్టుదలతో భీష్మించుకు కూచున్న కృషి ఇప్పుడు ఇండియాలో అడుగుపెట్టింది తాతయ్య అనారోగ్యం దృష్ట్యా అయినా యీ రోజు ఉపాధ్యాయ ప్రతిష్ట దెబ్బతినకూడదన్న ధ్యాసతో చౌదరిపై యుద్ధం ప్రకటించింది.

నిజానికి సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలని కాదు. . .

ఉపాధ్యాయ తన తాతయ్య అన్న భావం. . . డబ్బుని అధికారాన్ని ఆయన వారసురాలిగా పెంచుకున్న అటాచ్‌మెంట్.

ఒకవేళ ఉపాధ్యాయకి గుణగణాల్లోనూ ఆమె వారసురాలై వుంటే ఓ మామూలు స్థాయికి చెందిన విశ్వుతో స్నేహాన్ని పెంచుకునేది కాదు. అసలు అది స్నేహమేనా . . . పరిచయం ప్రారంభం ఎలా జరిగినా కాని అతడిమీద క్రమంగా ఆసక్తిని పెంచుకుంది?

గతం గాయం ఇంకా మానకనా. . .

లేక తాతయ్య నుంచి దక్కని అనుబంధం మరో రూపంలో వెతుక్కోవాలనా-

వెనక్కి తిరిగింది అడుగుల చప్పుడుతో.

డాక్టర్ మహంతి నిలబడి వున్నాడు- "కంగ్రాట్స్ కృషీ"

అసలు ఆ సమయంలో ఆయన అక్కడికి రావడం కృషికి నచ్చలేదు-

"పిల్ల కెరటంలా కనిపించిన కృషి చౌదరిని బలంగా దెబ్బతీసింది అంటూ మీ గ్రాండ్ పా నిన్ను తెగ మెచ్చుకుంటున్నాడమ్మా"

కళ్ళనుంచి జివ్వున నీళ్ళు తిరిగాయి.

అంతకన్నా తాతయ్య తనను అక్కున చేర్చుకుని గతాన్ని మరిచిపొమ్మని ఆప్యాయంగా అంటే చాలా ఆనందించేది.

అది చేతకాదు - ఆయన ఆనందించేది కార్పోరేట్ యుద్ధాల్లో గెలిచినప్పుడు తన ప్రతిష్ట దెబ్బతిననప్పుడు.

"మొత్తానికి నా మాటని నిలబెట్టావు కృషీ" క్షణం ఆగి అన్నాడు "తాతయ్యకి అండగా నిలబడ్డ నువ్వు పెళ్ళికూడా చేసుకుని సెటిలయితే మీ తాతయ్య కోరిక తీర్చినట్టవుతుంది. నువ్వు సరేనంటే- "

"అంకుల్" అర్థోక్తిగా ఖండించింది "అదితప్ప మనం మరేదన్నా మాట్లాడుకుందాం. మరోసారి ఇలాంటి చర్చవస్తే నేను జవాబు చెప్పేది ఇండియా నుంచి కాదు"

దుఃఖోద్విగ్నంగా అంది "నేను మనువరాల్ని అని కాక ఓ తెలివైన యంత్రాన్ని అని గ్రాండ్ పాకి బోధపడిందిగా. నన్ను అలాగే ఉపయోగించుకోమనండి. ఆయన సామ్రాజ్యాన్ని విస్తరించుకోటానికి వాడుకోమనండి - ఆయనకి కావాల్సింది అదేగా."

ఇక మాట్లాడేదేమీ లేనట్టు ఆవేశంగా లోపలికి నడిచింది.

అవాక్కయి చూశాడు డాక్టర్ మహంతి.

ఆ తర్వాతయినా కృషి మనశ్శాంతిగా వుండలేకపోయింది.

మొన్నటి జ్ఞాపకాలు యిందాక విశ్శు మాటలు మనసుని హోమగుండంగా మార్చి అసహనానికి గురిచేస్తుంటే బెడ్ పై నున్న ఓ ఫైలు అందుకుంది.

మరో వ్యాపకాన్ని సృష్టించుకున్నట్టుగా ఫైలు తెరిచి చూస్తుంటే ముందు కనిపించిందో రిపోర్టు.

సరిగ్గా ఏడాది క్రితం ఉపాధ్యాయ మెషిన్ టూల్ ఫ్యాక్టరీ కేంటిన్‌లో విషాహారం మూలంగా పాతికమంది దాకా అస్వస్థులు కావడం గురించి తయారు చేయబడిన నివేదిక అది. ఉపాధ్యాయని నేరస్థుడిగా నిలబెట్టిన సంఘటన అది. కేంటిన్ ఫుడ్ పాయిజన్ కలపడానికి తెరవెనుక వున్న చౌదరిగా నోట్ రాయబడి వుంది - అది రాసింది స్వయంగా ఉపాధ్యాయగారే.

చౌదరిని దోషిగా నిరూపించే అవకాశం లేకపోయినా తెలుసుకున్న ఆధారాల్ని కాన్ఫిడెన్షియల్‌గా పొందుపరిచారందులో.

ఒంటరితనం, వికలమైన మనస్సు ఎంత యిబ్బందిని కలిగించేదీ అర్థమౌతున్న క్షణాలవి-

అటు చౌదరి మరో అడుగు ముందుకేశాడు. విశ్శుని పావుగా కదిలించడం ద్వారా - దానికి కారణం తన మూలంగా చౌదరి పరపతికి జరిగిన నష్టం "The first Blow is half the battle" అన్న ఆలివర్ గోల్డ్‌స్మిత్ వాక్యంతో బాటు వ్రెజన్స్ అంటే సమక్షంలో వుండడం మాత్రమే కాదన్న మాల్కమౌపోబ్స్ సూక్తి కూడా గుర్తుకొచ్చింది. అందుకే గ్రాండ్ పాకి తన వునికి మరింత స్పష్టంగా తెలియచెప్పటానికన్నట్టుగా అదేరాత్రి ఫ్యాక్టరీ పర్సనల్ మేనేజర్‌కి ఫోన్ చేసింది.

చౌదరిపై మరో పథకానికి అంకురార్పణ జరిగింది. మరో అర గంటలో-

0 0 0 0

అర్థరాత్రి దాటి అరగంట కావస్తూంది.

దట్టమయిన చీకటిని చీల్చుకుని ఓ లారీ విజయవాడ రోడ్డుపై దూసుకు వెళుతూంది.

రెండు వేల లీటర్ల స్పిరిట్‌ని విజయవాడ తీసుకు వెళుతున్న ఆ 'టేంకర్'ని నడుపుతున్న డ్రైవర్ రామనాథచౌదరికి చెందిన సారా డిస్టలరీలోని ఉద్యోగి మాత్రమే గాక చౌదరి నేర ప్రపంచంలో ఎలాంటి దారుణాలనైనా చేయగల నేరస్థుడు కూడా.

గంటన్నర క్రితం సారా డిస్టిలరీ నుంచి బయలుదేరిన టేంకర్ నగర పొలిమేరల్లోని ఓ పంజాబీ డాబా దగ్గర ఆగింది. ఓ అరగంట - దూర ప్రయాణం చేసే లారీ డ్రైవర్లు పంజాబీ డాబాల దగ్గర ఆగడం అక్కడ లిక్కర్ సేవించి భోజనం చేశాక ఉత్సాహంగా గమ్యానికి బయలుదేరడం తరచూ జరిగేదే. అయితే డాబాలో మందుకొడుతున్న డ్రైవర్ యాదయ్యకి తెలీదు- అతడు తన పనిలో నిమగ్నమై వుండగా ఓ వ్యక్తి రహస్యంగా టేంకర్ పైకెక్కడం

టేంకర్ నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్ళిందో లేదో వేగంగా ఓ పోలీసు జీపు దాన్ని ఓవర్ టేక్ చేసుకుంటూ వెళ్ళి లారీ ముందు ఆగింది. . .

జరుగుతున్నదేమిటో యాదయ్యకి అర్ధమయ్యేలోగా ఎక్సైజు అధికారులు, పోలీసులు అతడ్ని కస్టడీలోకి తీసుకోవడమేగాక లారీని సీజ్ చేశారు.

అదే రాత్రి ఓ ప్రభుత్వ లేబరేటరీలో స్పిరిట్ విషపూరితమైందన్న నిజం నిర్ధారించబడింది. డిస్టిలరీపై రైడ్ జరిగడంతోబాటు డిస్టలరీ జనరల్ మేనేజర్ని అరెస్టు చేశారు.

తెల్లవారేసరికల్లా యీ వార్త దావాలనంలా పొక్కిపోయింది.

రామనాథచౌదరి కంపించిపోయాడు. నేరం ఎలా జరిగిందీ అన్న ఆలోచనగాని, నేరం నుంచి బయట పడడం అన్న సమస్య గురించి గాని అతడు భయపడలేదు కాని ఉదయం పది గంటలకల్లా తను స్పిరిట్ సప్లై చేసే ప్రముఖ మందుల కంపెనీల నుంచి ఆర్డర్సు కాన్సిల్ చేస్తూ ఫోన్ కాల్స్ అందుకున్నాడు.

ఎలా-

ఈ దారుణం జరిగింది ఎవరి మూలంగా-

రాత్రి పది గంటలదాకా ఆధారాలు సేకరించాలని ప్రయత్నించి విఫలమైన చౌదరి తన సిబ్బందిపై గావుకేకలు పెడుతుండగా ఫోన్ వచింది.

మళ్ళీ కృషి నుంచే-

“నేనే మిస్టర్ చౌదరీ” కృషి గొంతు ఎగతాళిగా వినిపించింది. “సరిగ్గా ఏడాది క్రితం మా గ్రాండ్‌ఫాదర్ మెషిన్‌టూల్ ఫ్యాక్టరీ కేంటిన్ ఫుడ్‌లో విషాన్ని కలిపించి మా తాతయ్యని నేరస్థుడిగా నిలబెట్టావని తెలిసి చిన్న ప్రయోగం చేసి నిన్ను మరోసారి చావుదెబ్బగొట్టాను. ఇంకో డిఫీట్. తట్టుకోలేకపోతున్నావా - పట్టించుకునేదాన్ని కాదేమో కాని పాపం విశ్నుని మళ్ళీ ప్రయోగించావుగా - తప్పనిసరయింది - అంతే చౌదరీ - నువ్వు పోరాటం ఆపనంతకాలం నేను పోరాడుతూనే వుంటాను” ఫోన్ క్రెడిల్ చేసింది కృషి.

ఏ డబ్బుని అస్త్రంగా వాడి మనుషుల్ని వినియోగించి చౌదరి అరాచకాల్ని సృష్టిస్తాడో అదే డబ్బుని ఆయుధంగా వాడిన కృషి, పర్సనల్ మేనేజరు శరత్ చంద్ర ద్వారా ఓ మనిషిని డబ్బుతో ఎంప్లాయ్ చేసింది. పకడ్బందీగా స్పిరిట్ లారీలో పాయిజన్ కలిపించి ఆ విషయాన్ని సీక్రెట్‌గా పోలీసులకి తెలియచేసింది.

ఇలాంటి నిస్సహాయ స్థితి ఒకటుంటుందని సోదాహరణంగా చౌదరికి తెలియచెప్పిన కృషి రిలాక్సయి ఏదో మేగజిన్ చదువబోతుండగా నౌకరు వచ్చాడు.

"విశ్వ అట. . .మీ కోసం వచ్చాడమ్మా"

ఉలిక్కిపడింది కృషి . . .

అప్పుడు గుర్తుకొచ్చింది ఒప్పందం అమలు చేయడనికి విశ్వ రాత్రి పదిగంటలకి వస్తానన్న విషయం. . .

ఆమె ఫాలభాగం స్వేదం పేరుకుంటుంటే లేచి నిలబడింది. . .

"మన ఒప్పందం ప్రకారం వెళ్ళాల్సింది మీ బెడ్ రూంలోకి" కృషి వెనుకే ఆమె పర్సనల్ చాంబర్‌లోకి నడుస్తున్న విశ్వ అన్నాడు ద్వారం దగ్గర నిలబడి.

"మిస్టర్ విశ్వనాథ్" జుగుప్సగా చూసింది. రోషం, ఉద్వేగం, క్రోధం చుట్టు ముడుతుంటే "నేనెవర్ననుకుంటున్నావ్" సాధికారంగా ప్రశ్నించింది.

ఎగతాళిగా నవ్వాడు. అతడి చూపుల్లో వ్య క్తమవుతున్నది కాంక్షో లేక కారణం లేని ప్రతీకారమో ఆమెకీ అర్థం కావడం లేదు.

"నువ్వో విశ్వ సౌందర్యాన్ని సవాల్ చేసే పాల పుంతవైన సింధూరాంబరం నుంచి రసాతలం దాకా విస్తరించిన ప్రకృతిలా ఏ భంగిమలో నైనా చూడదగ్గ పొంకం గల గంధర్వ కన్య వైనా యిప్పుడు నాకు లొంగిపోవాల్సినదానివి. . . ఒక రాత్రి సుఖం కోసం నీ కన్యత్వాన్ని అర్పించాల్సిన దానివి. . . అవునా."

అది ఆందోళన కాదు. భగ్గుమంటున్న మస్తిష్కంలో బాధాకరంగా రేగుతున్న ఆరాటం. నౌకర్లని పిలిచి అతడ్ని బయటికి సాగనంపే ప్రయత్నానికింకా తను సిద్ధపడలేకపోతూందేం. . . ఒప్పందంగా నోరు జారిన పాపానికే ఇదంతా తాను భరిస్తూందా. . .

"కామాంచ యౌవనే. . ." రెండడుగులు ముందుకు నడిచి ఆమె కటి భాగాన్నో లేక నైటీ వెనుక వివృత దిగంత ద్వారాల్నో నవలోక ప్రాకారాల్నో ఊహించుకుంటూ స్వప్నంలోలా అన్నాడు "యవ్వనంలో వున్నప్పుడే విద్యతోబాటు కామాన్నీ సేవించి తీరాలంటాడు వాత్స్యాయనుడు. . . పైగా తామరమొగ్గలా సుతిమెత్తగా వుండేది- పువ్వులాంటి నాసిక గలది-సంపంగి కలువల శరీరఛాయతో శోభిల్లుతూ కాదంటూనే ప్రియుడ్ని రా రమ్మనేది పద్మినీ జాతి స్త్రీ అని నీలాంటి అమ్మాయి గురించి అద్భుతంగా నిర్వచించేడు కూడా."

లిప్తలు గడ్డ కట్టుకుపోతుంటే ఉద్రేకాన్ని నిభాయించుకోటానికి ఆమె విశ్వప్రయత్నం చేస్తూంది.

"తనూలత" మరింత ముందుకొచ్చాడు.

"లతవంటి తనువు గలది అని కదూ. . .ఉపమానోత్తర పదకర్మధారయం. సమాసం కరెక్టో కాదో నాకు తెలీదు. కాని ఒకనాడు యీ పదానికి అర్థం తెలీకపోయినా నిన్ను చూస్తే నిజమనిపించింది కృషీ. . . కమాన్. ఇంకా ఆలస్యం దేనికి"

పిండుకోవాల్సిన ఉషస్సు గురించి గుర్తు చేస్తున్నాడు.

నిశ్చలంగా చూసింది. నిర్వేదంగా అతడ్ని గమనించింది.

ఒక కార్యసాధన కోసం ఆ రోజు అంత గాయపడీ గాయాన్ని గోప్యంగా వుంచి చివరిదాకా పోరాడిన విశ్నుని గుర్తుచేసుకుంటూ అంది. “నిజమే - ఒకనాడు అసంకల్పితంగా నువ్వన్న ఒప్పందానికిని నేను అంగీకరించాను - ఏ దురదృష్టకరమయిన క్షణంలో నేను సరేనన్నానో కాని యిప్పుడు నేను అన్లేదని బుకాయించను - జ్ఞానం తెలిసాక ఏ మగాడికీ అలాంటి అవకాశం కాదు- అలా మాట్లాడే అవకాశమే యివ్వని నేను నీ విషయంలో ఎవరో మంత్రించినట్టు మూగదాన్నయినా ఓ సభ్యతగల మగాడిగా నువ్వు రియాక్టవుతావనుకున్నాను. నోరు జారేక యిలా ఆలోచించడం నేరమే అని నాకూ తెలుసు. కాని నీ గెలుపు మనసారా కోరుకున్న నేను నువ్వు గెలిచావని నిరూపించేదాకా అవిశ్రాంతంగా పోరాడాను. ఆ తర్వాతనైనా నీ అభిమానానికి పాత్రురాలినవుతానని ఎదురు చూశాను.”

“నన్ను గెలిపించింది రాజేష్‌తో నువ్వు ఓడిపోకూడదని. . .కాని నన్ను పోటీకే రాకుండా ఆపాలని ప్రయత్నించింది నీ మీద నేను గెలవకూడదని.”

“నో” ఆవేశంగా అరిచింది “నిన్ను ఆపాలని గూండాల్ని ప్రయోగించింది నేను కాదు. నువ్వు పొరపడుతున్నావ్”

“నీకు కాక మరెవరికి అంత అవసరం వుంటుంది”

“తన కొడుకు ఓడిపోకూడదని చౌదరియే ఆ పని చేయించి వుండొచ్చుగా”

“నేను గెలిస్తే ఎక్కువగా నష్టపోయేది నువ్వు కృషీ.” అర్థం చేసుకోడేం-

నిర్లక్ష్యంగా అన్నాడు “నిజానికి నేను కావాలీ అనుకుంటే పోలీసులకి చిక్కిన క్రిమినల్ చేత దోషులెవరో చెప్పించడం కష్టం కాదు కృషి- కాని అక్కడా నీ డబ్బు నన్ను ఓడిస్తుందేమో అన్న అనుమానంతో నీకు తిరుగులేని బుద్ధి చెప్పాలని మన ఒప్పందం అమలుచేయడానికి ఇలా వచ్చాను.”

నిర్లిప్తంగా చూసింది. అంతకుమించి అర్థం లేని అతడి తర్కానికి జాలి పడింది. “ఓ మగాడిగా నా మీద గెలుపు కోసం మాత్రమే ఆలోచించే నిన్ను చూసి ఆ రోజు గెలిపించడానికి నేను పడ్డ శ్రమకిప్పుడు బాధపడుతున్నాను విశ్వనాథ్. డబ్బున్న వాళ్ళ గురించి నీకింత నీచమయిన అభిప్రాయం ఎందుకేర్పడినా గాని యీ క్షణంలో నేను చెప్పాలనుకున్నది ఒక్కటే - నువ్వు కోరుకుంటున్నది క్షణికానందం - డబ్బుకోసం ఏదన్నా చేయగల మనిషిగా నాకు పరిచయమయిన నువ్వు యిప్పుడు డబ్బు కన్నా యీ సుఖాన్నే ఎందుకిష్టపడుతున్నావో నాకు తోచడం లేదు - నిజం విశ్వనాథ్ - దానికి బదులు పది లక్షలు చెల్లించమంటే నీ వ్యక్తిత్వాన్ని గౌరవించేదాన్ని. అసలు ఒక్కరాత్రి సుఖంతో నువ్వు పొందే ఆనందం కండరాల రాపిడేగా- నైతిక విలువల్ని నీలాగే మరిచిపోతే అది నాకూ పెద్ద విషయం కాదుగా . . . వందరూపాయలు పారేస్తే ఏ వేశ్య దగ్గరయినా దొరికేదేగా. . . అందులోనూ ఉన్నింటి ఆడపిల్ల మీద యిలాంటి విజయాన్ని కోరుకోవడమే నీ ధ్యేయమైతే.”

.ఇంకా మానని గాయాల ప్రేరణతో ఆమె మీద కసి తీర్చుకోవడం.

"చాలా చెప్పి శ్రమ పడ్డావ్ కృషి. . . ఇక చాలు . . . నీ మాటల చాతుర్యాన్ని నీ మేధస్సుని ప్రదర్శించక మన ఒప్పందం సంగతి మాట్లాడు."

తను అనాలోచితంగా ఇంతకాలం వెంటపడింది సముద్రాన్ని కాదు ఓ మామూలు నీటి చలమనని బోధపడిందామెకు.

"అంగీకరించకపోతే" భావరహితంగా చూసింది కృషి "నీ దగ్గరున్న టేప్‌ని పత్రికల దాకా వినిపిస్తానంటావ్."

"గుడ్. . . గుర్తుందిగా."

"కాని ఆ చిన్న సాక్ష్యంతో నన్ను నువ్వు బెదిరించలేవని నువ్వు గుర్తుంచుకోవడం బెటర్ విశ్వనాథ్"

"అంటే మాట తప్పటానికి సిద్ధపడతానంటావ్"

క్షణం పాటు నిర్లిప్తంగా చూసింది. "మన మధ్య ఒప్పందమేమిటి" ఖచ్చితంగా చెప్పగలవా"

ప్రశ్నలో ఔచిత్యం అర్థంకాక నివ్వెరపోయాడు విశ్వ. "నేను ఓడితే మీ ఇంట్లో వాచ్‌మెన్‌గా పనిచేయాలి. కాని నువ్వు ఓడితే ఓ రాత్రి నువ్వు నాతో గడపాలి."

"అంతేగా"

"యస్"

"గడుపుతాను ఇప్పుడు కాదు."

"ఎప్పుడు"

"నాకు తోచినప్పుడు" నిర్లక్ష్యంగా అంది కృషి.

"అంతే విశ్వ. . .గడపాల్సింది ఎప్పుడో ఏ రాత్రో ఖచ్చితంగా మనం అనుకోలేదుగా"

తెల్లబోయాడు విశ్వ.

ఆమె మీద పెంచుకున్న కసితో ప్రతీకారం తీసుకోవాలని వచ్చిన విశ్వ ఇప్పుడు ఈ తర్కానికి వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. "తెలివితేటలు ప్రదర్శించకు కృషి"

"ఇట్స్ మై మైండ్ పవర్ మిస్టర్ విశ్వ. . .ఏం. . . నేను అన్నదాంట్లో తప్పుందా. అసలు నేను కాదంటేగా."

"నీ ఇష్టమొచ్చినప్పుడు గడుపుతాననడం కాదనడమేగా."

"అది కాదనడం కాదు విశ్వా. . . అవునంటూనే నిన్ను నీరు కార్పించడం... యస్ నేను నీతో గడుపుతాను. ఎప్పుడో తెలుసా. నాకు ఎనభై యేళ్ళు వయసొచ్చాక ప్రామిస్"

ఆవేశంగా ముందుకు రాబోయాడు

"ఆగు మిస్టర్ విశ్వా - హద్దులు మరిచి ప్రవర్తిస్తే నా స్థాయి ఏమిటీ అన్నది నేను ఖచ్చితంగా నిరూపించాల్సి వస్తుంది."

విశ్వ పిడికిళ్ళు బిగుసుకున్నాయి “తెలివిగా తప్పించుకున్నావ్ కృషి”

“యస్.. . నాకు డబ్బు మాత్రమే కాదు తెలివీ వుందని నువ్వు గ్రహించితే బెటరు.”

“నీ డబ్బునీ తెలివినీ కలిపి మరీ ఓడించగలిగే తెలివి నా దగ్గరావుంది  కృషి - ఆ విషయం నీకు త్వరలోనే తెలియచెబుతాను”

“నువ్వు ఓడించడానికి నేను మామూలు జికెబుక్ చదివి పోటీకి సిద్ధపడే రాజేష్‌ని కాను.”

“అలాగా” వ్యంగ్యంగా అన్నాడు.

“ఏం. . అనుమానమా”

“నిరూపించుకోగలవా”

రెప్పలార్పకుండా చూసింది “నిన్ను నువ్వు చాలా ఎక్కువగా అంచనా వేసుకుంటున్నావ్ కదూ”

“కబుర్లు చెప్పడం కాదు కృషి ” నిశ్చలంగా అన్నాడు. “దమ్ముంటే వేదిక మీద నా ముందు నిలబడి పోటీకి సిద్ధంకా”

“నేను చాలా ఖరీదైన ఆడపిల్లని”

“ఖరీదు నిర్ణయించేది కాల్‌గర్ల్స్.”

కృషి కోపం తెచ్చుకోలేదు. “నా గురించి నువ్వలా నీచంగా ఆలోచించినా నాకు అభ్యంతరం లేదు. మిస్టర్ విశ్వనాథ్  కాల్‌గర్ల్స్‌క్కూడా వేర్వేరు స్థాయిలు వుంటాయనుకుంటా కదూ కాబట్టే ఇప్పుడు పందేనికి ఎన్ని లక్షలు పెట్టుబడి పెడతావని అడుగుతున్నాను.”

“నేను గెలిస్తే నీ నుంచి కోరేది డబ్బుకాదు.”

“మరి”

“నీతో ఓ రాత్రి సుఖం. స్పష్టంగా విను.. . నేను ఏ రాత్రికావాలీ అంటే ఆ రాత్రి నువ్వు నాతో గడపాలి. గడపడమూ అంటే తోడు వుండడమేగా అంటూ లాజిక్ ప్రదర్శించకు - గడపడమూ అంటే నాతో సెక్స్ సుఖానికి అంగీకరించడం”

కృషి మొహం జేవురించిపోయింది.

“ఏం కంగారుగా వుందా”

“లేదు విశ్వ - చాలా ఖరీదైన కోర్కెకి సిద్ధపడ్డావు. కాబట్టి నేను నీతో క్విజ్ కాంపిటేషన్‌లో ఓడితే నువ్వడిగిన దానికి సరేనంటున్నాను. మరి నువ్వోడితే ఏం చెల్లిస్తావు అని అడుగుతున్నాను”

“వాచ్‌మెన్‌గా వుండమన్నావుగా”

“కేరెక్టర్ లేనివాడు వాచ్‌మెన్‌గా వుండటానికిని నేనిష్టపడను విశ్వా. . .” క్షణం ఆగి అంది. “నువ్వోడితే నాకు అయిదు లక్షలివ్వాలి.”

ఉలిక్కిపడ్డాడు.

“ఏం. . కంగారుగా వుందా” అతడను మాట అతడికే అప్పచెప్పింది. “నా డబ్బు మీద

నా తెలివి మీదనే గాక నా శరీరం మీద కూడా గెలుపు కోరుకుంటున్నావుగా. చెప్పు. అయిదు లక్షలు పెట్టుబడి పెట్టగలవా. కష్టమనుకుంటా కదూ. మోసం చేసి వందా వెయ్యీ సంపాదించే నీకు అంత డబ్బు కూర్చుకోవడం!”

“మిస్ కృషి” అహం దెబ్బతిన్నట్టుగా చూశాడు “మైండ్ పవర్ - అదే మేధస్సు నీ ఒక్కదాని సొత్తే కాదుగా - నీ షరతులకి నేను అంగీకరిస్తున్నాను”

“మరోసారి ఆలోచించు”

“ఆలోచించాల్సిన అగత్యం లేదు.”

“అయితే ఈ నెల పదిహేనో తేదీన అంటే సరిగ్గా పది రోజుల్లో మనం కాంపిటీషన్‌కి సిద్ధ పడుతున్నాం. ఓ.కె.”

“సరే”

“తర్వాత యిస్తాననడం కాదు. పోటీకి ముందే అయిదు లక్షల చెక్కు క్విజ్ మాస్టర్‌కి ఇవ్వాలి” స్పష్టం చేసింది.

వెళ్ళిపోయాడు విశ్వ-

అప్పటికి సమస్య నుంచి తెలివిగా గట్టెక్కడమే గాక ఇక ముందు సైతం తనతో పోరాటానికి సిద్ధపడకుండా జాగ్రత్తపడ్డాననుకున్న కృషి పొరపాటు పడిందిక్కడే. . .

విశ్వ సరాసరి రామనాథ చౌదరి దగ్గరికి వెళ్ళాడు.

ఓ శత్రువుకి శత్రువు స్నేహితుడవుతాడన్న తర్కాన్ని నమ్మిన విశ్వని నిరుత్సాహపరచలేదు చౌదరి-

ప్రతిష్ట పరపతి అనే జోడు గుర్రాలపై స్వారీ చేసే ఉపాధ్యాయకి ఒక్కగానొక్క వారసురాలైన కృషిని శరీరం పెట్టుబడి పెట్టమనడం స్థాయికి దిగజార్చగలిగిన విశ్వ అటే చాలా గౌరవం ఏర్పడింది.

“నా సంగతి అటుంచి” అయిదు లక్షల్ని పెట్టుబడిగా అడిగిన విశ్వ గురించి మరింత తెలుసుకోవాలన్నట్టుగా అడిగాడు చౌదరి “నీకు కృషి మీద ఇంట్రస్టేమిటి”

ఉలిక్కిపడ్డాడు విశ్వ.

కేవలం తనకే పరిమితం కావాల్సిన ఓ నిజాన్ని ఇంతకాలం తర్వాత చౌదరి తెలుసుకోవాలనుకుంటున్నాడు “ఇంట్రస్టు కాదు చౌదరిగారూ - పగ. . .”

దిగ్భ్రాంతిగా చూశాడు చౌదరి కొత్త విషయం వింటున్నాట్టుగా.

“అవును. . . నేను కృషితో పరిచయం పెట్టుకున్నది నా పగ సాధించడనికే చౌదరిగారూ.... చనిపోయిన నా తండ్రి, పిచ్చిదైన నా తల్లి నాకు ప్రేరణ అందిస్తుంటే చదువుతున్న చదువుని మధ్యలో ఆపి వెనక్కి వచ్చేశాను. నా కుటుంబం ఇలా చిన్నాభిన్నం కావటానికి ఉపాధ్యాయ కారణమని తెలిసి తెలివిగా ఆ కుటుంబంలో అడుగుపెట్టాలని మరో మార్గంలేక కృషితో వితండా పరిచయాన్ని ప్రారంభించాను”

"ఎంతవరకూ చదివావు"

"పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పిహెచ్ డి చేస్తూ మధ్యలో ఆపేశాను."

ఆ మాట వింటూనే చౌదరికి చెమట పట్టింది. తనముందు నిలబడ్డ వ్యక్తి సామాన్యుడు కాదని తెలిసిన తొలి క్షణమది. . .పోరాటానికి ఆయుధాలు, వాటిని సమకూర్చుకోవటానికి డబ్బు అవసరమనిపించి ఈ మార్గంలో అడుగు పెట్టాడు కాని విశ్వ సామాన్యుడు కాడు . . . ఉపాధ్యాయ కుటుంబంలో అడుగుపెట్టి ఆ కుటుంబాన్ని సర్వనాశనం చేయగల సమర్థుడు. అది సాధ్యం కాకపోతే ఏ ఐ.ఏ.యస్సో పాసై కలెక్టరు కాదగ్గవాడు. తనకి కలెక్టర్ల సాహచర్యం అవసరం లేదు. తెలివైన నేరస్తుడు కావాలి.

"నీ కుటుంబం చిన్నాభిన్నం కావడమంటే" అడిగాడు చౌదరి.

"ఉపాద్యాయ ఫ్యాక్టరీలో యూనియన్ లీడర్‌గా వుంటూ హత్య చేయబడ్డాడు నా తండ్రి".

"పేరు"

"మోహన్‌గాంధీ"

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు చౌదరి.

నిరాహారదీక్ష శిబిరంలో కూర్చుని హత్య చేయబడ్డ మోహన్‌గాంధి కొడుకు విశ్వ...

నుదుట పట్టిన చెమటని తుడుచుకుంటూ అన్నాడు "నీ పట్టుదలని అభినందిస్తున్నాను విశ్వా. నీకు పెట్టుబడిగా ఐదు లక్షలు నేనిస్తాను."

క్షణం ఆగి అన్నాడు విశ్వ "ఒకవేళ నేను ఓడితే. . ."

"నువ్వు తీర్చనక్కరలేదు విశ్వా" సాలోచనగా అన్నాడు ఆయన. "ఒక నిజాయితీ పరుడయిన వ్యక్తికి కొడుకువైన నువ్వు ఓడే ప్రసక్తిలేదు విశ్వా. ఒకవేళ ఓడావనుకో డబ్బుకి బదులు నువ్వేం చేయాలో నేను చెబుతాగా."

హామీ యిచ్చి పంపిన ఆయన ప్రశాంతంగా నవ్వుకున్నాడు.

లేనివాడికి పేదరికమే శత్రువైతే, ఉన్నవాడికి ప్రతి పేదవాడూ శత్రువే. . . అందులోనూ పగతోబాటు తెలివీ వున్నవాడు ప్రత్యర్థి ఐతే ఇక ఆ పోరాటం చూడ ముచ్చటగా వుంటుంది.

నిన్నగాక మొన్న కృషి గెలుపుతో గాయపడివున్న చౌదరి పెదవులకి అంటుకున్న రక్తాన్ని నాలుకతో నాకే పులిలా క్షణం రిలాక్సయి ఆ తర్వాత కృషికి ఫోను చేశాడు.

"హల్లో" కృషి కంఠం వినిపించింది.

"నేనే" నవ్వేడు చౌదరి తోడేలులా. "మరేం లేదు కృషీ. . . ప్రతిసారీ నువ్వు ఫోను చెయ్యడం నచ్చక ఈ సారి నేనే ముందు శ్రద్ధ తీసుకున్నాను."

"చెప్పు"

"నీ మీద యుద్ధం ప్రకటించిన విశ్వకి నేను పెట్టుబడిగా డబ్బివ్వబోతున్నాను."

క్షణం ఆగి అంది ఆమె. "అంటే మరోసారి ఓడిపోతున్నావన్నమాట"

"ఓడినా ఈ సారి నేనే గెలుస్తాను కృషీ" నిగూఢంగా అన్నాడు.

"నీ మీద నీ కెంత నమ్మకం!"

"నమ్మకమంటూ లేకపోతే యుద్ధభూమిలో అడుగు పెట్టలేము. పైగా నా తోక తొక్కావుగా. . . కాటుకి సిద్ధంగా వుండు" ఆయన ఫోను క్రెడిల్ చేశాక కొన్ని క్షణాలదాకా తేరుకోలేకపోయింది.

విశ్వా పూర్తిగా చౌదరి మనిషైపోతున్నాడు.

ఎందుకు ఇంత మొండితనాన్ని ప్రదర్శిస్తున్నాగాని నేర ప్రపంచంలో కూరుకు పోతున్నాడు.

ఇక పోటీ తప్పదని తెలీడంతో ప్రిపరేషన్ ప్రారంభించింది కృషి ఆ రాత్రే. . .

ఓటమి కన్నా ఇలా ఓడిపోవడం ఆమెకు నచ్చని విషయం.

ఆ మరుసటి రోజు ఉదయమే ఇంగ్లీషు డైలీలో ఓ అనౌన్స్‌మెంటు వచ్చింది

కాకతాళీయంగా.

మొత్తం పేజంతా ఆక్రమించిన ఆ అనౌన్స్‌మెంట్ చౌదరీ లేబరేటరీస్ పబ్లిక్ ఇష్యూకి సంబంధించింది.

అక్కడ చౌదరి అనే పేరే కనిపించి వుండకపోతే కేజువల్‌గా పేజి మరల్చేదే. . .

ఆసక్తిగా ప్రమోటర్స్ వివరాలు చదివింది. ఆమె అంచనా తప్పు కాలేదు. ప్రమోటర్స్ లిస్టులో మొదటి పేరు రామనాథ చౌదరీదే. సుమారు కోటిన్నర ఈక్విటీ షేర్స్ అమ్మకం కోసం షేర్ హోల్డర్స్‌గా ప్రజల్ని ఆహ్వానిస్తూ వారం రోజుల్లో ఇష్యు క్లోజవుతుందని వివరించబడి ఉంది.

ఇష్యూ హైలెట్స్‌ని ఏకాగ్రతగా చదివింది.

A SENSATIONAL INNOVATION OF "PROCALCIATE"

స్త్రీల మెనుస్ట్రేషన్ పీరియడ్‌లో కడుపునొప్పి మానసిక వైకల్యాన్ని నివారించడానికి ఉపయోగించే కాల్షియం డ్రగ్ PROCALCIATE. . .ఇంకా చాలా వివరాలున్నాయి. అన్నింటికన్నా ఆమెను అమితంగా ఆకట్టుకున్న విషయం చౌదరి లేబరేటరీస్‌లో తయారయ్యే PROCALCIATE నూరుపాళ్ళు అమెరికా ఎగుమతికి నిర్ధేశించబడినది.

చౌదరి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించి మరో ఆరు నెలల్లో అరుదయిన ప్రోడక్ట్‌తో మార్కెట్‌లో అడుగుపెడుతున్నాడు.

ప్రత్యర్థి విషయంలో అవసరానికి మించిన శ్రద్ధ చూపించడం వ్యాపార లక్షణం ఒక్కటే కాదు యుద్ధనీతి కూడా . . .

ప్రభుత్వంలో చాలా పలుకుబడి గల చౌదర్ని మాత్రమే గాక అలాంటి వాడికి కొమ్ము కాసే ప్రభుత్వ చిత్తశుద్ధినీ శంకిస్తున్నట్టుగా వెంటనే న్యూయార్క్‌కి ఫోన్ చేసింది.

తన మిత్రుడు న్యూ డీల్ కన్సల్టెన్సీ అధిపతి మిస్టర్ సీగల్ లైన్‌లోకి వచ్చాడు.

" కృషి ఫ్రం ఇండియా. . ."

"వాటే సర్‌ప్రయిజ్. . . అమెరికాని మరిచిపోయారు" సీగల్ అభిమానాన్ని ప్రకటించాడు.

"మరిచిపోతే మీకు ఫోను చేసేదాన్ని కాదు మిస్టర్ సీగల్" క్షణం ఆగి అంది "మీరో సహాయం చెయ్యాలి"

"ఆదేశించు మిస్ కృషీ"

"ఇండియా నుంచి ఫార్మాస్యూటికల్స్‌ని మీ కంట్రీ దిగుమతి చేసుకోవాలీ అంటే మీ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ లైసెన్సు కావాలిగా" చౌదరి లేబ్స్ వివరాలు తెలియజేసి "మీ FDA లైసెన్సు ఇచ్చిందో లేదో కనుక్కొని తెలియచేయగలరా. . ."

"మా ఎఫ్‌డియె పొలిటికల్లీ మోటివేటెట్ బాడీ కాబట్టి లైసెన్సు సంపాదించడం కష్టం కాదు. . . ఎనీ హౌ తెలుసుకొని చెబుతాను."

"మరో గంటన్నరలో న్యూయార్క్ నుంచి ఫోను చేస్తాడు సీగల్. "యూ ఆర్ రైట్ మిస్ కృషి చౌదరీ లేబరేటర్స్ వాళ్ళు లైసెన్సు కోసం అప్లయ్ చేసారు తప్ప ఇంకా లైసెన్సు పొందలేదు. . ."

అంతే. . .

ఆమె పిడికిలి బిగుసుకుంది. . .

రామనాథచౌదరి ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తులు కోట్ల మంది ప్రజల్ని మోసగించడానికి సిద్ధపడ్డాడు - లేనిది వుందని భ్రమింపచేస్తూ. . .

చేతికి చిక్కిన ఓ మారణాయుధాన్ని సంధించడనికి సిద్ధమైంది కృషి.

కేవలం ఇరవై నాలుగంటల వ్యవధిలో. . .

ఇంకా పాతికేళ్ళ వయసైనా లేని కృషి ఎలాంటి సంచలనానికి కారణమైందీ అంటే చౌదరీ లేబరేటరీస్ పబ్లిక్ ఇష్యూ నిజాయితీ శంకించకూడదూ అంటే అమెరికా దేశానికి చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ లైసెన్స్ వుందో లేదో స్పష్టం చేయాలని.

పత్రికా ముఖంగా రామనాథచౌదరిని ఛాలెంజ్ చేసింది ఒక కోటీశ్వరుడి మనుమరాలు ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ కావడంతో మొత్తం పత్రికలు కవర్ చేసాయా వార్తని. . . తేలు కుట్టిన దొంగలా వుండిపోయాడు రమనాథచౌదరి.

పత్రికల్లో వచ్చిన వార్తకి కంపెనీ ప్రమోటర్స్ ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వకపోవడంతో షేర్స్ కోసం అప్లయి చేయబోయిన జనం వెనక్కి తగ్గడమే గాక కొందరు స్టాక్ ఎక్స్ఛేంజ్ బ్రోకర్సు న్యాయబద్ధమైన జవాబు నర్థిస్తూ కోర్టుకి వెళ్ళారు. . .స్టే ఇవ్వబడింది ఇష్యూ పై.

మరుసటి రోజు లోక్‌సభలో ఫైనాన్స్ మినిస్టర్ని ఇదే విషయంపై నిలదీశారు ప్రతిపక్ష సభ్యులు. . . ఈ మధ్య కాలంలో దేశాన్ని అట్టుడికించిన స్కామ్స్ గురించి, బ్యూరో క్రాట్స్ వైఫల్యం గురించి ఉటంకిస్తూ ఇలాంటి విషయాల్ని తరచి చూడాల్సిన SECURITIES AND EXCHANGE BOARD OF INDIA చైర్మన్ మీద చర్య తీసుకోవాలని కేకలు పెట్టారు.

జరిగిన తప్పిదాన్ని అంగీకరించాడు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి. . . అంతే గాకుండా FDA లైసెన్స్ కోసం అప్లయ్ చేయుటమే జరిగింది తప్ప చౌదరీ లేబ్స్ యింకా లైసెన్సు పొందలేదని తెలియచేస్తూ ఆ కంపెనీ మీద చర్యతో బాటు ప్రభుత్వంలో వారికి సహకరించిన అధికారుల్నీ శిక్షించడం జరుగుతుందని హామీ యిచ్చాడు. . దేశం మొత్తం చర్చించుకున్న సమస్య ఇది.

కృషి దెబ్బకి కంపించిపోయాడు చౌదరి. అది కాదు, కోట్లనష్టంతో ఆడదాన్ని చిన్న చూపు చూడకూడదన్న సత్యాన్ని తెలుసుకున్న తొలి అనుభవమది.

0 0 0 0

ఏప్రిల్ పదిహేనో తేదీ

సాయంకాలం ఆరుగంటలు కావస్తూంది.

యూనివర్శిటీ ఆడిటోరియం విద్యార్థులూ, పత్రికా విలేకర్లతో సందడిగా వుంది.

ఒక అరుదైన పోటీని తిలకించాలనే సంకల్పంతో నగర ప్రజలూ ఆరోజు అక్కడికి చేరుకున్నారు.

“డియర్ ఫ్రెండ్స్ ” ఢిల్లీ నుంచి క్విజ్ మాస్టరుగా వచ్చిన సత్యేంద్రబసు ప్రేక్షకుల్ని చూస్తూ అన్నాడు “దిసీజె రేర్ అండ్ ఇంట్రెస్టింగ్ కాంపిటీషన్. . .ఇందులో పార్టిసిపేట్ చేస్తున్న ఇద్దరిలో ఒకరైన మిస్ కృషి పుట్టింది కోటీశ్వరుల వంశంలో, పెరిగింది చదివింది స్టేట్స్‌లో. . . రెండో వ్యక్తి మిస్టర్ విశ్వనాథ్. . . ఇక్కడ క్విజ్ కాంపిటీషన్స్‌లో తరచుగా పార్టిసిపేట్ చేసే వ్యక్తి. . నౌ” వేదికపై కూర్చున్న ఇద్దరు పార్టిసిపెంట్స్‌తో అన్నాడు

“సరిగ్గా మరో ఐదు నిముషాల్లో అంటే ఆరుగంటల పదిహేను నిముషాలకి పోటీ ప్రారంభమవుతుంది పోటీ గడువు అరవై నిముషాలు. . . ప్రశ్న అడిగేక జవాబు చెప్పడానికి యివ్వబడే గడువు పది సెకండ్లు మాత్రమే. ముందుగా ప్రశ్నలు అడిగేది మిస్ కృషి.

కృషి వెంటనే జోక్యం చేసుకుంది “లేడీస్ ఫస్టన్న సూత్రాన్ని మీరు ఫాలో అవ్వనక్కరలేదు. కావాలంటే విశ్వనాథ్‌నే ప్రారంభించమనండి.”

అప్పటికే అయిదు లక్షల రూపాయల చెక్కుని సత్యేంద్రబసు కిచ్చిన విశ్వు అవహేళనగా అన్నాడు “క్విజ్ కాంపిటీషన్స్ అంటే అనుభవం లేని మిస్ కృషి ప్రారంభించడమే న్యాయమనుకుంటాను.”

ఇక్కడ విశ్వు కావాలని జాలి ప్రదర్శిస్తున్నట్టు మాట్లాడ్డం ఆమెకు నచ్చలేదు.

ఓ కాయిన్ గాలిలోకి ఎగరవేయబోతూ సత్యేంద్ర చూశాడు కృషి వేపు. “టాస్ ” అందామె.

“హెడ్” అన్నాడు విశ్వు తనకున్నది ‘హెడ్’ అన్న భావంతో వ్యంగ్యంగా తన తలవేపు వేలిని చూపిస్తూ.

ఆడిటోరియంలో కలకలం మొదలయింది.

‘హెడ్’ అన్నాడు సత్యేంద్రబసు కాయిన్ ఎగరేశాక ఫలితాన్ని నిర్ధారిస్తూ. “ఇప్పుడు పోటీ ప్రారంభించాల్సింది మిస్టర్ విశ్వనాథ్” తన చైర్‌లో కూర్చుంటూ “అరగంట గడువులో మీరు అడగాల్సింది సరిగ్గా ఇరవై అయిదు ప్రశ్నలు . . . ప్రశ్న అడగ్గానే పది సెకండ్ల లోగా జవాబు రానపుడు మీరే జవాబు చెప్పేయాలి. ఒక్కో జవాబుకి పది మార్కులు. అరగంట తర్వాత మిస్ కృషి ఎంత స్కోర్ చేసిందీ చెబుతాను” రిస్టువాచ్ చూసుకుంటూ “స్టార్ట్ ” అన్నాడు.

రెండు సెకండ్ల విరామం. . .

తనకున్న మైండ్ పవర్ గురించి చాలా ధీమాని వ్యక్తం చేసిన కృషిని మొత్తం ఆ సబ్జక్టులోనే ప్రశ్నలడిగి కంగారు పెట్టాలనిపించిందేమో గొంతు సవరించుకుంటూ ప్రారంభించాడు విశ్వు.

"మిస్ కృషి - అమెరికాకి చెందిన మొదటి ప్రామినెంట్ సైకాలజిస్ట్ ఎవరు. అతడు సైకాలజీపై మొదట రాసిన గ్రంథమేది"

"విలియమ్ జేమ్స్. . . 1890 లో సైకాలజీ గురించి అతడు రాసిన గ్రంథం పేరు ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ సైకాలజీ"

"సంగీతం మెదడుపై కలిగించే రసాయనిక ప్రభావం ఏమిటి"

"స్టేన్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన ఫార్మకాలజిస్ట్ డాక్టర్ అవ్రమ్‌గోల్డు స్టిన్ థియరీ ప్రకారం యిష్టమైన సంగీతం విన్నప్పుడు మెదడు ఎండోర్ఫిన్స్‌వంటి రసాయనాన్ని విడుదల చేసి, ఆనందదాయకమైన ఆలోచనల్ని రేపుతుంది."

"రైట్. . . ఒకప్పటి సినీ నటుడైన మాజీ అమెరికా ప్రెసిడెంటు రోనాల్డ్ రీగన్‌పై ఓ సినిమా ప్రభావంతో ఒక వ్యక్తి తుపాకీ పేల్చి గాయపరిచాడు. ఆ వ్యక్తిపేరు, ఆ సినిమా పేరు చెప్పండి"

"1981 మార్చి ముప్పయ్యో తేదీన రీగన్ గుండెల్లోకి బుల్లెట్‌ని షూట్ చేసిన ఆ వ్యక్తి పేరు జాన్ హింక్లే. ఆ వ్యక్తిని ప్రభావితం చేసిన ఏంటీ హీరో పాత్ర వున్న ఆ సినిమా పేరు టాక్సీ డ్రైవర్."

"రైట్. . . పసికందు పుట్టుకలో ముందు తలమాత్రమే ఎందుకు వస్తుంది."

"గ్రేవిటేషనల్ ఫోర్స్" టక్కున చెప్పింది కృషి "గర్భంలో వున్న బిడ్డ తల బరువు మిగతా భాగాల కన్నా ఎక్కువ వుండటంతోనూ మొత్తం పొడవులో తల నాలోగో వంతు ఆక్రమించడంతోనూ ప్రసవంలో ముందు తలే బయటికి వస్తుంది"

"నైస్ మిస్ కృషి. . . సగటున మగాడి మెదడు బరువు మూడు పౌండ్లయితే స్త్రీ మెదడు బరువు రెండు పౌండ్లు మాత్రమే అంటే మెదడు విషయంలో మగాడికన్నా స్త్రీ తక్కువని మీరు అంగీకరిస్తారా"

"లేదు" విశ్వ గొంతులోని ఎగతాళికి జవాబుగా తనూ వ్యంగ్యంగా అంది "మెదడు బరువుకి మేధస్సుకి సంబంధం లేదు మిస్టర్ విశ్వనాథ్. మనిషి శరీర పరిమాణాన్ని బట్టి మెదడు నిర్ణయించబడుతుంది. సహజంగా మగాడి శరీరం కాస్త భారీగా వుంటుంది కాబట్టి అదే నిష్పత్తిలో మెదడు పరిమాణం వుంటుంది. అలానే స్త్రీలలో కూడా. . ."

"స్ప్లెండిడ్" కృషి తను అనుకున్నంత బలహీనురాలు కాదని బోధపడిన విశ్వ కాస్త జటిలమైన ప్రశ్నలతో ఆమెను ఇబ్బంది పెట్టాలనుకున్నాడు. "తలకి గాయమైన మగాడిలో సెక్స్‌లో ఆసక్తి తగ్గే అవకాశముందని నిరూపించిన బ్రెయిన్ రిసెర్చర్ ఎవరు."

స్తబ్దంగా వుండిపోయింది. విశ్వ పెదవులు మృదువుగా విచ్చుకున్నాయి. ఒకటీ, రెండు పది సెకండ్లు గడిచాయి.

క్విజ్ మాస్టర్ బజర్ మోగించగానే చెప్పాడు విశ్వ.

"మాసాచు సెట్స్ జనరల్ హాస్పటల్‌కి చెందిన డాక్టర్ విలియమ్ క్రోలీ." కృషిని

“తల్లి గర్భంలో పిండంగా రూపుదిద్దుకున్న ఇరవై వారాలకి అంటుంది సైన్స్”

“రైట్. . . సెన్సాఫ్ స్మెల్ మగాళ్ళకన్నా స్త్రీలలోనే ఎక్కువంటుంది కారణం?”

“స్త్రీలలో వుండే హార్మోన్ ఈస్ట్రోజన్ స్థాయిని బట్టి ఘ్రాణశక్తి నిర్ణయించ బడుతుంది. మగాళ్ళకన్నా స్త్రీలు అధిక ఘ్రాణశక్తి కలిగి వుండటానికి కారణం ఈస్ట్రోజన్ అంటుంది సైన్స్.”

“ఊరగాయలు ఐస్‌క్రీముల్లాంటి చిత్రమైన కాంబినేషన్స్ ఎన్నుకుంటుంటారు గర్భవతులైన స్త్రీలు. కారణం చెప్పండి”

“గర్భం ధరించిన స్త్రీ కన్నా గర్భవతి కాని స్త్రీకి రెండు వేల రెట్ల ఘ్రాణశక్తి ఎక్కువంటుంది సైన్స్. గర్భవతులైన స్త్రీలలో ఈస్ట్రోజన్ స్థాయి చాలా దారుణంగా పడిపోతుంది కాబట్టి ఘ్రాణశక్తి తగ్గిపోతుంది. నాలుక చిత్రమైన రుచుల్ని కోరుకుంటుంది.”

“సంతానంలో ఏ బిడ్డ ఐక్యూ రీత్యా వున్నతుడవుతాడు.”

“మిచిగాన్ సైకాలజిస్ట్ రాబర్ట్ బి జాజన్ థియరీ ప్రకారం అందరిలో పెద్ద పిల్లాడే 'IQ' రీత్యా బెటరుగా వుంటాడు. కారణం అతడి కన్నా పెద్ద పిల్లలు ఆ యింటిలో వుండరు కాబట్టి పెద్దల ఆలోచనల సరళితోనూ, తెలివితోనూ ఎక్కువగా సంపర్కం వుంటుంది కాబట్టి.”

‘బాప్‌రే’ అనుకున్నాడు విశ్నూ. ఆదిలో పెద్ద స్పందన లేకపోయినా కృషికి అనుకూలంగా విద్యార్థులు చప్పట్లు కొట్టడం ప్రారంభించారు వున్నట్టుండి.

కృషిని ఇబ్బంది పెట్టాలీ అంటే యిది కాదు పద్ధతి అనుకున్నాడేమో టక్కున అడిగాడు “హరికథా పితామహూడైన ఆదిబట్ల నారాయణ దాసు పుట్టింది ఏ వూర్లో.”

“శ్రీకాకులం జిల్లాలోని అజ్జాడ గ్రామంలో”

ఇబ్బందిగా చూశాడు విశ్నూ . . . ఎక్కడో అమెరికాలో చదివి తిరిగి వచ్చిన కృషి ఇలా తెలుగు రాష్ట్రంలోని పల్లెటూర్ల గురించి మాట్లాడడం బొత్తిగా నచ్చడం లేదు.

“ఎన్ సైక్లోపిడియా అన్నది మౌలికంగా ఏ భాషకి చెందిన పదం”

“అది గ్రీక్ పదం . . . దానికి అర్థం జ్ఞానచక్రం”

“తమలపాకులలో వున్న విటమిన్లు?”

‘ఎ’, ‘సి’ విటమిన్లతో బాటు ప్రొటిన్లు, కాల్షియం, భాస్వరం కూడ వున్నాయి.”

“తమలపాకులకి దారుణంగా అలవాటుపడి ఓ దశలో డబ్బుల్లేక రాజముద్రికని, కిరీటాన్ని తాకట్టు పెట్టి తమలపాకుల్ని తెప్పించుకున్న రాజెవరు. . .”

“పదకొండో శతాబ్దంలో కాశ్మీరుని పరిపాలించిన రాజు అనంత”

“తల స్నానానికి షాంపు వాడుతుంటారుగా. అసలు షాంపూ అనే పదానికి మూలం ఏమిటి.”

క్షణం ఆగి చెప్పింది కృషి “జుట్టుని పాయలుగా విడదీసి కలిపి రుద్ది దువ్వే ప్రక్రియని ‘చంప్‌నా’ అంటారు హిందీలో. . . షాంపూ అనే పదానికి మూలం ఈ చంప్‌నాయే”

క్రమంగా సహనాన్ని కోల్పోతున్నాడు విశ్నూ.

“భారత జాతీయ పతాకంలోని అశోకచక్రంలో ఎన్ని గీతలుంటాయి.”

“ఇరవై నాలుగు”

“పందులు సాధారణంగా ఎంత కాలం గర్భంతో వుంటాయి.”

“మూడు నెలల మూడు వారాల మూడు రోజులు.”

“తుమ్ ముజే ఖూన్ దో మై తుమ్హే ఆజాద్ దూంగా అన్న నినాదాన్నిచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడెవరు.”

“సుభాష్ చంద్రబోస్.”

“ప్రతి చిన్న విషయానికీ కళ్ళనీళ్ళు పెట్టుకునే స్త్రీల కళ్ళల్లో ఆ నీళ్ళు రావటానికి కారణమైన గ్రంధులేవి.”

"కన్నీళ్ళన్నవి కేవలం ఆడవాళ్ళకి మాత్రం పరిమితం కాదు మిస్టర్ విశ్వ - ఓడే స్థితి వస్తే మగాడికీ కన్నీళ్ళు తిరుగుతుంటాయి" విశ్వ ప్రస్తుత స్థితి నుద్దేశించి మాట్లాడుతున్నట్టుగా అంది "కమింగ్ టుది పాయింట్ - కన్నీళ్ళు రావటానికి కారణమైన గ్రంథులు లాక్రైమల్ గ్లేండ్స్."

"టిగ్రెనియాభాష ఏ దేశానికి చెందింది."

"ఇథియోపియా. . ."

"స్వామి వివేకానంద అసలు పేరు"

నిశ్శబ్దం. . . గుర్తు చేసుకునే ప్రయత్నం చేసినా స్ఫురించక పోవడంతో "పాస్" అంది కృషి.

"నరేంద్రనాథ్ దత్తా" అన్నాడు విశ్వ .

కృషిలో ఏ సంచలనమూ లేదు. చాలా మామూలుగా వుంది అంటే - గెలిచే తీరుతానన్న నమ్మకమా.

"నువ్వటే" సీరియస్‌గా అన్నాడు కృషిని చూస్తూ "పువ్వులాంటి వయసు నవ్వులంటిన సొగసు రువ్వి నా యెదపాయను పర్వులెత్తావటే - నువ్వటే." క్షణం ఆగి "ఇది మీ గురించి నేను భావుకంగా మాట్లాడ్డం కాదు మిస్ కృషీ. . . ఓ ప్రముఖ జానపద గీతం ఇది. . . రాసిందెవరో చెప్పండి."

"బాపిరాజు" చెప్పేసింది కృషి నిశ్చలంగా.

విశ్వ నుదుట స్వేదం పేరుకుంది.

"మొదటి రాజీవ్ ఖేల్ రత్న అవార్డ్ గ్రహీత ఎవరు"

"విశ్వనాథన్ ఆనంద్"

"పృధ్వీ క్షిపణి రూపశిల్పి ఎవరు"

"డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్"

"నిద్రపోయేటప్పుడు పాము ఎందుకు కళ్ళు మూయదు."

"అవాక్కయి చూసింది కృషి."

పది సెకండ్లు గడుస్తూండగా బజర్ మోగడంతో చెప్పాడు విశ్వ "పాము నిద్ర పోయేటప్పుడు కళ్ళు మూయదు - దానికి రెప్పలు లేవు కాబట్టి"

పాతిక ప్రశ్నలు పూర్తయిన సూచనగా పైకి లేచిన సత్యేంద్రబసు మైక్‌లో అనౌన్స్ చేశాడు. "మిస్టర్ విశ్వనాథ్ నిబంధనల మేరకు అడిగిన ప్రశ్నలు ఇరవై అయిదు. అందులో మిస్ కృషి చెప్పలేక పోయిన జవాబులు మూడు మాత్రమే. సో. . . హెర్ స్కోర్ యీజ్ టూ హండ్రెడ్ అండ్ ట్వంటీ."

ఆడిటోరియం కరతాళధ్వనులతో ప్రతిధ్వనిస్తూండగా అన్నాడు సత్యేంద్ర "నౌ దిసీజ్ ద టర్న్ ఆఫ్ మిస్ కృషి. . . ప్లీజ్ స్టార్ట్ మిస్ కృషి. . ."

రెండు సెకండ్ల పాటు రెప్పలార్చకుండా చూసిన కృషి అడిగింది "ఎద లోపలి యెదలో నెమ్మదిలో జీవిత రహస్యమార్గమ్ములలో వద అని కోరికవై నా బ్రతుకు బరువులెల్ల పాట పాడింతు సఖీ రాసిందెవరు"

"కృష్ణశాస్త్రి"

"గుడ్" అభినందనగా చూసింది "కొండ తిరిగీ కోన తిరిగీ చీర చెరుగున కూరిచితిరా - గరికెపూవుల కంతమల - ఆవునడిగీ అడవినడిగి పూల గిన్నెల పొందుపరిచితి-"

ఆమె వాక్యాలు యింకా పూర్తికాకముందే చెప్పాడు విశ్శు "నండూరి రాసిన జానపదగీతంలోని పంక్తులవి"

"ప్రపంచ ప్రముఖురాలైన బ్రిటిష్ నర్స్ ఫ్లారెన్స్ నైటింగేల్ వీలునామా నిర్లక్ష్యం చేయబడింది. ఎలా" ఇక్కడ విశ్శు తెల్లమొహం చేస్తాడనుకుంది. కాని వెంటనే చెప్పేయగలిగాడు "1910లో మరణించిన ఫ్లారెన్స్ నైటింగేల్ వీలునామా ప్రకారం ఆమె శరీరాన్ని సైన్స్ పరిశోధనకి అందించాలని కోరింది. ఆమె తల్లిదండ్రులు ఖననం చేయబడ్డ హేంప్‌షేర్ సిమెట్రీలోనే ఆమె శవమూ ఖననం చేయబడింది."

"మూడు పెళ్ళిళ్ళు విఫలమైన టెర్ ట్రండ్ రస్సెల్ తన ఎనభయ్యో యేట నాలుగో పెళ్ళి చేసుకున్నాడు - ఆమె పేరు".

"ఎడిత్ ఫించ్"

"రైట్. . ." ఈ సారి అతడ్ని కవ్విస్తున్నట్టుగా అడిగింది " 'లౌ' అంటే ప్రపంచంలో చాలా చరిత్రగలదైనా టెన్నిస్‌లో మాత్రం సున్నాని సూచిస్తుంది - ఎందుచేత."

"LOVE" అనే పదానికి మూలం ఫ్రెంచి భాషలోని LOEUF ఈ ఫ్రెంచ్ పదానికి ఆ భాషలో అర్థం గుడ్డు అని - గుడ్డు రూపం జీరోకి దగ్గరగా వుంటుంది కాబట్టి నన్ స్కోర్‌కి LOVE అనే పదం వచ్చింది."

"వేడిచేసి చల్లబరిచిన నీళ్ళు కప్ నీళ్ళలో ఏవి తొందరగా గడ్డకట్టే గుణం కలిగి వుంటాయి."

"తప్పకుండా వేడిచేసి చల్లబరిచిన నీళ్ళే. . .ఎందుకంటే అందులో బుడగలు వుండే అవకాశం లేదు కాబట్టి."

"ఇద్దరుంటే కంపెనీ ముగ్గురుంటే గుంపు అయితే నలుగురూ అయిదుగురూ వుంటే."

"తొమ్మిదిమంది" ఎగతాళిగా అన్నాడు విశ్శు.

విశ్శు ఆలోచించుకునే అవకాశ మివ్వనట్టుగా అడిగింది కృషి. "ఒక మగాడు తన భార్య వితంతువైతే ఆమె చెల్లెల్ని చట్టరీత్యా పెళ్ళి చేసుకోవచ్చా"

"యస్ - చేసుకోవచ్చు" అన్నాడు టక్కున.

"రాంగ్" నెమ్మదిగా అంది కృషి. . ."నువ్వు బ్రతికుండగానే నీ భార్య వితంతువయ్యే అవకాశం లేదుగా"

షాక్ తిన్నట్టుగా చూశాడు. . . చాలా తెలివిగా తప్పుదోవ పట్టించింది.

"మూడు ఏపిల్స్‌లో మీరు రెండు తీసుకుంటే మీ దగ్గర ఎన్ని మిగిలినట్టు. . ."

"ఒకటి. . ." కృషి ముఖకవళికల్ని చూస్తూ అన్నాడు. "కాదు కృషీ-రెండు. . . ఎందుకంటే నేను ఎక్కడో వున్న మూడు ఏపిల్సులో రెండు తీసుకున్నాను కాబట్టి నా దగ్గర వుండేది రెండే. . ."

"నాట్ బేడ్" అన్నట్టుగా నవ్వింది కృషి "పది సెకండ్లలో చెప్పాలి . . ." వున్న గడువు అదే అని ఆమెకీ తెలుసు కాని విశ్వని సైకలాజికల్‌గా యిబ్బంది పెట్టాలనుకుంది "కలిపినా లేక గుణించినా ఒకే మొత్తం వచ్చే మూడు అంకెల్ని చెప్పండి"

"ఒకటి రెండు మూడు"

"ప్రేమ విషయంలో అబ్బాయి అమ్మాయిల ఆలోచనా సరళి గురించి మోడరన్ సైకాలజీ ఏం చెబుతుంది"

"తొందరగా ప్రేమలో పడేది మగాడే అంటూంది సైన్స్."

ఆడిటోరియంలోని అమ్మాయిలు ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. "ఆ తర్వాత ప్రేమ విఫలమయినా మరిచిపోలేక బాధ పడేదీ మగాడే అంటుంది. . . అమ్మాయి విషయాయనికి వస్తే ఆమె తొందరగా రాజీ పడగలదన్నది సైన్స్ చెబుతున్న సత్యం. అంటే ప్రేమలో ఎక్కువ బాధను అనుభవించేది అబ్బాయిలే పాపం"

ఈ సారి విద్యార్థులు విశ్వకి సపోర్టుగా చప్పట్లు కొట్టారు.

"ప్రపంచంలో మొదటిసారిగా ఇంటెల్లిజన్స్ టెస్ట్‌ల కోసం ప్రయత్నం జరిగిందెప్పుడు."

"క్రీస్తు శకం 1900 సంవత్సరంలో మానసిక వైఫల్యంతో బాధపడుతున్న పిల్లల్ని పరీక్షించటానికి ఇంటెల్లిజన్సు టెస్టుల్ని డిజైన్ చేయించింది ఫ్రెంచి ప్రభుత్వం. ఈ టెస్టులకి రూపకల్పన చేసింది సైకాలజిస్ట్ ఆల్ ఫ్రెడ్ బెనెట్. . ."

జవాబు చెబుతూ చూశాడు విశ్వ . . . కృషి మొహంలో క్రమంగా రంగులుమారిపోతున్నాయి. . . పరిస్థితి చేజారిపోతూందన్న విషయం కృషికీ అర్థమౌతూనే వుంది. . .

ఇప్పుడామె ఆలోచిస్తున్నది కేవలం ఓటమి గురించి మాత్రమే కాదు. ఓటమి తర్వాత తాను పోగొట్టుకోబోతున్న వెలకట్టలేని జీవితం గురించి. . .

"చెస్ - అదే చదరంగానికి మూలం ఏమిటి" అడిగింది కృషి.

"క్రీస్తు శకం ఆరో శతాబ్దం నుంచీ మొదలైన ఈ చదరంగానికి మూలం భారతదేశంలోని ఓ యుద్ధ వ్యూహం 'చతురంగ'-"

విశ్వ జవాబుకి స్పందించిన విద్యార్థులంతా చప్పట్లు కొట్టారు. ఆడిటోరియం ముందు వరుసలో కూర్చున్న చౌదరి కొడుకు రాజేష్ సైతం విశ్వని సమర్థిస్తూ తన బృందాన్ని

పోరాడేందుకు సాహసించిన కృషిపై రగిలిన ద్వేషం.

"ఆగస్టు నెలకి ముప్పై ఒక్క రోజు లుండడానికి కారణం ఇంపీరియల్ జలసీ అంటారు.... వివరించండి."

"క్రీస్తు పూర్వం 38లో రోమన్ చక్రవర్తి ఆగస్టన్ పేరుని బట్టి జులై తర్వాత నెల ఆగస్టు అనే పేరు నిర్ధారించబడింది. అయితే జూలియస్ సీజరు పేరును సూచించే జులైకి ముప్పై ఒక్కరోజులుండడం, ఆగస్టుకి ముప్పై రోజులుండడం నచ్చని ఆగస్టన్ చక్రవర్తి ఆగస్టుకీ ముప్పై ఒక్క రోజులుండేట్టు చేసి ఫిబ్రవరి నెలకి ఓ రోజు తగ్గించాడు. ఈ చర్యని యింపీరియల్ జలసీగా వర్ణిస్తారు"

మళ్ళీ కరతాళ ధ్వనులు. . ..

కృషిలో టెన్షన్ ఉధృతం కాసాగింది. "తొలిసారి అంతరిక్షంలో అడుగుపెట్టిన ఘనత దక్కించుకున్న రష్యన్ ఆస్ట్రోనాట్ యూరీగగారిన్ మరణం ఎలా సంభవించింది"

"గగారిన్ అంతరిక్షంలో అడుగు పెట్టిన పదేళ్ళకి ఓ జెట్ ప్లేన్ నడుపుతూ విమాన ప్రమాదంలో చనిపోయింది.

కృషి మరో ప్రశ్న అడగబోతుండగా వేదికపైకి ఓ మూలగా వచ్చిన సూరి వేగంగా విశ్శుని సమీపించాడు.

ఏదో చెప్పి విశ్శుకి ఓ స్లిప్పు అందించాడు.

"మేం కిడ్నాప్ చేసుకువెళ్ళిన నీ తల్లి బ్రతకాలి అంటే పోటీలో నువ్వు ఓడిపోవాలి - ఓడేక కుతుబ్‌షాహి సమాధుల దగ్గరకొచ్చి నీ తల్లిని తీసుకువెళ్ళు . . . ఒకవేళ నువ్వు ఈ పోటీలో గెలిస్తే నీకు అక్కడ ఎదురయ్యేది నీ తల్లి శవం మాత్రమే"

ఆ స్లిప్పు తన దగ్గరికి ఎలా వచ్చిదీ సూరి చెబుతుంటే వినలేదు విశ్శు. నుదుటపట్టిన స్వేదాన్ని తుడుచుకుంటూ కృషిని చూశాడు.

మొన్న తను ఏది కోల్పోకూడదని తనపై గూండాల్ని పురమాయించిందో ఇప్పుడు మళ్ళీ కృషి అలాంటి పథకానికి సిద్ధపడింది.

ఓ మనిషిపై మొదలైన అనుమానం ఉధృతం కావటానికి పరిస్థితులు దోహదం చేయడమే నిజమైతే విశ్శు సరిగ్గా అలాంటిస్థితిలో చిక్కుకున్నాడిప్పుడు . . . కృషి తనను చాలా నిస్సహాయుడ్ని చేసింది.

లేనిదాని గురించి వున్నదాన్ని ప్రకటించడం ఉన్నదాన్ని వృదాచేసుకోవడమేనన్న సత్యం తెలిసిన విశ్శు ఆ తర్వాత యిక పోటీపై ఏకాగ్రత చూపించలేదు. వివేకంలేని ఆవేశానికి అర్థం లేదు.

బ్రతుకు మరుభూమిలో పిచ్చి చెట్టులా నిలబడి కోల్పోయిన సౌరభం కోసం ఆర్తిగా దిక్కులు చూస్తున్న అమ్మే తనకు ముఖ్యం తప్ప ఈ గెలుపు కాదు. . .

ఆ తర్వాత కృషి అడిగిన ఏ ప్రశ్నకీ అతడు జవాబు చెప్పలేదు. వున్నట్టుండి అతడిలో కనిపించిన యీ మార్పుకి ఎవరెంత నిశ్చేష్టులైనా గాని అతడి ఓటమిని అమితంగా ఆనందించింది కృషి.

కృషి గెలిచినట్టుగా నిర్ధారించబడింది.

ఆమె చూపుల్లోని స్వాతిశయం విశ్వని మరింత ఉద్రేకపరుస్తుంటే నిభాయించుకుని ఓడినవాడిలా ఆడిటోరియం బయటికి నడిచాడు.

అసలు ఏం జరిగిందో తెలుసుకోవాలని పత్రికా విలేకర్లు అతడ్ని చేరుకోబోతుండగానే అదృశ్యమైన విశ్వ మరో అరగంటలో కుతుబ్‌షాహీ సమాధుల్ని చేరుకున్నాడు.

నిర్జనంగా వుంది. రాత్రి ఎనిమిది గంటల సమయం. . .

ఓ మూల స్తబ్దంగా నిలబడివున్న తల్లిని కలుసుకునేదాకా స్థిమితంగా వుండలేకపోయాడు. రాచరిక వ్యవస్థలోని రాజసం బ్రతులకే కాదు  చావులకూ సమాధుల రూపంలో విస్తరిస్తుందన్న సత్యానికి సంకేతంలా నిలిచిన ఆ ప్రదేశంలోని ఓ సమాధి సమీపంలో కూర్చున్న విశ్వ నిస్త్రాణంగా కృషి గురించి ఆలోచిస్తున్నాడు.  తన పౌరుషాన్ని సమాధి చేయడానికి డబ్బున్న ఓ అమ్మాయి యిలా ప్లే చేసింది మళ్ళీ.  ఆమె తాతయ్యకు తన తండ్రిని హత్య చేయడానికి ఏ డబ్బు, పరపతి సహకరించాయో యిప్పుడు అదే డబ్బుతో గెలుపనే గర్వం కోసం కృషి మరో సారి ఢీకొని మనసుని గాయపరిచింది.

అంచెలంచెలుగా ఆమె మనసుదాకా విస్తరించాలని అప్పటికి తోచిన ఓ మార్గంతో ఆమెతో పరిచయాన్ని పెంచుకున్నాడు. ఒకవేళ పరిచయం విడదీయలేనంత స్నేహం దాకా వెళితే దాన్ని తన శత్రుత్వానికి బారులా వాడుకునేవాడే కాని ఊహించలేని చాలా మలుపులు తిరిగిన స్నేహం యిప్పుడు ముఖాముఖీ పోరాటం వేపు మళ్ళింది.

“అమ్మని ఆశ్రమానికి తీసుకువెళ్ళు”

సూరికి తల్లిని అప్పచెప్పిన విశ్వ ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి కృషికి ఫోన్‌చేశాడు.

“కంగ్రాట్స్ కృషి”

“థాంక్స్” కృషి నవ్వు వినిపించింది.

“పాపం నీకు పెట్టుబడి పెట్టిన చౌదరి మరో అయిదు లక్షలు నష్టపోయాడేమో కదూ. అయినా వున్నట్టుండి అలా బ్లేంక్ అయిపోయి ఒక్క ప్రశ్నకీ జవాబు చెప్పలేక పోయావేం- ”

“చేయాల్సింది చేసి యింకా సానుభూతి ప్రకటిస్తున్నావా కృషి”

“నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు”

ఇదీ నటనే అనుకున్న విశ్వ గొంతులో కోపాన్ని అదిమిపెడుతూ అడిగాడు .  “ఒకవేళ నువ్వోడితే ఈ పాటికి శోభనానికి సిద్ధపడేదానివేమో కదూ”

నిశ్శబ్దంగా వుండిపోయింది.

“ఇష్టం లేనివాడితో ఓ రాత్రి గడపాలి అంటే నీ లాంటి ఆడపిల్ల ఎలా రియాక్టవుతుంది కృషి ”

“తన మీద తనకే జుగుప్సతో జీవితమంతా కుమిలిపోతుంది”

“ఇప్పుడు నీ మీద నీకు అలాంటి జుగుప్స కలిగించబోతున్నాను”

“కలగంటున్నావా”

“లేదు కృషీ!  నేను అనుకున్నది నిజం చేయబోతున్నాను. . . శారీరకంగా నాతో కలిసే పరిస్థితే వస్తే ఓ జీవితకాలం నువ్వెంత బాధకు గురవుతావో అనుభవించకుండానే నిన్నలాంటి స్థితికి నెడితే. . .”

“ఎలా” వ్యంగ్యంగా అడిగింది.

“వెయిట్ అండ్ సీ”

ఫోన్ క్రెడిల్ చేశాడు విశ్వ. తనకి సాయం చేసిన రామనాథ చౌదరిని గుర్తుచేసుకుంటూ......

0 0 0 0

"విశ్వ గెలుపు కోసం అయిదు లక్షలు పెట్టుబడి పెట్టిన మీరు మళ్ళీ అతడు ఓడిపోవడానికి వాళ్ళమ్మని ఎందుకు కిడ్నాప్ చేయించారో నాకు తోచడం లేదు చౌదరిగారూ" ఆశ్చర్యంగా అడిగాడు రంగధాం స్థిమితంగా మందుకొడుతున్న చౌదరిని చూస్తూ.

భావరహితంగా చూశాడు ఆయన. దోషి నుంచి నిజం రాబట్టడానికి చాలా శ్రమించి చివరికి తన తప్పుని దోషి ఒప్పుకున్నాక నువ్వు దోషివే కాదు అని తేల్చి చెప్పిన దొంగ పోలీసాఫీసరులా నవ్వాడు.

అబద్దపు సాక్ష్యాలతో ఆఖరిదాకా పోరాడి, అనుకూలంగా జడ్జిమెంటు వచ్చే సమయంలో 'నేను కోర్టులో యింతకాలం ప్రజెంట్ చేసింది దొంగ సాక్ష్యాలే' అని జడ్జిముందు ఒప్పుకున్న లాయరులా మొహాన్ని సీరియస్‌గా పెట్టాడు చౌదరి. "ఒకవేళ విశ్వ గెలిస్తే నాకొరిగేదేమిటి"

వెంటనే జవాబు చెప్పలేకపోయాడు రంగధాం.

"ఫలానా లాభముందీ అని ఉత్సాహంగా చెప్పలేకపోయారూ అంటే విశ్వ గెలుపులో ఖచ్చితంగా మనకి లాభం లేదనేగా. మహా ఐతే ఓ రాత్రంతా కృషిని అనుభవిస్తాడు విశ్వ. అంతేగా . . .దాని వలన మనకి ఒరిగేదేమిటి? మనకి ఏదీ జరగదు సరికదా ఒకవేళ వాడితో అనుభవం దానికి నచ్చినా, దానితో అనుభవం విశ్వకి సంతృప్తి నిచ్చినా, అపార్థాలు చెరిపేసుకొని హాయిగా కాపరానికి సిద్ధపడే ప్రమాదం వుంది. కాని అలా జరక్కూడదు. శీలం పోగొట్టుకోటానికి ఇష్టపడని కృషి మరో మారు ఇలాంటి ఘాతుకానికి సిద్ధపడిందని కృషిని విశ్వ ద్వేషిస్తూ వుండాలి. అందుకే విశ్వ తల్లిని నేనే కిడ్నాప్ చేయించాను."

"కాని మీరు అయిదు లక్షలు కోల్పోయారుగా."

"కృషి మూలంగా కోట్ల రూపాయలు ఇప్పటికే నష్టపోయినవాడ్ని రంగధాం- ఈ నష్టమెంతని! కాని ఇప్పుడో . . . ఐదు లక్షల్ని అడ్డం పెట్టుకుని విశ్వని దాని మీదికి ఆయుధంలా ప్రయోగించబోతున్నాను. రెచ్చిపోయి వున్న విశ్వ ఆధారంతో కృషి మీద శాశ్వతంగా గెలవబోతున్నాను. . . "

ఎలాగో చెప్పలేదు. ఇంతలో తెలిసింది విశ్వ వచ్చాడని. . .లోనికి రప్పించాడు.

విశ్వని చూస్తూనే "మీ మీద చాలా నమ్మకంతో పెట్టుబడిపెట్టాను" అంటూ తన బాధని వ్యక్తం చెయ్యబోయాడు కాని దానికి ముందే ఏ స్థితిలో తను ఓడాల్సి వచ్చిందీ చెప్పేశాడు విశ్వ . . . అంతే కాదు - పోయిన ఐదు లక్షల విషయంలో తన బాధని ప్రకటించాడు.

"ఇక్కడ నేను ఆలోచిస్తున్నది పోయిన డబ్బు గురించి కాదు విశ్వ - ఓ ఆడపిల్ల తెగువ గురించి. . .ఏం చూసుకుని దానికంతపొగరు - డబ్బునా . . అది నా దగ్గరా వుందే. .

తిరుగుబాటు చేసి నన్నో సంఘ విద్రోహక శక్తినంది. . . నేను సరే. . . మరి నీ తెలివి ఎందుకూ కాకుండ పోయిందే" గాయపడి వున్న ఓ మనిషి అహాన్ని ఎంత చాతుర్యంగా దెబ్బ తీయొచ్చో తెలిసిన చౌదరి అద్భుతంగా అవకాశాన్ని వినియోగించుకున్నాడు.

మరింత సునిశితంగా మెదడు పొరల్లోకి చొచ్చుకుపోయేట్లు మాట్లాడేడు. "హత్య రాజకీయాలతో పబ్బం గడుపుకునే ఉపాధ్యాయ ఒకనాడు నీ తండ్రిని హత్య చేయించాడు. . . అతడికి వారసురాలైన కృషి తన మాట నెగ్గాలని ఈ రోజు నీ తల్లినీ హత్య చేస్తానని సవాల్ చేసింది. ఒక్క ఉపాధ్యాయే అనుకుంటే యిప్పుడు ఆజ్యంలా అతడికి కృషి కూడా తోడైంది విశ్వ . . ."

"ఇక నాకు విడిచి పెట్టండి" సాలోచనగా అన్నాడు విశ్వ. ఆ క్షణంలో విశ్వ మానసిక స్థితి చౌదరి వూహించి వుండడు. . . ఉపాధ్యాయని దెబ్బ తీయడానికి కృషి పరిచయాన్ని కోరుతున్న విశ్వకి యిప్పుడు కృషి కూడా ప్రమాదకరమైందే అని స్పష్టంగా బోధపడడంతో ఆఖరి అధ్యాయపు పుటల్ని రాయబోతున్నట్టుగా అన్నాడు.

"కృషికి వున్నది ఉపాధ్యాయ అండే అయితే అతడి అండని కృషి త్వరలోనే కోల్పోతుంది. ఉపాధ్యాయకి అండ కృషే అయితే కృషి ఆసరాని ఉపాధ్యాయ త్వరలోనే కోల్పోతాడు."

"ఎలా" ఉత్కంఠగా చూశాడు చౌదరి.

చెప్పలేదు వివరంగా - ఇక చెప్పడం తన అభిమతంకాదు. చేసి చూపించాలనే తిరుగులేని సంకల్పాన్ని ప్రకటిస్తూ రెండు నిముషాల నిశ్శబ్దం తర్వాత చెప్పాడు విశ్వ - "మూడు నెలల గడువులో కృషి ఈ దేశం విడిచి వెళ్ళిపోతుంది. వెళ్లడం యిష్టం లేకపోతే అవమాన భారంతో ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటుంది"

ఏ ఆలోచనల ఒరిపిడిలో విశ్వ అలా మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. కాని విశ్వ కళ్ళలో ఎరుపు జీరలు, అతడి గొంతులు పలికిన ఆత్మ విశ్వాసం చౌదర్ని అద్భుతంగా కదిలించాయి. యుద్దంలో అడుగుపెట్టే వరకే ప్రేరణ అందించాల్సింది. ఆ తర్వాత యుద్ధమే ప్రేరణ అందిస్తుంది. అసలు విశ్వ గెలిచినా గెలవకపోయినా కనీసం కృషిని ఆందోళన పర్చగలడు - ఏకాగ్రత లోపించే స్థితికి ఆమెను నెట్టితే చాలు మిగతాది తాను చూసుకుంటాడు.

పద్మవ్యూహంలో అడుగు పెట్టిన అభిమన్యుడు గెలవకపోతేనేం - కౌరవుల్ని చాల కంగారు పెట్టేశాడు.

కృషి మూలంగా కోట్ల నష్టానికి గురైనా ఇప్పుడు అయిదు లక్షల పెట్టుబడితో ఓ ఆయుధంలా ముందుకు దూసుకుపోతానంటున్న విశ్వని చౌదరి చూస్తుండగానే వెళ్ళిపోయాడు విశ్వ.

చాలా బలమైన పావుని కదిలించాడు మరి-

“మన కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రకటించి ఏడాది కాక ముందే సుమారు బిలియను డాలర్ల మేరకు పెట్టుబడి పెట్టడానికి విదేశీ ఇన్వెస్టర్లు నుంచి హామీ లభించింది. ఇదిలా వుండగా మన దేశంలోని అమెరికన్ ఎలక్ట్రానిక్ కంపెనీ “మీటరులా” ఇక్కడ నుంచి తన పరిశ్రమల్ని చైనాకి తరలించటానికి సిద్ధపడుతూంది.”

క్షణం ఆగాడు వేదికపై మాట్లాడుతున్న విశ్వ-

నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆర్గనైజ్ చేస్తున్న సెమినార్ అది - ఆ సెమినార్‌కి చాలా మంది పారిశ్రామిక వేత్తలతో బాటు ఉపాధ్యాయ కూడా వచ్చారు. ప్రస్తుతం ఆయన వేదికపై అధ్యక్ష స్థానంలో కూర్చుని వున్నారు. పాతికేళ్ళు నిండని ఓ అబ్బాయి అద్భుతమైన అనాలిసిస్‌తో విదేశీ పెట్టుబడుల గురించి మాట్లాడుతుంటే ఆసక్తిగా ముందుకు వంగి టేబుల్‌పై చేతులానించి వింటున్నారాయన.

“ఇలా మన దేశంలో పెట్టుబడి పెడతామన్న విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి మరో దేశానికి తమ పరిశ్రమల్ని తరలించుకోవడానికి కారణం మన ప్రభుత్వ యంత్రాంగాల్లో పనుల నిర్వహణలో జరుగుతున్న జాప్యం - ఆలోచనలు కాగితాలకే పరిమితం కావడం. 1990 లో థాయ్‌లాండ్‌కి 47 బిలియన్ డాలర్ల ప్రతిపాదనలు వస్తే మన దేశానికి కేవలం ఒక బిలియన్ డాలర్ల ప్రతిపాదనలతో ముగిసిపోవడం బాధాకరమైన విషయం”

ఓ నివేదికను తయారు చేసి అందులో సారాంశాన్ని ఉపన్యాసంలా చదువుతున్న విశ్వ కౌన్సిల్‌తో సంబంధం లేని వ్యక్తి అయినా ఇప్పుడా అవకాశన్ని దక్కించుకున్నది ప్రొడక్టివిటీ కౌన్సిల్‌లో అతడికి తెలిసిన ఓ స్నేహితుడి మూలంగా-

కేవలం ఉపాధ్యాయగారి సమక్షంలో తన మేధస్సుని ప్రదర్శించే ప్రయత్నంలో అవకాశమివ్వమని విశ్వ అడగలేదు. ప్రభుత్వంలో బ్యూరోక్రసీ వైఫల్యాల గురించి ఉపాధ్యాయ వంటి వ్యక్తుల దృష్టికి తీసుకు వెళ్ళడం తన అభిమతమన్నాడు. వేదికలోని స్టేటస్టిక్స్ విశ్వ స్నేహితుడ్ని కూడా ఆకట్టుకోవడంతో పైగా అప్పుడెప్పుడో బాంబే యూనివర్శిటీలో విశ్వతో వున్న పరిచయంతో సరే అని అంగీకరించి పది నిమిషాల సమయాన్ని కేటాయించాడు.

“ఎవరీ అబ్బాయి” అడిగాడు ఉపాధ్యాయ అతని పక్కనే కూర్చున్న కౌన్సిల్ సెక్రటరీని.

“పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో రిసెర్చి స్కాలర్ - ప్రస్తుతం నిరుద్యోగి. త్వరలో ఉద్యోగం కోసం స్టేట్స్‌కి వెళ్తున్నవాడు. పేరు విశ్వనాథ్ ” చెప్పాడు నెమ్మదిగా. ఇదేమీ గమనించడం లేదు విశ్వ.

“భారతదేశంలో వున్న విస్తృతమైన మార్కెట్ గురించే గాక నైపుణ్యతగల కార్మికులకే లోటూ లేదన్న విషయం అంతర్జాతీయ యిన్వెస్టర్లకి తెలుసు. అయితే ఇక్కడ సరైన ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం, ప్రాజెక్టుల అనుమతిలో అవరోధాలు వారికి తల నొప్పిగా తయారయ్యాయి. అదే తూర్పు ఐరోపా దేశాలలో టాక్స్ హాలిడేస్ మాత్రమే కాక ప్రాజక్టులకు అనుమతి సైతం తేలిగ్గా లభిస్తుంది.”

విశ్వ అంచనా తప్పు కాలేదు.. .  తను అనుకున్న దానికన్నా ఉపాధ్యాయ గార్ని అమితంగా ఆకట్టుకోగలిగాడనటానికి ఉదాహరణ ఆయన కనబరుస్తున్న ఆసక్తి. . . వయసుకి మించిన పరిజ్ఞానంతో భారత దేశ పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన కీలకమైన విషయాల్ని చాలా సునాయాసంగా చర్చిస్తున్నాడు.  డబ్బు పెట్టుబడి పెట్టడంలో ఎదురయ్యే సమస్యల గురించి సరైన అవగాహన లేకుండా సంఘర్షణకి లోనవడమే తప్ప ఎంతమంది పారిశ్రామిక వేత్తలకి తెలుసు యిలాంటి లోపాల గురించి?

"మన దేశంలో శ్రమ శక్తి తక్కువ రేటుకే లభిస్తుంది.  అయితే ఉత్పాదకతను పెంచే కార్మిక చట్టాలు లేవు. . .కార్మిక సంఘాలకి ఉద్యోగ భద్రతలపై ఆసక్తి తప్ప ఉద్యోగుల బాధ్యత గురించి నచ్చచెప్పే ఆసక్తి లేదు."

పరిశ్రమలు నష్టాలలో కూరుకోవటానికి ముఖ్యమైన కారణాల్ని వ్యక్తం చేస్తున్న విశ్వనాథ్‌ని మరింత అభినందనగా చూశారు ఉపాధ్యాయ".

"అసలు ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ ముందుగా ఆలోచించాల్సింది విదేశీ పెట్టుబడులే కాక సవరించబడాల్సిన ఫ్యాక్టరీ ఏక్ట్స్ ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ చట్టాల గురించి-"

విశ్వ ఉపన్యాసం ఇంకా పూర్తి కాలేదు.  ఉన్నట్టుండి ఆ స్టార్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో కలకలం మొదలైంది.  అదికాదు. . . ఓ విద్రోహుల చర్యలా ఆ హాల్లో దట్టంగా పొగ వ్యాపిస్తూంది.

"స్మోక్ బాంబ్స్" అన్న కేకలతో జనం కకావికలైపోయారు. . . ఎవరే పక్క పరుగెడుతున్నదీ అసలేం జరిగిందీ ఎవరికీ అర్థం కావడం లేదు. . . అర నిముషం వ్యవధిలో మేఘాల్లా ఆవరించిన పొగలో పైకి లేవబోయిన ఉపాధ్యాయకి ఏమీ కనిపించని ఆ స్థితిలో తననెవరో లాగుతున్నట్టు బోధపడింది.  ఊపిరితిత్తులనిండా నిండిన పొగతో ఉక్కిరిబిక్కిరైపోయారు.  తననెవరో కిడ్నాప్ చేయాలని ప్రయత్నిస్తున్నారని గ్రహించి శక్తిని కూడగట్టుకోబోయారు కాని అప్పటికే ఆయనకు స్పృహ తప్పుతూంది.

రాత్రి పది గంటల సమయంలో అక్కడ జరిగిన సంఘటన రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసుల్ని ఎంత కలవర పరిచిందీ అంటే నగరం అలర్ట్ చేయబడింది. అందరి నోటా ఒకటే మాట . . .  టెర్రరిస్టులు ప్రముఖ పారిశ్రామికవేత్త ఉపాధ్యాయని కిడ్నాప్ చేయబోతే విశ్వ అనే యువకుడు ప్రాణాలకి తెగించి పోరాడాడు.  ఉపాధ్యాయగార్ని రక్షిస్తూ తాను ధారుణంగా గాయపడ్డాడు.

పత్రికలు, ప్రజలు ఆసక్తిగా అపోలోకి చేరుకున్నారు.  మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటలకల్లా. అప్పటికే స్పృహలోకి వచ్చిన ఉపాధ్యాయ జరిగింది తెలుసుకుని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్న విశ్వ దగ్గరికి వెళ్ళారు.  అతడి షర్టు రక్తసిక్తమై వుంది.  మోచేయితో బాటు భుజం కూడా చీరుకుపోవడంతో బేండేజ్ కట్టినట్లు చెప్పారు డాక్టరు.

తనదాకా వచ్చేసరికి ఆందోళన పడ్డారేమో ఆప్యాయంగా విశ్వ తల నిమురుతూ "థ్యాంక్స్" అన్నారు .

"బుద్ధిబలమే కాక భుజ బలమూ కలవాడినని నిరూపించుకున్నావు"

బడలికగా చూశాడు విశ్వ. "నేనొక్కడిని పోయినంత మాత్రాన ఈ దేశానికి జరిగే నష్టం ఏమీ లేదు. కొన్ని వేల మందికి ఉపాధి నివ్వగల మీలాంటి వారు క్షేమంగా వుండాలి."

ఉపాధ్యాయ మరింత ఉద్విగ్నతకు లోనయ్యాడు విశ్వ మాటలువింటూ - "నువ్వు విదేశాలలో స్థిరపడాల్సిన అగత్యం లేదు విశ్వనాథ్ నాకు బాడీ గార్డ్‌లా నా ఇంట్లో నాతోనే వుంటావు. నా ఫ్యాక్టరీస్‌కి సంబంధించిన వ్యవహారాల్ని చూస్తూంటావ్ - నీకు కావాల్సినంత జీతం యిస్తాను" ఓ ఆదేశంలా అన్నారాయన. ఓ కోటీశ్వరుడి దృష్టికి వెళ్ళిన వ్యక్తి జీవితంలో హఠాత్తుగా ఏర్పడే అసాధారణమై మార్పులెలా వుండేదీ యిప్పుడే తెలిసినట్టు అక్కడ సన్నివేశాన్ని చూసిన వ్యక్తులు ఆలోచిస్తుండగానే బయటికి నడిచారు ఉపాధ్యాయ.

రాష్ట్ర డైరెక్టర్ జనరలాఫ్ పోలీస్ చెప్పాడు ఉపాధ్యాయ గారితో. “నేరస్తుల గురించి గాలింపు ఉధృతం చేశాం సర్. . . ఇప్పటికి అందించిన సమాచారాన్ని బట్టి రేన్సమ్ కోసం మిమ్మల్ని కిడ్నాప్ చేయబోయారని అర్ధమౌతూంది. . .”

బయట కారిడార్‌లో నిలబడ్డ కృషితోబాటు ఇంటికి తిరిగి వచ్చిన ఉపాధ్యాయ ఆ రోజు ప్రతి నిముషమూ జరిగిన సంఘటన గురించే మాట్లాడారు.

పూర్తిగా కోలుకున్న విశ్వని ఇంటికి రప్పించాక కృషిని పరిచయం చేశారాయన. “ఇక నుంచి మనకి రక్షణగా విశ్వనాథ్ ఇక్కడే వుండబోతున్నాడు”

కృషి అర్థం కానట్టు చూసింది. . . ఓ సెమినార్‌లో కలిసిన విశ్వ కాకతాళీయంగా ఉపాధ్యాయగారికి దగ్గర కావటాన్ని ఆమె అంగీకరించినా అతడ్ని బాడీ గార్డ్‌లా ఆలోచించడం నచ్చలేదు. “అంత కావాలనుకుంటే పోలీస్ సెక్యూరిటీ ఏర్పాటు చేయొచ్చు గ్రాండ్‌పా”

“నాకు కావల్సింది జీతం కోసం డ్యూటీ చేసే పోలీసుల రక్షణ కాదు. ఏ స్వార్థం లేకుండా ప్రాణాలు సైతం పెట్టుబడి పెట్టగలిగే విశ్వనాథ్ లాంటి యువకుడు”

ఒక నిర్ణయం తీసుకున్న గ్రాండ్‌పాని ఒప్పించడం గాని మార్చడం గాని సాధ్యంకాని పని.

ఓ శాసనంలా అనేసి తన గదికేసి వెళ్ళిపోయిన గ్రాండ్‌పాని చూస్తూ నౌకరు శరభయ్యతో చెప్పింది విశ్వనాథ్‌కి ఓ గది ఏర్పాటు చేయమని.. . .

అసలిదంతా ఆమెకు విచిత్రంగా వుంది. . .

తనతో పోరాటానికి ఛాలెంజ్ చేసిన వ్యక్తి యిప్పుడు తన కళ్ళ ముందు తన ఇంటిలోనే వుండబోతున్నాడు.

హుందాగా చిరునవ్వుతో సోఫాలో కూర్చున్న విశ్వ మీద పూర్వం అభిప్రాయం ఏదయినాగాని అతడు తీసుకున్న రిస్క్‌కి కృతజ్ఞతలు తెలపాలనుకుంది. “థేంక్స్ విశ్వ”

“దేనికి”

“ప్రాణాలకి తెగించి తాతయ్యని కాపాడినందుకు” నవ్వాడు

“దేనికి నవ్వుతున్నావు” అడిగింది కృషి.

“కాపాడడం అనే ప్రసక్తి రావాల్సింది నిజంగా అక్కడికి టెర్రరిస్టులంటూ వచ్చినప్పుడు”

“మరి” విస్మయంగా చూసింది.

“ఇదంతా నా పథకం కృషి. అసలు నేను ఆ సంఘటన సృష్టించింది కేవలం మీ తాతయ్య పరిచయం కోసం మాత్రమే. కాని ఇప్పుడు కోటలో పాగావేసే అవకాశాన్ని కలిగించాడు మీ గ్రాండ్‌పా”

షాక్ తిన్నట్టుగా వుండిపోయింది కృషి.

“నేను నమ్మను”

కంగారు పుట్టించే ఆ స్థితిలో సైతం నిశ్చలంగా అంది కృషి.

ఇప్పుడు విశ్వు షాక్ తిన్నాడు “అదేం”

“ఇదంతా నువ్వు చేయించిందే అయితే నీకీ గాయాలు ఎలా అయ్యాయి”

మృదువుగా నవ్వాడు తేరుకుంటూ “అందమైన అమ్మాయిని కలుసుకోవాలని గోడ దూకి వెళ్ళే అబ్బాయిలకి ఒక్కోమారు గాయలవుతూంటాయి కృషి ఇదీ అలాంటిదే - నీకు దగ్గర కావాలీ అంటే ముందు నీ తాత పరిచయం కావాలి . . . అది కూడా చాలా పకడ్బందీగా జరగాలి . . . దానికోసం నేనే గాయం చేసుకున్నాను. అయినా ఆడపిల్లల కోసం హత్యలు సైతం చేయడం ఆనవాయితీ అయినప్పుడు ఈ మాత్రం రిస్క్ తీసుకుంటేనేం?”

“నువ్వు ఒట్టి శాడిస్టువే అనుకున్నాను.”

“ఇప్పుడు మెసోచిస్ట్‌వి కూడా అని తెలిసిపోయిందా” ఎదుటి వ్యక్తి మీద కసి తీర్చుకోలేని ఉన్మాదంలో ఒక్కోమారు తనను తాను గాయపరుచుకునే మెసోచిజం గురించి వివరిస్తున్నట్టుగా అన్నాడు “నేనేమిటీ అన్నది ఇప్పటికైనా నీకు అర్ధమైనందుకు సంతోషంగా వుంది.”

“ఇప్పుడు నేనేమిటో కూడా నీకు తెలియచెప్పబోతున్నాను విశ్వూ. . . ” అవహేళనగా నవ్వింది కృషి.

“అంటే నేను ఓ పథకం ప్రకారం ఈ లోగిలిలో అడుగుపెట్టానని మీ తాతయ్యకి చెప్పడం కోసం ప్రయత్నిస్తావేమో కదూ. . . కష్టం కృషీ” నిర్లక్ష్యంగా చూశాడు విశ్వూ. “ఎందుకంటే నిన్ను నేను రేప్ చేస్తానని మీ తాతయ్యకి నువ్వు చెప్పినా నమ్మడు. అలా కోపంగా చూడకు. అంత కాన్ఫిడెన్స్‌తో వున్నారాయన. ఒకవేళ నీ మీద నేను అఘాయిత్యం చేసానని నువ్వన్నా నిజమో కాదో నిరూపించడానికి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురమ్మంటాడే తప్ప. . .”

“మిస్టర్ విశ్వనాథ్” క్రోధారుణ నేత్రాలతో చూసింది కృషి. విశ్వు దేనికైనా సిద్ధపడగలడని ఎప్పుడో ఊహించింది కాని ఇలాంటి ప్రమాదకరమైన మూర్ఖత్వాన్ని సైతం ప్రదర్శించగలడని ఇప్పుడు అర్థం చేసుకుంది. “ఏం సాధించాలని ఇలాంటి వలయంలో అడుగుపెట్టావో నాకు బోధపడటం లేదు.”

చిన్మయానందంగా నవ్వేడు “ఒక్కటే కృషి నీతో అనుభవం అనే ఆలోచనలు అంటించిన అగ్నికి మండే సమిధనయిన నేను అవసరమైతే ఆ సుఖం కోసం కాలిపోతాను. కాలుతూ సైతం రగులుతున్న నీ నిమ్నోన్నతాల నగరాని తలుచుకుంటూ నా వేలి కొనల స్పర్శతో నీ ఒంటిని విద్యుద్వీణగా మార్చుతాను. నీ యవ్వనం ఆవలి తెలి నురుగుల హోరుతో తడిసిపోతాను. నా అదిరే పెదవుల నిశ్శబ్దం కోలాహలాన్ని కుంచెగా మార్చి కోర్కెల సిత పత్రంపై ఊపిరి లిపిని రాసి నువ్వు కసిగా గొంతులో దాచుకున్న హాలాహలంగా నయినా మిగిలిపోతాను . . . ఆ తర్వాత నీ మనసు ఎన్ని కవచాల్ని అడ్డం పెట్టుకుంటేనేం - నొక్కి పెట్టిన నీ నవ్వులోనూ కనులలోనూ - ఎక్కుపెట్టిన నీ గుండెల్లోనూ దాగుంటాను. . . నీ కళ్ళలో కాంక్ష ల్లోనే కాక ఆదమరిచి నిదరోయే నీ చెక్కిలిపై తారాడే కలల నీడల్లోనూ నేను కనిపిస్తూనే వుంటాను-

“షటప్”

"ఏం ఆడపిల్లవి నువ్వు. . . ఇంత అద్భుతమైన భావుకతతో మాట్లాడానే . . . కొద్దిగా నైనా రియాక్టు కావేం?"

విశ్నులో నిర్భీతి ఆమెకు భరింపశక్యంగా లేదు. "గుడిలో దేవుడి ఆభరణాల్ని దొంగిలించాలని వచ్చిన వాడు దేవుడ్ని స్తుతిస్తే అది భక్తి అనిపించుకోదు విశ్నూ . . . నీ మాటలకి స్పందించే సగటు ఆడపిల్లని కాను నేను. . . వెళ్ళి ఒక్క రాత్రయినా ప్రశాంతంగా నిద్రపో."

రేపు నువ్వీ భవంతిలో ఎలాగూ వుండవని చెప్పడం ఆమె వుద్దేశ్యం.

"అయితే నడు"

"ఎక్కడికి"

"ఒక్క రాత్రి ప్రశాంతంగా నీ బెడ్ రూంలో గడపటానికి"

ఏమిటి ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నాడు. అసలు గ్రాండ్‌పా అయినా అంత సులభంగా ఇతడ్ని ఎలా నమ్మగలిగాడు?!

"ఏమిటి కృషీ ఇంకా ఆలోచిస్తున్నావేం" ఆమెను మరింత రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

"ఒకనాడు నాతో పందెంలో నువ్వోడితే నువ్వు నా ఇంటి వాచ్‌మెన్‌గా వుండాలని అడిగాను గుర్తుందా విశ్నూ" నిశ్చలంగా అంది ఆమె. "ఇప్పుడు ఈ ఇంట్లో బాడీ గార్డులా అడుగుపెట్టినా నువ్వు వుండేది ఆ స్థాయిలోనే. . . అది జ్ఞాపకం పెట్టుకొని మేం దయదలిచి యిచ్చిన గదిలో సెటిల్‌కా. కనీసం ఒక్క రాత్రి" మరోసారి 'ఒక్కరాత్రి' అన్న పదాన్ని ఒత్తి పలికి తన గదివేపు నడిచింది.

అరనిముషం తర్వాత నౌకరు శరభయ్య ఏర్పాటు చేసిన గెస్ట్‌రూంలో అడుగు పెట్టిన విశ్ను ప్రశాంతంగా వుండలేకపోయాడు.

కృషి పట్టుదలేమిటో అప్పటికే అతడికి అర్థమైపోయింది. కనీసం కొన్ని రోజులపాటు కృషి నుంచి తనను తాను కాపాడుకోవాలి. . .

అతడు ఆలోచన తప్పుకానట్టుగా ఆ రాత్రి పది గంటలకి కృషి ఫోన్ చేసిందెక్కడికో. . .

ప్రొడిక్టివిటీ కౌన్సిల్ సెమినార్‌లో జరిగిన సంఘటనకి కారణం బయటనుంచి వచ్చినవాళ్ళా లేక హాల్లోని వ్యక్తులెవరయినా అలాంటి ఏర్పాటు చేసారా అన్న విషయాన్ని తెలుసుకోమని ఆమెకు పరిచయమున్న ఏ.సి.పి. మాథుర్‌ని హింట్ చేసింది-

ఆ సందర్భంగా విశ్వనాథ్ మీద తనకున్న అనుమానాన్ని వ్యక్తం చేయటానికి వెనుకాడలేదు.

0 0 0

ఉదయం ఎనిమిది గంటల సమయం. . .

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న ఉపాధ్యాయ సమక్షంలో నౌకర్లందరూ క్రమశిక్షణగల

పనివాళ్ళుగానే భావించే ఉపాధ్యాయగారు వాళ్ళ ముందు మనసారా నవ్వటాన్ని సైతం ఇష్టపడరు అందుకే ఆయన ఇంట్లో వున్నంత సేపూ యంత్రాల్లా పని చేసుకు పోతుంటారంతా.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

ఆయనకి సమీపంలో కూర్చున్న కృషి బ్రేక్‌ఫాస్ట్ చెయ్యకుండా ఏదో అడగాలని సంశయిస్తున్నట్టు అర్ధమైంది - నిజానికి కృషికి నిన్న రాత్రి కూడా సరిగ్గా నిద్ర పట్టలేదు... విశ్వ గురించి ఓ పక్క వివరాలు సేకరించమని పోలీసుల సహాయాన్ని అర్ధించినా ఒక సువిశాల సామ్రాజ్యాధినేతలా బ్రతికే గ్రాండ్‌పా విశ్వ మీద వున్నట్టుండి అంత అభిమానాన్ని ప్రదర్శించడం ఆమెకు నచ్చడం లేదు. ఆ విషయాన్నే చర్చించాలను కుంటూంది.

ఏ రోజూ కృషితో సైతం ఆత్మీయంగా మాట్లాడే అలవాటు లేని ఉపాధ్యాయ బ్రేక్‌ఫాస్ట్ చేయబోతూ హఠాత్తుగా గుర్తుకొచ్చినట్టు "విశ్వనాథ్ ఏడీ" అన్నారు.

కృషి జవాబుని ఆశించనట్టు అతడ్ని పిలవమని నౌకరుని పురమాయించారు - మరో అర నిముషంలో వచ్చాడు విశ్వ అక్కడికి - ఆ ఉదయమే ఆశ్రమం నుంచి సూటుకేస్ తెప్పించుకుని విశ్వ అప్పటికే కాలకృత్యాలు ముగించుకుని డ్రెస్ చేసుకొని వున్నాడు.

అదికాదు కృషిని ఆశ్చర్య పరిచింది. నుదుట బొట్టుతో ఇప్పుడే పూజా కార్యక్రమాలు ముగించుకొని వచ్చిన భక్తుడిలా అనిపిస్తున్నాడు.

"బ్రేక్‌ఫాస్ట్ చెయ్" అధికారం ఆత్మీయతల్ని కలిపి ఆదేశంలా అన్నారు ఉపాధ్యాయ . . . వెంటనే టేబుల్ దగ్గర కూర్చోలేదు విశ్వ.

"క్షమించండి - మీ పక్కన కూర్చునే స్థాయి కాదు నాది " అవసరానికి మించిన బిడియాన్ని, భయాన్ని నటిస్తున్న విశ్వ ఆ క్షణంలో ఉపాధ్యాయని ఎంత ఆకట్టుకున్నదీ ఆమె గమనిస్తూనే వుంది.

"మీరు మరీ తప్పదంటే మీరు లేచాక కూర్చుంటాను."

గొంతులో సైతం అసాధారణమైన వినమ్రతని, అణకువని అభినయిస్తున్నాడు.

ఇక రెట్టించలేదు ఉపాధ్యాయ. . . ఏ వ్యక్తయినా తన ముందు అలా ప్రవర్తించడమే ఇష్టమైనట్టు మృదువుగా నవ్వారు. వెంటనే "నీకు ప్రతిరోజూ పూజ చేయడం అలవాటనుకుంటాను."

"నేను దేవుడ్ని నమ్ముతాను సర్. . . ఎందుకంటే" కళ్ళల్లో టన్నుల కొద్దీ భక్తి పారవశ్యాన్ని నింపుకుని మాట్లాడుతుంటే మంటగా చూసిందే తప్ప అతడ్ని నిలదీయ లేకపోయింది ఆమె. "అసలు ఆ దేవుడి దయ లేకపోతే మీ స్థాయి వ్యక్తికి నేను దగ్గరయ్యేవాడ్ని కాదు కాబట్టి. . . నిజానికి ఇప్పటికీ జరిగింది నేను నమ్మలేకపోతున్నాను - ఇది ఏ పూర్వజన్మ సుకృతమో కాకపోతే గుడిసెలో వుండాల్సిన నేను ఈ గుడిలో అడుగు పెట్టడమేమిటి?"

"రేర్ చైల్డ్" అభినందనగా చూసారు ఉపాధ్యాయ "అసలు ఈ కాలంలో ఇలాంటి యువకుడు తారసపడటం . . . 'ఏమంటావ్ కృషి.'"

గొంతు దిగనట్టు పొలమారింది కృషికి - ఏం జరుగుతూంది. . . విశ్వు ఇంతింతై వటుడింతై అన్నట్టు గ్రాండ్‌పా దృష్టిలో అలా ఎదిగిపోతున్నాడేం. . ."యస్ గ్రాండ్‌పా"... ఓరకంట విశ్వుని చూసింది. "నిజమే ఈ కాలంలో ఇలాంటి యువకుడుండటం చాలా అరుదైన విషయం".

"మీ అభిమానం కాని. . ." ఆధ్యాత్మికంగా నవ్వేడు విశ్వు. "ఇదంతా మీ మనసుల్లోని నిర్మలత్వమేగా - అవును మేడమ్. ప్రపంచం కనిపించేది చూసే కళ్ళను బట్టి అన్నది నా నమ్మకం. నమ్మకమేమిటి నిజం కూడా . . . మీరు నన్ను ద్వేషిస్తే ఇప్పటి నా ప్రవర్తన నటనలా వుంటుంది. అభిమానిస్తే వినమ్రతగా కనిపిస్తుంది"

ప్రశాంతంగా నవ్వేరు ఉపాధ్యాయగారు. ఎప్పుడూ వ్యాపారానికి చెందిన ఫైల్స్‌తో లాభనష్టాల చిట్టాలతో కొత్త ప్రొజక్టుల గురించి చేసే ఆలోచనలతో సతమతమయ్యే తనకి విశ్వుతో చర్చ చాలా రిలీఫ్‌గా వుంది. అదొక్కటే కాదు - నిన్న వేదికపై వ్యాపారానికి చెందిన ప్రాక్టికల్ ఫిలాసఫీ మాట్లాడిన విశ్వు ఇప్పుడు ఇంకో డైమన్షన్‌లో కనిపిస్తున్నాడు. చాలా చదివితే తప్ప ఆ వయసులో యింతటి విజ్ఞానాన్ని సంపాదించడం కష్టమైన పని. "చాలా చదివాననుకుంటాను" అడిగారు ఉపాధ్యాయగారు.

తల వంచుకున్నాడు విశ్వు బిడియంగా.

"నిజమే గ్రాండ్ పా" ఉక్రోషాన్ని అదిమి పెట్టుకుంటూ అంది కృషి. "చాలా చదివిన వాడిలా కనిపిస్తున్నాడు . . . చెప్పండి విశ్వనాధ్ గారూ. . . ఇంతవరకూ ఏమేం చదివారు. . . సిగ్గుపడకుండా చెప్పండి."

క్షణంపాటు కృషి కళ్ళలోకి చూసి దృష్టిని మరల్చుకున్నాడు. లోలోన కృషి ఎంత మండిపోతూందో అర్ధమౌతూనే వుంది. "ఎంత చదివినా ఇంకా చదవాల్సింది చాలా వుందన్న సత్యాన్ని మాత్రమే తెలుసుకున్న నేను ఏం చదివానని చెప్పమంటారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని తెలియచెప్పే అద్వైత్వాన్ని, ఏకత్వంలో భిన్నత్వం గురించి వివరించే ద్వైతాన్నీ చదివాను. వేదాలు, ఉపనిషత్తులతో బాటు రామాయణ భారతాల వంటి కావ్యాలు, యుస్కెఫీ ప్రచురణలూ చదువుతుంటాను."

విభ్రమంగా అడిగింది "యుస్కెఫీ ప్రచురణలంటే"

"సమాజంలో విషబీజాలను నాటే సెక్సు గురించి, నేరాల గురించి, సంఘ విద్రోహక చర్యల గురించి రాయబడుతూ పసిపిల్లల మనసుల్ని ఛిన్నాభిన్నం చేసే చెత్త సాహిత్యానికి కలతచెంది ఓ ధర్మసంస్థ విడుదల చేస్తున్న ప్రచురణలవి. . . "

"నేను అడిగింది యుస్కెఫీ అంటే ఏమిటి అని."

"యునైటెడ్ సోషల్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (USCEFU). తెలుగులో అయితే భారతీయ ఆధ్యాత్మిక సాంస్కృతిక విద్యా ధర్మ సంస్థ"

లేనటువంటి ప్రచార సాహిత్యం మూలంగా జంతు ప్రాయంగా మారుతున్న పిల్లల్ని, నేటి యువతని కాపాడాలీ అంటే మన ప్రాచీన విజ్ఞానం గురించి, దేశ భక్తి గురించి, మంచి నడత గురించి తెలియచెప్పే మరెన్నో గ్రంథాల్ని యుస్కోఫీ ప్రచురించాలని కొరుకుంటున్నాను."

ఇంకా మాట్లాడేసేవాడే. . .చప్పట్లు వినిపించాయి. . . వెనక్కి తిరిగిన విశ్శు అప్పుడు చూసాడు డాక్టర్ మహంతిని.

"అభినందనలు మిస్టర్ విశ్వనాథ్. . . " విశ్శుకి నిన్ననే పరిచయం అయ్యాడు డాక్టర్ మహంతి. "అసలు చెప్పడమే కాని వినే అలవాటు లేని మా ఉపాధ్యాయని శ్రోతగా మార్చేసావూ అంటే నువ్వు సామాన్యుడివి కాదు. . . ఇక నో ప్రాబ్లమ్. . . ఉపాధ్యాయగారినిక ఏ అనారోగ్యమూ ఇబ్బంది పెట్టదు. నూరేళ్ళు బ్రతికేస్తారాయన."

ఈ స్టేట్‌మెంట్‌కీ జవాబు చెప్పకుండా వుండలేకపోయాడు విశ్శు. "అనారోగ్యంతో వున్న మనిషి ఆయుష్షుని పెంచేది డాక్టర్లు కాదని తేలిపోయింది మహంతిగారూ. ఈ మధ్యనే అమెరికాకి చెందిన సోషియాలజిస్ట్ 'ఎల్లెన్‌బడ్లర్' హంగేరియాకి చెందిన ఎపిడిమాలజిస్ట్ 'స్లాన్స్మవ్‌కాసి' సైంటిఫిక్‌గా నిరూపించారు"

ఉత్సుకతగా చూసారు ఉపాధ్యాయ. . . అది తన మేధస్సుని మరింతగా ఎరుకపరచాలని విశ్శు చేస్తున్న ప్రయత్నంగా బోధపడిన కృషి సైతం అబ్బురంగా చూసింది. ఎంత కోటీశ్వరుడికైనా బ్రతుకు మీద ఆసక్తి చావదని తెలిసిన విశ్శు ఇక్కడ తెలివిగా అవకాశాన్ని తీసుకుంటున్నాడు.

"అరవై అయిదు సంవత్సరాలు దాటిన సూమారు ఇరవైమూడు వేల మంది పేషెంట్సుని వాళ్ళ ఆరోగ్యం గురించి మూడే మూడు ప్రశ్నలు అడిగారట. ఒకటి నీ ఆరోగ్యం చాలా బాగుందా. రెండు నీ ఆరోగ్యం బాగుందా అని. మూడు నీ ఆరోగ్యం క్షీణించిపోయిందా అని. కొందరు చాలా బాగుంది అన్నారు. మరికొందరు బాగుంది అన్నారు. ఇంకొంతమంది బాగా క్షీణించిపోయింది అన్నారు. ఇందులో బాగా క్షీణించింది అన్నవారు బాగుంది, చాలా బాగుంది అన్న వ్యక్తుల కన్నా ముందుగా అంటే నాలుగు సవత్సరాల వ్యవధిలోనే ప్రాణాలను కోల్పోయారు. దీన్ని బట్టి ఈ సర్వేలో ఎక్స్‌పర్టులు తేల్చిన విషయం ఏమిటంటే జబ్బుపడినా ఆయుష్షుని కాపాడేది జబ్బు విషయంలో ఆయా పేషెంట్సుకున్న ససెప్టిబిలిటీ. . . ఆ ససెప్టిబిలిటీకి దోహదం చేసేది ఆ వ్యక్తులకి చెందిన కుటుంబాల్లోని పూర్వీకులు రోగాల చరిత్ర కూడా. మొత్తానికి పేషెంట్సుని అమితంగా ప్రభావితం చేసేది బ్రతకాలనే ఆశ, బ్రతుకుతాననే ఆశావాదం అన్నది నిపుణులంతా తెలుసుకున్న సత్యం." చెప్పాల్సిందంతా చెప్పిన విశ్శు క్షణం ఆగి ఉపాధ్యాయగారికేసి చూసాడు. "ఇపుడు ఉపాధ్యాయగారు కూడా నూరేళ్ళు బ్రతుకుతారన్నది నిర్వివాదాంశం. ఎందుకంటే ఆశావాదిగానే ఆయన ఇంత సుస్థిరమైన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోగలిగారు కాబట్టి. వేల మందికి అన్నం పెట్టగలుగు తున్నానన్న సంతృప్తితో బ్రతకడంతో బాటు వేల కుటుంబాల ప్రార్థనలే నిన్న ప్రమాదం నుంచి ఆయన్ని కాపాడాయన్నది మనమంతా అంగీకరించాల్సిన నిజం"

కృషికి మతిపోతోంది విశ్శు చాతుర్యం చూస్తుంటే . . .మొన్నెప్పుడో ఓ మామూలు వీధి దొంగగా పరిచయమైనవాడు ఆ తర్వాత క్విజ్‌పోటీలో మేధావి కూడా అనిపించిన మనిషి చివర నీచంగా ఆలోచించగల హీనుడు కూడా అనుకుంటే ఇదేమిటి ఇన్ని రూపాల్లో కనిపిస్తున్నాడు.

ఇంత లోతుగా చొచ్చుకుపోతున్న ఈ వ్యక్తి ఏం ఆశించి ఇంత విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. అసలు దేన్నీ ఓ పట్టాన అంగీకరించని తాతయ్య సైతం మత్తులో కూరుకుపోతున్నాడేం. . .

ఆమె ఆలోచనల నుంచి ఇంకా తేరుకోనే లేదు.

ఇంటి లోపలికి దూసుకువస్తున్నాడు మాధుర్. . . అసిస్టెంట్ కమీషనరాఫ్ పోలీస్... వస్తూనే అందర్నీ గ్రీట్ చేసాడు. ప్రత్యేకించి ఉపాధ్యాయగారితో చెప్పాడు "నిన్న కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సంఘటనలకి కారణం తెలుసుకోగలిగాం ఉపాధ్యాయగారూ... అది జరిగింది టెర్రరిస్టుల మూలంగానో లేక మిమ్మల్ని అపహరించాలనో కాదు."

ఎసిపి మాధుర్ విశ్వ కేసి చుశాడు. . .

తను అనుకున్న నిజాన్ని సాధించిన సంతృప్తితో కృషి తేలుకుట్టిన దొంగలా రెడ్‌హేండెడ్‌గా దొరికిన డెకాయిట్‌లా కనిపిస్తున్న విశ్వని గమనించింది ఏకాగ్రతగా.

నుదుట పట్టిన స్వేదాన్ని తుడుచుకుంటున్నాడు విశ్వ దిక్కులు చూస్తూ. అప్పుడు సమయం ఉదయం తొమ్మిది గంటలు.

0 0 0

"అహమాదిశ్చ మధ్యంచ భూతానాం అంత ప్రవచ. . ." గంభీరంగా ఓ శ్లోకాన్ని వల్లించి ఆగింది గీతాదేవి. . . అప్పటిదాకా మూసుకున్న కనురెప్పల్ని తెరిచి తనకు అభిముఖంగా కూర్చున్న భక్తులందనీ ఓమారు పారవశ్యంగా చూసింది. "ప్రాణుల మొదలు మధ్య చివర నేనే. . . జనన జీవన మరణాలన్నీ నేనే. . నువ్వు పుట్టింది నాలోనే... నాకే - నువ్వు బ్రతికేది నాతోనే. . . నువ్వు చివర ఐక్యమయ్యేది నాలోనే. . . ఇది గీతా సారాంశం."

వయసులో వున్న అమ్మాయిలు నలుగురు కాషాయ వస్త్రధారిణులైన ఆమెకు వింజామరలు వీస్తుంటే మళ్ళీ కళ్ళు మూసుకుంది దేవి. పాతికేళ్ళ వయసు దాటని దేవి ప్రతి ఉదయమూ ఇలా భక్తులకి దర్శనమిస్తూ ఉంటుంది. అవసరాన్ని బట్టి ఒక్కోమారు అత్యవసర దర్శనాలనీ అందించి భక్తుల్ని తరింపచేస్తుంది. ఆ విషయం నగరంలో వున్న ఖరీదైన వ్యక్తులకు మాత్రమే తెలుసు.

సుమారు మూడు సంవత్సరాల క్రితం జూబిలీ హిల్సులోని ఓ ఖరీదైన భవంతిని అద్దెకు తీసుకున్న దేవి ఆధ్యాత్మికమైన ఉపన్యాసాల్ని అందిస్తూ ప్రముఖుల్ని ఆకర్షించి క్రమంగా ఆ ఇంటిని సొంతం చేసుకుంది.

దానిక్కారణం ఆమె అసాధారణ సౌందర్యమే కాక అద్భుతమైన వాక్చాతుర్యం కూడా... ఆమె ఎక్కడినుంచి వచ్చిందో, అసలు జీవితాన్ని ఎలా ప్రారంభించిందో తెలీదు కాని వేదాల్ని, ఉపనిషత్తుల్ని బాగా చదివిందని ఆదిలోనే అందరికీ అర్థమైంది... అలాగే భావించారు. ఆ భవంతిని అద్దెకిచ్చిన ఓ ఐ ఏ యస్ ఆఫీసరూ, అతడి ఇద్దరి కొడుకులు కూడా పైకెగురుతున్న

ఆఫీసరు ఆమె భక్తిలో మునిగాడు. ఆనక వయసులో వున్న కొడుకులూ పనులు మానుకుని ఆమెను కొలవడం ప్రారంభించారు. ఈ కొలవడమన్నది ఒకరికొకరికి తెలియకుండా కొనసాగించడంతో ఆనక భక్తి కాస్త రక్తి దాకా అక్కడి నుంచి కొట్టుకుని విడిపోవడం దాకా కంటిన్యూ అయ్యింది. అప్పుడు ముగ్గుర్నీ ఒకేసారి బెడ్‌రూంలో కలుసుకున్న దేవి "అహంకార విమూఢాత్మ కర్తాయతి మాన్యతే" అంది. . . ఆ వాక్యానికి అర్ధమేమిటో తెలీని ముగ్గురితో "అహంకార వ్యామోహంలో చిక్కుకున్నవాడు కర్తని నేనే, కర్మ క్రియల్ని నేనే అని భావిస్తాడు. తప్పు జరిగిందంతా మన 'ఖర్మ' అని సరిపెట్టుకోడు అన్న జ్ఞానోదయాన్ని గావించి ఇంటి నుంచి బయటికి నెట్టింది.

ఆ తర్వాత ఈ రకం ఆధ్యాత్మిక ప్రక్రియల ద్వారా చాలా మంది ప్రముఖుల్ని ఆకర్షించి తన వ్యాపారాన్ని పటిష్టం చేసుకుంది. ఇప్పుడు ఆమె భక్తుల్లో రాజకీయ నాయకులున్నారు. . . బ్యూరోక్రాట్స్, ఆఫీసర్లూ, వ్యాపారవేత్తలూ వున్నారు. . .ఆమె ఆశీస్సులతో చాలామంది చాలా సాధించగలుగుతున్నా ఏ రోజూ ఆమె బయటికి వెళ్ళదు. . . ఓ రాజకీయ నాయకుడి పదవిని కాపాడాలి అంటే తనకున్న అందమైన పెదవిని అందించడం గాని. ఓ ఇండస్ట్రియలలిస్టుకి కావాల్సిన టెండర్ని సాధించడంలో బెడ్ మీద 'థండర్'లా కదలడం గాని అంతా ఆమె పడక గదిలోనే జరిగిపోతుంది. . . కాకపోతే ప్రతిదానికీ ఓ రేటు వుంటుంది. అలా సంపాదించేది కూడా లోక కళ్యాణార్ధమే అన్నది ఆమె అభిప్రాయం.

అసలు ఆమె ఏమిటీ అన్నది చాలామంది ప్రముఖులకు తెలిసినా ఏ రోజూ ముక్కులమీద వేళ్ళేసుకోలేదు. అసలు ఆమె ఏకాంత సన్నిధి ఓ అరుదయిన పెన్నిధి అనే అభిప్రాయం చాలామందికి ఏర్పడిపోయింది. అందుకే అక్కడికి రాగానే ఓ భావాతీత ధ్యానంలోకి జారిపోయినట్టు పులకించిపోతూ ఆమె ఎవర్ని పిలుస్తుందా అనే ధ్యానంతో కళ్ళు మూసుకుంటారు. అంతకు ముందే నిర్ణయించబడిన షెడ్యూల్ ప్రకారం భక్తుల్లో ఎవరో ఒకరికే ఏకాంతసేవకి అవకాశం ఇస్తుంది దేవి. . .

"భక్తా" రెండు నిముషాల ధ్యానం తర్వాత ఆమెకు అభిముఖంగా ముందు వరుసలో కూర్చున్న రామనాథచౌదరికి సంజ్ఞ చేసింది. "మీ సమస్యని వినాలని ఉత్సాహ పడుతున్నాం"

అంతే. . .ఉదయం పూజలో ఇంకెవరికీ అవకాశం ఉండదన్నట్టుగా మిగతా వ్యక్తులు లేచి వెళ్ళిపోగా గంభీరంగా నడుచుకువెళుతున్న దేవి వెనుక ఏకాంత మందిరంలో అడుగుపెట్టాడు చౌదరి.

మరో ఐదు సెకండ్లలో ద్వారం మూసుకుంది.

ఆమె నేలమీద ఆసీనురాలైంది ముందు. . . ఐదు నిముషాలలో అటాచ్డ్ బాత్‌రూంలో స్నానం చేసి వచ్చాడు చౌదరి. . . అది ఆచారం. ఆమె అనుమతి కోసం అన్నట్టుగా చౌదరి ఎదురు చూస్తుంటే నెమ్మదిగా పైకి లేచింది. . . "మృత్యు: సర్వహరశ్చహమ్. . ." అన్ని

అప్పటికే పేకెట్టుని బెడ్‌పై ఓ మూల వుంచాడు. అందులో వున్న కరెన్సీ ఎంతని అడగలేదు. అడగదు - చౌదరి స్థాయి తెలుసు కాబట్టే అంతకు పూర్వంలాగే ఈ రోజూ నిశ్శబ్దంగా వివస్త్రగా మారింది.

అరనిముషం వ్యవధిలో తన ముందు నగ్నంగా నిలబడ్డ దేవిని చూడటానికి కళ్ళు చాల్లేదు చౌదరికి. ప్రతిసారీ ఇంతే. ఆమెను ఎన్నిసార్లు అనుభవించినా తనివితీరదు. . . నిజానికి ఆమెది అందం కాదు ఇక ఎప్పటికీ వెనక్కి రాకూడదనిపించే అంతరిక్ష గవాక్షం. షూట్ ఎట్ సైట్ వారెంటులా వెంటనే చంపాలనో, చావాలనో అనిపించే కోరికలతో మండుతున్న చితాగ్నిగుండం. . .

"భక్తా. . . రా . . . నాలో ఐక్యం కా" అంది విల్లులా వంగిపోతూ. అనుభవాన్ని ఐక్యం కావడంగా అభివర్ణించే దేవిని బెడ్ మీదకి నడిపించబోయాడు ఉద్రేకంగా. "ఈ రోజు ఏకాదశి. . . మేం నేలమీదనే శృంగార క్రీడని ఇష్టపడతాం"

అదేశంలా ఆమెను సమీపించి నేల మీదకి నెట్టబోతుంటే "విద్ధకమునకు సిద్ధపడు" అంది.

"ఆ పనిలోనే వున్నాను" అన్నాడు ఆమె పైకి రాబోతూ.

"విద్ధకము అనగా వాత్సాయనుడి కామశాస్త్ర రీత్యా ఒకరి నొకరు బలంగా బంధించుకోవడం. నువ్వు చెయ్యాలనుకునే యుద్ధం కాదు" అణువంత కోపాన్ని అభినయించింది. . . ఆమె భాషతో ప్రతిసారీ కంగారుపడే చౌదరి ఆమె చెప్పినట్టు విద్ధకం పూర్తిచేసి ఆమెను ఆక్రమించాడు.

ఆ గదిలో గాలి వేడి సెగలుగా మారుతూంది.

వృద్ధాప్యం మూలంగా చౌదరి ఇబ్బంది పడటాన్ని గమనిస్తూ "తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యధ్యచ.... నన్ను తలచుకుంటూ యుద్ధాన్ని కొనసాగించు" కళ్ళను అరమోడ్పులుగా మార్చి ఉత్సాహ పరిచింది "నీ సమస్యను వివరించు."

కొద్దిగా ఆగేడు. "నా మిత్రుడొకడికి మేషిన్ టూల్ ఫ్యాక్టరీ వుంది - ఈ సారి డిఫెన్స్ టెండర్ వాడికి రావాలి. . . మాకు ముఖ్యమైన పోటీ కృషి మెషిన్ టూల్స్ యజమాని ఉపాధ్యాయ. ఇంతవరకూ ఉపాధ్యాయ ప్రతిసారీ సాధిస్తున్న ఆ టెండర్ మేం సంపాదించాలి"

మృదువుగా నవ్వింది. . . " ఉపాధ్యాయ " మననం చేసుకుంటూ అంది "నీ చిరకాల ప్రత్యర్థి కదూ. . .సరే. . . ఉపాధ్యాయ నాలో ఐక్యం కావటానికి అవకాశం లేకపోయినా నీ కోరిక నెరవేస్తాను. . . "

"థ్యాంక్స్" లేచాడు యజ్ఞం పూర్తిచేసినట్టుగా. అయిదు నిముషాలలో బాత్‌రూంలో నుంచి బయటికి వచ్చాడు.

"నీ ఆయుధం ఎలా వుంది" అంది దేవి వున్నట్టుండి ఉలిక్కిపడ్డాడు. "నేను అడుగుతున్నది నువ్వు ఉపాధ్యాయపై సంధించిన విశ్వనాథ్ అనబడే ఆయుధం గురించి"

ఉపాధ్యాయ ఇంట్లో అడుగు పెట్టాడు. మహా మేధావి కాబట్టి ఇక దూసుకుపోతాడు. . .”అర నిముషం పాటు కళ్ళు మూసుకుంది ఏ దివ్యలోకాల్నో దర్శిస్తున్న తపస్వినిలా. ఆ తర్వాత మృదువుగా నవ్వింది.

“ఘటికుడే” అంది పారవశ్యంగా ” అతడ్ని ఓ మారు పంపండి ఐక్యం చేసుకోవాలనుంది.”

ఉలిక్కిపడ్డాడు చౌదరి. . . దేవి అడిగిందంటే ఇక తిరుగులేదు. అసలు ఇలా అడుగుతుందని చౌదరి ఏనాడూ ఊహించలేదు. . .

“నువ్వు కోరింది జరగాలీ అంటే అలాంటి సమర్థుడైన యువకుడితో మేం ఓమారు ఐక్యం కావాలి చౌదరీ. . రేపు రాత్రికి అతడ్ని పంపించు” ఆమె అడిగింది అర్ధరాత్రి ప్రత్యేక దర్శనానికి అని బోధపడిపోయింది. భక్తులతో కాక విడిగా రావచ్చు. . .

“అలా పంపితే నీ టెండర్ సమస్యని రేపు రాత్రిలోగా మేం పరిష్కరిస్తాం”

ఓ ఆదేశంలా చెప్పి ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

ఇక మళ్ళీ దర్శనం వుండదు. . . మాట్లాడే అవకాశం లేదు. అదంతే. . . తప్పించుకోటానికి ఈ ఒక్కసారితో తీరే పనికాదు. దేవి మూలంగా చాలా పనుల్ని సాధించాడు. . . ఇప్పుడు అడిగే టెండర్ వ్యవహారమూ సామాన్యమైనది కాదు. అది సాధించగలిగితే తనకి కనీసం యాభై లక్షల కమీషన్ దక్కుతుంది.

విశ్వని పంపటానికే తీర్మానించుకున్నాడు చౌదరి.

అప్పుడు సమయం ఉదయం తొమ్మిది గంటల రెండు నిముషాలు. . .

0 0 0

“కేవలం మిమ్మల్ని టెర్రరైజ్ చేయటానికి ఎవరో చేసిన ప్రయత్నం అది” ఎసిపి మాధుర్ కంక్లూడ్ చేశాడు విశ్వపై నుంచి దృష్టి మరల్చకుండా. . .

ఉపాధ్యాయకి బోధపడలేదు మాధుర్ చెబుతున్నదేమిటో.

విషయం మరింత స్పష్టంగా అర్థమయ్యేట్టు చేసే ప్రయత్నంలా కృషి మాధుర్ని అడిగింది “అలాంటి ప్రయత్నం వలన ఎవరికి ఉపయోగం?”

“మీకు, నాకు లేకపోవచ్చు మిస్ కృషి. ఉపాధ్యాయగార్ని కాపాడగలిగామనే క్రెడిట్ కోసం ఎవరో ఈ పని చేసి వుండొచ్చుగా”

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

ఉపాధ్యాయగారి మొహంలో రంగులు మారాయి.

విశ్వని యిరికించగలిగిన సంతృప్తితో కృషి తాతగారికేసి చూస్తుండగానే ఫోన్ రింగయింది.

రిసీవర్ని సాలోచనగా అందుకున్న ఉపాధ్యాయగారు “ఎస్. స్పీకింగ్” అన్నాడు ముందు.

ఆ తర్వాత అర నిముషం పాటు రిలీఫ్‌గా విని ఫోన్ క్రెడిల్ చేశాడు.

"సరైన ఆధారాలు లేకుండా మాట్లాడ్డం అవివేకం మిస్టర్ మాధుర్. . ." చెప్పారు ఉపాధ్యాయగారు నిట్టూర్చుతూ. "ఇప్పుడే మీ కమీషనర్ ఫోన్‌చేసి చెప్పాడు.... కాచిగూడా పోలీసులకి కాన్ఫరెన్స్ హాల్లో స్మోక్ బాంబ్ పెట్టిన నేరస్థుడు పట్టుబడ్డాడు"

"వ్వాట్" నిశ్చేష్టుడిలా అడిగాడు మాధుర్.

"అంతే కాదు. . . నన్ను కిడ్నాప్ చేసే ప్రయత్నంలో అడ్డం వచ్చిన విశ్నుని గాయపరిచినట్టుగా దాన్ని కూడా అంగీకరించాడట" ఉపాధ్యాయగారు చెప్పిందంతా విన్న మాధుర్ ఇక అక్కడ నిలబడలేదు. తన పై అధికారి చెప్పిందాన్ని కాంట్రాడిక్టు చేయలేనట్టుగా శలవు తీసుకుని కాదు - క్షమార్పణలు చెప్పి మరీ వెళ్ళాడు.

కృషి తెల్లబోయి చూస్తుంది విశ్నునే. . . అతడి మొహంలో ఏ భావమూ వ్యక్తం కావడం లేదు. . . అసలు చేసింది విశ్ను అయితే మరెవరో నేరాన్ని అంగీకరించడ మేమిటి.. .

తలవంచుకుని నిలబడ్డ విశ్నుతో అన్నారు ఉపాధ్యాయగారు "జరిగిందానికి బాధ పడుతున్నావా"

విశ్వ నిర్వేదంగా నవ్వాడో అలా అభినయించాడో కృషికి అర్థం కాలేదు. “నేను బాధపడుతున్నది జరిగిందానికి కాదు ఉపాధ్యాయగారూ. ఇక ముందు జరగబోయేదాని గురించి. . . మీ అభిమానాన్ని పొందగలిగిన ఒక అనాధ యువకుడిపై కక్షతో పోరాటం ప్రారంభించిన వాళ్ళు రేపు మరేం చేస్తారో అన్నది వూహించలేక పోతున్నాను.”

లాలనగా విశ్వని పేట్ చేశారు ఉపాధ్యాయ . . . విశ్వ చెప్పిన దాంట్లో తనో అనాధ అన్న పదం ఎక్కువగా ఆయన్ని కదిలించినట్టుగా “నేనుండగా నువ్వు అనాధవి కావు విశ్వ” అన్నారు గంభీరంగా.

అది విశ్వ నటనలో గొప్పతనమో లేక నిజాన్ని గుర్తించలేని తాతయ్య అమాయకత్వమో కృషికి తోచడం లేదు. కాని విశ్వ చాలా అమోఘంగా ఆకట్టుకుంటున్నాడు.

ఆ తర్వాత ఫ్యాక్టరీకి బయలుదేరుతున్న ఉపాధ్యాయని వారించబోయాడు విశ్వ “ఈ వయసులో సైతం మీ దీక్ష, దక్షత కొనియాడ తగినవే! కాని మీ ఆదేశాల్ని పాటించడానికి నాలాంటి వాళ్ళుండగా మీరింకా శ్రమపడటం నాకు సమంజసంగా అనిపించడం లేదు”

మృదువుగా నవ్వారాయన. . . “నా శరీరంలో శక్తి ఇంకా ఉడిగిపోలేదు విశ్వనాథ్” అంతకు మించి మాట్లాడకుండా డాక్టర్ మహంతితో బాటు బయటికి వెళ్ళిపోయారు.

విశ్వ నిజాయితీపైనా సమర్థతపైనా అసాధారణమైన నమ్మకం ఏర్పడిపోయిన ఉపాధ్యాయ కారెక్కుతూ డాక్టర్ మహంతితో ఏం చెప్పిందీ కృషికి తెలీదు.

కాని ఉపాధ్యాయని పూర్తిగా నమ్మించగలిగిన విశ్వతో అంది ఉక్రోషంగా “అభినందిస్తున్నాను విశ్వా. . . నీ నటనా కౌశల్యానికి ఆశ్చర్యపోతున్నాను”

“అప్పుడే ఏం చూసేవు కృషి ఇది ప్రారంభం మాత్రమే”

“నన్ను కూడా తక్కువగా అంచనా వేయకు”

“అలా చేసేవాడ్ని అయితే అక్కడ పోలీస్ స్టేషన్‌లో చౌదరి మనిషి సరెండర్ అయ్యేట్టు ఆర్గ నైజ్ చేసేవాడ్ని కాదు కృషి ”

అదిరిపడింది కృషి “వాట్”

“ఎస్ మిస్ కృషి” విజయగర్వంతో నవ్వాడు విశ్వ. “నాకు తెలుసు నువ్విలాంటి పరిశోధన ప్రారంభిస్తావని. . . అందుకే చౌదరితో మాట్లాడాను. ఓ మనిషిని ఏర్పాటు చేశాను. . .పాపం. . .ఏసిపి మాథుర్ వచ్చేసరికి చెస్‌లో నాకు చెక్ చెప్పేసినట్టు తెగ సంబరపడిపోయావు కదూ. . .కాని . . . పదివేలు మొహాన పడేస్తే నేరం ఒప్పుకుని జైల్లో కూర్చునే వ్యక్తులు ఈ దేశంలో చాలా మంది వుంటారని తెలుసుకోలేకపోయావు...”

కృషికి ముచ్చెమటలు పోసాయి. . . ప్రతి యెత్తుకి పై యెత్తు వేసి చాల అలజడి సృష్టిస్తున్నాడు విశ్వ.

“దేనికోసం ఇదంతా”

“నీ మీద గెలుపుకోసం”

“అంటే. . ..”

“నువ్వెంత వున్నదానివైనా నాకింద వుండాల్సిన దానివే అని నీకు నిరూపించడం కోసం”

“అదంత సులభం కాదు విశ్బు . . . .”

“సులభమే అయితే యిన్ని పథకాలెందుకు కృషి ఎప్పుడో కానిచ్చేసేవాడ్నిగా” క్షణం ఆగి అన్నాడు “అంచెలంచెలుగా ఎదిగిపోతున్న నన్ను చూస్తుంటే ఇప్పుడేమని పిస్తూంది”

“నువ్వు వచ్చింది కేవలం నాకోసం మాత్రమే కాదని అర్థమైపోయింది విశ్వూ. . . ఇప్పుడు అసలు పరిశోధన ప్రారంభించాలని వుంది”

ఎగతాళిగా నవ్వేడు విశ్బు. . .

“ఒకనాడు నేను నీ తల్లిని కిడ్నాప్ చేయించావన్నావుగా. . .”

“అయితే”

“ఇప్పుడు ఆవిడ్ని నిజంగా కలుసుకోబోతున్నాను. . . ”

“నువ్వో అనాధవని యిందాక మా గ్రాండ్‌ఫాదర్‌తో అన్నావుగా”

విశ్బు మొహంలో రంగులు మారాయి.

“నువ్వు చెప్పింది నిజం కాదని మా తాతయ్యకి త్వరలోనే తెలియచెప్ప బోతున్నాను. నిన్నీ యింటి నుంచి బయటికి సాగనంపబోతున్నాను”

కృషి వెంటనే ఆ పనిలో నిమగ్నమయ్యేదే కాని ఫ్యాక్టరీ నుంచి అర్జెంటుగా రమ్మని ఉపాధ్యాయగారు ఫోన్ చేశారు. . . ఇప్పుడిప్పుడే కొన్ని కీలకమైన నిర్ణయాలలో కృషిని ఇన్వాల్వ్ చేస్తున్న ఉపాధ్యాయ గారు పిలిచింది తన ఛాంబర్‌లో జరిగే ఓ ముఖ్యమైన సమావేశంలో పార్టిసిపేట్ చేయమని. . .

అది ఉపాధ్యాయ తన మెషిన్‌టూల్ ఫ్యాక్టరీకి సంబంధించి పంపబోయే టెండర్ గురించి.

చౌదరి నిన్న దేవిని ఏకాంత సేవలో అడిగింది ఆ టెండర్ గురించే. . .

కృషి రోజంతా అ పనిలోనే బిజీగా వుంది.

0 0 0

రాత్రి పది గంటలు కావస్తుండగా జూబిలీ హిల్స్‌లోని గీతాదేవి బిల్డింగ్‌లో అడుగుపెట్టాడు విశ్బు.

నిజానికి వెళ్ళడం ఇష్టం లేదు కాని ఓ ముఖ్య సమాచారం తెలుసుకోవాల్సి వుంది కాబట్టి వెళ్ళక తప్పదన్నాడు చౌదరి.

ఖరీదైన భవంతిలోని హాల్లో అడుగు పెట్టగానే ఓ స్వాగతంలా పది మంది అమ్మాయిలు ఎదురొచ్చారు. . . లోలోన చాలా కంగారుపడ్డాడు. అక్కడ జరిగే కార్యక్రమం గురించి చౌదరి కొద్దిగా హింట్ చేశాడు. కాని ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే కొత్తల్లుడు తొలిసారిగా అత్తగారింట అడుగుపెట్టినప్పటి ఏర్పాట్లలా అనిపించింది.

తెలియజేసింది.  ఆమె వెనుకగా మెట్లెక్కి ఓ గది దాకా వచ్చాడు. . .ఆ తర్వాత లోపలికి వెళ్ళమన్నట్టు సంజ్ఞ చేసి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

లోపల అడుగుపెట్టగానే మల్లెల గుబాళింపు .... ఎదురుగా శోభనపు మంచంలా అలంకరించబడిన బెడ్. . . ముచ్చెమటలు పోస్తుంటే ముందుకు నడిచాడు. . . . దేవాలయం మీద బూతుబొమ్మల్లా గోడల నిండా శృంగారానికి సంబంధించిన చిత్రాలున్నాయి. . .చౌదరి పంపింది ఒకందుకైతే వచ్చింది మరెందుకో అన్నట్టు అక్కడి వాతావరణం ఆందోళన పుట్టిస్తుంటే ద్వారం గడియపెట్టిన చప్పుడు వినిపించింది.

గభాలున వెనక్కి తిరిగిన విశ్ను రెండు నిముషాల దాకా చూపు మరల్చుకోలేకపోయాడు.

పరిమళపు ప్రభంజనంలా, స్వప్న రంభాపరీరంభపు కైపుతో వినీల శిరోజ తమస్సముద్రంలో ఉద్భవించిన నందివర్ధనంలా నడిచి వస్తూంది దేవి.  కళ్ళతో కాంక్షల మేలుచాందినీలు. . .పరతెంచే పుష్పపరాగం. .  . కాలాన్ని స్తంభింపచేసి 'గిరులకీ జరులకీ అర్థం నేనే' అన్న అహాన్ని ప్రదర్శించే అదిరే ఆనందపు నెలవంకల అధరాల సవ్వడి. . .

"మిమ్మల్ని మెచ్చాం భక్తా" గళాన సౌందర్య మధూళిని చిందిస్తూ నవ్వింది దేవి... అతడు నివ్వెరపోయి చూస్తుండగానే ఆమె శరీరంపై ఉన్న ఉల్లి పొరలాంటి చీర నేల జారింది.

ఆమె ఒంపుల్లో ఇంద్రధనస్సులూ, అదృశ్యస్వర్గాలూ అశ్రుతగాంధర్వాలూ యిప్పుడు బహిర్గతమై మొగలిపొదలో పడగవిప్పి ఆడ త్రాచును గుర్తు చేస్తున్నాయి.

ఏకాంత సేవలో ఆనవాయితీగా వుండే స్నానం గురించి ఆమె విస్మరించింది.  ఇప్పుడు అలాంటి ఆలస్యం సైతం ఆమెకు భరింపశక్యం కానట్టు "రా. . . మాలో ఐక్యంకా. . . " అంది మగతగా.

చెమట్లు పట్టేయి విశ్నుకి.

"నిన్నే భక్తా. . .జ్ఞానాకారమిదం సర్వం. . .ఇప్పుడు మాలో ఐక్యం కావడమూ జ్ఞానమే - రా" విరహంతో కాగిపోతూందామె.

"నేను. . . . బ . . .బ్రహ్మచారిని. .  ." అదో అనర్హతలా వ్యక్తం చేశాడు  కంగారుగా.

"మాకు మరింత ఆసక్తికరమైన విషయం" అతడి ముందుకు వచ్చి బాట చూపుతున్నట్టు నేలపై పడుకుంది.

"ఇంతవరకూ నాకు అలవాటు లేదు" ఉన్న వాస్తవం చెప్పేశాడు "అందుకే చేతకాదంటున్నా."

"పిచ్చి భక్తా. .  ." గొణిగింది స్వగతంలా "కర్మజ్యాయోహ్యా కర్మణ: అని వినలేదా"

"ఇదే తొలిసారి వినడం. . ." ఏ ఆడదైనా ఆఖరికి వేశ్యయినా గాని ఈ రేంజ్ ఉన్మాదం ప్రకటించగలదని అతడకి తెలీదు. . . ఇప్పుడెలా తప్పించుకోవడం. . . సీరియస్‌గా అన్నాడు. "మీ బాధ అసలు అర్థం కావడం లేదు"

నిర్వహించకపోవడం కన్నా కర్మని నిర్వహించడమే మిన్న అన్నది అర్యోక్తి. . . ఉపదేశించటానికి మేం సిద్ధంగా వున్నాం. . .ముందు మానసికంగా సిద్ధంకా. . .”

“అది కాదు మేడమ్. . .”

ఆమె కళ్ళు అరుణిమని పుంజుకున్నాయి. . .చూపు మాత్రంగానే మగాళ్ళని శాసించి పాదాక్రాంతం చేసుకోగల ఆమె శక్తి ఇక్కడ విఫలమవుతున్నట్టు కోపంతో ఆమె కంపించిపోతుంది “మయి బుద్ధిం నివేశయ. . . .”

“ఇదీ నాకు అర్థం కాలేదు”

“మాలో బుద్ధిని మనసుని నిలుపుకొమ్మని ఆదేశిస్తున్నాను.”

“నిలుపుకోవడం కష్టంగా వుంది”

”ఏకాగ్రతగా ప్రయత్నించు”

“ప్రయత్నించడానికి నాకు అభ్యంతరం లేదు”

“మరి ఏమిటి నీ సమస్య .. . . ” ఉక్రోషంగా అడిగింది.

“జఘాతా కృషినా కఠోరలఫాకిట్” విభ్రమంగా చూసింది “ఏమిటి నీవు చెప్పింది”

“జఘాతా కృషినా కఠోరలఫాకిట్”

“ఇది ఏ వేదములందూ మేం వినలేదు”

“అవకాశం లేదు. . . . ఎందుకంటే అది లాటిన్ భాష కాబట్టి.”

“ఆ భాషని మా ముందు వల్లించడంలో మీ వుద్దేశం.”

“సర్వజ్ఞులు మీకు తెలుయనిదేముంది” నిజాయితీగా అన్నాడు. మొహంలో సాధ్యమైనంత బాధని రంగరించుకుని.

“నేను ఆ జబ్బుతో బాధపడుతున్నాను”

దేవి ఉలికిపాటుగా చూసింది. “మీరు రోగగ్రస్తులా”

“హు” ఆర్ధ్రతగా అన్నాడు “శాపగ్రస్తుణ్ని మేడమ్. . .లేకపోతే ఈ వయసులో ఎంచక్కా మీలాంటి వాళ్ళ ఆఫర్‌ని కాదనడమేమిటి చెప్పండి - ఈ పాటికి వాత్స్యాయునిడి పుస్తకం పక్కన పెట్టుకుని మిమ్మల్ని ఓ ఆట ఆడించేవాడ్నిగా. . . కాని ఓ జబ్బు మూలంగా యీ అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోతున్నాను”

ఆ శ్లోకం మననం చేసుకోబోయింది గాని విశ్వ చెప్పిన జబ్బు గుర్తుకు రాలేదు.

దేవి ఇబ్బందిని గుర్తించినట్టు మళ్ళీ తనే చెప్పాడు విశ్వ.

“జఘాతా కృషినా కఠోరలఫాకిట్ అనే ఈ జబ్బుని తెలుగులో ఏమంటారో నాకు తెలీదు. కాని లాటిన్ భాషలో దీనికి అర్థం ఘటాఫట్ లాడించే వయసులో కఠినమైన నిగ్రహంతో వ్యవహరించూ అని. . .ఇది నాకెలా వచ్చిందీ మరలా ఎంతకాలం వుంటుందీ అన్నవి మీ తర్వాత ప్రశ్నలనుకుంటాను”

“ఓసారి పందెం కాసి చార్మినార్ మీద నుంచి దూకాను. . . అంతే జారిపోయింది”

“ఏమిటి” టక్కున అడిగింది.

“వెన్నుపూస. . . కొంతకాలం వీపులో వట్టి నొప్పిలే అని సరిపెట్టుకున్నాను. ఆ తర్వాత తెలిసింది నాలో మగాడికుండే సహజమైన స్పందన పోయిందని. . .చాలా మంది డాక్టర్లకు చూపించాను. . .చూపించిందేమిటి అని అడక్కండి. వాడుక భాషతో చూపించడమంటే జబ్బు లక్షణాల గురించి చెప్పడమేగా . . .ఆ ప్రోసెస్‌లో చాలా టెస్టుల తర్వాత తేలిందేమిటంటే యిదో అరుదైన జబ్బని - ఆ తర్వాత ఏడాదిగా మందులు వాడుతున్నాను.. ఇప్పుడు మొత్తం అంతా మామూలుగానే వుంది కాని మరో పదిరోజులు మందులు వాడాలి. అంతే. . అప్పుడు మీతోనే బోణీ ప్రారంభిస్తాను. . .” అబద్ధాల్ని ఆర్డర్‌లో అందంగా చెప్పిన విశ్వ దేవి అహాన్ని చల్లార్చేటట్టుగా మంచి భావుకతనీ ప్రయోగించాడు “ఇది హామీ యివ్వడం కాదు దేవీ. . . . సముద్రంలా పరుచుకున్న మీ శృంగార తనూలతని చూస్తూ దిక్కూచి పని చెయ్యని ఓడలా నిలబడిన నా దుర్విధికి బాధపడుతున్నాను. ఆకాశ ద్వారంలో అడుగుపెట్టమని పాలపుంత తోరణాలుకట్టి స్వాగతం చెప్పినా నక్షత్రాల్ని కోసి మీ సిగలో పెట్టాల్సిన నేను పువ్వులా కాక మొగ్గలా మిగిలినందుకు కుమిలిపోతున్నాను. . . . క్షణం సేపు స్వప్నంలోకి జారిన నేను పది రోజుల వ్యవధిలో మళ్ళీ మీ ముందుకు రావాలని వువ్విళ్ళూరుతున్నాను”

దేవి నేత్రాలు అరమోడ్పులయ్యాయి. . . . అర్జునుడి కోసం ఎదురు చూసిన నాగకన్య ఉలూచిలా బుసకొడుతూ అతడి మాటల తూణిరాలు మనసుని స్పందింప చేస్తుంటే భారంగా కనురెప్పల్ని మూసుకుంది.

“నేను చెప్పింది నిజమో కాదో దివ్య దృష్టితో పరికిస్తున్నట్టున్నారు” అన్నాడు మరింత ఆర్ద్రంగా.

“అవును” అంది కాని దేవి ఆ క్షణాన ఆలోచిస్తున్నది పదిరోజుల తర్వాత అతడితో సాగించబోయే ప్రణయపోరాటం గురించి. జీవితంలో తొలిసారి ఇలాంటి అనుభవం ఎదురైనందుకేమో ఓడిన బాధతో ఆ బాధపై సాధించాల్సిన గెలుపుకోసం సీరియస్‌గా ఆలోచిస్తుంది.

ఆశించింది జరిగిపోతే దాని ఆయుష్షు అయిదు నిమిషాలే కాని ఇప్పుడు జరగాల్సిందాని కోసం ఆశించడం, ఆశిస్తూ ఎదురు చూడడం వింతగా వుంది. విరహం ఆమెకు అర్థం కాని పదం.

“నీ కోసం ఎదురు చూస్తుంటాం” అంది తమకంగా.

ఆ తర్వాత ఆ రోజు సాయంకాలం కృషి మెషిన్ టూల్స్ జనరల్ మేనేజర్ సుబ్బారాయుడు ఏకాంత సేవలో అందించిన టెండర్ జిరాక్స్ కాగితాన్ని విశ్వ కిచ్చింది. “ఎప్పుడో భార్యని హత్యచేసిన జనరల్ మేనేజరు సుబ్బారాయుడు దానిని ఆత్మహత్యగా

మారి అప్పుడప్పుడూ మాలో ఐక్యం కావాలని వస్తూంటాడు - చౌదరి కోరింది దృష్టిలో వుంచుకుని ఈ రోజు సుబ్బారాయుడి నుంచి యిది సంపాదించాం. జాగ్రత్తగా రాయుడికి అప్పజెప్పండి.

విశ్శు నిశ్చేష్టుడై చూశాడు ఆ కాపీలోకి. . .అందులో ఉపాధ్యాయగారు 'కోట్' చేసిన రేటుని తగ్గించి టెండరు పెడితే చాలా కోట్ల ఖరీదు చేసే ఆర్డరు మరొకరి సొత్తయిపోతుంది.

"పది రోజులలో రావాలి విశ్వనాథ్ - మిమ్మల్ని మాలో ఐక్యం చేసుకోవాలని మనసు ఉవ్విళ్ళూరుతూంది" బయటికి వెళ్తున్న విశ్శుతో మరోసారి ఓ షరతులా చెప్పింది.

0 0 0

"ఇప్పుడు మెషినరీని అర్జెంటుగా ఇంపోర్ట్ చేయాల్సిన అగత్యమేముంది" అడిగింది కృషి ఉపాధ్యాయగార్ని చూస్తూ . . . . అనారోగ్యంతో రోజురోజుకీ మరిన్ని సమస్యల్లో ఆయన కూరుకుపోవడం ఆమెకు ఇష్టం లేకనే ఆ మాటంది తప్ప ఫ్యాక్టరీ విస్తరణ ఆమెకు ఇష్టం లేక కాదు. "అంతకన్నా ఉన్న వనరుల్ని సద్వినియోగ పరుచుకునే ప్రొడక్టివిటీ గురించి ఆలోచించడం బెటరనుకుంటాను"

కృషి ఆర్గ్యుమెంట్ నచ్చలేదు ఉపాధ్యాయగారికి - మారుతున్న పారిశ్రామిక ప్రపంచంలో ఆధునికత కూడా చాలా అవసరమన్నది ఆయన వుద్దేశ్యం. . . అందుకే పదికోట్లు ఖర్చుచేసి మెషిన్‌టూల్ ఫ్యాక్టరీకి యంత్రాల్ని దిగుమతి చేసుకోవాలని ఆలోచిస్తున్నారు.

ఉదయం ఎనిమిది గంటల సమయాన డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని యిద్దరూ చర్చించుకుంటుండగా వచ్చాడు విశ్వ అక్కడికి. అతడ్ని చౌదరి మనిషిగా భావించే కృషి విశ్వ సమక్షంలో యిదంతా చర్చించడం ఇష్టం లేక టాపిక్ మళ్ళించబోతుంటే ఉపాధ్యాయగారే కదిపాడు విషయాన్ని - నిజానికి వారి చర్చ అంతా అప్పటికి విన్న విశ్వ ఆయన చెబుతున్న దానిపై ఆసక్తిని ప్రదర్శించాడు. తెలివున్నవాడు చర్చని ఏ కోణంలో అయినా కొనసాగించగలడు అనటానికి ఉదాహరణ విశ్వ చెప్పిన జవాబు ఇక్కడ విశ్వ లక్ష్యం ఉపాధ్యాయగార్ని సమర్ధించడమే. . . . "వ్యాపారంలో ఎక్కువగా డబ్బు సంపాదించడమెలా అని ఓ సగటు వ్యాపారవేత్తని ప్రశ్నిస్తే అతడిచ్చే జవాబు కార్మికులకి తక్కువ డబ్బు చెల్లించి ఎక్కువ పని చేయించుకోవడం అని! కాని వ్యాపారం చేసేది మనకోసం కాదు వినియోగదారుడి కోసం అని ఆలోచించే ఆధునిక భావాలు గల వ్యాపారవేత్త తన ఘన విజయానికి ప్రాతిపదికలా ఫ్యాక్టరీని మోడర్‌నైజ్ చేయాలని ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో కొత్త యంత్రాలని దిగుమతి చేస్తాడు. . . కార్మికుల తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి చేసే వినూత్నమైన పద్ధతులకి అనుగుణంగా అలా దిగుమతి చేసి అటు తను ఎక్కువ లాభాల్ని ఆర్జించడమేగాక వినియోగదారుల్ని సంతృప్తి పరుస్తాడు తక్కువ ధరలకి సరుకుల్ని అమ్ముతూ. . ."

"మీరు చెప్పేది థియరీ" అంది కృషి రోషంగా.

"నేను చెప్పిన థియరీ ప్రాక్టికల్‌గా నిరూపించబడింది మేడమ్. ఆరు వందల రూపాయలకి కెమిస్టుగా ఉద్యోగం చేసిన కార్సన్‌భాయ్ పటేల్ యీ రోజు వందల కోట్ల రూపాయల టర్నోవర్ గల 'నిర్మ' వాషింగ్ పౌడర్‌ని మార్కెట్ చేస్తున్నది అదే థియరీపై . . . అటు బిర్లాలకి ఇటు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన హిందుస్తాన్ లీవర్‌కి ప్రత్యర్థిగా నిలబడ్డ పటేల్‌కి 'నిర్మా' పేకట్‌పై వస్తున్న లాభం చాలా తక్కువ. కాని ఎక్కువ ఉత్పత్తి చేస్తూ ఎక్కువ లాభాల్ని పొందగలుగుతున్నాడు. ఈ రోజు అతడి వ్యక్తిగత ఆస్తులే సుమారు వందకోట్ల దాకా వున్నాయి. అంటే ఆధునికమైన పద్ధతులు ఆ పద్ధతులకి అతడుపయోగించే యంత్రపరికరాలే"

అభినందనగా చూశారు ఉపాధ్యాయగారు. విశ్వ ఓ వ్యక్తిగా కాక ఓ నిఘంటువులా

"అలాగే బారన మార్సెల్ బిక్ కూడా తొలిసారి బాల్ పాయింట్ పెన్నుని తయారుచేసి అతడు మార్కెట్‌లో విడుదల చేసినప్పుడు ఒక్కో పెన్ను మీద అతడి లాభం 00666 సెంట్సు మాత్రమే. అయినా యంత్రాలతో ఫ్యాక్టరీని ఆధునీకరించాడు. సాలీనా కోటి డాలర్ల లాభాన్ని సంపాదిస్తున్నాడు. సో - ఎక్కువలాభాలు కావాలీ అంటే నాణ్యతగల ఉత్పత్తి ఎక్కువ కావాలి. ఆ నాణ్యతకీ ఉత్పాదకతకీ కొత్త యంత్రాలూ వుండాలి."

తెలిసిన స్టేటిస్టిక్స్‌ని మాటల గారడితో మిశ్రమం చేసి అద్భుతంగా స్కోర్ చేస్తున్న విశ్శుని ఓడించాలనుకుంది కృషి. "అంటే కార్మికుల మోటివేషన్‌తో జరిగే ఉత్పాదకత కన్నా కొత్త యంత్రాలు మోడర్నైజేషన్‌తోనే ఎక్కువ ఉత్పత్తి సాధ్యమంటారు."

"మీరు నా మాటల్ని సరిగా అర్థం చేసుకోలేదనుకుంటాను మిస్ కృషి. . .మీకు యింకా స్పష్టంగా అర్థం కావాలీ అంటే. . ." ఆమెది తనను అర్థం చేసుకోగలిగే స్థాయికాదన్న భావాన్ని ఒడుపుగా వ్యక్తం చేశాడు విశ్శు. "ఫుట్‌పాత్ మీద పళ్ళమ్ముకునే వ్యాపారి కొడుకూ పళ్ళమ్ముకునే బ్రతకటానికి కారణం వ్యాపారంలో మెళకువ తెలీక అనే అంటే మీరు అంగీకరించాలి. . .పళ్ళను చూసి ధర ఎక్కువగా వుందని మనం అంటే నీ మొహానికి పళ్ళెప్పుడైనా కొన్నావా అని ఎద్దేవా చేస్తాడు. అందుకే ఆ స్థాయిని దాటి ఎదగడు. కాని ఓ అంగడిలో చిన్న టీ కొట్టు నడిపిన కృష్ణమూర్తి ఆ తర్వాత దేశ విదేశాలలో ఫుడ్‌లేండ్స్ హోటళ్ళను ప్రారంభించాడు. . అతడి వ్యాపారంలో ఎదుగుదలకి కారణమైంది యంత్రం కాదు. . .యంత్రంలా పనిచేయగల సహనం, ఆధునికంగా ఆలోచించగల మేధస్సు. . . అంచేత ప్రతి వ్యాపారానికీ కార్మికుడు కావాలి. . . ఆ కార్మికుడికి మోటివేషనూ వుండాలి."

"ఇంత తెలిసిన మీరు చౌదరి దగ్గరే ఎందుకు వుండలేకపోయారు. . ." అసంకల్పితంగా అనేసింది కృషి.

ఒడిలో బాంబుపడ్డట్టు అధిరిపడ్డాడు విశ్శు . . . కృషి యింత సూటిగా యిలాంటి సమయంలో చౌదరి రిఫరెన్స్ తీసుకు వస్తుందని వూహించలేక పోయాడు.

ఉపాధ్యాయగారు అప్పటికే ఓ బద్ధ శత్రువుని చూస్తున్నట్టు విస్మయంగా అడిగారు "నువ్వు చౌదరి మనిషివా"

విశ్శు జవాబు చెప్పలేకపోయాడు.

"యస్ గ్రాండ్ పా.... విశ్వనాథ్ ముందునుంచీ రామనాథచౌదరికి చాలా చాలా ఆత్మీయుడు."

అక్కడ గాలిగడ్డ కట్టుకుపోయింది.

"చాలా శ్రమపడి నేను చౌదరి మనిషినని తెలుసుకున్న మీ పరిశోధనకి నా జోహార్లు మిస్ కృషి" సీరియస్‌గా అన్నాడు విశ్శు కృషిని చూస్తూ. "ఇంతకన్నా మీ మనుషులు కానిదెవరో తెలుసుకోటానికి మీ శక్తిని వినియోగించివుంటే మరింత ఆనందించేవాడ్ని."

ఉద్రేకాన్ని నిభాయించుకోటానికి చాలా శ్రమ పడాల్సి వచ్చింది.

"నేను వెళ్ళడమే మీరు కోరే విషయమైతే వెళ్ళిపోతాను. కాని వెళ్లేముందు... "

"చెప్పు" అర్థోక్తిగా అన్నారు ఉపాధ్యాయ.

"నిన్న భారత రక్షణశాఖకి మీరో టెండర్ పంపే ఏర్పాట్లు చేసారు కదూ"

ఉపాధ్యాయ మొహంలో రంగులు మారేయి.

"చాలా రహస్యంగా జరిగిన సమావేశంలో మీరు సప్లై చేయాల్సిన మెషిన్ రేట్సుని ఫైనలైజ్ చేశారు. . . "

కృషి సైతం అవాక్కయి చూస్తూంది.

"అందులో మీరు స్పెషల్ పర్పస్ మెషిన్‌కి కోట్ చేసిన ధర డెబ్బై లక్షల ముప్పై రెండు వేల రూపాయలు. . . మౌంటింగ్‌కి అరవై ఏడు వేలు - ట్రాన్స్‌పోర్టేషన్‌కి లక్షా రెండు వేల ఏడు రూపాయలు విడి విడిగా కోట్ చేశారు - అవునా - "

ఉపాధ్యాయ నిశ్చేష్టుడై చూస్తున్నారు కోట్ల ఖరీదు చేసే కొటేషన్‌కి సంబంధించి చాలా గోప్యంగా ప్రిపేర్ చేసిన వివరాల్ని తెలియచేస్తున్నాడు విశ్వ ఒక్క అంకె కూడా తప్పుకాకుండా-

"ఒకవేళ నేను చౌదరి మనిషినే అయి వుంటే మీ పరిధి నుంచి బయటికి వెళ్ళిన ఈ రహస్యం గురించి యిప్పుడు మీకు చెప్పాల్సిన అగత్యం నాకు లేదు చెబితే నాకు ఒరిగేది వుండదు."

ఉపాధ్యాయగారిపై తాత్కాలికమైన అస్త్రాన్ని సంధిస్తున్నాడు విశ్వ. అతడి జేబులో వున్న జిరాక్స్ కాపీ చూపించకుండా కొటేషన్ అంతా చెప్పేసాడు తప్పనిసరి పరిస్థితుల్లో.

"నిజానికి ఈ ఇన్‌ఫర్మేషన్‌తో నేను లక్షలు సంపాధించగలను కాని నా లక్ష్యం లక్షలు కాదు - మీ విజిలెన్స్‌లోని లోపం వలన మీకెంత నష్టం జరుగుతున్నదీ మీకు తెలియచెప్పడం.

"ఒకవేళ మీరు - " కృషి ఇంకా షాక్‌లోనే వుండటాన్ని గమనిస్తూ చెప్పాడు విశ్వ "అందరు ఆడపిల్లల్లా మనసుతో కాక మెదడుతో ఆలోచించి వుంటే నేను చౌదరి అనే మీ ప్రత్యర్థితో కొద్దిపాటి సాహచర్యాన్ని మెయిన్‌టెయిన్ చేయడంలో ఉద్దేశం మీకు అర్థమై వుండేది. ఎనీహౌ - నేనేమిటీ అన్నది మీరు ఇప్పటికైనా తెలుసుకుంటే చాలు సంతోషంగా వెళ్ళిపోతాను."

ఇక బయలుదేరేవాడే - అప్పుడు జోక్యం చేసుకున్నారు ఉపాధ్యాయ. . . "ఆగు"

అనడమే కాదు ఆప్యాయంగా విశ్వ భుజంపై చేయి చేశారు. . . అది అనితరసాధ్యమైన పరిశోధనే అనిపించిందో లేక తన సామ్రాజ్యాన్ని కాపాడటానికి విశ్వ అనే ఓ యువకుడు నిస్వార్థంగా తీసుకున్న శ్రద్ధగా కనిపించిందో మరి ఉద్వేగ్నంగా అన్నారాయన "నువ్వు వెళ్ళాల్సిన అవసరం లేదు విశ్వనాథ్ ప్యాక్టరీ విజిలెన్స్ సెల్ తెలుసుకోలేని ఓ నిజాన్ని నాకు తెలియచేసి నాకు కనువిప్పు కలిగించడమేగాక నా అడ్మినిస్ట్రేషన్ లోపాల్ని ఎత్తి చూపించి నీ నిజాయితీని కూడా నిరూపించుకున్నావ్. చెప్పు. ఈ విషయాన్ని ఎలా తెలుసుకోగలిగావు."

"క్షమించడి ఉపాధ్యాయగారూ. అది నేను చెప్పలేను."

"ఈ వివరాలు బయటికి ఎలా వెళ్ళాయి" కంపించి పోతున్నారాయన.

"అది తెలుసుకోవాల్సింది కూడా మీరే" మరింత రెచ్చగొడుతున్నట్టుగా అన్నాడు విశ్వ.

కృషి ఆవేశంగా అంది "ఇంత చెప్పిన మీరు అది కూడా తెలియచేయొచ్చుగా."

"నన్ను నిలదీసేకన్నా ఛాన్సెస్ గురించి మీరు ఆలోచిస్తే బెటర్. నిన్న మీ సమావేశంలో ఎవరెవరు పార్టిసిపేట్ చేశారు. అందులో ఎవరికి లీక్ చేసే అవసరం వుందీ లాంటి ప్రోబబులిటీస్."

"మిస్టర్ విశ్వనాథ్" విశ్వ గొంతులోని ఎగతాళిని భరించలేనట్టుగా అంది కృషి. "మీరెలా తెలుసుకున్నారో అది చెబితే ఈ రహస్యం బయటికెలా వెళ్ళిందో మేం ఇన్వెస్టిగేట్ చేస్తాం"

"మీ అమాయకత్వానికి బాధపడుతున్నాను మిస్ కృషి" మరింత వ్యంగ్యంగా అన్నాడు. "క్షణం పాటు ఆ వివరాలున్న డాక్యుమెంట్‌ని దొంగతనం చేసింది నేనే అనుకుందాం. . . అప్పుడు ఎలా దొంగతనం చేశావని నన్నడగడం కాదు మీరు చేయాల్సింది. . . నాకు అలాంటి బాధ ఛాన్సిచ్చిన మీ సెక్యూరిటీ లోపాల గురించి ఆలోచించాలి - మీ వాళ్ళూ అనుకుంటున్న మీ మనుషుల్లోని నిజాయితీ గురించి ఆలోచించాలి."

అర నిముషం మౌనం తర్వాత అన్నారు ఉపాధ్యాయ "నిన్న టెండర్‌కి సంబంధించిన చర్చలో పార్టిసిపేట్ చేసింది ముగ్గురం. నేను, కృషి, ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ సుబ్బారాయుడు - చర్చ తర్వాత ఫైనల్ స్టేట్‌మెంట్‌ని జియం కిచ్చాను పంపే ఏర్పాట్లు చేయమని - " ఈ విషయం చెబుతూ సైతం చాలా అసహనంతో నలిగిపోయారాయన. తన స్థాయి వ్యక్తికి సంజాయిషీలా మాట్లాడటం అనూహ్యమైన విషయం. "ఎలా - " గొణుగుతున్నట్టుగా అన్నారాయన "ఎలా తెలిసింది నీకీ విషయం"

"మీరు నమ్మే వ్యక్తులు అంతా మీరు నమ్మదగ్గవాళ్ళు కారు ఉపాధ్యాయగారు. . . " కృషి వేపు చూశాడు విశ్వ. ఆమెకు చురుక్కుమనిపించేట్టుగా - "పైగా ఫ్యాక్టరీ విజిలెన్స్ అన్నది ఎంత ముఖ్యమైన విభాగమో మీకు చెప్పేటంత మేధావిని కాను నేను-"

తను మాత్రం నమ్మదగ్గ వ్యక్తినంటూ పరోక్షంగా విశ్వ వ్యక్తం చేస్తుంటే తను పడుతున్న శ్రమని ఎగతాళి చేస్తున్నట్టుగా వుంది కృషికి.

"మీ అనుభవం అపారమైనది. మీ దీక్ష అనితర సాధ్యమైనది - కాని. . ." ఉపాధ్యాయగారి అహాన్ని ఒడుపుగా రెచ్చగొడుతూ చెప్పుకుపోయాడు విశ్వ. "మీరు అనారోగ్యంతో వున్న వ్యక్తి - ఆ విషయం మీరు అంగీకరించరు. అంగీకరించక పోయినా ఇది నిజం. కాబట్టే కృషిలాంటి సమర్ధురాలైన వ్యక్తికి మీ కాన్ఫిడెన్స్‌లోకి తీసుకోవాల్సి వచ్చింది. ఇలా అంటున్నందుకు నన్ను మీరు కోపగించుకున్నా నేను బాధపడను సర్. కాని ఆడపిల్లలకి

జనరల్ మేనేజర్ బయటికి చేరేసిన విషయాన్ని లాఘవంగా తెలుసుకోగలిగేది."

"వ్వాట్" అదిరిపడినట్టుగా చూశాడు. . ."ఇది చేసింది సుబ్బారాయుడా" ఓ దశాబ్దం కాలం నుంచి అతడిపై పెంచుకున్న నమ్మకం సడలిపోతుంటే ఆందోళనగా అన్నారు "ఐ కాంట్ ఇమేజినిట్. . . "

"ప్రతి మనిషికీ కొన్ని బలహీనతలుంటాయి. . .ఆ బలహీనత డబ్బు కావచ్చు... ఆడది కావచ్చు. . . . అధికారం కావచ్చు. . . "

"సుబ్బారాయుడికి డబ్బుతోనూ అవసరం లేదు"

"కాని అతడికున్న బలహీనత ఆడది - ఆ ఆడదానికి వున్న బలహీనత డబ్బు - అందుకే డబ్బు తీసుకున్న ఓ ఆడది మీ టెండరు వ్యవహారాన్ని తెలుసుకుంటానని మీ ప్రత్యర్థులకి హామీ ఇచ్చింది. మీ జనరల్ మేనేజర్ని తన దగ్గరకు రప్పించుకుని ఈ వివరాలన్నీ సంపాదించగలిగింది."

విశ్వ చెప్పింది పూర్తికాక ముందే అంది కృషి "మీరు ఇదంతా అలాంటి ఆడదానినుంచి తెలుసుకోగలిగారన్నమాట"

"ఎస్" వెంటనే అన్నాడు విశ్వ "మీరు కరెక్టుగా గెస్ చేశారు ఐతే నా బలహీనత ఆడది కాదు. అలాంటి వ్యవహారాలు సహించలేకపోవడం - "

"మిమ్మల్ని నమ్మేట్టు చేసుకోగలగడం కూడా అనుకుంటాను "ఉక్రోషంగా అంది కృషి.

కృషీ సాధికారంగా నిలదీశారు ఉపాధ్యాయ. "ఇక్కడ నువ్వు ప్రశ్నించాల్సింది విశ్వనాథ్ని కాదు - మన అడ్మినిస్ట్రేటివ్ లాప్సెస్ని"

కృషిని విశ్వ విషయంలో ఇలా మందలించడం తొలిసారి. . . ఇక్కడ కూడా తను ఓడిపోయినందుకు ఆమె బాధపడుతుందో లేక గ్రాండ్‌పాకి మరింత దగ్గరకావాలని విశ్వ ప్రదర్శించిన తెలివికే ఆశ్చర్యపోతుందో ఆమెకి తెలీదు.

"థేంక్స్ సర్. . ." వినయంగా అన్నాడు విశ్వ. "నేనేమిటీ అన్నది మీరైనా తెలుసుకోగలిగారు. . . అందుకు కృతజ్ఞుడ్ని."

మరింత నిజాయితీని ప్రదర్శించిన విశ్వని చూస్తూ అర నిముషం తర్వాత అన్నారు ఉపాధ్యాయ.

"ఇక నువ్వు నువ్వేమిటీ అన్నది నిరూపించుకోవాల్సిన అగత్యం లేదు విశ్వ . . ." తన నమ్మకాన్ని ఇంకెవరూ సడలించలేరన్నంత దృఢంగా చెప్పుకుపోయారాయన. "ఈ రోజు నుంచీ నువ్వు మాకు మరింత ఆత్మీయుడవైన వ్యక్తివి. . .యస్ విశ్వనాథ్. . . నిస్వార్థంగా నన్ను కాపాడిన నువ్వు ఇప్పుడు నా సామ్రాజ్యాన్ని కాపాడే ప్రయత్నం చేశావు. అందుకు అభినందిస్తున్నాను. . . ఇక ముందూ నీ సహకారం కావాలని కోరుకుంటున్నాను."

తన పథకంలో మెదటి అంకం పూర్తయినట్టుగా విశ్వ పెదవులు ఆనందంగా నిమురుకున్నాడు.

కృషి నివ్వెరపోతూంది విశ్వని చూస్తూ. . .

అసాధారణంగా విస్తరించిపోతూన్న విశ్వ తను అంత సులభంగా కదిలించలేని స్థాయికి చేరుకుంటున్నాడు.

ఆ తర్వాత జనరల్ మేనేజర్‌పై గ్రాండ్‌పా ఎలాంటి చర్య తీసుకుంటాడూ అన్నది కాదు ఆమె ఆలోచిస్తున్నది. ఇంత లోతుగా పాతుకుపోతున్న విశ్వ మూలంగా రేపేం జరగబోతుంది అన్న విషయం గురించి.

కేవలం తనపై శారీరకమైన గెలుపు ఆశించి వుంటే ఇలాంటి మార్గంలో ఇంత రిస్క్ తీసుకోవాల్సిన అగత్యం లేదు.

మరో ఐదు నిముషాల్లో గ్రాండ్‌పా ఫ్యాక్టరీకి వెళ్ళిపోయాడు.

విశ్వ ఇప్పుడు ఆమెకు అభిముఖంగా డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. అలా కూర్చోవటానికి అర్థం నన్ను ఇక కదిలించలేరని ఛాలెంజ్ చేయడమా. . .

ఓడిపోతున్నానన్న ఆందోళనతో నలిగిపోతున్న ఆమెకి ఇక తన గెలుపుకి తిరుగులేదనే ధీమాని ప్రదర్శించే విశ్వతో బాటు ఆ హాల్లో వుండటం కష్టంగా వుంది.

"నీ సువిశాల సామ్రాజ్య వృత్తానికి కేంద్రంగా మారాలని అంచెంలంచెలుగా నీ మీద గెలుపు సాధించుకుపోతున్నాను కృషీ. నేనేమిటో అర్థ మైందిగా"

క్రోధారుణనేత్రాలతో చూసింది. "ఎందుకు ఈ ఇంట్లో అడుగుపెట్టావ్. . . అసలు ఏం కావాలి నీకు"

"కావాల్సింది నువ్వివ్వవని తెలిసిపోయింది కృషీ. ఇప్పుడు నేను కోరుకుంటున్నది నిన్ను కాదు - నువ్వీ దేశం వదిలి వెళ్ళిపోవడాన్ని"

నిశ్చేష్టంగా చూసింది . . . ఇదో కొత్త ప్రపోజల్.

"నేనెందుకు వెళ్ళాలి"

"వెళ్ళకపోతే ఆడదానిగా నువ్వు చాలా నష్టపోవాల్సి వస్తుంది కాబట్టి " మరింత స్పష్టంగా చెప్పాడు. "ఔను మిస్ కృషి! ఒకప్పుడు పందెంలో గెలిచిన నేను కోరింది నీతో ఓ రాత్రి గడపటాన్ని. కాని తెలివిగా తప్పించుకున్నావు. . . అందుకే ఇప్పుడు ఈ దేశం వదిలి వెళ్ళమంటున్నది. వెళ్ళనూ అని నువ్వు మొండిగా కూర్చుంటే - "

"చెప్పు" ఉక్రోషాన్ని అదిమి పెట్టుకుంటూ అడిగింది. "నేను వెళ్ళనంటే ఏం చెయ్యబోతున్నావ్?"

"నువ్వు అపురూపంగా కాపాడుకుంటున్న నీ ఆడతనాన్ని తెలివిగా కొల్లగొడతాను - 'అది నీ వల్ల కాదు' అనకు - ఇంత చేసిన వాడ్ని అది సాధించడం నాకు కష్టం కాదు... అందుకే కనీసం ఆ నష్టం జరక్కుండా ఈ దేశం విడిచి వెళ్ళిపోమంటున్నాను".

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

"ఆగు" పిలిచింది గది దాటి వెళ్ళబోతున్న విశ్వని చూస్తూ.

"చెప్పు"

"ఇప్పుడు స్పష్టంగా అర్థ మైంది"

"ఏమిటి"

"నువ్విక్కడకెందుకొచ్చావు అన్న విషయం. ఎస్ మిస్టర్ విశ్వనాథ్ - చౌదరి అనబడే నీ ఆత్మీయుడు నన్ను ఎదుర్కొనలేక పోతున్నాడు. కాబట్టి నేను ఈ దేశం వదిలి వెళ్ళేట్టు

ద్వారా చూపించడం అతని ధ్యేయం కావచ్చు. . . . నువ్వీ ఒప్పందానికి సిద్ధపడటానికి నువ్వతనికి తిరిగి చెల్లించలేని ఐదు లక్షలు కారణం కావచ్చు. అలా చూడకు విశ్వ . . . ఇవి తెలుస్కోవటానికి పెద్ద ఐక్యూ అవసరం లేదు. . . డబ్బుకోసం ఏదన్నా చెయ్యటానికి దిగజారేవాడికి . . .దిగజారుడు తనాన్ని జీవితంగా మార్చుకున్న వాడికి ఇంతకుమించి ఆలోచించగలగడం చేతకాదుగా. . . అయితే ఇక్కడ నీకో విషయం నేను స్పష్టం చేయాలి. మా గ్రాండ్‌పా దగ్గర గుడ్‌విల్ సంపాదించడానికి టెండరు వివరాలు సేకరించి చెప్పిన నువ్వు ఈ ఇంట వుండటానికి స్థానం సంపాదించుకో గలిగావేమోకాని ఈ ఇంటి నుంచి నన్ను పంపగలిగేటంత స్థాయిని మాత్రం కాదు. . . అసలు ఇలాంటి ఆలోచనలు గల నీ అమాయకత్వానికి జాలిపడుతున్నాను. . . నిన్న మొన్నటిదాక ఈ దేశం వదిలి వెళ్ళాలన్న ఆలోచన ఏదన్నా వుంటే అది ఈ క్షణం నుంచీ చెరిపేసుకుని నీ సంగతి తేల్చబోతున్నాను. . . గెట్ రెడీ. . .”

ఓ హెచ్చరికలా చెప్పిన కృషి ఆ తర్వాత అక్కడ నిలబడలేదు. అపారమైన తెలివితేటలు, అసాధారణమైన సునిశిత బుద్ధిగల కృషి తన గదిలోకి వెళుతూనే ‘కోలా’ కంపెనీకి ఫోన్ చేసింది. తొలిసారి విశ్వ పార్టిసిపేట్ చేసిన కోలా కంపెనీ నుంచి విశ్వనాథ్ రెసిడెన్షియల్ అడ్రస్ తెలుసుకోగలిగింది. ఓ అనాధగా తాతయ్యకి తనను తాను పరిచయం చేసుకున్న విశ్వ తల్లి వుండేదెక్కడో ఆరా తీయడం ఆమె లక్ష్య మైతే దాన్ని ఆమె సునాయసంగా సాధించగలిగింది.

ఆ సాయంకాలమే చైతన్యనంద ఆశ్రమానికి వెళ్ళింది కృషి . . .

0 0 0

“తెర తొలిగింది. పాత్రలు పలికాయి. . . కథ నడిచింది. గాధ ముగిసింది. ఇది నాటకం..... జన్మ మొదలయింది. . . బ్రతుకు కదిలింది యాత్ర ముగిసింది. చితి రగిలింది. ఇది జీవితం. . . కాలమనే ఎడారిలో చరిత్ర ఇసుక తిన్నెలపై కొందరివే అడుగుజాడలు కనిపిస్తాయి. ఎందరివో మాసిపోతాయి. . . ”

అసుర సంధ్యా సమయాన చైతన్యానంద కంఠం నుంచి జాలువారుతున్న వేదాంత సారం ఆశ్రమంలో అసదృశమైన ప్రశాంతత నింపుతూంది.

ఆయనకి అభిముఖంగా కూర్చున్న సుమారు ఏభైమంది ఆశ్రమవాసుల్లో స్త్రీలూ, పురుషులూ మాత్రమే కాక పసి పిల్లలు వున్నారు. . . అందరూ తాదాత్మ్యంగా ఆయన చెబుతున్నది వింటుంటే నిశ్శబ్దంగా వచ్చి ఓ మూల కూర్చుంది కృషి-

“బ్రతకటం వ్య క్తిగతం. జీవించడం సాంఘికం. . . తన కోసం మాత్రమే ఆలోచించే మనిషి మిగిల్చిన అడుగుజాడలు గాలి అలలకి చెరిగిపోతుంటాయి. సంఘం కోసం జీవించే మనిషి అడుగు జాడలు మరో మనిషికి మార్గదర్శకాలౌతాయి. అందుకే బ్రతకడం కన్నా జీవించడం గొప్ప. అలా జీవించడమే చరిత్ర. ఇదే “[illegible]” బ్రతకడానికి

జీవించడనికీ మూలం ఒకటే. . . అది ప్రేమ . . . తనను తాను ప్రేమించుకోవడం బ్రతకడం అనిపించుకుంటే అందర్నీ ప్రేమిస్తూ ముందుకు సాగిపోవడం జీవించడమౌతుంది. ఇక్కడ నేను ఉదహరించిన ప్రేమ అరిషడ్వర్గాలకి అతీతమైనది భక్తిరస ప్రధానమైంది. . . అలాంటి ప్రేమలకి ఆశలు లేవు. . . అందించడమే గానీ అందుకోవాలనే ఆసక్తి వుండదు. . . అది భౌతికం కాదు..... సకల జీవులకి జీవనాన్ని ప్రసాదించి కాపాడే సూర్యభగవానుడ్ని మనోల్లాసం కలిగించే చంద్రతారక వసంతాల్నీ గుర్తుచేసే ప్రతిఫలాపేక్ష లేని నిస్వార్థ ప్రక్రియ ఆ ప్రేమ. . . ”

మహర్షిలా చెప్పుకుపోతున్న చైతన్యానంద వాక్కులు కృషిని ఎంతగా ఆకట్టుకున్నాయి అంటే అలసిపోయిన మనసుకి సేద తీర్చే అవకాశం ఇంతకాలానికి దక్కినట్టనిపించింది. అది ఉపదేశం కాదు . . . అమృత రసవాహిని లాంటి జీవిత సత్యాలతో గుండె గాయాల్ని మరపింపచేసే దివ్యౌషధంలాంటి ఆధ్యాత్మికానుభూతి.

మరో పది నిముషాలలో వేదాంత ప్రసంగం ముగిసింది. ఆశ్రమ వాసులంతా కుటీరాలకు వెళ్ళిపోయిన రెండు నిముషాలకి చైతన్యానందని సమీపించింది కృషి . . .

ఆమె వచ్చింది ఎందుకయినా గానీ ఆ క్షణంలో రుష్యత్వం సిద్ధించుకున్న ఓ మహోన్నతుడ్ని కలుసుకోగలిగిన సంతృప్తి ఆమె కళ్ళల్లో. . . చేతులు జోడించి నమస్కరించింది. వేలట్‌లో నుంచి ఓ లక్ష రూపాయల చెక్ తీసి అతడికి అందించింది.

ఆయన నేత్రాలు విస్ఫారితాలయ్యాయి . . .

“ఎందరో అభాగ్యులకి అనాధలకి నిలయమైన ఈ ఆశ్రమానికి మా కుంటుంబం తరపున ఇస్తున్న ఓ నూలుపోగు” వినమ్రంగా అంది.

“ఎవరమ్మా నువ్వు” నేత్రాంచలాలలో మెరిసే కాంతుల్ని ఆయన దాచుకోలేక పోయారు..... “నిన్ను చూడటం తొలిసారి”

“నేను” తనెందుకొచ్చింది అప్పుడు గుర్తుకొచ్చినట్టుగా అంది “విశ్వ స్నేహితురాల్ని” అది అబద్ధం కావటం మూలంగా ఆమె గొంతు వణికింది.

చైతన్యానంద భృకుటి ముడివడింది. . .

ఆయన చూపులు ఏ గుండె పొరల్నో తాకినట్టయి తల వంచుకుంది కృషి. “అర్థం కావడం లేదు బాబా. . .ఇంతటి ఆధ్యాత్మిక చింతనని ఉపదేశించగల మీ సన్నిధిలో వుంటూ విశ్వ అంత అశాంతిగా ఎందుకు బ్రతుకుతున్నదీ నా ఊహకందడం లేదు. . . ”

ఆయన నేత్రాలు అరమోడ్పులయ్యాయి.

“తనవారైన యాదవులు ధర్మచ్యుతులై ముసలం పట్టి పరస్పరం బాధించుకుంటూ ప్రాణాలు విడుస్తుంటే చూస్తూ వుండిపోవటానికి గాని తన కళ్ళముందే తన వంశమంతా నాశనమౌతున్నా నిబ్బరంగా నిలబడటానికిగాని విశ్వ బ్రహ్మజ్ఞాని అయిన శ్రీకృష్ణుడు కాదమ్మా. . . ఇంకా బ్రతుకు మైకం వదలని పసికందు - ”

కోల్పోవడంతో అతడు అర్థాంతరంగా చదువుని ఆపి వెనక్కి వచ్చిన తీరు గురించి. . .

కృషి అవాక్కయిపోయింది. . .

విశ్వ కొద్దో గొప్పో చదువుకున్నవాడేమో అనుకుంది గాని రీసెర్చిని అసంపూర్తిగా వదిలిన స్కాలర్‌గా ఇప్పుడే తెలుసుకుంది. అదికాదు ఆమెను అంత ఆందోళన పరిచింది... విశ్వ తండ్రి మోహన్‌గాంధీ పనిచేసింది తన ఫ్యాక్టరీలోనే. . .ఓ కార్మిక నాయకుడిగా ప్రాణాలను కోల్పోయింది తమ ఫ్యాక్టరీ సమ్మెలో. . .

కృషి నుదుటపట్టిన స్వేదాన్ని తుడుచుకుంటూ తనకు తెలీని మోహన్‌గాంధి హత్య గురించి ఆలోచిస్తూనే చైతన్యానందంతో బాటు ఆశ్రమం అంతా తిరిగింది. . .

అయితే ఆమెను అమితంగా కదిలించింది విశ్వ తల్లి పార్వతమ్మ పరిస్థితి. . . ప్రపంచంతో సంబంధంలేనట్టు పిచ్చి చూపులు చూస్తూ నిలబడి వుందామె. . .

మరో అరగంట తర్వాత ఆశ్రమం నుంచి బయలుదేరిన కృషికి బోధపడిపోయింది.

విశ్వ తన ఇంట అడుగుపెట్టింది పగ సాధించాలని మాత్రమే. . . దానికోసం తనకంటూ బలమైన ఓ వలయాన్ని నిర్మించుకుంటున్నాడు.

విశ్వ తండ్రి మోహన్‌గాంధీ హత్య చేయబడటానికి కారణం ఏదన్నా కాని వెంటనే ఈ విషయం గ్రాండ్‌పాకి తెలియచేయకపోతే విశ్వ ఉనికి చాలా అనర్థాలకి దారితీస్తుంది.

విశ్వకి ఇంటి నుంచి ఉద్వాసన చెప్పటానికి ఈ మాత్రం చాలు. ఓ తిరుగులేని అస్త్రాన్ని సంధించబోతున్న ఉద్వేగంతో ఇంట అడుగుపెట్టిన కృషి ఉపాధ్యాయగారి ఛాంబర్‌కేసి చూసింది. . .

ఆయన వున్న సూచనగా గదిలో లైటు వెలుగుతూంది. . .

మరో పది సెకెండ్ల వ్యవధిలో ఆ గదిలో అడుగుపెట్టేదే. . .

అప్పుడు వినిపించింది విశ్వ కంఠం.

"మిస్ కృషి"

"ఎస్" సాలోచనగా చూసింది క్షణం ఆగి. . .

సరాసరి ఆశ్రమం నుంచే వస్తున్నారనుకుంటాను."

"అభినందిస్తున్నాను"

"దేనికి"

"నేను వెళ్ళిన విషయం తెలుసుకున్నందుకు"

"ఆమె రాక గురించి సూరి తెలియచేసిన విషయం చెప్పలేదు విశ్వ."

"మీరు మీ గ్రాండ్‌పా దగ్గరికి వెళ్తున్నారనుకుంటాను."

"కరెక్టుగానే గెస్ చేశావు. . ." నవ్వింది భావ గర్భితంగా "వెళ్ళడమే కాదు విశ్వ- నీ తండ్రి మరణానికి కారణం ఉపాధ్యాయగారే అన్న ఆలోచనలో పగ సాధించాలని ఈ ఇంట అడుగుపెట్టావని కూడా చెప్పబోతున్నాను."

ఇందాకటి ఆమె అభినందన గుర్తుచేస్తూ అన్నాడు విశ్వ - "అభినందిస్తున్నాను."

"దేనికి"

"నేను ఎందుకు వచ్చిందీ తెలుసుకున్నందుకు" విశ్వలో ఎలాంటి సంచలనమూ లేదు. "అయితే వెళ్లేముందు ఈ కవరు చూడండి"

కొన్ని లిప్తల విరామం తర్వాత కవరు అందుకుంది కృషి కవరులోని ఫోటోల్ని చూస్తూ అదిరిపడింది.

అవి మామూలు ఫోటోలు కాదు.

అతడి గుండెలపై ఆమె ఆదమరిచి నిద్రపోతున్నట్టు తీయబడిన ఫోటోలు.

నిలువునా కంపించిపోతున్న కృషిని చూస్తూ అన్నాడు "ఇవి మీ తాతయ్యకి చేరకూడదూ అనుకుంటే ఇప్పటి మీ ప్రయత్నాన్ని విరమించుకోవాలి. తప్పదు"

అదిగో అప్పుడు చూసింది కృషి. . .

ఛాంబర్‌లో నుంచి తమవైపే వస్తున్నారు ఉపాధ్యాయ.

ముందు కృషి గొంతు పెగల్లేదు.

వెంటనే తేరుకుని ఉపాధ్యాయ గారికి ఎదురువెళ్ళి "మీరొచ్చి ఎంతసేపైంది గ్రాండ్‌పా" అంది ఫోటోల్ని వెనక దాచేస్తూ. . . నిబ్బరంగా. నిజాయితీగా బ్రతకడం తెలిసిన కృషికి ఇలాంటి సన్నివేశం అలవాటులేనిది "అదే గ్రాండ్‌పా. . ." అర్థం కానట్టు చూస్తున్న ఉపాధ్యాయ గారితో అంది.

"ముందుకు దూసుకుపోయే వ్యక్తికి ఓ సమస్య సైంధవుడిలా అడ్డుపడినా క్రియేటివిటీ వుంటే నెగ్గుకురావడం కష్టం కాదని చెబుతున్నాను విశ్వనాథ్‌కి."

"యస్సర్" తననో సైంధవుడిగా ఆమె ఆలోచించడం ఇష్టపడని విశ్వ వెంటనే అన్నాడు "మిస్ కృషి ఆ మాట అనగానే అమెరికాలో చదివి వచ్చిన మీకు సైంధవుడి గురించి కూడా తెలుసా అన్నాను. అంతే జవాబు కోసం ఆమె వెదుక్కుంటుండగా మీరొచ్చారు."

ఉపాధ్యాయ గారి రియాక్షన్ ఏమైనా గాని సైంధవుడి గురించి తనకు తెలీనట్టు విశ్వ మాట్లాడ్డం నచ్చలేదు కృషికి - తనను ఓడించడనికి విశ్వ ఇక్కడా సైంధవుడిలాగే అడ్డం పడుతుంటే మొహంలో భావాల్ని అణిచిపెడుతూ అంది "సైంధవుడి గురించి మీకెంత తెలుసో తెలుసుకోవాలని వుంది."

"సింధు దేశాధిపతి వృద్ధక్షత్రుని కొడుకు జయద్రథుడు. సైంధవుడంటే అతడే."

"సైంధవుడు దృతరాష్ట్రుడు కుమార్తె, దుర్యోధనుడి చెల్లెలు అయిన దుస్సలని పెళ్ళిచేసుకున్నాడు" కృషి చెప్పడం ప్రారంభించింది వెంటనే "ఒకనాడు ద్రౌపదిని మోహించి ఆమెను బలవంతంగా ఎత్తుకుపోతుంటే భీమార్జునులు వెళ్ళి సైంధవుడు పాండవులందర్నీ ఓడించే శక్తినిమ్మని వరమడిగితే ఒక్క అర్జునుణ్ణి తప్ప మిగతా నలుగురు పాండవుల్ని ఒకరోజు ఓడించే వరమిచ్చాడు శివుడు. ఆ శక్తితో పద్మ వ్యూహంలో అడ్డుపెట్టిన అభిమన్యుడికి

సహాయంగా రాబోయిన ధర్మజ భీమ నకుల సహదేవుల్ని అడ్డగించి ఓడించిన సైంధవుడు అభిమన్యుడి చావుకి కారణమయ్యాడు.

ఆ తర్వాత అర్జునుడి చేతిలో హతమయ్యాడు. అలా గొప్పవాళ్ళ పురోభివృద్ధికి అల్పుడెవడైనా అడ్డుపడితే అతడ్ని సైంధవుడు అనడం ఆనవాయితీగా మారింది.”

విశ్వ మాత్రమే కాదు ఉపాధ్యాయ గారూ అవాక్కయిపోయారు కృషి చెప్పింది విని - పెరిగింది ఎక్కడైనా ఏ వాతావరణంలోనైనా గాని ఇక్కడి సంస్కృతి గురించి కృషి మరిచిపోకపోవడం ఒక్కటే కాదు - ఒక సాధనలా విషయాన్ని క్షుణ్ణంగా శోధించడాన్ని అలవాటుగా మార్చుకుంది ఇప్పటిక్కూడా-

మృదువుగా నవ్వారాయన “సో. . . సమస్యల సైంధవుల్ని నెగ్గుకురావాలీ అంటే క్రియేటివిటీ వుంటే చాలంటావు.”

“యస్ గ్రాండ్‌పా. . .” విశ్వనాథ్ వేపు చూసింది. ఇప్పుడు ఆమె టార్గెట్ విశ్వ మాత్రమే- “క్రియేటివిటీ పట్టుదలకీ కారణమౌతుంది. ఆ పట్టుదల ఆలోచనా శక్తిని పెంచుతుంది - ఆ శక్తి పైకి దూసుకొచ్చే చీకటిని ఓడించే విద్యుచ్ఛక్తి ఉనికిని కనుక్కోటానికి, మనిషి పురోభివృద్ధికి, సైంధవులని కడతేర్చే మారణాస్త్రాలని తయారుచేయడానికి, మొత్తం చరిత్ర పరిణామానికి మూలమౌతుంది. దాన్నే కృషి అంటారు.”

చురుక్కుమందేమో వెంటనే జోక్యం చేసుకున్నాడు విశ్వ “కృషి ఒక్కటే చాలదు మిస్ కృషి. . .దీక్ష కావాలి. . . దీక్షంటే మొండితనం కాదు”

“దీక్ష కావాల్సింది తపోభంగం కాకూడదనుకునే ఋషులకి మిస్టర్ విశ్వా. . . భంగపడుతున్నా ముందుకెళ్ళే ప్రాక్టికాలిటీకి అవసరం మొండితనమే.”

“అది రిస్క్ తీసుకోవడం అవుతుంది” తన చర్యని సమర్థించుకోబోయాడు విశ్వ.

“ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడుపోతున్న పాప్‌కార్న్ కంపెనీ అధిపతి ఓర్‌వెల్లి రెడెన్ బీచర్ తన జీవితాన్ని ప్రారంభించింది ఓ మామూలు సేల్స్‌మెన్‌గా - ఆదిలో అంతా అతడ్ని అవమానించారు. పాప్‌కార్న్‌తో వ్యాపారం చూసి రిస్క్ తీసుకుంటున్నావని ఎగతాళి చేశారు. అయినా మొండితనంతో సాధించాడు. ఇప్పుడు రెడెన్ బేచర్ స్లోగన్ “ఒక్కటే నన్ను ప్రోత్సహించి పైకి తెచ్చింది. ఆనాడు నన్ను నిరుత్సాహపరిచిన వ్యక్తుల స్ఫూర్తి!” అలాగే కాలేజీ నుంచి సస్పెండ్ అయ్యాక టెక్సాస్ ఆయిల్ ఫీల్డులో అడుగుపెట్టి వ్యక్తిగతంగా ఆయిల్ ఎక్స్‌ప్లొరేషన్‌కి సిద్ధపడ్డ ‘డ్యూక్ రడ్‌మన్’ పదకొండు సంవత్సరాల సుదీర్ఘకాలం ఓడిపోయాక చివరికి నూనె నిక్షేపాన్ని సాధించాడు. మొండి పట్టుదలతో రెండు వందల ఇరవై మిలియన్ డాలర్ల ఆస్తికి అధిపతి అయ్యాడు. అతడి స్లోగన్ “నా గెలుపులో ఎక్కువ శాతం నన్ను ప్రోత్సహించింది నేను పొందిన వైఫల్యాలే ” అన్నది. “సో. . .” క్షణం ఆగి అంది. “అమెరికాకి చెందిన ఈ ఇద్దరు ప్రముఖులు ఎదిగింది సమస్యల నుంచి రిస్కుల నుంచి మొండితనం నుంచీ - ఇక్కడ మొండితనం అనే పదాన్ని నేను ఎందుకు వాడాల్సి వచ్చిందీ అంటే ఓటమి ఎదురైతే ప్రతిసారీ వాళ్ళు వెనుకడుగు వేయకుండా మొండితనంతోనే ముందుకు దూసుకుపోయారు కాబట్టి.”

“మీ ఆర్గ్యుమెంట్‌ని నేను అంగీకరించలేక పోతున్నాను మిస్ కృషి” ఆమె ఆలోచనా విధానం తప్పని నిరూపించడమే తన ధ్యేయం అన్నట్టుగా చెప్పాడు విశ్వ “మీరు చెప్పింది అన్ని రంగాలకీ వర్తించదు. పాట పాడలేని వాడు ఎంత మొండిగా కృషి చేసినా సంగీత విద్వాంసుడు కాలేడు.”

“అసలు పాటే పాడలేనివాడు సంగీత విద్వాంసుడు కావాలనుకోడు మిస్టర్ విశ్వనాథ్. మరో వ్యాపకం అంటే, తన అభిరుచికి అనుకూలమైన మరో వ్యవహారం వేపు మొగ్గు చూపిస్తాడు. లేదూ మొండిగా సంగీత విద్వాంసుడ్ని మాత్రమే కావాలీ అనుకుంటే ప్రారంభం దగ్గరే అంతమైపోతాడు.

“అంటే మొండితనం ఒక్కటే ఏదన్నా సాధించడానికి సరిపోదనేగా” కంక్లూడ్ చేశాడు విశ్వ కృషిని ఖండిస్తున్నట్టుగా “యస్ మిస్ కృషి . . . మనిషి ఒక గమ్యాన్ని చేరాలీ అంటే కావాల్సింది ముందు సంకల్పం. తర్వాత దానికోసం ప్రణాళిక. ఆ తర్వాత సాధించింది నిలుపుకోటానికి నిర్విరామ పోరాటం. . . ఈ పోరాటం అన్నది ఓ స్థాయికి చేరిన సంగీత విద్వాంసుడు రోజూ చేయాల్సిన సాధనలాంటిది. IF YOU MISS ONE DAY PRACTICE YOU NOTICE THE DIFFERENCE. IF YOU MISS TWO DAYS OF PRACTICE, THE CRITICS NOTICE THE DIFERENCE, IF YOU MISS THREE DAYS OF PRACTICE THE AUDIENCE NOTICES THE DIFFERECE. ఇది కేవలం సంగీతానికే కాదు, మనిషి జీవితంలో ప్రతి ప్రక్రియకీ వర్తిస్తుంది.”

తెలివిగల యిద్దరు వ్యక్తుల మధ్య సాగుతున్న ఆ చర్చ ఉత్సాహాన్ని కలిగించిందో లేక వారి చర్చల్లో జోక్యం చేసుకోకూడదనుకున్నారో ఉపాధ్యాయ నెమ్మదిగా లేచి వెళ్ళిపోయారు.... ఆ గదిలో తన ముందు అణుకువగా నిలబడటం మాత్రమే తెలిసిన విశ్వ యిప్పుడు క్రమంగా ఆ యింటిలోని ఓ వ్యక్తిలా కృషితో మాట్లాడం ఆయనకీ ఆనందంగా వుంది. . . విశ్వ ఉనికిని భరించలేనట్టుండే కృషి సైతం విశ్వని తనతో బాటు ఓ మేధావిగా అంగీకరించడం ఆయన కోరుకుంటున్నదే. ఇక్కడకూడా వ్యాపార బంధంలాగే ఆలోచించారు తప్ప అంతకుమించి స్నేహాన్ని ఆయన ఆశించలేదు... ఆశించరుకూడా. . . తన సామ్రాజ్య విస్తరణలో కొందరు విశ్వనాథ్‌లు తనకు అండగా వుండటాన్ని ఆయన కోరుకుంటున్నారు. అంతే. . .

ఉపాధ్యాయగారు వెళ్ళాక విశ్వ కూడా తన గదివేపు నడవబోతుంటే పిలిచింది కృషి“ఆగు”

నిశ్చలంగా చూశాడు విశ్వ “తెలివైనదానివి కృషి. . .మొత్తానికి మీ గ్రాండ్‌పాకి ఫోటోలు చూపించే అవసరాన్ని తప్పించావు”

"అది చెప్పాలీ అంటే కెమెరాలోని రకాలు వాటి ఉపయోగాల గురించి నీకు చిన్న సైజు లెక్చరివ్వాల్సి వుంటుంది."

"ఆ వివరాలు నాకు అవసరం లేదు మిస్టర్ విశ్వ . . . ఈ సాహసాన్ని ఎక్కడ ఎలా చేయగలిగావూ అని"

"నీ బెడ్‌రూంలోనే. . ." మృదువుగా నవ్వాడు విశ్వ.

"అవును కృషి. నీకు ప్రతి రాత్రీ నిద్రపోయేముందు కాంప్లాన్ తాగడం అలవాటుగా. అందులో కొన్ని ట్రాంక్విలైజర్సు కలిపాను. . . తర్వాత నువ్వు మత్తుగా నిద్రలోకి జారేక అర్ధరాత్రి నీ బెడ్‌రూంలోకి దూరి నిన్ను నా గుండెలపైకి లాక్కుని అప్పుడు. . ."

"స్టాపిట్" అరిచింది ఆవేశంగా.

"చెప్పనియ్ కృషీ. . . నిన్ను నా గుండెలపైకి లాక్కున్నాక నాలో కలిగిన రసాయనికమైన మార్పుల గురించి, ఆ తర్వాత నన్ను నేను అదుపు చేసుకోటానికి నేనుపడ్డ శ్రమ గురించి వివరంగా తెలియచేయనియ్.'

"అవసరం లేదు" అది అతడిపైన ద్వేషమో లేక తన ఇంటిలో తనపై చేసిన ప్రయోగానికి తన శరీరాన్ని తనే కోసుకోవాలన్నంత జుగుప్సాకరమైన భావమో కంపించిపోతూ అంది "అసలు ఇలా చేయడానికి నీకెన్ని గుండెలు. . ."

"ఒక లక్ష్యం సాధించడానికి రిస్క్ ఎంత అవసరమో బిజినెస్ టైకూన్స్ రెడెన్ బేచర్ డ్యూక్ రడ్‌మన్‌ల కథల ద్వారా యిందాకే తెలియచెప్పావుగా కృషీ . . . అయినా నిన్ను నేనేం రేప్ చెయ్యలేదే. . . రెచ్చిపోయే నీలాంటి ఆడపిల్లని అదుపు చేయడానికి అవసరమని ఇలా ఫోటోలు తీశాను. . . అఫ్‌కోర్స్ కొన్ని పుట్టుమచ్చల్ని చూశాననుకో."

"వ్వాట్" రొప్పుతూ చూసింది కృషి " అంటే నువ్వు. . . "

మనసు విస్ఫోటనంతో మెదడు నిశ్శబ్దం చెదిరిన కృషి కలవరపాటుగా ఆగిపోయింది. అది కలవరం కూడా కాదు. ఏ విషాద నిశీధాల వెన్నెల మరకలో కలుషితమయినట్టు ఇంకా ఒలకని యవ్వన మధు పాత్రలోని అనుభూతుల మాధుర్యాన్నో అనుమతిలేకుండా మరెవరో తాకినట్టు కలత చెందింది. . . యింతకు తెగించిన ఈ మనిషి ఇంకా ఏం చేసి వుంటాడు.

"కేవలం చూశానే తప్ప ఏదో చేసినట్టు అంత కంగారు పడతావేం - కృషీ" ఆర్ద్రతకి భావుకతని రంగరించి స్వప్నంలోలా అన్నాడు విశ్వ. "అప్పటిదాకా తెలీదు నాకు పగిలిపోతున్న క్షణాలలోని నిశ్శబ్దాల మధ్య అందం కూడ ఓ అస్థిత్వం కాగలదని - మనసు పడితే నేను తలదాచుకునే దివ్యరస సౌధానివి కాగలవని అప్పటిదాకా నాకు అర్థం కాలేదు. ఏకాంతపు పాలరాతి మందిరాన నీ సన్నిధిలో కూర్చుంటే నిన్నటి నా ఎడారి తీరాల్ని మరిచి విస్ఫారిన నేత్రాలలో నీ తనువంతా వెదకాలనిపించింది - అరమోడ్పులైన నేత్రాంచలాల్లో అనంతానంత లోకాల్ని చూస్తూ కదలని నీ పాద మంజీర ధ్వనుల్ని వింటూ ఏ సుదూర తీరాలకో

స్మృతుల జీవన భృతిలో రాలిపోతేనేం అనిపించింది. నీలోని ప్రభాత కోమలత్వాన్ని ఆస్వాదిస్తూ నిన్ను తాకే ప్రత్యూష పవనాన్నై యోగసిద్ధిని పొందాలనీ మనసు తొందరపడింది. నఖశిఖ పర్యంతం తక్షకుడిలా కాటు వేయడం నాకు కష్టం కాదు కృషీ. అప్పటి అవకాశం నాది - అయినా నిగ్రహించుకున్నాను ఎందుకో తెలుసా - నువ్వు తరుణీవీ వైతరణీవీ అన్న ఆలోచన నా మనసు మైదానంలో అలవోకగా మెదిలిన సజీవ స్వప్న లావణ్య శాఖవని."

"స్టాపిట్" అరిచింది యిక వినలేనట్టుగా - అది మోదమో ఉన్మాదమో ఆమెకే తెలీదు కాని ఇప్పటి మానసిక స్థితిలో అతడి భావుకత భరింపశక్యం కానిదైంది. "ఐ హేట్యూ."

"సహజమే. . ." విశ్శులో ఇందాకటి లాలిత్యం లేదు.

"ఉర్ధ్వోష్టమున పుట్టుమచ్చగల అమ్మాయి మంచి వంశంలో జనించి మంచి కీర్తి ప్రతిష్ఠలు పొందడమేగాక ఇలా స్వాతిశయాన్ని ప్రదర్శిస్తుంది. అయితే పెళ్ళి అయ్యాక ఇటువంటి మాటలకి అద్భుతంగా స్పందిస్తూ మృష్టాన్న భోజనాలతో భర్తకి ఆనందాన్ని పరుపుపై అమితమైన సుఖాన్నీ ఇస్తుందీ అని చెబుతుంది పుట్టుమచ్చల శాస్త్రం. . . ఇంతేకాక ఈ ఉర్ధ్వోష్టమున పుట్టు మచ్చగల అమ్మాయి- "

ఆమె తనను తాను మరిచినట్టు అమాంతం విశ్శు షర్టు కాలరు పట్టుకుంది. అసలు కృషిలాంటి అమ్మాయి అలాంటి సాహసం చేయగలదని విశ్శు సైతం వూహించలేకపోయాడు.

"చెప్పు. . . ఉర్ధ్వోష్టము అంటే. . ." సీరియస్‌గా అడిగింది. "ఎక్కడ . . .ఏ ప్లేసది. . . "

విశ్శు మొహంలోని చిలిపితనం ఆమెనెంత ఉద్రేకపరిచిందీ అంటే యించుమించు కుదిపేసింది "చెప్పమంటున్నది నిన్నే"

"ఇందాక సైంధవుడి గురించి వివరంగా చెప్పేసి నీకున్న పరిజ్ఞానాన్ని నీ తాత ముందు ఏకరుపెట్టావ్... ఆ పదానికి అర్థం తెలియక పోవడమేమిటి. . . అది నగ్నంగా వుండే ప్రాంతం..... వెళ్ళిచూసుకో. . ."

"య్యూ. .. " ఉక్రోషంతో గోడకి నెట్టి విశ్శు చెంపలు పగలగొట్టేదే. అదిగో అప్పుడు చూసింది ద్వారం దాటి వస్తున్న నౌకరుని. అంతే విడిచిపెట్టింది.

ఆ తర్వాత ఆమె ఇంటిలో ఉండలేక పోయింది. అతడితో మాట్లాడుతుంటే చికాగ్గా వుందో అతడి ప్రవర్తన చికకు కలిగిస్తూందో స్పష్టంగా తోచడం లేదు. . . డాక్టర్ మహంతిని కలుసుకోవాలనుకుంది. అతడి గురించి అతని తండ్రి మరణం గురించి వివరంగా తెలుసుకోవటానికి ఆయన్ని మించి మరోదారి లేదు.

కారులో వెళుతూ సైతం అనుకుంది.

ఉర్ధ్వోష్టమూ అంటే ఏమిటి. . .పైగా ఆ భాగమంతా నగ్నంగా వుంటుందంటా డేమిటి. . .

0 0 0

"ఆశ్చర్యంగా వుంది కృషి- విశ్శు మోహన్‌గాంధీ కొడుకంటే నమ్మలేక పోతున్నాను" [illegible] అన్నాడు డాక్టర్ మహంతి

"నాక్కూడా తెలిసింది ఈ రోజు ఆశ్రమానికి వెళ్ళాకనే అంకుల్ చైతన్యానందగారు విశ్వ కుటుంబం గురించి చెప్పింది విన్నాక నా అనుమానం నిజమనిపించింది" క్షణం ఆగి అంది కృషి "చెప్పండి అంకుల్. మోహన్‌గాంధీ ఎలా చనిపోయాడు"

చాలా సేపటిదాకా నిశ్శబ్దంగా వుండిపోయాడు డాక్టర్ మహంతి. . . ఉపాధ్యాయ కుటుంబానికి ఆత్మీయుడైన మహంతి కళ్ళలో చెప్పాలా వద్దా అన్న సందిగ్ధత. . .

"ప్రత్యేకించి మిమ్మల్ని అడగడంలో నా ఉద్దేశ్యం నిజం మీకు మాత్రమే తెలిసి వుంటుందన్న నమ్మకం అంకుల్ . . . కేవలం మీ వెర్షన్ ఆధారంగా మోహన్ గాంధీ హత్యలో గ్రాండ్‌పా ప్రమేయం ఎంతవరకున్నదీ తెలుసుకోవాలనుకుంటున్నాను"

విభ్రమంగా చూశాడు డాక్టర్ మహంతి "హత్య జరిగిన మాట నిజం కృషి. కాని దానికి మీతాతయ్య బాధ్యుడు కాదు. ఎందుకంటే తన సామ్రాజ్య విస్తరణకి మీ తాతయ్య తన వాళ్ళని వదులుకోగలడేమో కాని హత్యలు చేయించి అడ్డుతొలగించుకునేటంత రాక్షసుడు కాడు."

నిర్వేదంగా నవ్వింది కృషి "హత్యలు చేయించడం అంటే ఆయుధాల్ని ఉపయోగించి చంపమనడమొక్కటే కాదంకుల్. చావటానికి అనుకూలమయిన పరిస్థితుల్ని సృష్టించడమూ హత్య చేయడమే అవుతుంది."

"కౌశిక్‌ని దృష్టిలో పెట్టుకుని నువ్విలా మాట్లాడుతున్నావనుకుంటాను."

"యస్" కృషి కళ్ళలో జివ్వున నీళ్ళు తిరిగాయి. "నేను కోరుకున్న కౌశిక్ చావుకి కారణమైన ప్రమాదం గ్రాండ్‌పా సృషించింది కాదు. కాని గ్రాండ్‌పా ఇచ్చిన షాక్ కౌశిక్‌ని జీవచ్ఛవంగా మార్చేసింది. చావులాంటి బ్రతుకునుంచి చావడం దాకా తరిమింది. డబ్బు, ప్రతిష్ట, అంతస్తులు యివేగా గ్రాండ్‌పా ఆరాధించేది. ఎప్పుడో రెండున్నర దశాబ్దాల క్రితం తన చెల్లెలు ఓ సామాన్యుడ్ని ప్రేమించినందుకు యింటినుంచి బయటకి సాగనంపటానికి గాని ఆ తర్వాత ఆమె కేన్సరుతో ప్రాణాలు కోల్పోయే స్థితిలో ఉందని తెలిసీ సహాయం చేయటానికి తిరస్కరించి ఆమె చావుకి కారణం కావటానికి కారణం ఈ అంతస్తుల వ్యామోహమేగా. . . అంతే అంకుల్. ఈ రోజు మోహన్‌గాంధీ చావుకీ యించుమించు అలాంటి కారణం ఒకటి వుండి వుండాలి. లేకపోతే మా కుటుంబాన్ని నాశనం చేయడానికి విశ్వ అనే ఓ వ్యక్తి యింటిలో అడుగుపెట్టేవాడు కాదు. . ."

ఆమె విశ్వని సమర్థిస్తుందో లేక తిరస్కార భావంతో మాట్లాడుతుందో అర్థం కాలేదు.

“ కృషీ” బయటి చీకటిలోకి చూస్తూ ఉదాసీనంగా అన్నాడు డాక్టర్ మహంతి.

“నీ తర్కాన్ని నేను కాదనలేను. నిజమే చంపకపోయినా చావటానికి అనుకూలమైన పరిస్థితుల్ని సృష్టించడమూ హత్య చేయడంలాంటిదే. కాని మీ గ్రాండ్‌పా మనస్తత్వమది. . . అది మనం మార్చలేనిది. కాబట్టే తన పంతంకోసం తన ఆరోగ్యాన్ని సైతం నాశనం చేసుకోగలడని నిరూపించుకున్నాడు మీ తాతయ్య. ఇలాంటి సమస్యకి పరిష్కారం చెప్పగలిగేది కాలమో లేక నీ ప్రయత్నమో నాకు తెలీదు కాని చెప్పాలనుకుంటున్నాను కృషి. అసలు ఇలా దాని గురించి చర్చించాల్సిన అవసరం ఏర్పడుతుందని ఇంతవరకూ ఊహించలేకపోయాను.”

స్వగతంలా చెప్పుకుపోయాడు.

“మోహనగాంధీ మీ ఫ్యాక్టరీ కార్మికుడు మాత్రమే కాదు కార్మిక సంఘానికి నాయకుడు కూడా. చాలా నిజాయితీపరుడని పేరుండేది. ఒకనాడు మీ గ్రాండ్‌పాతో కార్మికుల డిమాండ్స్‌కి సంబంధించి మాట్లాడి విఫలం కావడంతో సమ్మెకి దిగాడు తన కార్మికుల అండతో. ఫ్యాక్టరీ లాకౌట్ అయింది. అయినా మీ గ్రాండ్‌పా చర్చలకి సిద్ధం కానన్నాడు. వారం రోజుల్లోగా పరిష్కరించకపోతే ఎనిమిదో రోజు ఆత్మాహుతి చేసుకుంటానని బెదిరించాడు మోహన్‌గాంధీ. ఉపాధ్యాయగారు కంగారుపడ్డారు. చర్చలకి ఆహ్వానించడానికి నిర్ణయించుకున్నారు.

“కాని ఆ ముందు రాత్రే టెంట్‌లో కూర్చున్న మోహన్‌గాంధీ హత్య చేయబడ్డాడు దారుణంగా. అయితే ఆ తర్వాత అది మోహన్‌గాంధీ ఆత్మహత్యగా నిర్ణయించ బడింది.”

విస్మయంగా చూసింది కృషి “ఎలా”

“మీ గ్రాండ్‌పా ఖర్చుచేసిన డబ్బుతో అది సాధ్యమైంది కృషీ. లేకపోతే మీ తాతయ్య హంతకుడిగా నిలబడాల్సి వచ్చేది. కాబట్టే చాలా శ్రమపడి అది ఆత్మహత్యగా నిరూపించడం జరిగింది.”

“అసలు హత్య చేయించిందెవరు?”

“చౌదరి”

కృషి నిశ్చేష్టంగా చూసింది.

“అవును కృషి. . . సమ్మెగాని చర్చగాని ఫలించడం యిష్టపడని చౌదరి మీ తాతయ్యని నేరస్థుడిగా నిలబెట్టి జైలుకి పంపాలనే ఉత్సాహముతో ఆ హత్య చేయించాడని తెలిసింది. అయితే ఆ నిజాన్ని నిరూపించడానికి ప్రయత్నించారు ఉపాధ్యాయ. . . లాభం లేకపోయింది. కారణం చౌదరివైపు వున్న దేవి అనబడే ఓ ఆడది.”

కృషి విభ్రమంగా వింటూంటే దేవి అనబడే ఓ ఆడదాని గురించి ఆధ్యాత్మిక చర్చల నీడలో జరిగే అక్రమమైన దేవి కార్యకలాపాల గురించి చెబుతూ చౌదరి నేరస్థుడిగా చిక్కిన

"అంతే . . . డబ్బుతో మీ తాతయ్య తను చేయని హత్య నుంచి తనను కాపాడుకుంటే అదే డబ్బుతో దేవిద్వారా హంతకుడైన చౌదరి తనను తాను కాపాడుకున్నాడు."

నుదుటపట్టిన స్వేదాన్ని తుడుచుకుంటూ నిలబడిపోయింది కృషి చాలా సేపటిదాకా. మరోసారి తనకు ఇష్టంలేకుండానే చౌదరి అనబడే ఓ జుగుప్సాకరమైన పాత్రగురించి వినాల్సి వచ్చింది. ఇప్పుడు ఆమె ఆలోచిస్తున్నది అది కాదు. ఏ వ్యక్తయితే తన తండ్రి మరణానికి కారణమయ్యాడో ఆ వ్యక్తి అండతోనే విశ్శు తమపై దాడికి సిద్ధపడ్డాడు. . . నిజాన్ని వదిలి నీడవెంట పడుతున్నాడు. ఒక్కోసారి మేధస్సుతో ఆలోచించగల వ్యక్తులు సైతం మూర్ఖుల్లా ప్రవర్తించటానికి కారణం ఆలోచించే అవకాశమివ్వని పరిస్థితులైతే యిప్పుడు విశ్శుని మంత్రించిన సర్పంలా మార్చేశాడు చౌదరి.

ఆధారాలులేని ఈ సత్యాన్ని విశ్శుకి చెప్పినా అతడికి అర్థం కాదు. నిరూపించాలి సోదాహరణంగా. . . ఇప్పుడు సమస్య విశ్శుని ఇంటినుంచి బయటకి తరమడం కాదు. అతడెవరన్నది తాతయ్యకి తెలియచెప్పడం కాదు. . . అతడ్నే అస్త్రంగా మార్చి చౌదరిపై చావు దెబ్బతీయడం.

అపరాత్రి కావస్తుంటే ఆలోచిస్తూ కారు నడుపుతున్న కృషి టేంక్‌బండ్ దగ్గర పోగయివున్న జనాన్ని చూసి కారాపింది.

"వయసులో వున్న పిల్ల. చావటానికి హుస్సేన్‌సాగర్‌లో దూకితే రక్షించారు. . ." చెబుతున్నాడేవరో.

రైలింగ్‌కి ఆనుకునివున్న సిమెంటు బెంచీపై ఇంకా స్పృహలోకి రాని అమ్మాయికి ఫస్ట్ ఎయిడ్ చేస్తున్నాడో వ్యక్తి.

ఓ వారగా కారుని పార్కు చేసిన కృషి ఏ శక్తో ప్రేరేపించినటటు అందరి మధ్యకి నడిచింది.

అంతే. . .

ఆ యువతిని చూస్తూ షాక్ తింది.

ఆమె ఎవరో కాదు జీవిత. . .కౌశిక్ చెల్లెలు.

ఆలోచనల తెరమాటున సమాధయిన గతంలా బ్రతుకు రంగస్థలంపై కొంత కాలం కదిలి కనుమరుగయిన కౌశిక్‌నే ఇంకా మరిచిపోలేకపోతుందే. అతడి ఆలోచనలకి అవశేషమై జీవిత ఎందుకిలా కనిపించింది.

కృషి ఆలస్యం చేయలేదు. తనే కారులో అపోలోకి తీసుకువెళ్ళింది.

స్పృహలోకి రావటానికి గంట వ్యవధి అవసరమైంది.

ముందు చూసింది కృషినే. . . జీవిత కళ్ళలో జివ్వున నీళ్ళు తిరిగాయి. . . అది తన ప్రయత్నం విఫలమైనందుకో లేక కృషికి యిలా దొరికిపోయినందుకో ఆమెకే తెలీదు. వెక్కి

ఆప్యాయంగా తల నిమిరింది కృషి. . .“పిచ్చిపిల్లా! మీ అన్నయ్యే అనుకుంటే అంత కంటే పిరికిదానివి నువ్వు-”

కౌశిక్ గురించి ఇప్పుడు మాట్లాడింది జీవితకి జీవితంపై ఆసక్తి కలిగించాలనే. . . గెలుపులాంటి అనుభూతికన్నా కొన్ని సమయాలలో ఓటమి గురించి మాట్లాడుకోవడం సంతృప్తిని కలిగిస్తుంది. ఇది అలాంటి సన్నివేశమే - “ఏమైంది జీవితా. . .మీ అన్నయ్య జ్ఞాపకలనుంచి మీ వాళ్ళింకా తేరుకొని వుండరే. . నువ్వు మరింత శోకాన్ని మిగిల్చి వెళ్ళిపోవాలని ఎందుకనుకున్నావ్”.

ఆమె జవాబు చెప్పలేదు. ఆ స్థితిలో వున్న ఏ ఆడపిల్లయినా అలాగే ప్రవర్తిస్తుంది...

“చెప్పమ్మా. . .” అక్కయ్యలా లాలించింది.

“నేను నీకు కావాల్సినదాన్నేగా. . . ”

మనసులో ఏ పొర కదిలిందో జీవిత అశ్రుశిక్త నయనాలతో చూస్తూ అంది. “నేను పెళ్ళి కాకుండనే తల్లి కాబోతున్నదాన్ని. అందుకే. . .”

ఆశ్చర్యపోలేదు కృషి. . . అలాంటిదేదో వుంటే తప్ప ఆ వయసులో వున్న ఏ ఆడపిల్లా యిలాంటి నిర్ణయం తీసుకోదు. . .

“ఎవరా అబ్బాయి” నిశ్చలంగా అడిగింది కృషి - “నీకు న్యాయం చేస్తాననే హామీ ఇవ్వడం లేదు జీవితా. . . చేయటానికి ప్రయత్నిస్తానంటున్నాను చెప్పు.”

కృషి స్థాయిగల ఆడపిల్ల చెప్పే ప్రతి పదమూ ఓ హామీ కాగలదనుకుందో - ఆ క్షణంలో కృషిని మించిన ఆత్మీయురాలు మరొకరు లేరనిపించిందో చెప్పింది జీవిత “రాజేష్ - రామనాథ్ చౌదరిగారి అబ్బాయి”

ఎక్కడో ఓ పిడుగు పడిన చప్పుడు. . . ఎన్నో ప్రశ్నలకి ఒక్క జవాబులా మళ్ళీ రామనాథ చౌదరి పేరునే వినాల్సి వచ్చిందేమిటి - శాఖోపశాఖలుగా విస్తరించిపోతున్న చౌదరి దమననీతికి రాజేష్ కూడా వారసుడేనా. . .బ్రతుకు పుస్తకాన తల దూర్చి రేపటి పరీక్ష కోసం చదువుకొనే ఓ మధ్య తరగతి అమ్మాయి యిక్కడా పరీక్షలో విఫలమైనందుకు తనను తాను అంతం చేసుకోవాలనుకుంటూంది.

రాజేష్‌కీ, జీవితకీ ఎలా పరిచయం అన్నది కాదు యిక్కడ సమస్య. “రాజేష్ నిన్ను కాదన్నాడా” నెమ్మదిగా అడిగింది కృషి.

“వాళ్ళ నాన్నకి భయపడి నేనేం చెయ్యలేనంటూ మొహం చాటేశాడు.”

అందులో నిజానిజాల గురించి ఆలోచించలేదు కృషి.

అదే రాత్రి ఆమెను ఇంటిదగ్గర డ్రాప్ చేస్తూ అంది కృషి “ప్రపంచంలో ప్రతి సమస్యకీ చావే పరిష్కారమైతే ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ మిగిలేవారు కాదు జీవితా - జీవితమంటే వైఫల్యం కాదు. . . . విఫలం కావడమూ జీవితంలో ఓ భాగమని నువ్వు అర్థం చేసుకోవాలి. . .

The World is A Comedy To Those That Think, A Tragedy To Those That Feel"

మరో బాధ్యతని కృషి నెత్తిన వేసుకుంది. . .

0 0 0

ఉదయం ఆరున్నర కావస్తుండగా బాత్‌రూములో అడుగుపెట్టిన కృషి బడలికగా టబ్‌లోకి చేరి వాల్వ్‌ని ఓపెన్ చేసింది. గోరు వెచ్చగా శరీరాన్ని తడుపుతున్న నీళ్ళు ఆమెకు అదోలాంటి ప్రశాంతతని అందిస్తుంటే స్టీరియోలో మంద్రంగా వినిపిస్తున్న మైకేల్ జాక్సన్ 'బ్లాక్ అండ్ వైట్' మనసుని వివశత్వానికి గురి చేస్తుంది.

గుండె కెందుకీ సంకోచ వ్యాకోచాలు. . . బ్రతుకుని కోల్పోయిందేమైనా కాని ఆశల్ని సమాధి చేసుకుని ఎక్కడో సుదూరంగా బ్రతికేస్తూ యిక్కడ కొచ్చిన తనకీ అనుభవాలేమిటి... ధృవాల దిగంతాల్లో కల్లోల రాగాలనాలపించిన వర్తమానానికి అతీతంగా శరశయ్యలాంటి భవిష్యత్తులో శేషంగా మిగలాలి అనుకుంటే కార్చిచ్చు వర్షంలో తడిసిపోయి ఇంత కలవర పడుతుందేం. . . అసలిది కలవరమా . . .కోరని కలల్ని వరించడమా . . . ఎదుకు తనింతగా స్పందిస్తూంది. . . కూతకొచ్చిన కోయిలే అయితే తనకి కొరత లేదని తెలుసే - అయినా ఉదయ సంధ్యని కాదని గ్రీష్మంలో నడవాలని తను కోరుకుంటూంది అంటే ఎక్కడ తనలో లోపం - పూతకొచ్చిన మావిలా కదలాలనుకుంటూ చచ్చిపోయిన పచ్చదనంతో కాళ్ళని కదలించలేక కలత చెందుతుందెందుకని. . . ఇంత తెలివైన తను విశ్వని ఓడించలేక పోవటానికి కారణం గెలవలేకనా . . . లేక గెలుపుకంటే ఓటమిలోనే తను ఆనందాన్ని పొందుతూందా. . . పూర్తిగా అతడి గురించి ఆలోచించటానికి వెనుకాడుతున్నది కౌశిక్ జ్ఞాపకాలుమాసిపోకనా, లేక విశ్వ పై నిజంగానే మనసు లేకనా. . .

సమూహం మధ్య ఏకాంతం లాంటి ఈ బ్రతుక్కి అర్థమేమిటి. . . అర్ధనిమీలితాలై ఆమె కనురెప్పల్ని పాయలుగా కదిలిన కుంతలాలు కప్పి విచిత్రంగా గిలిగింతలు పెడుతుంటే పక్కకి ఒరిగింది ఆందోళనకి ఆలాపనలా గుండెలు ఎగిసి పడుతుంటే మంత్ర ముగ్ధలా పైకి లేచింది.

తను నగ్నంగా వున్నాననన్న విషయం మరచినట్టు కృషి అలాగే నడిచింది.

ఎదురుగా నిలువుటద్దం. . .

ఖజురహో శిల్పంలాంటి పొంకం.... నిసర్గ సుందర జానపద గీతాన్ని తలపించే హాసిస్తున్న వసంత గానంలాంటి వర్చస్సు - స్వాప్నిక యుగళ గీతాల నేత్రాలు - మొలకల కనుకొలకుల్లో తళుక్కుమనే రాగరేఖలు - మౌనాన్ని వేడిగా నిట్టూర్చే వక్ష ద్వయం - ధూళి రేగిన సంధ్య కాంతిలాంటి శరీరఛాయ.

అదిగో అప్పుడు ఆ ధ్యానంలోనే చూసింది ఎడమ స్థనానికి ఎగువగా నల్లని పుట్టమచ్చ.

మరల్చింది. . . ఎడమ తొడపై మరొక పుట్టుమచ్చ - బిడియంతో ఒదిగిపోయింది. . . అదికాదు ఆమెను మరింత ఆందోళన పరిచింది. ఇంతకాలం తను గమనించలేదు నాభికి నాలుగు అంగుళాల దిగువునవున్న నల్లని పుట్టుమచ్చని.. . అది కూడా అతడు-

నెత్తుటి కొలనులో అతడి చూపుల నాళికని ముంచితే నాదం నినాదమై బిందువు సింధువై సృష్టి ద్వారా మణికవాటం తెరుచుకుని మనోసాగర స్వర మండలం గట్టుల్ని తెంచుకుని-

ఏమిటి. . . ఎందుకు తనిలా ఆలోచిస్తూంది.

ఒంటరితనం యింత భయానకంగా వుంటుందా. . .

మనసుని నిగ్రహించుకొని డ్రెస్ చేసుకుని మరో పది నిమిషాలలో గదిదాటి బయటికి వచ్చింది.

ముందు కనిపించింది విశ్శు - అతడే కనిపించాడో లేక తనే ముందతడ్ని చూసిందో ఆమెకే తెలీదు. కాని డైనింగ్ టేబుల్ దగ్గర గ్రాండ్‌పా కూడా వున్నాడు అప్పడికే.

అదికాదు. స్నేహితుల్లా చర్చించుకుంటున్నారు.

"గుడ్‌మానింగ్ గ్రాండ్‌పా" అంది తప్ప విశ్శుని విష్ చేయలేదు.

అరక్షణం విరామం తర్వాత విశ్శు ఇందాక ఆపిన చర్చని కొనసాగిస్తూ చెప్పుకుపోతున్నాడు. "అంచేత మీ కుడిచేతి బొటన వ్రేలిమీద పుట్టుమచ్చ మీ స్థాయికి కారణమన్న నిజాన్ని మీరు అంగీకరించాలి- ఈ లెక్కన మీకు రైట్ థై మీద కూడా మరో పుట్టుమచ్చ వుండి వుండాలి. . . అలాగే గుండెపై. . . "

ఆ తర్వాత కృషికి అతడి మాటలు వినిపించలేదు. అతడు చెబుతున్నది తనని ఉద్దేశించే అనిపిస్తుంటే ఇక భరించలేనట్టు లేవబోయింది.

"ఉండు బేబీ. . ." మృదువుగా వారించాడు ఉపాధ్యాయ.

"విశ్వనాథ్ మేనేజ్‌మెంట్ సైన్స్‌లోనే కాదు పుట్టుమచ్చల శాస్త్రం గురించీ క్షుణ్ణంగా తెలిసినవాడు.

అయినా ఆమె వెళ్ళిపోవాలనుకుంది. వెళ్ళిపోయేదే. . ."అదే మాదిరిగా గొప్ప అదృష్టాన్ని అందిస్తుంది ఊర్ధ్వోష్టంపై వున్న పుట్టుమచ్చ కూడా. . ."

టక్కున ఆగింది కృషి.

"ఊర్ధ్వోష్టం అంటే" అడిగింది కృషి కాదు ఉపాధ్యాయగారు-

అక్కడ హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది.

'నగ్నంగా వుండే ప్రదేశం' అన్నాడు విశ్వ విన్న. . . కృషి రెప్పలార్చకుండా చూస్తోంది.

"ఊర్ధ్వోష్టం అంటే పై పెదవి. . ."

విభ్రమంగా చూసింది. నగ్నంగా వుండే ప్రదేశం అంటే దేనికీ మరుగున వుండని చోటని అతడి వుద్దేశ్యమా.... కేవలం తనను కంగారు పెట్టాలనే ఆ పదాన్ని వాడేడా. . . అసలు విశ్వ నిజంగా తన నగ్నదేహాన్ని చూశాడా. పై పెదవిపై తనకు పుట్టుమచ్చ వున్న విషయం తెలుసు కాని ఇన్ని గంటలుగా అతడు తనని ఆందోళన పరిచింది దాని గురించే అని తెలిసిందిప్పుడే-

ఆ చర్చ ఇంకా కొనసాగేదే. . . సరిగ్గా అప్పుడు ఫోన్ రింగయింది. నౌకరు అందించిన రిసీవరు తీసుకున్న ఉపాధ్యాయగారు ఫోన్‌లో ఏం విన్నదీ తెలీదు.

అచేతనంగ కుర్చీకి జారగిలబడిపోయారు.

"ఏమైంది" ఆత్రంగా అడిగింది ఆమె.

తేరుకోడానికన్నట్టుగా రెండు క్షణాలు నిశ్శబ్దంగా వుండిపోయిన ఉపాధ్యాయగారు "డిఫెన్స్‌కి మనం పంపిన కొటేషన్ చేజారిపోయింది కృషి . . . ఏడు కోట్ల ఖరీదుచేసే ఆర్డర్ పోయింది " అన్నారు సన్నగా కంపిస్తూ. .

"కాని ఎలా. . ."ఉద్విగ్నంగా అడిగింది ఆమె.

"జనరల్ మేనేజర్ లీక్ చేసిన వివరాల్ని తెలుసుకుని మనం రేట్స్‌ని తిరిగి కరెక్టు చేశాంగా."

ఎంత కోటీశ్వరుడికైనా ఇలాంటి నష్టం భరింప శక్యం కానిది. . . ఇక్కడ ఆర్థికమైన నష్టం కాదు దెబ్బతిన్న ప్రతిష్ట గురించి ఆయన అమితంగా కలవరపడుతున్నారు.

"దీనికి జవాబు చెప్పాల్సింది మీరు మిస్టర్ విశ్వనాథ్" విశ్వపై దాడి చేసింది కృషి. . . చౌదరి నుంచి వివరాలు సేకరించి మళ్ళీ చౌదరి గెలవటానికి కారణం కాగలిగేది విశ్వ మాత్రమే అన్నది ఆమె బలమైన నమ్మకం. "ఎందుకలా ఆశ్చర్యంగా చూస్తున్నారు. మా గ్రాండ్‌పాని ఇంప్రెస్ చేయటానికి ఇక్కడ ఆ వివరాల్ని అందించారు... ఈ విషయాన్ని మళ్ళీ చౌదరికి మీరు తెలియజేసి అతడు కరెక్టు చేసుకునే అవకాశం కల్పించారు."

"మిస్ కృషి" ఉద్వేగంగా అన్నాడు విశ్వ. "మీరేం మాట్లాడుతున్నారో మీకు అర్థమౌతుందా.... కష్టపడి వివరాల్ని సేకరించిన నేను కోరింది మీరు నష్టపోకూడదనే తప్ప మీ గ్రాండ్‌పాని ఇంప్రెస్ చేయాలని కాదు.

"ఇంప్రెస్ చేయటమే మీకు ఆలోచన కాకపోతే మేం నష్టపోకూడదని మీరెందుకు కోరుకున్నారు - ఏమిటి ఈ కుటుంబం మీద మీకున్న శ్రద్ధ. . . "

"పోనీ చౌదరి మీద మీకున్న కక్షేమిటి"

మరో ప్రశ్న. . . ఇదీ జవాబు చెప్పటానికి సాధ్యం కానిదే. . . అయినా సమర్ధించుకోవాలనుకున్నాడు. . . తప్పదు. . . ఇంతదాకా వచ్చాక ఓ బలమైన అస్త్రాన్ని సంధించాలి.

"మిస్ కృషి మీ ప్రశ్నలకి జవాబు ఒక్కటే. . . మీ కుటుంబం మీద నాకంటూ ఓ శ్రద్ధ ఏర్పడటానికి కారణం ఉపాధ్యాయగారు నా మీద చూపించే అభిమానం - అందుకే చౌదరి ఎత్తుని తిప్పికొట్టాను. అంతే తప్ప చౌదరి మీద నాకు కక్షలేదు. ఇకపోతే ఈ దారుణం జరగటానికి కారణం మీరు-"

"వ్వాట్"

"ఎస్ మిస్ కృషీ మీరు నన్ను తొలినుంచీ నమ్మడం లేదు కాబట్టి నన్ను చౌదరి ప్రయోగించిన మనిషిగా భావించి ప్రతి క్షణమూ నన్ను అనుమానిస్తూనే వున్నారు. చివరికి చౌదరికీ మీకూ మధ్యవున్న వైరంతో నేనిక్కడ చేసిన పనికి చౌదరికి మీరే తెలియచేశారు - కేవలం చౌదరి నన్ను సాధించాలన్న ఆలోచన. . ."

"నో- " అరిచింది కృషి

"ఇది నిజం"

"కాని" ఆమె ఆగింది ఓ క్షణం "నేను చౌదరికి చెప్పింది వెంటనే కాదు - టెండర్ సబ్మిట్ చేయడం పూర్తయిన రెండు రోజులకీ. . . అప్పటికి లాస్ట్ డేట్ అయిపోయింది.

"అసలెందుకు ఫోన్ చేశారు"

జవాబు చెప్పలేకపోయింది.

"లాస్ట్ డేట్ అయిపోయినంత మాత్రాన చౌదరిలాంటి వ్యక్తికి మరో టెండరు పాత డేట్‌తో అందించడం కష్టం కాదుగా"

ఇప్పుడు కృషి ఇరుకున పడింది.

నిజానికి చౌదరి టెండరు కరెక్టు చేసుకోమని విశ్వ ముందే సలహా ఇచ్చాడు. ఉపాధ్యాయ కుటుంబంపై తనకున్న ఉక్రోషంతో ఆ ఇంట అడుగుపెట్టిన విశ్వ దేవి నుండి వివరాలు సంపాదించి ఉపాధ్యాయ గారికి తెలియచేశాడు. ఇక్కడ ఏ పరిస్థితుల్లో చెపాల్సి వచ్చిందీ చౌదరికి తెలియచేసి అక్కడ చౌదరికి సహకరించాడు - ఈ విషయం తెలీని కృషి ఇప్పుడు దోషిలా నిలబడిపోయింది.

ఇంత పదునుగా ఓ తర్కాన్ని ప్రయోగించి తన నోరు మూయిస్తాడని ఆమె ఊహించలేకపోయింది.

నిశ్శబ్దంగా తన బెడ్‌రూంలోకి వెళ్ళబోతున్న ఉపాధ్యాయగారిని చేరుకుంది "గ్రాండ్‌పా.... అసలు జరిగింది"

చేతిని పైకెత్తాడు తనకు వినే సహనం లేనట్టుగా.

వెళ్ళిపోయారాయన.

అప్పుడు చూసింది కృషి. . . విజయ గర్వంతో నవ్వుతున్నాడు విశ్శు - కొన్ని వారాల శ్రమకి దీక్షకి సమాధి కట్టి తననో నేరస్థురాలిగా మార్చాడు.

ఉగ్రనేత్రాలలో నుంచి జారిపడ్డ మొదటి అగ్ని కణంలా ఓ నీటి బొట్టు పైకి రాబోయి ఆమె కను కొలకుల్లోనే ఆగిపోయింది.

"తప్పదు కృషి నీ స్థానం ఈ ఇంట బలహీనపడుతూంది. నువ్వీ దేశం వదిలి వెళ్ళక తప్పదు" పరిహాసంలా అన్నాడు విశ్శు.

అతడికి సరైన బదులు చెప్పాలి. అంత వరకూ మనసుకి వూరటలేదు. ఉద్రిక్త చైతన్యానికి తిరుగులేని ఓ విరామం లాంటి పదునైన బాణాన్ని సంధించాలి.

"ఓ సారి నా గదిలోకి రా" ఆహ్వానంలా పిలిచింది.

ఉలికిపడ్డాడు విశ్శు.

"ఊర్ధ్వోష్టంపై పుట్టుమచ్చ గల అమ్మాయి శక్తేపాటిదో చెప్పిన నువ్వు ప్రాక్టికల్‌గా దాన్ని రుచి చూడాలిగా... రా...."

విశ్శులో చలనం లేదు. ఇప్పుడు తనను ఓ ట్రాప్‌లో ఇరికించబోతుందేమో అన్న సంధిగ్ధంతో నిలబడిపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్. నేను ట్రాంక్విలైజరు మత్తులో వుంటే తప్ప గదిలోకి అడుగుపెట్టలేవేమో కదూ! పర్వాలేదు. పిలుస్తున్నది నేనేగా కమాన్"

అది ఓ ఆదేశంలా వినిపించింది.

"పది సెకండ్ల గడువిస్తున్నాను"

వెళ్ళిపోయింది కృషి. . . ఆరు సెకండ్ల పాటు టెన్షన్‌గా నిలబడ్డ విశ్శు ఆ తర్వాత జాప్యం చేయలేదు. సరాసరి ఆమె బెడ్ రూంలో అడుగుపెట్టాడు.

నవ్వింది భావ రహితంగా "అర్ధమైందిగా విశ్శూ. సంకోచించే ఆడపిల్లని చూసి మగాడు వ్యాకోచిస్తాడు. యుద్ధమే వద్దనే మనిషితో పోరాటానికి సిద్ధమంటాడు. మూర్ఖుడైన నీలాంటి మగాడు. కాని యుద్ధానికి నేను సిద్ధమని పది సెకండ్ల గడువిచ్చేసరికి. . . "

"నేను వచ్చింది నీకు భయపడి కాదు"

"నేనంటే నీకు భయమే లేకపోతే ఆ రాత్రి కాంప్లాన్ మత్తుమందెందుకు కలిపావ్.. . నిన్ను గుండెలపైకి లాక్కుని ఫోటోలు తీయించుకుంటానని ముందే చెప్పగలిగేవాడివిగా"

"ఎందుకు పిలిచావో చెప్పు"

"నా స్థాయికి....." క్షణం ఆగింది కృషి "ప్లీజ్ అండర్ లైన్ దిస్ సెంటెన్స్ మిస్టర్ విశ్వనాథ్. . . నా స్థాయి గల ఆడపిల్లకి నిన్ను నేలమట్టం చేయడం కష్టం కాదు. . . ఓ లక్ష నాది కాదనుకుంటే చాలు నిన్ను మించిన మొండితనం గల ఓ మగాడ్ని లేదూ ఓ గూండాని రంగంలోకి దింపి నీ కథని ముగించేయగలను. కాని ఆ పని చేయలేదూ అంటే కారణం నాకు

జన్మత: వచ్చిన సభ్యత సంస్కారాలు . . .  యస్ మిస్టర్ విశ్వనాథ్! ఈ క్షణం దాకా నిన్ను కాపాడింది అదే. . . నిజానికి నువ్వు ఫోటోలు చూపించి బెదిరించగానే నేను ఆగింది నీకు భయపడి కాదు. . . గ్రాండ్‌పాకి నన్ను నేనలా పరిచయం  చేసుకోవటం యిష్టం లేక. . . అసలు ఆ ఫోటోలు చూపించి నువ్వేం  సాధించగల ననుకున్నావ్. . . నీకూ నాకూ సంబంధం వుందని నిరూపించి నాకీ యింటిలో స్థానం లేకుండా చేయాలనుకున్నావ్.  అంతేకదూ, కాని ఆ తర్వాత జరిగేదేమిటో తెలుసా నీ స్థాయి మనిషితో  సంబంధం వున్న నన్ను గ్రాండ్‌పా ద్వేషించే వాడేమోకాని బయటికి తరిమేసేవాడు మాత్రం కాదు విశ్వ..... కాని నీ స్థాయి నువ్వు మరిచినందుకు నీకు వెంటనే ఉద్వాసన పలికేవాడు ..... అంటే నాకు ఓ తాత్కాలికమైన నష్టాన్ని మాత్రం కలిగించిన నువ్వు మాత్రం శాశ్వతంగా బయటికి వెళ్ళిపోయేవాడివి. . .చెప్పు. . . ఏ ఫోటోలు నువ్వు మారణాయుధాలుగా భావించి మురిసిపోయావో వాటిని నన్నే స్వయంగా మా గ్రాండ్‌పాకి చూపించమంటావా”

హఠాత్తుగా ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

కోరి మూర్ఖంగా ప్రవర్తించే అలవాటు గల విశ్వకే అర్థమైపోయింది. ఆమె ఎత్తులకి చివరి పై ఎత్తులా ఫోటోల ప్రహసనానికి సిద్ధపడ్డాడు కాని అవి తన ఉనికే ప్రమాదమని బోధపడిపోయింది.

“మాట్లాడు విశ్వా. . . ఇప్పుడు బలహీన పడిందెవరు. . . నువ్వా నేనా”

ఆమె ఊహించలేదు విశ్వ అలాంటి సాహసం చేస్తాడని. . .  ఎటో చూస్తున్న  కృషి చేతిలోని కవరుని గభాలున లాగేసుకున్నాడు - ముందు అవాక్కయిపోయిన కృషి ఆ తర్వాత అతడిపై కలియబడాలనుకుంటూనే ఆగిపోయింది ఇబ్బందిగా.

“ఏమిటి నువ్వు చేసింది” రొప్పుతూ అడిగింది.

“సింపుల్ కృషి - నువ్వో పరీక్ష రాస్తున్నావ్. .  .ఇచ్చిన గడువు పూర్తయిపోయింది.” చాలా నిశ్చలంగా ప్రశాంతంగా మాట్లాడుతున్నాడిప్పుడు. “ఇంతలో ఇన్విజలేటర్ వచ్చి నీ ఆన్సర్ షీటు లాక్కుపోయాడు..... అప్పుడు గుర్తుకొచ్చింది నువ్వు చివరగా ఓ బిట్‌క్వెశ్చనుకి ఆన్సరు తప్పు రాశావని. .   . అరక్షణం ఛాన్సు దొరికితే దాన్ని కరెక్టు చేసుకుంటావ్ - ఛాన్సిమ్మని ఇన్విజలేటర్‌ని అడుగుతావ్ - ఇదీ అంతే - అయితే నేను నిన్ను అడగలేదు.  అవకాశం తీసుకుని లాగేసుకున్నా.  ఆడపిల్లవిగా.”

ప్రతి మొండివాడిలోనూ ఓ పసికందు వుండడమే నిజమైతే ఇక్కడ విశ్వ కూడ పసిపిల్లాడిలా కనిపించాడు...... యోధుడైనవాడు ప్రత్యర్థిని పోరాటంతో నిరాయుధుడ్ని చేస్తాడు తప్ప ఆయుధాన్ని దొంగతనం చేయడు.

వచ్చిన పనైనట్టు అతడు వెళ్ళబోతుంటే “ఆగు” అంది.

“నీకు కావాల్సింది నేనీ దేశం వదిలి వెళ్ళటమేగా.”

“అదీ ఈ ఇంట నా స్థానానికి భంగం కలగకుండా” గుర్తుచేశాడు విశ్వ

"వెళతాను. కాని నువ్వు యోధుడివే అని నిరూపించుకోవాలి" చెప్పింది కృషి. "సిద్ధమేనా"

"ఏంకావాలి" సాలోచనగా చూశాడు. తన ఉనిక్కి యిబ్బంది లేకుండా వుంటే ఆమెను సాగనంపటానికి తను దేనికైనా సిద్ధమే.

అరక్షణం తర్వాత అడిగింది "నీకే ఓ చెల్లి వుందనుకో. . . ఆ చెల్లి అమాయకంగా ఓ మగాడ్ని నమ్మి పెళ్ళి కాకుండానే తల్లయే పరిస్థితి వచ్చిందనుకో ఏం చేస్తావు. . . నీ చెల్లిని చంపుకుంటావా లేక మోసం చేసిన మగాడ్ని నిలదీస్తావా"

"నిలదీస్తాను. చీరేస్తాను."

"సరిగ్గా జీవిత అనే ఓ అమ్మాయి ఇప్పుడు అలాంటిక స్థితిలోనే వుంది విశ్వా.. దానికి కారణం మీ చౌదరి కొడుకు రాజేష్."

నిశ్చేష్టుడిలా చూశాడు.

"ఇది కల్పన కాదు విశ్వా. నిజం. చావటానికి సిద్ధంగా వున్న ఆమెను రక్షించిన నేను ఆమె బ్రతుక్కి హామీ ఇచ్చాను" కృషి మొహంలో ఇందాకటి చిలిపితనం లేదు. సీరియస్‌గా చెప్పుకు పోయింది. "ఆమె కోసం పోరాడటానికి యిప్పుడామె అన్న బ్రతికిలేడు. చెప్పు నీకూ ఓ మనసుంటే ఆ మనసుకి ఆర్ధ్రత వుంటే మోసగింపబడిన ఆ అభాగినికి న్యాయం చేయగలవా. అది నువ్వు చేయగలిగితే నీ మాట ప్రకారం నేను దేశం వదిలి వెళ్ళిపోతాను"

రెండు నిముషాల నిశ్శబ్దం తర్వాత అన్నాడు "సరే"

సంతృప్తిగా చూసింది తన కోసం పోరాటంలో అడుగుపెడతానన్న విశ్వాని.

0 0 0

నిద్రపోతున్న రామనాథచౌదరి ఉలికిపాటుగా లేచాడు బెడ్ పక్కనున్న ఫోన్ రింగవుతుంటే.

"ఎవరు" విసుగ్గా అడిగాడు రిసీవర్ అందుకుని.

"నేనే"

అది కృషి కంఠం అని తెలియగానే ఆవేశంగా అరిచాడు "ఇంత రాత్రివేళ ఫోనెందుకు చేశావ్?"

"డిఫెన్స్ టెండర్ సాధించగలిగిన నిన్ను అభినందించాలని."

"దటీజ్ రామనాథచౌదరి"

కృషి నవ్వు వినిపించింది.

"దటీజ్ కృషి" వెంటనే అంది మళ్ళీ "ఇంతవరకూ మనమధ్య బేరీజు వేసుకుంటే నువ్వే ఎక్కువ నష్టపోయావవ్ చౌదరీ. ఈ సత్యం నీకీపాటికే తెలిసే వుండాలి."

"అందుకే నిన్ను శాశ్వతంగా నష్టపరచాలని విశ్వాని నీ ఇంటికే పంపేను."

"కాని ఏం సాధించగలిగాడు?"

"ఇంకా వ్యవధి వుంది"

"అని నువ్వనుకుంటే చాలదు చౌదరీ. నువ్వు ధైర్యవంతడివేమో కాని తెలివైన వాడివి కావు"

"ఎందుకలా అనిపించింది"

"ఓ జోక్ చెబుతాను విను"

నిద్ర లేపిన కృషి ఇప్పుడింత ప్రశాంతంగా మాట్లాడుతుంటే చౌదరికి చిర్రెత్తుకొస్తున్నా నిభాయించుకున్నాడు.

"నీలాంటి ఓ తెలివైన వాడిననుకునే ఓ చౌదరి, ఇంకో స్కూలు విద్యార్థి, డాక్టరు ముగ్గురూ ఓ విమానంలో ప్రయాణం చేస్తున్నారట, హఠాత్తుగా విమానం ప్రమాదంలో చిక్కుకుంది. విమానం నడుపుతున్న పైలెట్ కాక్‌పిట్‌లో నుంచి బయటకివచ్చి ముగ్గురితో అన్నాడట."

"ఏమని" వ్యగ్యంగా అడిగాడు చౌదరి.

"విమానంలో రెండు పేరాచ్యూట్స్ వున్నాయి. మీ ముగ్గురిలో ఇద్దరు మాత్రమే వాటి సహాయంతో దూకి ప్రాణాలు కాపాడుకోవచ్చని- అంతే అందిన ఓ పేరాచ్యూట్‌తో చౌదరి దూకేసాడు. తర్వాత డాక్టరు దూకేసాడు తర్వాత స్కూలు విద్యార్థి దూకటానికి ప్రిపేరవుతున్నాడు అప్పుడు పైలెట్ అన్నాడు విద్యార్థితో. 'నువ్వెలా నీ ప్రాణాలు కాపాడుకుంటావూ' అని. పేరాచ్యూట్ వుందిగా అంటూ చూపించాడట స్కూలు విద్యార్థి. నేను ఇచ్చినవి రెండే పేరాచ్యూట్స్‌గా అన్నాడు పైలట్, మూడోది ఎక్కడనుంచి వచ్చిందో అర్థం కాక. డాక్టర్ పేరాచ్యూట్ సాయంతోనే దూకాడు గాని మొదట దూకిన చౌదరి మాత్రం నా స్కూలు బేగ్‌ని పేరాచ్యూట్‌గా భ్రమపడి దానితోనే దూకేసాడని చెప్పాడా విద్యార్థి."

అతని మొహంలో రంగులు మారేయి.

"అంటే ఆ తర్వాత చౌదరి ఫేట్ ఏమైవుంటుందో ఈపాటికి నీకు అర్థమై వుండాలి మిస్టర్ చౌదరీ. . . దీన్ని బట్టి నీది ఎంత తెలివితక్కువ దూకుడో తెలిసిపోతూందిగా. చెప్పొచ్చేదేమిటంటే నువ్విప్పుడు ఖచ్చితంగా అలాంటి సమస్యలో ఇరుక్కున్నావు."

"క్లియర్‌గా చెప్పక. . ." పళ్ళునూరేడు చౌదరి.

"రేపు ఉదయం దాకా ఆగితే నీకే అర్థమౌతుంది." క్షణం ఆగి అంది కృషి. "పాపం టెన్షన్‌కి గురవుతున్నట్టున్నావ్ కదూ. . . అయితే విను. నువ్వు నీ కొడుక్కి ఓ సెంట్రల్ మినిస్టర్ కూతురితో పెళ్ళి సెటిల్ చేసినట్టున్నావ్. బహుశా అలాంటి సంబంధంతో నీ ఎంపైర్‌ని

చేశాడు. మోసగించబడిన ఆ అమ్మాయి ఆత్మహత్యకి సిద్ధపడితే నేను కాపాడి జరిగిన వ్యవహారం గురించి పోలీసుల దగ్గర స్టేట్‌మెంట్ ఇప్పించాను. సో. . నీ కొడుకు ఇప్పుడు ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలి.”

హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది.

“ఏం చౌదరీ. గొంతు పెగలడం లేదా”

“నువ్వు చెప్పిన వ్యవహారం నాకు తెలీనిది కాదు”

“మరిప్పుడేం చేయాలనుకుంటున్నావ్”.

జవాబు చెప్పలేకపోయాడు వెంటనే. అదికాదు చౌదరి ఆ క్షణంలో ఆలోచిస్తున్నది. తన సామ్రాజ్యానికి సంబంధించిన ఆనుపానులే గాక తన కుటుంబానికి చెందిన వ్యక్తుల కదలికల్ని కూడా ఆమె గమనిస్తూంది. వాటి పరంగా తనపై దండ యాత్రకి ప్రిపేరవుతూంది. ఇంతవరకూ వెళ్ళిన కృషి ఇక విడిచిపెట్టదు. ఏదో రాద్ధాంతం చేస్తుంది. అసలు ‘జీవిత లాంటి శత్రుశేషం మిగిలివుండడమే ఈ అనర్థానికి కారణం’ అని చౌదరి ఆ క్షణంలో అనుకుంటే అది అతడి తప్పుకాదు.

“జీవితకి నువ్వు హాని చేయలేవు చౌదరీ. . . ఎందుకంటే మీవాడు రాసిన ప్రేమలేఖలు ఇప్పుడు జీవిత దగ్గర భద్రంగా వున్నాయి ఇప్పుడు నువ్వు తెలివైనవాడిలా తొందరపడటం ఇందాక నేను చెప్పిన జోక్‌లో చౌదరి స్కూలుబేగ్‌తో విమానంలోంచి దూకడమవుతుంది. సో...సెంట్రల్ మినిస్టర్ కూతురు సంబంధాన్ని పక్కకిపెట్టి జీవితని కోడలుగా చేసుకుంటే బ్రతికిపోతావ్”

ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు. . .

అప్పటికే చౌదరికి ముచ్చెమటలుపోసాయి. తన స్థాయివాడికి ఆ సమస్య చాలా చిన్నది కావచ్చు. కాని ఇప్పుడు జటిలంగా మారిపోయింది. విషం సీసాలో వున్నంతసేపూ ప్రమాదం కాదు. గొంతులోకి దిగితేనే ప్రాణ హాని కలిగించేది. ఇప్పుడు ఆ చిన్న సమస్య కృషిదాకా వెళ్ళడంతో గొంతుదిగి కంగారు పుట్టించేదిగా మారిపోయింది.

ఆ రాత్రి రామనాథచౌదరి నిద్రపోలేదు..... సమస్య పరిష్కారానికి ఏ మార్గం అనుసరించాలీ అన్న మీమాంసలో తెల్లవార్లూ గడిపాడు.

ఉదయమే లాయర్ రంగధాంతో ఆ విషయం చర్చించాలనుకున్నాడు. కనీసం ఎమ్మెల్యే రాజారావు సహాయంతో ఏదన్నా చేయాలనుకున్నాడు. కాని కృషిని ఎదుర్కోటానికి మరేదో అనూహ్యమైన మార్గాన్ని వెదకాలని నిర్ణయించుకుని ఇద్దరితోనూ సంప్రదించడం మానేశాడు.

ఇక్కడ చౌదరి కొడుకు చేసిన తప్పు గురించి ఆలోచించడం లేదు. కృషి పరంగా ఎదురయ్యే యిబ్బంది గురించే ఆందోళన పడుతున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో విశ్వా అతడి దగ్గరికి వచ్చాడు.

ఆవేశంగా అనేశాడు విశ్వాని చూడగానే “నువ్వో సమర్థుడివి అని పంపితే ఇంతవరకూ ఒక్క అరంగుళం ముందుకు సాగలేకపోయావ్. అసలు నీ వలన సాధ్యమవుతుందా అని ఇప్పుడు ఆలోచిస్తున్నాను.”

“చౌదరిగారూ” హర్టయినట్టుగా చూశాడు విశ్వ “మీ అభియోగానికి మొదటి జవాబు ఇంకా మీరిచ్చిన గడువు పూర్తిగాలేదని . . . ఇకపోతే కృషి అనే ఆడపిల్లని మానసికంగా హింసించడంలో నా పరిధిలు దాటి వెళ్ళాను. ఇంచుమించు ఓ శాడిస్ట్‌లా ఆమెను ప్రతిక్షణమూ హింసిస్తూనే వున్నాను. అయితే కృషి మీరూ నేను అనుకున్నంత బలహీనురాలు కాదు. . . తెలివిలోగాని ధైర్యంలో గాని. . .”

“ఆపేయ్” అర్థోక్తిగా అరిచాడు చౌదరి “నీకోసం అయిదు లక్షలు పెట్టుబడి పెట్టడంలో గాని నిన్నక్కడకు పంపడంలో గాని నా వుద్దేశ్యం కృషిని ఇండియా నుంచి తరిమేయాలని. . . ఆమె గుణగణాల్ని శక్తి యుక్తుల్ని స్టడీ చేయమని గాదు.”

విశ్వాకి పట్టలేనంత కోపంవచ్చింది. అతడి అనుచరుడిలానో చేతికింద పనివాడిలానో చౌదరి శాసించడం నచ్చలేదు. అయినా తమాయించుకున్నాడు.

“మీకు కృషి ఈ దేశం నుంచి వెళ్ళిపోవడం కావాలి. అంతేగా”

“యస్”

“ఆ ప్రయత్నంలో మీరు నాకు సహకరించటానికి సిద్ధంగా వుంటానని ముందే మాటిచ్చారు కదూ”

“అవును”

“అయితే ఓ పనిచేయండి” అతని రెస్పాన్స్ కోసం ఎదురు చూడకుండా అన్నాడు విశ్వా. “మీ అబ్బాయి రాజేంద్ర మూలంగా మోసపోయిన జీవితని మీ కోడలుగా చేసుకోండి”

విస్మయంగా చూసాడు చౌదరి. రాత్రి కృషి ఏ ప్రపోజల్ గురించి మాట్లాడిందో యిప్పుడు సరిగ్గా ఆ విషయమే చర్చిస్తున్నాడు విశ్వ.

“మిస్టర్ విశ్వనాథ్” కోపాన్ని దిగమింగుకుంటూ అన్నాడు చౌదరి. “ నువ్వు అయిదు లక్షలూ వెనక్కి తిరిగి చెల్లించనవసరం లేదని నేను చెప్పింది నేను చెప్పిన పని నువ్వు చేస్తావని, చేయాలని. . . కాని ఇప్పుడు నువ్వు నేనేం చేయాలో సలహా ఇస్తున్నావ్”

“ఇది సలహా కాదు చౌదరిగారూ. . . ఇండియా విడిచి ఆ కృషి వెళ్ళటానికి తను పెట్టిన షరతు”

“ఆ షరతుకి నేను అంగీకరిస్తే నువ్వేం సాధించినట్టు”

“కోట్లరూపాయల డిఫెన్స్ కాంట్రాక్టు మీకు వచ్చేట్టు చేశాను. మీ మీద ఉద్వేగంగా దూకే కృషి చైతన్యాన్ని పక్కలో బాంబులా నిలబడి సగం అదుపు చేసాను”

“సారీ విశ్వా. నీకూ నాకూ ఒప్పందం నువ్వు కృషి ఈ దేశం వదిలివెళ్ళేట్టు చేయడం. అంతవరకే. మిగతా విషయాల్లో నీ [illegible] నేను [illegible]”

షాక్ తిన్నట్టుగా చూసేడు "అంటే జీవితనే ఓ ఆడపిల్ల జీవితానికి సంబంధించి న్యాయం చేయనంటారు."

"డబ్బుకోసం ఏ గడ్డి అయినా కరిచేవాడు యిలాంటి న్యాయాన్యాయాల గురించి మాట్లాడకూడదు."

చెళ్‌మనిపించింది చౌదరి స్టేట్‌మెంట్. ఒకనాడు కృషి తనగురించి ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందో ఇప్పుడు చౌదరి అదే చెబుతున్నాడు కాకపోతే కృషిమాటల్లో ఆర్తివుంది. ఇతని స్టేట్‌మెంట్‌లో అధికారం ధ్వనిస్తూంది.

ఒక అవసరంకోసం ఓ సామ్రాజ్య పరిధిలో అడుగుపెట్టిన విశ్ను లాంటి తెలివైనవాడికి అభిమానవంతుడికి ఈ మాత్రం షాక్ చాలు జ్ఞానోదయం కావటానికి తనకున్న వ్యక్తిగతమైన కక్షకి తనను చౌదరి ఆయుధంలా వాడుకుంటున్నాడని ఇంతకుముందే తెలిసినా విశ్నూ ఈ రోజు దాకా ఇంతగా రియాక్టు కాలేదు కారణం విశ్నూకి ఉపాధ్యాయ కుటుంబంపై వున్న కసి....

"ఇంతవరకూ వచ్చింది కాబట్టి ఈ క్షణంలో నేనో విషయం మీకు చెప్పక తప్పదు చౌదరిగారూ" నిర్భీతిగా గొంతులో అణువంత హెచ్చరికని ధ్వనింపచేస్తూ అన్నాడు. "మీకు కావాల్సింది కృషి ఈ దేశం వదిలి వెళ్ళడమే అయితే జీవితకీ రాజేంద్రకీ పెళ్ళిచేయండి. లేదూ మీకు నేను ఐదు లక్షలు చెల్లించడమే ముఖ్యమనుకుంటే. . ."

"చెప్పు"

"ఆ అయిదులక్షలూ కృషినుంచి తీసుకుని మీకు యివ్వాల్సి వస్తుంది"

అప్రతిభుడయ్యాడు చౌదరి " కృషి నీకెందుకిస్తుంది"

"జీవితనే ఓ ఆడపిల్ల జీవితాన్ని నేను చక్కదిద్దితే కృషి నాకు పదిలక్షలైనా ఇవ్వటానికి వెనుకాడదు కాబట్టి."

చౌదరి నుదుట స్వేదం పేరుకుంది. అతడ్ని తెలివిగా కృషే ఈ పనికి నియోగించిందని భోదపడిపోయింది. అంటే తనతో పోరాటానికి విశ్నుని ప్రేరేపిస్తూంది. అదికాదు ఆమె మేధస్సుకి చౌదరి ఆ క్షణాన కంగారుపడింది తను ఈ దేశం వదిలి వెళ్ళటానికి కృషి ఇలాంటి పెళ్ళి అనే కండిషన్ పెట్టడం ద్వారా ఓ ప్రముఖుడితో తను వియ్యమందే అవకాశానికి విఘాతం కలిగించబోతూంది. తన పరపతికి ముప్పు తేబోతుంది. కృషి ఎంత పటిష్టమైన పథకం అమలుచేయబోతున్నది అర్ధమైన చౌదరి తగ్గడం తప్పనిసరన్నట్టుగా ఓ అడుగు వెనక్కి వేశాడు. "చూడు విశ్నూ. . . ఇక్కడ నువ్వు ఆలోచించాల్సిన విషయం మరోటుంది. రాజేష్ పెళ్ళి సెటిలయింది సామాన్యుడి కూతురితో కాదు ఓ కేంద్రమంత్రి బిడ్డతో. అది తెలిసిన కృషి నిన్ను ట్రాప్ చేయబోతూంది"

"ఇది ఓ ట్రాప్‌గా నేను భావించడం లేదు చౌదరిగారూ" కృషి మాటలు అతడిపై ఎలాంటి ప్రభావం చూపించిందీ స్పష్టంగానే వ్యక్తం చేశాడు విశ్ను. "నేను ఉపాధ్యాయ కుటుంబపై

భ్రమించి నా కుటుంబం చిన్నాభిన్న మైందని. ఇప్పుడు మీ అబ్బాయి మూలంగా మరో ఆడపిల్ల జీవితం అన్యాయం కాబోతూంది అంటే మరో కుటుంబం అశాంతికి మీరు కారణమవుతున్నారు అప్పుడు మీకూ ఉపాధ్యాయకీ తేడాలేదు. అలాంటి మీకు నేను సహకరించడంలో అర్థం లేదు."

చౌదరి పిడికిళ్లు బిగుసుకున్నాయి. అయినా నిభాయించుకున్నాడు. "అంటే నా ఒప్పందం కన్నా నీకు కృషి ప్రపోజలే ముఖ్యమంటావు"

"నేను కసితో ఆ కుటుంబంలో అడుగుపెట్టడానికి మీ సహాయం తీసుకున్నవాడ్నే తప్ప డబ్బు తీసుకొని ప్రొఫెషనల్ క్రిమినల్గా ఆలోచించే మనిషిని కాదు. దయుంచి ఆ విషయం గుర్తుపెట్టుకోండి. సో. . . నా అయిదులక్షలే అనుకుంటే మీ ప్రత్యర్థిగానైనా ఆ డబ్బుని నన్ను సంపాదించనివ్వండి. మీ నిర్ణయం వెంటనే తెలియ చేయనవసరం లేదు. ఇరవై నాలుగు గంటల టైమిస్తున్నాను"

వెళ్ళిపోయాడు విశ్వ. . .

చౌదరికి చెమట్లుపట్టాయి. ఈ కథ యిలాంటి మలుపు తిరుగుతుందని అతడూహించలేదు. చివరి గెలుపు సరిహద్దులదాకా నడిచిన విశ్వ ఇప్పుడు ఇలాంటి 'అల్టిమేటమ్' ఇవ్వడంతో ఆవేశం హద్దులు దాటుతున్నా ఏం చేయాలి అన్నది వెంటనే స్ఫురించలేదు. . . .

అదిగో సరిగ్గా ఆ సమయంలో రాజేంద్ర వచ్చాడు తండ్రి దగ్గరికి. . .

"అంతా విన్నాను డాడీ"

"నికృష్టుడా. . ." అరిచాడు చౌదరి "నన్ను నాశనం చేసావ్"

నవ్వాడు రాజేంద్ర "నేను నీ కొడుకుని డాడీ. నిన్నెలా నాశనం చేస్తాను. . . జీవితని శాశ్వతంగా కడతేర్చబోతున్నాను"

"అప్పుడు నువ్వు జైల్లో సెటిలైపోతావు"

"ఆ భయం మీకు అక్కరలేదు. . . " క్షణం ఆగి ఓ పథకంలా అన్నాడు "మీరు విశ్వ ప్రపోజల్ని అంగీకరిస్తారు. అంటే అతడ్ని పిలిచి ఈ విషయం తెలియచేస్తారు. కాని ఈ లోగా నేను జీవిత మరెక్కడికో పారిపోతాం జంటగా. . . "

"అర్థం కావడం లేదు"

"సింపుల్ డాడ్. ఈ సాయంకాలానికల్లా నువ్వు విశ్వని పిలిచి జీవితకి నాకూ పెళ్ళి చేయటానికి ఒప్పుకుంటున్నట్టు నీ నిర్ణయం తెలియచేస్తావ్. కాని అప్పటికే నేను జీవితతో కలిసి ఓ హోటల్ రూంలో దాగుని వుంటాం మీ మొండితనంతో బ్రతుకుతో కలిసే అవకాశం లేని మేం యిద్దరం విషం తాగేసి అమర ప్రేమికులమై మిగిలిపోదామనుకుంటాం. . . నిజంగా విషం తాగుతాం కూడా. . . అలా నోరు తెరవకండి . . . తాగిన వెంటనే జీవిత చచ్చిపోతుంది. నేను తాగింది చాలా స్వల్పం కావడంతో హాస్పిటల్లో కోలుకుంటాను.

ఇంకా చాలా వివరంగా చెప్పాడు రాజేంద్ర.

మతిపోయింది చౌదరికి. "తన వారసుడు బుర్రలో ఇలాంటి అనూహ్యమైన ఓ పథకం రూపు దిద్దుకోవడం చౌదరిని ఎంత ఉత్తేజపరిచిందీ అంటే అమాంతం కొడుకుని కావలించుకున్నాడు. "గర్వపడుతున్నారా. . .ట్రిగ్గర్ నొక్కకుండా బులెట్‌లా దూసుకుపోయి కృషి పథకంపై చావుదెబ్బ తీయగలిగే నీ ఆలోచన్ని మనసారా అభినందిస్తున్నాను"

అంతే-

అమర ప్రేమికుడిలా నటించి ఓ అమ్మాయి జీవితంతో ఆడుకున్న రాజేంద్ర పోలీసుల ఊహకి సైతం అందని ఓ హత్యకి పథకం వేసాడు.

0 0 0

అగ్ని నాలుకతో అసుర సంధ్యని స్పృశిస్తూ సూర్యుడు అస్తమిస్తున్న సమయాన..

ఎవరో తరుముతున్నట్టుగా కృషి ఇంటికి వచ్చాడు విశ్వ.

అదే సమయానికి జీవితకూడా కృషితో బాటు అక్కడే వుంది.

"మీతో మాట్లాడాలి కృషి" అన్నాడు విశ్వ ఉద్వేగాన్ని అదిమిపెడుతూ. . .

విశ్వ వెంట మరో గదిలోకి నడిచి అంది "చెప్పండి"

"చౌదరి యీ పెళ్ళికి అంగీకరించడం లేదు. కాని రాజేంద్ర సుముఖంగా వున్నాడు."

"అలా అని మీకు చెప్పాడా"

"యస్. . . కేవలం తండ్రికి భయపడి జీవితని మోసం చేయటానికి సిద్ధపడ్డట్టు నా దగ్గర ఒప్పుకున్నాడు. కాని జీవిత ఆత్మహత్యా ప్రయత్నం తెలిసాక బాగా రియాక్టయ్యాడు. . ."

"ఇప్పుడు తండ్రినెదిరించి ఆ పెళ్ళి చేసుకుంటానంటున్నాడా"

"అవును. . . జీవితతో బాటు కొన్ని రోజులపాటు ఎక్కడికయినా వెళ్ళిపోతానంటున్నాడు. ఆ తర్వాత పెళ్ళి చేసుకుని సరాసరి ఇంటికి తీసుకువస్తానంటున్నాడు. ఉన్నది ఒక్కకొడుకే కాబట్టి ముందు కాదన్నా తర్వాత దారికి వస్తాడన్నది రాజేంద్ర నమ్మకం. . ."

వెంటనే జవాబు చెప్పలేకపోయింది కృషి.

"తప్పదు కృషి. . . .మన పందెం మాట అటుంచితే జీవిత జీవితం చక్కబడాలి అంటే యిలాంటిదేదో జరగాలి పైగా రాజేంద్ర తనంతట తానుగా రియాక్టయి యిలాంటి ప్రపోజల్‌కి సిద్ధపడినప్పుడు నువ్వు సహకరించాలి"

"అంటే"

"రాజేంద్రతోబాటు వెళ్ళటానికి జీవితని ఒప్పించాలి"

చాలా సేపు నిశ్శబ్దంగా వుండిపోయిన కృషి "రాజేంద్ర సిన్సియారిటీ మీద మీకంత నమ్మకం వుందా" అంది నిశితంగా చూస్తూ. . .

"రాజేంద్రమీద కాకపోయినా ప్రేమన్న పదం మీద నాకు నమ్మకం వుంది."

తర్వాత జీవిత గదిలోకి వెళ్ళి ఏం చెప్పిందో మరో అయిదు నిముషాలలో జీవిత బయటికి నడిచింది.

బయట కారులో వెయిట్ చేస్తున్న రాజేంద్రని చూస్తూ కంట తడిపెట్టుకున్న జీవిత ఎందుకో దిగులుగా వెనక్కి మరలింది.

“నేను నీకు అన్నలాంటివాడ్ని” నచ్చచెబుతున్నట్టుగా అన్నాడు విశ్వ. . . “వెళ్ళు”

వెళ్ళిపోయారిద్దరూ. . . .

ఆ క్షణంలో తన గురించి ఏమనుకుంటున్నదీ ఆలోచించలేదు విశ్వ . . . గెలుపులాంటి అనుభూతికన్నా ఓ ప్రేమకథని గెలిపించిన అనంత సంతృప్తితో విశ్వ వెనక్కి మరలబోయేటంతలో హాల్లో ఫోన్ రింగయింది.

చౌదరి ఫోన్ చేసాడు.

“నీ ప్రపోజల్‌కి అంగీకరిస్తున్నాను విశ్వ. జీవితని నా యింటి కోడలుగా చేసుకోవాలనుకుంటున్నాను”

విస్మయంగా నిలబడిపోయాడు విశ్వ.

సరిగ్గా అదే సమయానికి నగరంలోని ఓ ఖరీదయిన హోటలు గదిలో అడుగుపెట్టారు రాజేంద్ర జీవితలిద్దరు.

అప్పుడు సమయం రాత్రి ఏడు గంటలు. . .

“ఎందుకా కన్నీళ్ళు”

తలవంచుకుని నిలబడ్డ జీవిత కళ్ళు తుడిచాడు రాజేంద్ర. ఆ క్షణంలో అతడు తప్ప ఆమెను ఓదార్చగల వ్యక్తి శక్తి మరొకటి లేదన్నంత నమ్మకంతో రాజేంద్ర గుండెలపై వాలి బావురుమంది.

ఒక నమ్మకపు పునాదిపై నిలబడ్డ ఏ ఆడపిల్లయినా చాలా సులభంగా బేలన్స్ తప్పే అవకాశముందనే సత్యం తెలిసినవాడిలా బెడ్‌పైకి లాక్కున్నాడు.

ఆమె ప్రతిఘటించలేదు.

ఆ శక్తి ఎప్పుడో కోల్పోయింది. మరోసారికి లొంగనిది మొదటి సారి జాగ్రత్త పడినప్పుడే అన్న నిజం తెలీని జీవిత ఈ క్షణాలే యిక శాశ్వతమన్నంత ఆర్తిగా అతడ్ని చుట్టేసింది.

పది నిముషాల పాటు పరిసరాల్ని మరిచిపోయింది కేవలం జీవిత మాత్రమే. . . మరో పది నిముషాల్లో జరిగే అనర్థం గురించి ఆమెకు తెలీదు. . .

“నాకు భయంగా వుంది” ఈ మాట అన్నది జీవితకాదు రాజేంద్ర “నీకు తెలీదు మాడాడీ మనస్తత్వం. . .ఒకవేళ మనం మొండిగా పెళ్ళిచేసుకున్నా నిన్ను నాతో కలిసి బ్రతకనివ్వరు”

కంపించిపోయింది జీవిత. కొన్ని క్షణాల క్రితం దాకా వున్న ధైర్యం సడలిపోయింది అంతలోనే ‘నాకు అన్యాయం చేయకండి”

తీసుకొచ్చింది నీకు అన్యాయం చేయాలనికాదు. . . మనిద్దరికీ ఒకేసారి న్యాయం జరగాలనే. చెప్పు. . . ఒకవేళ రేపు మన పెళ్ళయ్యాక డాడీ నన్ను నీకు దూరం చేయాలని ప్రయత్నిస్తే. . ."

"ఆత్మహత్య చేసుకుంటాను" టక్కున అంది అదొక్కటే తనకు తెలిసిన మార్గమన్నట్టుగా.

ఒక మధ్య తరగతి ఆడపిల్ల బలహీనత గురించి బాగా తెలిసిన రాజేంద్ర "అలా అయితే నువ్వు లేకుండా నేనెలా బ్రతకగలనని- " అన్నాడు తెచ్చి పెట్టుకున్న ఉద్వేగంతో.

"నన్నెందుకు తీసుకొచ్చినట్టు'

కొన్ని నిముషాల క్రితం శరశయ్యపై అతడి క్రింద నలిగిన జీవిత అశ్రుశిక్త నయనాలతో నిలదీసినట్టుగా అడిగింది.

"మాట్లాడండి" వణికిపోతూ అతడ్ని పెనవేసుకుపోయింది. "ఇప్పుడు నన్నేం చేయాలనుకుంటున్నారు."

"నిన్ను నేనేమీ చేయదలుచుకోలేదు జీవితా. నా చివరి క్షణాల్ని నీముందే గడపాలని ఇలా తీసుకొచ్చాను. . ." జేబులోనుంచి ఓ ప్యాకెట్ తీసాడు.

"ఏమిటది"

"నిద్ర మాత్రలు. . . నీ ఒడిలో శాశ్వతంగా నిద్రపోవాలని నేను తెచ్చుకున్న స్లీపింగ్ టేబ్లెట్స్."

"వద్దు" దు:ఖోద్విగ్నంగా వారించబోయింది.

"నన్ను ఆపకు జీవితా. . .ప్రేమించిన ఆడపిల్లకోసం ప్రాణాలు వదిలిన పిరికి ప్రేమికుడిగా నీ కళ్ళముందే రాలిపోనియ్. . . " ఆయాస పడిపోతూ ఆవేశాన్ని ప్రకటించాడు.

"ప్లీజ్"

"జీవితా. . .మరో జన్మంటూ వుంటే ఓ మంచి తండ్రికి కొడుకుగా పుడతాను. నీ ప్రేమను గెలుచుకుంటాను."

సుమారు వంద నిద్రమాత్రలతో చేసిన పౌడర్ని గ్లాసులోని నీళ్లలో కలిపాడు.

"మీరు లేకుండా నేనెలా బ్రతకగలననుకుంటున్నారు."

"వద్దు జీవితా- "

"మీతో బాటు నేను కూడా- "

జీవిత గభాలున గ్లాసు అందుకోబోతుంటే "ఆగు" అన్నాడు ఆవేశంగా. . . అప్పటికే రాసిన ఓ కాగితాన్ని ఆమె ముందుంచి "నాతో పాటు నువ్వూ చావాలి అనుకుంటే ఈ క్రింద నువ్వూ సంతకం చేయ్."

జీవిత ఆలోచించలేదు "బ్రతుకులో సాధించని ప్రేమ మరణంతో గెలుచుకోవాలని వెళ్ళిపోతున్న మా చావుకి ఎవరూ బాధ్యులు కారు" అని రాసివున్న కాగితంపై ఇద్దరూ సంతకం చేసారు.

"ముందు నేను" అంటూ జీవిత గ్లాసుని అందుకుని గడగడా తాగేస్తుంటే వారించలేదు రాజేంద్ర. మూడు వంతులభాగం జీవిత తాగేక ఆమె చేతి నుంచి గ్లాసులాక్కుని తనూ తాగేడు.

అప్పటికే జీవిత గొంతు పిడచ కట్టుకుపోతున్నట్టు ఆర్తితో పెనుగులాడుతూంది.

కొద్దిపాటి మగతతో ఆమెను గమనిస్తున్న రాజేంద్ర పెదవులపై గర్వంగా నవ్వు మెరిసింది.

కాలిపోతున్న ప్రేమలిప్తల్లో ఆఖరి పోరాటంలో అంగలార్చుకుపోతున్న జీవితని చూస్తూ స్వర్గ స్మృతుల్లో తలదాచుకుని అమర ప్రేమికుల్లా కడతేరిపోదామని అంతసేపూ చెప్పిన రాజేంద్ర ప్రపంచ ప్రేమ చరిత్రల పుటల్ని తినేసే చెదపురుగులా నవ్వుతున్నాడు ఇంకా. . .

జీవితకిదేమిటో అర్థం కావడం లేదు - ఏదో అనిపించినా సరిదిద్దుకునే అవకాశం లేదు.

ఆ క్షణంలో సైతం ప్రియుడి పరిష్వంగాన్నే ఆమె కోరుకుని వుంటే ఆ తప్పు జీవితది కాదు. గొడ్డళ్ళతో గుండెల్ని వ్రయ్యలు చేసినా గోళ్ళతో గుండె పొరల్ని చీల్చినా సృష్టికి లయానికి నడుమ మిగిలే అస్థిత్వం పేరే ప్రేమని ఇంకా నమ్మే వేల కోట్ల ముగ్ధలకి ప్రతినిధిగా ఆమె అలాగే రాజేంద్ర గుండెలపై తలానించింది.

అదిగో. . .సరిగ్గా అప్పుడు గదిలో ప్రవేశించారు చౌదరి ముందే ఏర్పాటు చేసిన పోలీసులు చౌదరితో బాటు. . .

ఆ తర్వాత ఇద్దర్నీ హాస్పటల్‌కి తరలించారు.

జీవిత ప్రాణం పోయిందని డాక్టర్లు వెంటనే తేల్చేసినా రాజేంద్ర ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నించారు.

"రాజేంద్రని రక్షించగలిగాం."

ఓ డాక్టరు చెప్పాడు థియేటరులో నుండి బయటకి వస్తూ.

ఒక్క అంగలో రాజేంద్రని సమీపించిన చౌదరి అలవాటులేని దుఃఖాన్ని అభినయిస్తూ "ఎందుకు ప్రాణాలు తీసుకోవాలనుకున్నారు. నేను కాదన్నంత మాత్రాన ఇలాంటి దారుణానికి ఎందుకు పూనుకున్నారు. ధైర్యంగా ఎదిరించి బ్రతకాల్సిన మీరు... అయ్యో." రాజేంద్ర చేతులు పట్టుకుని కుదిపేస్తుంటే పోలీసు అధికారులు అతడ్ని ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. . .

అప్పుడు గదిలోకి ప్రవేశించింది కృషి విశ్వతో బాటు. . .

ఓ మూల జీవిత శవం. . .ఎవరూ పట్టించుకోని అనాధ ప్రేతంలా కనిపిస్తుంటే స్తబ్ధురాలైపోయింది.

శబ్ద రహిత భాషలా కళ్ళలో నిలిచిన బాష్పాలు మనసును కలవర పరుస్తుంటే నెమ్మదిగా శవం దగ్గరికి నడచింది కృషి.

నిన్నటి ఆత్మహత్యా ప్రయత్నంలోని భయం లేదిప్పుడు జీవిత నేత్రాలలో..... ఇంకా చావని ఏ ఆశల నక్షత్రాలనో బ్రతుకు తోరణాలుగా పేర్చుకున్న పర్ణశాలలా వుంది.

ఎందుకు తను నిన్న కాపాడింది - ఈ రోజెందుకు తను నచ్చచెప్పి మరీ పంపింది.

నెమ్మదిగా నడిచింది అక్కడ నిలబడ్డ పోలీసాఫీసరు దగ్గరికి.

చివర రాసిన ఉత్తరాన్ని అక్కడ దొరికిన ఆధారాలని అతడు వివరిస్తుంటే నిశ్శబ్దంగా వింది.

చీకటి ఆవరణలో కారు దగ్గరికి నడుస్తుంటే వచ్చాడు విశ్వ "సారీ" తలవంచుకున్నాడు "ఇలా జరుగుతుందనుకోలేదు"

"కాని నేను అనుకున్నాను మిస్టర్ విశ్వ . . . అందుకే నీ మిత్రుడు చౌదరి కొడుకు సిన్సియారిటీ గురించి నేను ప్రశ్నించింది."

అప్రతిభుడై అతడు నిలబడి వుండగానే వెళ్ళిపోయింది కృషి.

0 0 0

రాత్రి పదకొండు గంటల సమయం. . .

అసహనంగా తన గదిలో పచార్లు చేస్తూ వుండిపోయింది ఆమె. జీవిత ఆత్మహత్య చేసుకోలేదు. తెలివిగా హత్య చేయబడింది. ఎలాగో ఆమెకీ తెలీదు. కాని అది ఖచ్చితంగా హత్యే అనిపిస్తూంది.

కృషి మనసు వికలమైపోయింది. ఏం సాధించింది తను.

ఏ డబ్బు విషయంలో గ్రాండ్‌పాకి ఆసరాగా ఈ దేశంలో వుండటానికి నిర్ణయించుకుందో తిరిగి గ్రాండ్‌పాని అదేస్థితికి నెట్టింది. . . ఒక చిన్న నిర్లక్ష్యం డిఫెన్స్ టెండర్ కోల్పోవటానికి కారణమైంది. . . ఇక్కడ సమస్య ఆర్థికమైన నష్టం కాదు - పోగొట్టుకున్న పరపతికి సంబంధించి మానసికంగా అయినగాయం.

ఆ అశాంతి నుంచి తను ఇంకా తేరుకోకముందే ఇప్పుడు జీవితను కోల్పోయింది - ఆమె మరణానికి ప్రత్యక్షంగా తను కారణం కాదు. కాని చేజేతులా తనే పంపించి మృత్యురూపంలోకి నెట్టింది.

"కృషి" డాక్టర్ మహంతి నిలబడి వున్నారు ద్వారం దగ్గర. కృషి అడక్కముందే చెప్పాడు "గ్రాండ్‌పాకి మళ్ళీ అటాక్ వచ్చిందేమో అని భయపడ్డానమ్మా . . .బాగా టెస్ట్ చేశాక తెలిసింది ఇది. . .

Transient Ischaemic Attack కాదని. మానసికంగా గాయపడ్డారు అంతే...”

ఒంటరి తనంతో బాధపడే ఓ వ్య క్తికి అణువంత ఉపశమనం అందించేది ఆత్మీయుల పరామర్శే అయితే ఇదిగో ఇప్పుడు అలాంటి వూరటనే అందించగలిగాడు డాక్టర్ మహంతి. అందుకేనేమో ఆమె కళ్ళు తడయ్యాయి. “ఓ సారి వెళ్ళి తాతయ్యని కలుసుకోవచ్చుగా”

“దానివలన ఉపయోగం లేదు అంకుల్” బలవంతంగా నవ్వాలని ప్రయత్నించింది. “డిఫెన్స్ టెండర్ పోవటానికి నేనే కారణమనుకుంటున్నారు గ్రాండ్‌పా. అఫ్‌కోర్స్ అది నిజమే.....”

“కాని ఆ వ్య క్తే అంతకుముందు నీ సమర్థతకి పొంగిపోయేవాడు . . .”

బాధగా తల వంచుకుంది కృషి.

“ఎందుకలా బాధపడతావు”

“శక్తికి మించిన పోరాటంలో అడుగుపెట్టాను అంకుల్. అదీ కావాలనే. . . కాని ఏదో చెయ్యాలనే ప్రయత్నించిన నేను గ్రాండ్‌పాని ఇంత నష్టానికి గురి చేసాను.”

“ప్రత్యర్థితో యుద్ధానికి సిద్ధపడ్డప్పుడు మనం కొన్ని గాయాలకి ప్రిపేర్ కావాలి కృషి - నీ మూలంగా చౌదరికి తగిలిన దెబ్బల కన్నా చౌదరి మూలంగా నీ గ్రాండ్‌పాకి అయిన గాయం చాలా స్వల్పం కాబట్టి నువ్వు బాధ పడాల్సిన అగత్యం లేదు ఈ విషయం మీ గ్రాండ్‌పాకి తెలీక కాదు. . .”

అ తర్వాత చాలా సేపటిదాకా నిశ్శబ్దం ఆవరించింది.

“అంకుల్”

వెళ్ళబోయిన మహంతి ఆగాడు.

“నాకో క్లారిఫికేషన్ కావాలి” చెప్పింది జీవిత రాజేంద్రల ఆత్మహత్యా ప్రయత్నం గురించి క్లుప్తంగా “ఇద్దరూ విషం త్రాగారు కాని చనిపోయింది జీవిత మాత్రమే.”

“విషం త్రాగాక ప్రభావం ఇద్దరిమీదా వుంటుంది కృషి. కాకపోతే ఎక్కువ విషం పుచ్చుకున్నవాళ్ళు చనిపోతారు. తక్కువ తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడతారు.”

అంతే. . .

యధాలాపంగా డాక్టర్ మహంతి చెప్పిన జవాబులో చాలా ప్రశ్నలకి సమాధానం దొరికింది. అంటే ఓ పథకం ప్రకారం జీవితని హత్య చేశారు రాజేంద్ర, రామనాథ్ చౌదరిలిద్దరూ.

డాక్టర్ మహంతి వెళ్ళిన ఐదు నిమిషాల దాకా అదే విషయం గురించి ఆలోచించిన కృషి ఇక నిభాయించుకోలేక ఫోన్ అందుకోబోయి ఆగింది ద్వారం దాటి వస్తున్న విశ్నుని చూస్తూ-

ఎప్పుడూ చాలా వుత్సాహంగా వుండే విశ్ను ఆ క్షణంలో బిడియంగా తల వంచుకోవడన్ని ఆమె గమనించినా నిశ్శబ్దంగా వూరుకోలేదు. . .

"మిస్ కృషి. . నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్ధమౌతుందా"

"ఆవేశపడకు విశ్వ . . . జీవితనే ఓ అమాయకురాలి ప్రాణాలు తీసే తమ పథకంలో చౌదరి నీకెంతిచ్చాడు"

విశ్వ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"డబ్బుకోసం నువ్వేదన్నా చెయ్యగల సమర్ధుడివేగా విశ్వా. అసలు నీకు ప్రపంచంలో చాలా ముఖ్యమైనది డబ్బేగా?"

"పిచ్చిపిచ్చిగా మాట్లాడకు"

"ఏం నీకూ కోపం వస్తుందా. . . అలా రావాల్సింది ఆత్మాభిమానం వున్న వాళ్ళకి" అతని మొహం వివర్ణమౌతుంటే క్రోధంగా అడిగింది. "చెప్పు విశ్వ . . .కొన్ని రోజులపాటు అజ్ఞాతంగా వుండి తర్వాత పెళ్ళి చేసుకొని జీవితని ఇంటికి తీసుకుని వెళ్తానని నీకు హామీ ఇచ్చిన రాజేంద్ర వెళ్ళిన గంటలో ఆత్మహత్యకి ఎందుకు సిద్ధపడ్డాడు. ఆ ప్రయత్నంలో కేవలం జీవిత మాత్రమే ఎందుకు ప్రాణాలు కోల్పోయింది."

షాక్ తిన్నట్టుగా చూశాడు అతను. ఇలాంటి విశ్లేషణకి ఆ క్షణం దాకా అతడు సిద్ధపడలేదు.

"నీ హెచ్చరికతో చౌదరి కలవరపడ్డాడు. నీ ద్వారా నన్ను సాధించాలనుకున్న చౌదరి నీకు అనుమానం రాకుండా కొడుకుతో ఓ పథకం వేశాడు. ఆ పథకం జీవిత ప్రాణాలు తీయడం. అలా తను కోరిన మంత్రిగారి కూతుర్ని తన కోడల్ని చేసుకోవడం. అది నీకు అర్థం కాలేదు. కాబట్టి రాజేంద్ర అడిగాడని నా దగ్గరకొచ్చావు. కేవలం నా మీద గెలుపు సాధించాలనే ఒకే ఒక్క ధ్యేయంతో నన్ను కూడా నమ్మించి జీవితని తీసుకెళ్ళిపోయావ్ "జీవిత ఆలోచనలతో మనస్సు ద్రవించిందేమో కళ్ళలో పేరుకున్న నీటి పొరల్ని దాచేసుకుంటూ అంది "ఇక్కడ పొరపాటు నీది కూడా కాదు విశ్వా నీ తండ్రి విషయంలో పగ తీర్చుకోవాలని ఈ ఇంట అడుగుపెట్టావే తప్ప నువ్వు డబ్బు కోసం హత్యలు సైతం చేసే హంతకుడివని నేను అనుకోకపోవడం. యస్ - అదే జీవితని నేను నీకు అప్పచెప్పటానికి కారణమైంది. అలా చూడకు విశ్వా. ఒక మేధావి ఆలోచనా సరళిలో సైతం ఒక్కోమారు అపశృతి ధ్వనించే అవకాశం వుంటుందన్న అరిస్టాటిల్ సూక్తి నిజమైతే చాలా తెలివైనదానినను కున్న నేనూ ఓ మూర్ఖురాలిలా ప్రవర్తించాను. . . ప్రత్యేకించి నీకీ విషయం ఎందుకు చెబుతున్నాను అంటే ఒకనాడు నాతో ఒకరాత్రి గడపాలనుకుంటున్నానన్న నువ్వు అలాంటి అవకాశం దొరికినా నన్ను మత్తులో ముంచి ఫోటోలకే నీ తెలివిని పరిమితం చేసుకున్నావు తప్ప నన్ను అనుభవించటానికి కాదుగా... నన్ను అనుభవించడమే నీ ధ్యేయమైతే అది ఆ రాత్రి నీకు సాధ్యమయ్యే విషయమేగా. అదిగో అక్కడ నువ్వు ఓ పగతో ఈ ఇంట ప్రవేశించిన మనిషివే తప్ప అవకాశం దొరికినా ఓ ఆడపిల్లపై అఘాయిత్యం చేయవని అర్థం చేసుకున్నాను. అసలు నీకు ఏం తెలుసని మా కుటుంబం మీద పగ తీర్చుకోవటానికి. . నీ తండ్రి

తెలుసా. . .”

“స్టాపిట్. . .” ఆవేశంగా అరిచాడు విశ్శు. “ఇంకేం మాట్లాడకు”

“మాట్లాడను విశ్శు. . . మాట్లాడినా ప్రయోజనం లేదని నాకు తెలుసు. ఎందుకంటే ఏ ఉపాధ్యాయ పతనాన్ని నువ్వు కోరుకుంటున్నావో ఆ ఉపాధ్యాయ నాకన్నా నీ మాటకే ఎక్కువ విలువ యిస్తారని నాకు తెలుసు కాబట్టి. అయితే ఒక్క నిముషం . . . మన రాజకీయ చదరంగంలో నువ్వూ నేనూ ప్రత్యర్థులం అయినా రాజకీయాల్లో ఆలోచించాల్సింది ఎవరూ, ఏమిటీ అని కాదు. . . ఎవరు ఎవరి మనిషి అన్న విషయం. . . అది నువ్వు తెలుసుకునేదాకా నువ్వు చౌదరిని నమ్ముతుంటావు, ఉపాధ్యాయని ద్వేషిస్తూనే వుంటావు. . . ”

“అసాధారణమైన నీ మేధస్సుకి, అమోఘమైన నీ విశ్లేషణకి నా అభినందనలు కృషి . . . ఇప్పుడు మనం వెంటనే ఆలోచించాల్సింది తాత్కాలికమైన ప్రజ్ఞలగురించి కాదు - జీవితని నిజంగా హత్య చేశారా అన్న విషయం గురించి” ఆమె మాటల్ని ఖండిస్తున్నట్టుగా అన్నాడు.

రెప్పవాల్చకుండా చూసింది. “ప్రిజుడీస్‌తో ఈ ఇంట అడుగుపెట్టిన నీకు చౌదరి దుర్మార్గం గురించి చెప్పినా నమ్మకమేర్పడదు.”

అతడు బయటికి నడవబోయాడు.

“ఆగు మిస్టర్ విశ్శూ. . . ఎప్పుడో కాదు నీ మిత్రుడు చౌదరి ఏమిటో అన్నది ఇప్పుడే నిరూపిస్తాను.”

“నువ్వది నిరూపించగలిగితే చౌదరికి నేను శత్రువునౌతాను.”

“శత్రువుగా మారతావో లేక యింకా మిత్రుడిగా కొనసాగి నీ భ్రాంతిలోనే నువ్వు బ్రతుకుతావో నీ యిష్టం” తన ఆలోచనల్ని అమలు పరుస్తున్నట్టుగా చూసింది. “నీ గదిలో వున్న ఫోన్ ద్వారా పేరలల్‌గా నాకూ చౌదరికీ జరిగే చర్చ వింటే జరిగింది నీకు అర్థమవుతుంది.”

అరనిముషం వ్యవధిలో తన రూంలోని ఫోన్ అందుకుని చౌదరికి డయల్ చేసింది కృషి.

“చౌదరి హియర్”

“నేనే”

ఫకాలున నవ్వాడు చౌదరి కృషి కంఠం వినగానే.

“మొత్తానికి అందర్నీ ఫూల్ చేయగలిగావు చౌదరీ”

“పాపం షాక్ తిన్నట్టున్నావు కదూ”

“నిజమే చౌదరీ. . . నిన్ను నేను తక్కువగా అంచనా వేసాను. అందుకే విశ్శూని నీకు ప్రత్యర్థిగా మార్చాలని ఓ పథకం వేసి దారుణంగా ఓడిపోయాను. జీవితనే ఓ పిచ్చిక మీద మీరు ఇంత పెద్ద బ్రహ్మాస్త్రాన్ని సంధించగలుగుతారని ఆలోచించలేక పోయాను.”

“దటీజ్ చౌదరీ. . . ఇక నా కొడుకు పెళ్ళికి అడ్డం తొలిగిపోయిందిగా. ఇప్పుడేం చేస్తావ్”

పోలీసుల్ని మభ్యపెట్టి సులభంగా జీవిత అడ్డం తొలిగించుకోగలిగావేమో కాని- ”

“ఆగిపోయావేం . . .”

“విశ్వ తండ్రి మోహన్‌గాంధీని నువ్వే హత్య చేయించావని నేను నిరూపించటానికి చేస్తున్న ప్రయత్నం నుంచి తప్పించుకోలేవు చౌదరీ”

చౌదరి పక్కనుంచి జవాబు లేదు.

“ఏం. .. కంగారుపడుతున్నావా చౌదరీ. . .గెట్ రెడీ. మన పోరాటంలో చివరి ఘట్టానికి చేరుకుంటున్నాం కాబట్టి కటకటాలు లెక్కపెట్టటానికి ప్రిపేరై వుండు”

“పిల్లకాకివి నువ్వెంత”

నవ్వింది.

“ఎందుకు నవ్వుతున్నావు”

“రాబందును చూసినట్టు బెంబేలు పడుతూ కూడా నన్నో పిల్లకాకినని ఎద్దేవు చేస్తున్నందుకు . . .”

“నీ సమాధికి పునాదుల్ని సిద్ధం చేస్తున్నాను కృషి”

“చూద్దాం చౌదరీ. . . ఎవరి సమాధి శంఖుస్థాపన ముందు జరుగుతుందో కాలానికే వదిలేద్దాం.”

ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు.

అప్పుడు చూసింది కృషి విశ్వ జేవురించిన మొహాన్ని.

ఈ యింట ఎందుకు అడుగుపెట్టినా గాని ఏం చేయాలని యింత కాలమూ ఆలోచించినా గాని ఒక్క రోజులో ఒకే ఒక్క ఫోన్‌కాల్‌తో అతడి గమ్యం మారిపోయినట్టుగా అంతసేపూ పట్టుకుని వున్న రిసీవర్ని హుక్‌చేసి బయటికి నడిచాడు వేగంగా.

చాలా రోజుల తర్వాత కృషి రిలాక్స్‌డ్‌గా సోఫాలో కూర్చుంది.

ఇంత వరకూ జరిగినదాని గురించి కాక యికముందు జరగబోయే దాని గురించి ఉత్కంఠగా ఆలోచిస్తూందామె.

విశ్వ సరాసరి చౌదరి దగ్గరకు వెళ్ళలేదు. . . ఆశ్రమానికి వచ్చాడు.

తన మీద తనకే జుగుప్సలాంటి భావం పేరుకుపోతుంటే ఆలయంలోని ప్రశాంతతలా నిశ్శబ్దంగా వున్న కుటీరాల మధ్య మతి భ్రమించిన వాడిలా తిరిగాడు చాలా సేపటిదాకా. . .

ముకుళించుకున్న కాలం మౌనంగా రేకులు విప్పుకుని సరికొత్త మార్గాలనే నిర్దేశిస్తుందో లేక మేధాకేదారంలోని నిశ్చల సమాధికే భంగమైనట్టు అనిపిస్తూందో కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

జీవితని ఒప్పించి నమ్మించి పంపింది తనేగా. . అన్నయ్యాలా నేనున్నానని హామీ యిచ్చి మృత్యు గహ్వారంలోకి నెట్టింది తనే అయినప్పుడు ఈ పాపానికి నిష్కృతి ఎక్కడ - ఉనికిలేని

చేయాలని యాత్ర ప్రారంభించిన తను మరో తల్లి కడుపు కోతకి కారణమైపోయాడే. దీనికి జవాబుగా తానేమివ్వగలడు.

"విశ్వా"

సమీపంలో చైతన్యానంద నిలబడి వున్నాడు.

"ఏమైంది"

ఆ కొద్దిపాటి పరామర్శకే విశ్వ కళ్ళనుంచి జలజలా నీళ్ళు రాలాయి. "నేను ఓడిపోయాను బాబా"

ఆప్యాయంగా స్పృశించారు "ఉరకలు వేస్తూ పరుగులిడే నదీ ప్రవాహం చివరికి లయమయ్యేది కడలిలోనే అయినా అది ఓటమికాదు విశ్వా - ప్రాణులకి వెలుగుని ప్రకృతి పుష్పాల సౌరభాల స్ఫూర్తికి కాంతినీ అందించే సూర్యుడు ప్రతిరోజూ అస్తమిస్తున్నా అదికూడా ఓటమికాదు. జీవితం జీవిత సత్యాలకది సంకేతం సంఘాన్ని సంస్కరించాలనుకునే వ్యక్తులకి సైతం తప్పని మానసిక గ్లాని మామూలు మనుషులకి తప్పనిదేగా - తప్పనిదనుకోవాలి. తప్పయితే తెలుసుకోవాలి. అదే మనిషి చేయగలిగేది"

ఎంత ఊరటగా అనిపించింది.

ఆ తర్వాత బాబా నుంచి శలవు తీసుకున్న విశ్వ తన కుటీరం వేపు నడిచాడు.

"ఏమిటి. ఇంత అర్ధరాత్రి - " సూరి పలకరించాడు. ఈ మధ్య విశ్వ వుంటున్నది ఉపాధ్యాయగారి ఇంటిలోనే అని తెలిసిన సూరి విశ్వ ముఖకవళికల్ని గమనిస్తూ అడిగాడు "ఏమైంది"

జవాబు చెప్పలేదు.

"పాపం జీవితనే అమ్మాయి చనిపోయిందటగా"

"కాదు చంపబడింది" అంతటితో ఆగకుండా సూరికి అంతా వివరంగా చెప్పాడు.

సూరి మౌనం విశ్వని మరింత గాయ పరుస్తూంటే ఇక సంభాళించుకోలేనట్టుగా ఉద్రేకంగా సూరి భుజాల్ని పట్టుకున్నాడు. సూరి కంపించిపోతుంటే "చెప్పరా - ఒకనాడు నేను గాయాలతో హాస్పిటల్లో అడ్మిటైతే నా గురించి డబ్బు ఖర్చు చేసింది నేను బ్రతకాలని డాక్టర్లని అర్థించింది కృషే కదూ."

సూరి గొంతు తడారిపోయింది.

"నాకు జవాబు కావాలి సూరీ. నాకు నిజంగా స్నేహితుడివే అయితే నువ్వు నిజం చెప్పాలి."

ఏ సంఘటనతో విశ్వ యిలాంటి మార్పుకి గురైనా కాని తన గురించి అతడే మనుకున్నా రేపు చౌదరి మూలంగా తనకి హాని జరిగినా కాని యిక పెదవి విప్పక తప్పదు.

"అదొక్కటే కాదు విశ్వా" సూరి కళ్ళలోనూ యిప్పుడు నీళ్ళు తిరిగుతున్నాయి. "ఆ రోజు క్విజ్ పోటీలో అమ్మని కిడ్నాప్ చేయించిందీ చౌదరీయే."

విశ్వ షాక్ తిన్నట్టుగా చూసాడు. ఆమె ఓడితే పోగొట్టుకోవాల్సిన శీలంకోసం కృషే ఆ పని చేయించిందని తను నమ్మేడు. కాదు చౌదరి నమ్మించాడు.

"ఎందుకీ విషయం దాచావ్"

"నీతో నిజం చెబితే అమ్మ ప్రాణాలకి హాని తలపెడతానని చౌదరి బెదిరించాడు కాబట్టి.... అసలు నీ ఓటమి కోరింది కృషి కాదు విశ్వా. . . చౌదరి ఐదు లక్షల అప్పుతో నిన్ను రుణగ్రస్తుడ్ని చేసి మానసికంగా శారీరకంగా హింసించి ఆమెను ఈ దేశం నుంచి పంపించడమే చౌదరి లక్ష్యం."

ఆ రాత్రి నిద్రపోలేదు విశ్వ.

ఎన్ని సార్లు యెన్ని విధాలుగా కృషిని అవమానించిందీ మానసికంగా హింసించిందీ గుర్తుకొచ్చి బిడియంగా కదిలిపోయాడు.

నిజానికి తనకున్న కక్ష ఉపాధ్యాయపై. అది సాధించడానికి ఓ మార్గం కావాలి. ఉపాధ్యాయ స్థాయి వ్యక్తికి చేరువ కావాలి అంటే కృషితో పరిచయం తప్పనిసరైంది.

తెలతెలవారుతుండగా నిశ్చయించుకున్నాడు. ఇప్పుడు తన ప్రత్యర్థి ఉపాధ్యాయ ఒక్కడే కాక చౌదరి కూడా అని. . . అసలు తన తండ్రి మరణానికి కారకులు ఖచ్చితంగా ఎవరైనా గాని యిక ముందు తనకు తానే ముఖా ముఖీ పోరాటానికి సిద్ధపడాలి తప్ప కృషిని డిస్టర్బ్ చేయడు. . . అసలు ఆమెను ఇక ఎప్పటికీ కలుసుకోకూడదు. . .

దృఢంగా తీసుకున్న నిర్ణయం అది.

0 0 0

"మిస్ కృషి . . . మాటలతో, చేతలతో హింసించడమే అలవాటైన ఈ మనిషి యింత ఒద్దికగా ఉత్తరం రాస్తున్నాడేమిటి అని ఆశ్చర్యపోతున్నారా. . . దుర్మార్గుల జీవితాల్లోనూ కొన్ని దివ్య క్షణాలుండడం నిజమైతే అలాంటి క్షణమే నా జీవితంలో మీ పరిచయం.

మేధస్సు పరంగా ఏ కొద్దిగానో నేను ఎదిగినా నాది చాలా చిన్న ప్రపంచం కృషి... అందుకే చిన్న పొదిరింటిలో పుట్టిన నేను అమ్మా, నాన్నల ఆశయాల మేరకు ఎదగాలని అహోరాత్రులు శ్రమించి ఎదగటానికి అకుంఠిత దీక్షతో కృషి చేశాను. కొద్దిగా ఎదిగానేమో

పొదరింటిలో నేను ఒంటరి వాణ్నయిపోయాను. . . ఆ తర్వాత దురదృష్టవశాత్తూ కక్ష తీర్చుకోవడమే జీవిత ధ్యేయమైంది. అందుకు తొలిమెట్టుగా మీ పరిచయాన్ని పెంచుకున్నాను..... ఇప్పుడు నాకు పూర్తిగా జ్ఞానోదయమైందని చెప్పడం లేదు కృషి . . . నా తండ్రి హత్యలో చౌదరి భాగస్వామే అని అణువంతైనా అర్థం చేసుకున్నాను. . . అంటే లక్ష్యం కొంత మారింది తప్ప పగ తీర్చుకోవాలనే ఆలోచన మాత్రం విరమించుకోవడం లేదు. . .

ఈ క్షణంలో మీకు క్షమార్పణ చెప్పుకోవటం తప్పు కాదు. ఇంకా ఆరని భాస్వర స్వప్నాల మధ్య నిలబడి నిన్న చచ్చిపోయిన బ్రతుకు పచ్చదనాల గురించి ఆలోచించే నేను మీకు మళ్ళీ కలవను. కలిసి ఆరడిపెట్టను . . .

మీ పరిచయం వాన కౌగిటి అంత స్వచ్ఛదనాన్ని అందించినా దాన్ని విస్మరించి వరద గోదావరిలో కొట్టుకుపోవటానికే సిద్ధపడుతున్నాను. నా పిడికెడు చీకటి గుండెల్లో ఆరని ఆశల దివ్వెల్ని రగిల్చిన మీ పరిచయాల అక్షర జ్యోతుల్ని నేను రాలిపోయే దాకా గుర్తుంచుకుంటాను. నేననుకునే కథ సుఖాంతం కాకపోయినా ప్రత్యర్థుల అశుభం దాకా ఒంటరిగా పోరాడుతూనే వుంటాను. . .

ఎందుకు ఇంకా నేను ఇలానే ఆలోచిస్తున్నానూ అంటే అశోకంలా ఎంత నిటారుగా పెరిగితే మాత్రం ఏం లాభం ఎప్పుడో ఒకనాడు విరిగి పోవాలిగా. గరికనైతే చాలదూ. . . గాలివాటుకి గాయపడినట్టు తలవాల్చినా విడవకుండా మళ్ళీ తలెత్తుకుని సాధించానన్న సంతృప్తితో కడతేరిపోవచ్చు. సమస్యల వరదల బీభత్సంలో కొట్టుకుపోతున్న నేను బ్రతుకు కెరటాల కొరడా దెబ్బలకి కలత చెంది ఏ క్షణాన్నైనా మిమ్మల్ని బాధ పెడితే క్షమించమని మరో మారు అర్థిస్తూ శలవు తీసుకుంటున్నాను.

నన్ను మన్నిస్తారు కదూ. . .
క్షమార్హుడ్ని అవునో కాదో తెలీని
విశ్వ . . . ”

ఆమూలాగ్రం చాలా ఏకాగ్రతగా ఉత్తరాన్ని చదివిన కృషి కొన్నిక్షణాల దాకా బెడ్‌పై పడుకుని ఆలోచిస్తూ వుండిపోయింది. . .

ఆ ఉత్తరాన్ని సూరి తెచ్చిచ్చింది గంట క్రితం. . .

ఇప్పటికి చాలా సార్లు చదివింది. . .

పెదవులే విచ్చుకున్నాయో లేక మనోగ్రహాంతరాల్లో అరమరికలు చెరిగిన బాలికల్లా వూసుల గుస గుసల్తో గుండె చప్పుళ్ళే ఆమెను వివశత్వానికి గురిచేసాయో పైకి లేచింది చప్పుడు చెయ్యని శబ్ద కిరణానికి తను అందించే సజీవ ఆహ్వానంలా ఆశ్రమానికి బయలుదేరింది.

ఇంత కాలమూ ఏమైనా గాని విశ్వ ఇప్పుడు మనస్సుని పూర్తిగా ఆక్రమించుకుని ఆమె

మస్తిష్కపు వాకిలి తెరిచి ఆలోచనల పొరల వెనుక అతడికోసం ఏర్పరచిన నిద్రా రంగస్థలంపై అతడు కొంత విశ్రమిస్తే తప్ప తన సంగ్రామపు చివరి ఘట్టానికి తనూ అతడికి తోడు కాలేదు. . .

ఆశ్రమానికి వెళ్ళింది కాని విశ్వ లేడు.

ఉదయమే వెళ్ళిపోయాడని తెలిసింది. . .

అప్పుడు భయపడింది విశ్వ గురించి తొలిసారి.

0 0 0

"ఏమిటి డల్‌గా వున్నావ్" విశ్వని చూస్తూ అడిగాడు చౌదరి.

హాల్లో అప్పటికే చాలా సందడిగా వుంది. . . అదంతా రేపు నెలలో కేంద్రమంత్రిగారి కూతురితో రాజేంద్రకి జరగబోయే పెళ్ళి సందడిలా వుంది తప్ప నిన్న జరిగిన ఓ దారుణానికి సంబంధించి జరుగుతున్న చర్చలా లేదు. .

"బహుశా నిన్నటి షాక్ నుంచి విశ్వ ఇంకా తేరుకున్నట్టులేదు" అన్నాడు లాయర్ రంగధాం అదో జోకులా....

మరెక్కడో జీవిత యింటిలో బహుశా ఈపాటికి జీవిత శవానికి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయమది.

"కరెక్టుగా గెస్ చేసారు లాయరుగారూ. . ." నిర్వేదంగా అన్న విశ్వా మొహంలో ఆ బాధ పూర్తిగా వ్య క్తం కాకుండ జాగ్రత్త పడ్డాడు . . . "ఒకవేళ చౌదరిగారు నిన్న కనుక అడగ్గానే ఆ పెళ్ళికి అంగీకరించి వుంటే. . ."

"ఈ పాటికి కృషి అమెరికా ప్రయాణానికి సిద్ధమయ్యేదంటావ్" చౌదరి జోక్‌లా నవ్వాడు.

"కనీసం జీవితనే ఓ అమ్మాయి బ్రతికేదిగా"

"మరిచిపో విశ్వ. . . దేనికైనా ప్రాప్తం వుండాలిగా. . . అప్పటికే నేను ఒప్పుకున్నాగా. . . కాకపోతే కాస్త ఆలస్యమైంది. . ." చౌదరి ఈజీగా అనేసాడు.

మరేదో చెప్పేవాడే యింతలో ఎమ్మెల్యే రాజారావు వచ్చి ఓ రహస్యంలా అన్నాడు చౌదరితో "అవతల గదిలో పెద్దమనుషులు మీ కోసం ఎదురుచూసున్నారు సర్."

విశ్వాని పట్టించుకోలేదిక చౌదరి. . .

లోపలికి వెళుతుంటే నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోయాడు. . . మరో అర నిముషం తర్వాత బయటికి వెళ్ళబోతుండగా పలకరించాడు రాజేంద్ర "హాయ్ విశ్వా. . ."

నిన్న ఆత్మహత్య నుంచి తేరుకున్నట్టు కాక ఓ హత్య చేసి తప్పించుకున్న ఉత్సాహంలా వుంది.

చౌదరిలాంటి వ్య క్తిని ఢీకోవాలి అంటే ఓ బలమైన ఆయుధం కావాలి . . . జీవితనే ఓ ఆడపిల్ల జీవితాన్ని అంత నిర్ధాక్షణ్యంగా కాలరాసిన రాజేంద్ర సుఖంగా బ్రతక్కూడదు... ఈ

దిగమింగుకుని యిలా వచ్చాడు.

అదిగో అప్పుడు చూసాడు యింటి లోపల అడుగుపెడుతున్న డాక్టర్ సక్సేనాని... అతడితో బాటు మరో యిద్దరు పార్లమెంటు సభ్యులు లోనికి వచ్చి లాయర్ రంగధాం సాధరంగా ఆహ్వానిస్తుంటే లోపలి గదిలోకి వెళ్ళారు.

డాక్టర్ సక్సేనా అంటే ప్రపంచ ఆరోగ్య సంస్థలో భారతదేశానికి చెందిన పర్యావరణ సంఘానికి ప్రతినిధి. . . ఇక్కడి కెందుకొచ్చాడు . . .

కేంద్ర మంత్రిగారు రాజేంద్రకి మామ కాబోతున్న సందర్భంలో యిలాంటి ప్రముఖులు యిక్కడ అడుగుపెట్టడంలో ఆంతర్యం అర్థం కావడం లేదు విశ్వాకి.

రాజేంద్ర ద్వారా తప్ప విషయాన్ని రాబట్టే మార్గం లేనట్టుగా విశ్వ రాజేంద్రని రెచ్చగొట్టి పార్టీకోసమన్నట్టుగా ఓ ఫైవ్‌స్టార్ హోటల్ రెస్టారెంట్‌కి తీసుకువెళ్ళాడు.

అతిగా తాగేక రాజేంద్ర ఎంత వాగేది అర్థమైన విశ్వ మొత్తం విషయాన్ని రాబట్టగలిగాడు. ఇక్కడ రాజేంద్రకి తెలీనిది విశ్వ ఇప్పుడు తన తండ్రి హత్యలో చౌదరిని అనుమానిస్తున్నాడన్న విషయం.

“ఇందాక నువ్వు చూసింది డాక్టర్ సక్సేనా ఒక్కడ్నే విశ్వా. . . అంతకుముందే మా యింటిలో అతడికోసం వెయిట్ చేస్తున్న వ్యక్తి లక్నోకి చెందిన ఇండస్ట్రియల్ టాక్సికాలజీ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ సైంటిస్ట్ డాక్టర్ మోహతా..”

“నీ పెళ్ళికి వాళ్ళు రావటానికి సంబంధం ఏమిటి”

“మాకు చాక్‌లెట్ కంపెనీ ఒకటుందని అది దేశంలో ప్రముఖ కంపెనీగా ఎదిగే ప్రోసెస్‌లో యీ మధ్య విదేశాలకు కోట్ల రూపాయల చాక్‌లెట్స్‌ని ఎగుమతి చేస్తూందన్న విషయం నీకు తెలుసుగా . . . ఈ మధ్య ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో మా కంపెనీ చాక్‌లెట్స్‌లో ‘నికెల్’ వున్నట్టు కనిపెట్టింది. ఆ విషయం బయటపడితే ఎగుమతులు ఆగిపోవడమే కాదు మన దేశంలోనూ చాక్‌లెట్స్ డిమేండ్ తగ్గి కంపెనీ మూసేయాల్సిన పరిస్థితి రావచ్చు. . .”

రాజేంద్ర చెప్పకపోయినా కంపెనీ అధిపతి అయిన చౌదరి జైలుకి వెళ్ళాల్సి వుంటుంది, పసిపిల్లలు తినే చాక్‌లెట్స్‌లో నికెల్ రుచిపెంచే అవకాశం వున్నా అది ప్రాణహాని కలిగించే జబ్బులకి కారణం అవుతుంది.

“ఇది మా డాడీకి తెలిసింది ఈ మధ్యనే. అదీ నాకు కాబోయే మామగారైన కేంద్ర ఆరోగ్యశాఖామంత్రి ద్వారా ప్రపంచ ఆరోగ్య సంస్థ యిప్పటికే హెల్తు మినిస్టర్‌కి రిపోర్టు పంపింది. ఇప్పుడు డాక్టర్ సక్సేనా డాక్టర్ మెహతాలు ఇంతవరకూ ఉత్పత్తయిన మా చాక్‌లెట్స్‌లో నికెల్ లేదని లేబరేటరీస్‌లో నిరూపించాలి. దానికి సంబంధించిన లావాదేవీలు మాట్లాడటానికే వాళ్ళు మా ఇంటికి వచ్చింది. “వాళ్ళని పంపింది నాక్కాబోయే మామగారే - వాళ్ళు మాకు సహకరిస్తే దానికి బదులుగా నేను కేంద్ర ఆరోగ్య శాఖామంత్రికి అల్లుడ్ని కావాలి.

అదీ సంగతి. . . ”

అభినందనగా రాజేంద్ర భుజం తట్టాడు విశ్వ. అలా అభినందించింది మంత్రిగారికి అల్లుడవుతున్నందుకు కాదు ఓ అద్భుతమైన 'క్లూ' అందించినందుకు. . .

ఇక్కడ రాజేంద్ర మొత్తం కక్కేసి ఎంత పొరపాటు చేసిందీ ఆ మరుసటి రోజుకిగానీ అర్థం కాలేదు.

ఆ మరుసటి రోజే విశ్వ హోటల్ ఎమరాల్డులో ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటుచేశాడు. ఆ కాన్ఫరెన్స్‌కి వినియోగదారుల సంఘం ప్రతినిధుల మహిళా సంఘాలతో బాటు పౌరహక్కుల సంఘం నాయకుల్నీ ఆహ్వానించాడు.

అంతే. . .

ఏదైతే గోప్యంగా జరగాలని చౌదరి ప్రయత్నించాడో అది కాస్త పత్రికలదాకా వెళ్ళడంతో బాటు 'చౌదరి చాక్‌లెట్స్ గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో తేల్చిన వాస్తవాల్ని ప్రభుత్వం ఎందుకు నొక్కిపెడుతుంద'ని పార్లమెంటులో సైతం చర్చించబడింది మరునాడే.

కోట్లాది మంది పసిపిల్లల ప్రాణాలకు హాని కలిగించే చౌదరి చాక్‌లెట్స్ గురించి ప్రయోగశాలలో పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని ప్రతిపక్షాలకు హామీ యిచ్చాడు దేశ ప్రధాని.

ఒకేసారి సెంట్రల్ ఫుడ్ లేబరేటరీస్, హైద్రాబాద్‌కి చెందిన కేంద్ర పౌష్టికాహార సంస్థ, మైసూర్‌లోని డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లేబరేటరీలలో చాక్‌లెట్లలో 'నికెల్' శాతం గురించి తెలుసుకొమ్మని స్వయంగా ప్రధానమంత్రే ఆదేశాలిచ్చాడు.

కేవలం నాలుగురోజుల వ్యవధిలో రామనాథ చౌదరికి చెందిన సగం సామ్రాజ్యం సమస్యల్లో చిక్కుకుంది. అంతేకాదు కాబోయే పెళ్ళి సైతం నిరవధికంగా వాయిదా పడిపోయింది.

ఒక అణువు విస్ఫోటనం ఎలాంటి భీభత్సానికి కారణమయ్యిందీ తెలిసిన చౌదరి వెంటనే తల బలగానికి ఆదేశాలిచ్చాడు.

ఇరవై నాలుగు గంటల్లో విశ్వ కడతేరిపోవాలి.

ఆ విషయం ముందు తెలుసుకున్నది కృషి.

పత్రికల, రేడియో, దూరదర్శన్‌ల ద్వారా విశ్వ ఒంటరిగా సాగిస్తున్న పోరాటం గురించి తెలుసుకుంటూ అమితమైన ఆనందంతో బాటు అనూహ్యమైన టెన్షన్‌కి గురైన కృషి విశ్వని కలుసుకునే ప్రయత్నంలో విఫలమైంది మొదటి ఆరు రోజులు.

ఆ తర్వాత ఓ అర్థరాత్రి అతడ్ని కలుసుకుంది ఆశ్రమంలోనే.

మాసిన గెడ్డంతో కనిపించిన విశ్వ ఇప్పుడు యోధుడిలా అనిపించలేదు.

ఓ యజ్ఞం ప్రారంభించిన రుషిలా వున్నాడు.

ఆమెను చూడగానే ముందు అవాక్కయ్యాడు.

తర్వాత నా పరిచయం సైతం మీకు ప్రమాదమే అని చెప్పాలనుకున్నాడు.

అసలు ఆమెను కలుసుకోవడమే తనకు ఇష్టం లేనట్టు తల తిప్పుకోబోయాడు.

కాని. . .

కృషి అతడికి ఆ అవకాశం ఇవ్వలేదు.

నెమ్మదిగా ఓ చిరుగాలి అలలా అతడ్ని సమీపించింది.

ఘనీభవించిన ఏ ఆలోచనల పొరలో ఉన్నట్టుండి ద్రవించినట్టు హఠాత్తుగా అతడ్ని చేరి పెదవులపై బలంగా ముద్దుపెట్టుకుంది.

ఇద్దరికీ తెలీదు చౌదరి మనుషులు అప్పటికే అ కుటీరాన్ని చుట్టుముట్టారని.

0 0 0

సరిగ్గా అదే సమయంలో. . .

పది నిముషాలుగా చౌదరి ఫోన్‌లో కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి గంగాధరంతో మాట్లాడుతున్నాడు చాలా ఆవేశంగా. . .

"మనం వియ్యంకులం కావాల్సిన ఆఖరి క్షణంలో పెళ్ళి కేన్సిల్ చేయడం నేను భరించలేని విషయం గంగాధరం. ఇంత పరపతిగల నేను రేపు తలెలా ఎత్తుకోను"

"సారీ చౌదరీ. . . . నీతో వియ్యానికి సిద్ధపడితే నేను ఇరుక్కుపోతాను. . . పార్లమెంటులో సైతం నీ చాక్‌లెట్ ఫ్యాక్టరీ విషయం చర్చించబడింది. అంటే నువ్విప్పుడు పూర్తిగా వూబిలో కూరుకుపోయావు."

"ఇవన్నీ చాలా మామూలు విషయాలు గంగాధరం"

"నువ్వంత ఈజీగా ఎలా తీసుకోగలుగుతున్నావో నాకు అర్థం కావడంలేదు - రేపు చాక్‌లెట్స్‌లో 'నికెల్' వున్న విషయం మన లేబరేటరీస్‌లో నిరూపించబడితే వినియోగదారుల సంఘాలు నష్టపరిహారాల కోసం కోర్టులో దావావేస్తే నీ ఆస్థి మొత్తం హరించుకుపోవడమే కాదు, నువ్వు జైలుకెళ్ళడమూ తప్పనిసరి అవుతుంది."

"నాకా భయం లేదు"

"ఇది చిన్న విషయం కాదు చౌదరీ. . . ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించిన ప్రమాదకరమైన నిజం. అంటే నివ్వెంత ధారుణమైన నేరానికి సిద్ధపడ్డదీ జాతీయస్థాయి కాదు అంతర్జాతీయ స్థాయిలో చర్చించబడుతుంది. అప్పుడు నీ చాక్‌లెట్స్ ఎగుమతి చేసిన దేశాల ప్రభుత్వాలు మన ప్రభుత్వం ముఖ్యంగా దేశ ప్రధాని మీద ఒత్తిడిని తీసుకొచ్చి ఎక్స్‌ట్రెడిషన్‌ట్రిటీ ప్రకారం నిన్ను ఆయా దేశాలకు నేరస్థుడిగా అప్పగించవచ్చు కూడా"

"పసిపిల్లల్ని బెదిరించినట్టు మాట్లాడుతున్నావ్"

"నేను చెప్పేది అతిశయోక్తి కాదు చౌదరీ. . . పచ్చి నిజం. ఇప్పటికే కేంద్ర రాజకీయవర్గాలు మాట్లాడుకుంటున్న విషయం యిది. . ."

క్షణాలు దగ్గరపడుతున్నాయా. . .దశాబ్దాల కృషితో సంపాదించుకున్న ప్రతిష్ఠకి తిలోదకాలిచ్చి జైలులో గడిపే పరిస్థితి దాపురించ బోతూందన్నమాట.

"గంగాధరం. . . నన్ను కాపాడు" చౌదరి కంఠం వణికింది జరగబోయేది జ్ఞప్తికి వస్తుంటే "నేను నీకు వియ్యంకుడ్ని కావాలన్న ఆశలేదు. కనీసం నీ సహాయంతో ఈ గండం గట్టెక్కాలనుంది."

నిజమే. . . కృషి కోట బురుజుల్ని మాత్రమే పగలగొడితే ఒక్క దెబ్బతో విశ్వ కోట పునాదికే డైనమైట్ పెట్టేశాడు - నమ్మకస్థుడిలా నటించి బయటకు రాలేని వ్యూభిలోకి నెట్టేశాడు. . .

"చౌదరీ" గంగాధరం గొంతులోనూ అణువంత ఆందోళన ధ్వనించింది. "ముందు నన్ను కాపాడుకోవాలి. ఎందుకంటే నీకేదో సహకరించబోయానని ప్రధానమంత్రి కూడా గుర్రుగా వున్నాడు కాబట్టి. ఇది నిజం చౌదరీ. ప్రతిపక్షాల రాద్ధాంతం ఇలానే కొనసాగితే నేను పదవి వదిలిపెట్టాల్సి వుంటుంది. కనీసం పార్టీ ప్రతిష్ఠ దక్కించుకోవడం కోసం"

"అయితే ఏమీ చెయ్యలేనంటావ్"

"నేనున్నదే అద్దాలమేడ. ఈ అభియోగంతో పగలడం ప్రారంభించింది. నిన్ను నేను ఎలా కాపాడగలను "

"మీ పార్టీకి కోట్లు ఫండ్స్‌గా ఇచ్చాను"

"కాదనను. కాని ప్రభుత్వానికి ప్రమాదం వచ్చినప్పుడు రాజకీయ నాయకులు ఫండ్స్ ఇచ్చిన వాళ్ళకన్నా పదవుల్ని కాపాడుకోవడమే ధ్యేయంగా పెట్టుకుంటారు. అది సాంప్రదాయం" అసహనంగా అన్నాడు గంగాధరం "అసలు ఈ విషయం బయటికెలా వచ్చింది."

చౌదరి ఉక్రోషాన్ని ఆపుకోలేకపోయాడు "మా కుర్ర వెధవ ఆ విశ్వ గాడితో కక్కేసాడు. నాకొంప ముంచాడు."

"అలాంటి కొంపముంచే అలవాటు గలవాడ్ని నేను అల్లుడ్ని చేసుకుంటే మరి నా కొంపా ముంచేసే వాడుగా. అది గాకుండ మీ వాడు ఎంతో గొప్ప గ్రంధసాంగుడని కూడా తెలిసింది."

మరణించిన జీవిత అఫైర్ గురించి పరోక్షంగా వ్యక్తం చేస్తున్నాడని అర్ధమైపోయింది. ఆ క్షణంలో సైతం కొడుకు మీద ద్వేషం కన్నా దీనికంతటికీ మూలకారకుడైన విశ్వ మీద ఆవేశాన్ని ప్రదర్శించాడు చౌదరి "ఇంతచేసిన విశ్వ గాడ్ని నేను విడిచి పెట్టడం లేదు గంగాధరం. ఈ రాత్రే వాడ్ని కడతేర్చ బోతున్నాను."

ఫోన్ క్రెడిల్ చేసిన చౌదరి అప్పటికి ఆశ్రమానికి వెళ్ళిన తన బలగం విశ్వని ఫినిష్ చేసేసి వుంటారని భావించాడు.

కాని అక్కడ పరిస్థితి వేరు.

హఠాత్తుగా గదిలోకి వచ్చిన కృషి వున్నట్టుండీ ముద్దుపెట్టుకోవడంతో ముందు కలేమో అనుకున్నాడు విశ్వ.

కాని అది నిజమే అని తెలుసుకునే సరికి మెదడు మొద్దుబారిపోయింది.

స్వేదం చినుకుల జడి మేలిముసుగులా శరీరాన్ని తడిపేస్తుంటే మనోగీత సంకేతాల కేతనాల్లా ఆలోచనలు అతడ్ని వివశుడ్ని చేసాయి.

స్పందించిన హృదయం అందించిన చలిగాలిలో వెచ్చటిస్పర్శల ఆ క్షణం నిగ్రహాన్ని కోల్పోయాడు.

జరిగిన సంఘటనల స్మృతులు మురళీ సృతులై గతి తప్పిన స్వర జతులై క్షణాల వీక్షణాలై సుతారంగా మోగే సారంగ ధ్వనుల లయలై ప్రియా విదగ్ధ పరిష్వంగ అమృత జరులై ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే -

"ఏమిటిది " అన్నాడు గభాలున వెనక్కి జరిగి.

"మొన్న నువ్వు అడిగినా నేను ఇవ్వంది ఈ రోజు నువ్వు అడగవని తెలిసినా ఆనందంగా ఇచ్చింది." కృషి కంఠంలో మామూలు స్నిగ్ధదరహాసమే. నిన్న కాదన్నా వెచ్చని కోరికల ఇంద్రజాల పేటికనుంచి బయటపడి చేసిన ఆ సాహసంలో ఎంతటి లాలిత్యం వున్నా ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాడు విశ్శు. రెప్పలార్పకుండా చూస్తున్న కృషి నేత్రాల్లో ఉద్రిక్త యౌవన శిఖరాగ్రాన్ని అధిరోహించిన భావం ద్యోతకం కావటం లేదు. నిన్న వర్షించనని మొరాయించిన ఓ మేఘం పులకింతగా వర్షించిన తొలకరి జల్లు వేళలో అణువంత ఆవిరితో పరిమిళింత భూదేవి స్వగంధంలా వుంది"

"నమ్మలేక పోతున్నాను" గొణుగుతున్నట్టుగా అన్నాడు.

"నా ఇష్టాన్నా"

"నన్ను ఇష్టపడగలవనే నిజాన్ని"

"ఇంకా ఏం చేసి నమ్మించను"

జవాబు లేనట్టుగా చూశాడు విశ్శు. . .

"మనసు పడ్డ అమ్మాయి తన అభీష్టాన్ని క్షణంలో వ్య క్తం చేయటానికి వున్నది ఈ ఒక్క ఆధారమే అయితే నేను ఇప్పుడు చేసింది అదే విశ్శూ. . . ఇందులో" క్షణం ఆగింది బిడియంలా తలవంచుకుని "నా ఓటమిలేదు - నిన్నటి ఓటమి పై నేను సాధించిన గెలుపులానే అనిపిస్తూంది. ఇది నటన కాదు విశ్శు - కోరుకున్న మగాడి ముందు తన జీవితాన్ని పదిలంగా అందించటానికి నేను సిద్ధమని చెప్పటానికి నాకు తెలిసిన మార్గం ఇదొక్కటే. . .హఠాత్తుగా ఎందుకిలా మారావూ అంటే నా దగ్గర జవాబు లేదనుకోకు. ఉంది. చౌదరి సామ్రాజ్యం మీద నేను దాడి ప్రారంభించి ఎన్ని నెలలూ రోజులూ గడిచినా ఎంత గెలిచానో నాకు స్పష్టంగా తెలీదు కాని నువ్వు సాధించిన దాని ముందు నేను చేసింది చాలా స్వల్పమే అని మాత్రం అర్థం చేసుకున్నాను. . . అదొక్కటే కాదు విశ్శు - నీలో ఇంకా చావని మానవత్వం, విలువలు నన్ను బలంగానే కదిలించాయి. ఈ మాట ఎందుకంటున్నానూ అంటే మా కుటుంబం మీద పగ

స్పందించాల్సిన అగత్యం లేదు. కాని మూవ్ అయ్యావు. . . అదే. . .సరిగ్గా అదే నీ ముందు నేను ఓడితేనేం అనిపించిన తొలిక్షణం. . . ఆ తర్వాత నిన్ను నువ్వు నిర్దేశించుకున్న మార్గం నుంచి పక్కకు జరిగి నువ్వు చౌదరిపై ఎలాంటి చావు దెబ్బ తీసావూ అంటే ఈ రోజు చౌదరి ప్రాణాలుగ్గ బట్టుకుని బ్రతుకుతున్నాడు - నీ మీద నేను ఇష్టం పెంచుకోవటానికి ఇదొక్కటే కారణం కాకపోయినా పెంచుకోకపోవటానికి అభ్యంతరం మాత్రం కనిపించలేదు విశ్వ. . . అయితే చివరిగా మరో విషయం. . . ” విశ్వ వున్న ప్రస్తుత మానసిక స్థితిలో ఆ విషయం ప్రస్తావించడం ఎంతవరకూ సమంజసమో ఆమె ఆలోచించలేదు “నీ తండ్రి హత్యకి కారణం మా గ్రాండ్‌పా మాత్రం కాదు.”

“వద్దు. . . ఇప్పుడా విషయం మనం మాట్లాడుకోవద్దు” విశ్వ కంఠంలో ఇంకా అదే మొండితనం. . .

బాధగా చూసింది. ఏం చెప్పి నమ్మించాలీ వ్యక్తిని, ఏం చేసి ఈ మనిషికి నిజాన్ని నిరూపించాలి.

“ఆవేశంతో కాదు విశ్వ - కూల్‌గా ఆలోచించు. . . ఇలా అడుగుతున్నది నిన్నటి దాకా నీకు ప్రత్యర్థిగా నిలబడ్డ ఉపాధ్యాయ మనవరాలు కృషికాదు . . . తన ఆడతనాన్ని నిర్లజ్జగా నీకు అర్పించటానికి సిద్ధపడి వచ్చిన ఓ అమ్మాయి.”

“ కృషీ. . .” కాలిన ఏ చితిమంటల కాగడాలో అతడి కళ్ళలో ప్రతి ఫలిస్తుంటే బడలికగా కళ్ళు మూసుకున్నాడు. “నేను చేసిన పొరపాటు ఉపాధ్యాయగారి మీద ఆవేశాన్ని నీ మీద ప్రకటించడమూ నిన్ను హింసించటానికి సిద్ధపడటమూను. కాదనను. అయితే నువ్వే ఓ విషయం అర్థం చేసుకోవాలి. నేనిప్పుడు గాయపడి వున్న మృగాన్ని. అలా గాయమైంది కేవలం మీ గ్రాండ్‌పా ఒక్కడి మూలంగానే కాదు. చౌదరి మూలంగా కూడా అని తెలుసుకోబట్టే ఇప్పుడు అటు కూడా ఓ అస్త్రాన్ని సంధించాను. దాని ఎఫెక్టు ఎంతన్నది వదిలేద్దాం”

వెయ్యి పేజీల ప్రేమకథని మనసుతో కుదించి నిర్వచిస్తే వట్టి రెండక్షరాల పదం ‘ముద్దు’ అయితే అది కూడా విశ్వాని మార్చలేకపోయింది. కృషి టార్గెట్ కాదని అతడికెప్పుడో తెలుసు. . . ఆమె ద్వారా ఓ మార్గాన్ని కోరుకున్నాడు తప్ప ఆమెని ప్రేమించడమూ లేక ఆమె చేత ప్రేమించబడటమూ అన్నది అతడి అసలు లక్ష్యం కాదు - అందుకే ఇప్పుడూ నిక్కచ్చిగా మాట్లాడాడు.

మరో అర నిముషంలో ఓటమిలాంటి భావంతో ఆమె బయటికి నడిచేదే. . .

అదిగో అప్పుడు వింది తలుపు తట్టిన శబ్దాన్ని.

ముందు అవాక్కయిపోయింది విశ్వా. . . .

అలాంటి వేళలో అరుదుగా అయినా తనను వచ్చి కలిసేది సూరి మాత్రమే.

అందుకే నిర్భయంగా తలుపు తీసాడు.

సర్రున చీరుకుపోయిన విశ్వా అరచేతి రక్తం అతడి కదలికలో కృషి మొహంపై పడింది.

జరుగుతున్నదేమిటో గ్రహించిన కృషి వెనుకడుగు వేయలేకపోయింది.

లోనికి ఎందరు దూసుకొస్తున్నదీ ముందు అర్థం కాలేదు. . . మరో వ్యక్తి చేతిలోని డేగర్‌లాంటి ఆయుధం యిప్పుడు కృషిని తాకబోతుంటే ఒక్క వుదుటున ఆమెను వెనక్కి లాగేసిన విశ్వ ఇందాక గాయమైన చేతితోనే ఆయుధాన్ని ఒడిసిపట్టుకున్నాడు.

మెరుపు వేగంతో కదిలిన వ్యక్తులు అదే వూపులో కృషిని విశ్వనీ ముక్కలుగా నరికేసేవారే. . .

అప్పుడు వినిపించింది పోలీసుల బూట్ల చప్పుడు. వెనువెంటనే ఎసిపి మాధూర్ అక్కడ ప్రత్యక్షమై అగంతకులకి రివాల్వర్ గురిపెట్టాడు. . .

"డ్రాప్ యువర్ వెపన్స్" మాధుర్ కంఠం ఖంగుమంది.

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

రామనాథ చౌదరికి చెందిన ఆరుగురు అనుచరుల్నీ కస్టడీలోకి తీసుకున్నాడు మాధుర్.

ఏమీ జరగనంత ప్రశాంతంగా వుంది ఆశ్రమం. . . చౌదరి అనుచరుల్ని వేన్‌లోకి నెట్టి స్టేషన్‌కి పంపేక వెనక్కి వచ్చిన మాధుర్ "మీ అంచనా తప్పుకాలేదు మిస్ కృషి... యూ ఆర్ రైట్" అన్నాడు కృషిని చూస్తూ.

విశ్వకి వెళ్ళాలని లేకపోయినా బలవంతంగా హాస్పిటల్‌కి తీసుకువెళ్ళింది. చేతికి బేండేజ్ కట్టేక ఎసిపి మాధుర్ స్టేట్‌మెంట్ తీసుకోవటం మరిచిపోలేదు.

కృషి వెళ్ళిపోయింది నిశ్శబ్దంగా . . . ఎసిపి మాధుర్ విశ్వని ఆశ్రమం దగ్గర డ్రాప్ చేసాడు మరో అరగంటకల్లా. . .

"నాకో ప్రశ్నకి జవాబు చెబుతారా" అడిగాడు విశ్వా.

"ష్యూర్"

"కృషి అంచనా తప్పు కాలేదన్నారిందాక. అంటే నా మీద చౌదరి మనుషుల అటాక్ జరిగే అవకాశముందని కృషి మీకు ముందే చెప్పిందా"

డిసిప్లిన్డ్‌గా వుండే ఐపియస్ ఆఫీసరైనా విశ్వా విషయంలో కృషి ఎలాంటి ఆసక్తి చూపిస్తున్నది మాధుర్‌కి చాలా రోజుల క్రితమే అర్థ మైపోయింది.

"పెద్ద సంస్థల మధ్య జరిగే కార్పొరేట్ వార్స్ గురించి నేను అర్థం చేసుకోగలను మిస్టర్ విశ్వా. కాబట్టే చౌదరి స్థాయి మనిషి మిమ్మల్ని విడిచి పెట్టడని నేను ముందే గెస్ చేసాను. . . అయితే మీకు రక్షణ కావాలని మీ పరంగా ప్రపోజల్ రావాలిగా. మీరు అడగలేదు. కాని మీ తరపున కృషి అలాంటి యినీషియేటివ్ తీసుకుంది."

విభ్రమంగా చూసేడు "అంటే"

"మీరీ మధ్యన సృష్టించిన సంచలనంతో మీకూ ఈ ఆశ్రమంలో వున్న మీ మదర్‌కి ఇంకా వివరంగా చెప్పాలీ అంటే మొత్తం ఆశ్రమానికి చౌదరి మూలంగా ప్రమాదం జరగబోతుందని మిస్ కృషి తనే కమీషనర్‌కి రిటెన్ కంప్లయింటిచ్చింది. తనకున్న పలుకుబడినుపయోగించి సెక్యూరిటీగా పాతికమంది పోలీసుల్ని ఆశ్రమం పరిసరాల్లో ఏర్పాటు చేయించింది. . . అఫ్‌కోర్స్ నన్ను పర్సనల్‌గా రిక్వెస్టు చేసింది కూడా. . . చుట్టుపక్కల కాపలాగా వుంచాను. ఇదంతా గోప్యంగా జరగటానికి కారణం మీరిలాంటివి యిష్టపడరన్నది ఒకటైతే పోలీసుల మూలంగా ఆశ్రమ ప్రశాంతతకి భంగం కలగకూడదన్నది మరొకటి ఇది కూడ కృషి ఆలోచనే"

సాలోచనగా చూసాడు విశ్వా.

"ఈ రోజుతో మేం మా కాపలాని ముగించడంలేదు మిస్టర్ విశ్వా. ఆశ్రమం సేఫ్టీ దృష్ట్యా యింకా కొనసాగిస్తాం. అయితే అది గోప్యంగానే వుంటుంది. చౌదరిలాంటి వ్య క్తి యికనుంచి మరీ రెచ్చిపోయే అవకాశముంది కాబట్టి మీరు జాగ్రత్తగా వుండటం మంచిది."

"థేంక్స్" అన్నాడు విశ్వా.

అలా చెప్పింది ఎసిపి మాధుర్ అయినా విశ్వా మనసులో మెదిలింది కృషి . . . నిన్నగాక మొన్నటిదాకా తను ఆకతాయిగా అల్లరి పెట్టిన అమ్మాయి -

ఎదని యెరలా కొరుక్కు తినగలిగేది 'ప్రేమ' అయితే ఆ భావం అలసిన మనసుని సైతం మంచు మైదానంలా మారుస్తుంది. . . ఏకాకి అనుకున్న వారికి స్వాప్నిక లోకాల్ని సృష్టిస్తుంది.

గోళ్ళతో గుండెను చీల్చి గాయపరిచినా పగిలిన ఆ మనసు పొరల్లో నుంచి వినిపించే ఆక్రందన ప్రణవం అంత మధురంగా అనిపిస్తే అంతటి విశ్వజనీనమైన మార్పుకి కారణమైన 'ప్రేమా' నీకు కాక మరెవరికమ్మా జోహార్లు అర్పించేది.

0 0 0

"విశ్వా ఓడి గెలిచానో గెలిచి ఓడానో తెలీని సందిగ్ధ స్థితిలో రాస్తున్న ఉత్తరమిది. . .

ఓ నిజం చెప్పనా . . . ఒంటరితనపు ఒంటి స్థంభపు మేడపై ఏకాంతపు గదిలాంటి జీవతంలో బ్రతికిన ఆడపిల్లని నేను. అలా అని నాకు అనుభూతులు లేవనుకోకు. . . ఉన్నాయి. కాబట్టే ఆస్తులూ అంతస్తులూ అనే గ్రాండ్‌పా ఆలోచనలకు దూరంగా పారిపోయి అక్కడ

దూరమై మనసు గాయమైంది. దానికి కారణం ఎవరన్నా కాని ఏమైనా కాని నాకీ ప్రపంచంలో వున్నది తాతయ్యే కాబట్టి మళ్ళీ ఈ దేశంలో అడుగుపెట్టాను.

శాశ్వతంగా ఉండిపోవాలని కాదు తిరిగి వెళ్ళాలనే అనుకున్నాను. కాని కొన్ని సమస్యలు నన్నిక్కడ కట్టేశాయి తాత్కాలికంగా అయినా. అదిగో నువ్వు సరిగ్గా అప్పుడు పరిచయమయ్యావు చిత్రంగా. ముందు మోసగాడివనుకున్నాను. తర్వాత మేధావివనీ తెలుసుకున్నాను. నువ్వు సరిగా అర్థం కాకపోయినా నీలో నేకోరుకునే సరిగమల సవ్వడినీ చూసాను. అది ఖచ్చితంగా ఇష్టమని చెప్పలేనుగాని నువ్వు నన్ను రెచ్చగొడుతున్నా పూర్తిగా ద్వేషించలేకపోయాను. ఎందుకో అప్పటికీ నాకు అర్థం కాలేదు. అర్థం చేసుకోవటానికి రోజుల తరబడీ శ్రమించాను విశ్వా. . . తెలిసింది నువ్వు కూడా ఓ గాయపడ్డ మనిషివని అందుకే నా పరిచయం కోరుకున్నావని.

ఆ తర్వాతైనా నిన్ను వదిలించుకోవడం నిజానికి నాకు పెద్ద సమస్య కాదు. బహుశా నీకు దూరం కాలేకనో నిన్ను దూరం చేసుకోలేకనో చేయాల్సిన ప్రయోగాల్ని వదిలి యోగ నిద్రలోకి జారినట్టు నీతోకాక నా మనసుతో పోరాటం ప్రారంభించాను.

మనసు పొరల్లో ఆకారం లేని నాదం - క్రమంగా సాకారమైంది. ఆనక అది నీ రూపంగా కనిపించింది. మేధ ఆత్మలో అంతర్భవించినప్పుడు జరిగే రసాయనిక చర్యల గురించి నాకు అనుభవం లేదు విశ్వా. కాని నువ్వనే ‘వింత’ పాలపుంతలా నన్ను ప్రభావితం చేస్తూండేది. నిన్ను ద్వేషంగా చూడాలనుకునే నా కనురెప్పల కౌగిట్లో ప్రేమో బెంగో తెలీని చూపులు నా మీద తిరగబడి నన్నే ప్రశ్నించేవి. ఏం చేయను. అంతరంగం రెండుగా చీలిపోతుంటే ముందు కనిపించే మెలిరెక్కల్ని పట్టుకుని మనసు గోపురంపై రాలే నీ ఆలోచనల్ని విదిల్చుకోవాలో తెలీకుండానే చాలా దూరం నడిచేసాను.

అర్థరాత్రి నిద్రపట్టని నా ఏకాంతంలోకి నిశ్శబ్దంగా పయనించే కడలి అల అనుకున్నానుగాని నువ్వు విజృంభిస్తే మహార్ణవాలే అని ఆలస్యంగా తెలుసుకొని నీ ముందు ఓడిపోవాలని నిర్ణయించుకున్నాను.

మల్లెపూల వాల్జడతో నిన్ను నా యింటికి ఆహ్వానించలేను సిగ్గిలిన సోగకళ్ళతో నీలో రగులుతున్న తుఫానుకి వారధి వేయలేను. ఈ క్షణములో నన్ను నేను మోసం చేసుకోలేను విశ్వా. మనసు తెరలన్నీ జారిపోయిన ఈ క్షణాలలో నిన్ను నేను ప్రేమిస్తున్నానూ అని చెప్పకుండా ఉండలేను.

నా ప్రేమకన్నా నీలో రగిలే ద్వేషమే నీకు ముఖ్యమని నాకు తెలుసు. . .

చివరిగా నాదో విన్నపం విశ్వా. . .

నువ్వు అసహ్యించుకునే గ్రాండ్‌పా నిన్నటిదాకా నువ్వు తోడుగా నిలిచిన చౌదరి లాంటివాడు కాదు. అంతస్తు కాపాడుకోటానికి ఏదన్నా చేయగలరేమో కాని హత్యలు చేయించలేడు. నిజానికి నీ తండ్రిని హత్య చేయించింది చౌదరి. కారణం ఆస్తి

గ్రాండ్‌పా మీద గెలుపు సాధించడం. అయితే తాతయ్య చేసిన పొరపాటు ఒక్కటే. తనమీద హత్యానేరం వస్తున్న సమయాన అది తప్పించుకునే మార్గంలేక నీ తండ్రిది ఆత్మహత్యగా నిరూపించారు తనకున్న డబ్బు పరపతి దానికి ఉపయోగించి వుంటే అది పొరపాటే. అయితే ఆ క్షణంలో అంతకుమించి ఆయన ఆలోచించలేక పోయారు.

ఇద్దరు ప్రత్యర్థులమధ్య జరిగిన పోరాటంలో నాశనమైంది నీ కుటుంబమే అని నేను అంగీకరిస్తాను. ఇప్పటికీ మించిపోయింది లేదు. 'దేవి' అనబడే ఓ సన్యాసిని ద్వారానే తను అంతా నడిపించిన చౌదరి గురించి ఆ 'దేవి ' ద్వారానే వీలైతే తెలుసుకో. అప్పటికీ హత్య చేయించింది మా గ్రాండ్‌పా అని నువ్వు నిరూపిస్తే నిన్ను ఆనందంగా ఆహ్వానిస్తాను. తాతయ్య పై నువ్వు చేయాలనుకునే ప్రయోగానికి నేనే నీకు సహకరిస్తాను.

ఆవేశంతో కాక మనసున్న ఓ మనిషిగా నా యీ చివరిమాటని విశ్వసించి వాస్తవాన్ని తెలుసుకోగలవని నమ్ముతూ. . .

కృషి "

ఉత్తరం మడిచిన విశ్వకి ముందు గుర్తుకొచ్చింది కృషి కాదు దేవి.

ఉదయం పదిగంటలకల్లా ఆశ్రమంనుంచి బయలుదేరబోయిన విశ్వ టక్కున ఆగిపోయాడు.

కుటీరం ద్వారం దగ్గరే ఎదురొచ్చింది కృషి.

"మీరు" తడబాటుగా గొణిగాడు.

నీటిలో నీడలాగా వూగివూగిన కృషి ఆలోచనలు స్థిరరూపాన్ని చేసుకోటానికి అరక్షణం పట్టింది. "ఇంతదాకా వచ్చాక నువ్వు కాస్త మీరుగా మారిపోయిందా"

"అదికాదు కృషీ" తన వేగాన్ని నిరోధించే అడ్డుగోడలా ఆమె ఎదురు రావడం అతడికి నచ్చలేదు.

"సూరిద్వారా పంపించిన ఉత్తరం చదివాను". నిట్టూర్పులా అన్నాడు. "నిజానిజాలు తేల్చుకోవాలనుకుంటున్నాను"

కృషి నొసలు చిట్లించి చూసింది 'ఎలా'

"అది నాకు వదిలిపెట్టండి"

"ముందు నువ్వు బహువచనంలో అడ్రసు చేయడం మానేయ్" ఏకవచనంలో సంబోధించింది.

"సాధ్యం కాదు"

"అదేం"

"ఇప్పుడు మీ మీద పగతీర్చుకోవాలనుకుంటున్న వ్యక్తిని కాదు"

"కాబట్టి 'మీరు' అయ్యానా"

అర్ధం కాలేదు"    గభాలున ద్వారం మూసింది.  ఉలికిపడ్డాడు విశ్ను.

"ఎవరన్నా చూస్తారు"

"ఏమిటి"

"మనం ఇద్దరం లోపల వుండటాన్ని"

"ఊరికనే ఉన్నాం తప్ప మరేం చేసుకోవడం లేదుగా"

కృషి ఇలా మాట్లాడ్డం నచ్చలేదు.

"నా మాటవిని ద్వారం తెరవండి"

రెప్పలార్చకుండా చూస్తూ నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నారు"

"నవ్వక ఏం చేయాలి విశ్నూ. ఓ రాత్రి నాతో గడపగలవా అని నిన్న మొన్నటిదాకా వేధించిన మగాడు నన్ను గుండెలపై లాక్కుని ఫోటోలు తీసి బెదిరించిన వ్యక్తి నేను ఈ దేశం నుంచి వెళ్ళకపోతే నన్ను అనుభవించి పరాభవిస్తానన్న వాడు ఇప్పుడు వూరకనే ద్వారం మూసినందుకు కంగారు పడుతుంటే నవ్వకుండా ఎలా వుండగలను"

"అప్పటి పరిస్థితులు వేరు"

"ఇప్పటి పరిస్థితులు కూడా వేరేగా"

"అంటే" ప్రశ్నార్ధకంగా చూశాడు.

"అప్పుడు నువ్వు అడిగిన ప్రతిదానికీ కాదన్నాను. ఇప్పుడు నువ్వు అవునూ అనకముందే నిన్న రాత్రి నిన్ను ముద్దుపెట్టుకున్నాను."

ద్వారం తెరిచింది విశ్నూని ఇంకా ఇబ్బంది పెట్టడం యిష్టం లేనట్టుగా.

"ఇంతవచ్చిగా నేను ఎలా మాట్లాడుతున్నానూ అన్నది ఆలోచిస్తున్నావా విశ్నూ.  అలా మాట్లాడ్డం నీకు ఇష్టమని కాదు. ఎందుకో నాకే మాట్లాడాలనిపించింది. వయసుడిగిన వాళ్ళు యవ్వనం గురించి నెమరువేసుకుంటారు. యవ్వనంలో ఉన్నవాళ్ళు కలల్ని కనాలని కోరుకుంటారు.  ఆ విషయం కూడ తెలిసింది నీ మూలంగా నీ ఆశలూ ఇలా పంచుకో"

"ఇప్పుడు అవన్నీ చర్చించుకోవడం మానేద్దాం" అన్నాడు విశ్ను సీరియస్‌గా.

"మానేయాలి అంటే నువ్వో పని చెయ్యాలి"

"చెప్పండి"

"నువ్వు అండీ అని అడ్రస్ చెయ్యటం మానెయాలి."

క్షణం నిశ్శబ్దం తర్వాత అన్నాడు "ఓకే"

"ఇప్పుడు చెప్పు. .  . దేవినుంచి ఆ రహస్యాన్ని ఎలా తెలుసుకోవాలను కుంటున్నావ్."

వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.  నిజమే.  . . దేవి ఓ మామూలు వేశ్యకాదు డబ్బుల్తో సులభంగా కొనేయటానికి.  చాలా పరపతీ ఆలోచనా శక్తిగల స్వామిని రూపంలో వున్న బ్రోతల్....

అంత సులభంగా విషయం దక్కదు. యుక్తిగా సాధించాలి.

సాలోచనగా అడిగాడు అరనిముషం తర్వాత " ఎసిపి మాథుర్ చౌదరి మనుషుల నుంచి వివరాలేమైనా రాబట్టగలిగాడా"

"లేదు. . .అది సాధ్యమయ్యే విషయం కాదు. ఎందుకంటే తన కున్న డబ్బుతో చౌదరి నిరపరాధుల్ని కూడా అపరాధులుగా ఒప్పించి అవసరమైతే జైలుకి పంపగలడు కాబట్టి. . . కాని వాళ్ళు మాత్రం వెంటనే బయటికి రారు. రాకుండా నాన్ బెయిలబుల్ వారెంటుతో లోపలే వుంచగలడు మాథుర్."

"అది మాత్రమే చాలదు కృషీ. . . చౌదరి కావాలనుకుంటే లీడింగ్ లాయర్లని రంగంలోకి దింపగలడు. వాళ్ళని జుడీషియల్ కస్టడీలనుంచి బయటకి రప్పించగలడు. సో. . . ఇప్పుడు జరగాల్సింది మరొకటి."

"చెప్పు"

"చౌదరి ఈ పాటికి లాయర్లని స్టేషన్‌కి పంపి వాళ్లని విడిపించే ప్రయత్నంలో వుండొచ్చు. కాబట్టి వాళ్ళని మరెక్కడికయినా రహస్యంగా తరలించాలి. అంటే నీకూ, మీ గ్రాండ్‌పాకి వున్న పలుకుబడితో వాళ్ళని మరెక్కడికయినా తరలించి వాళ్ళని ఇప్పటికే విడిచిపెట్టినట్టుగా ఓ సీను సృష్టించాలి.. . . "

"ఎందుకు?"

"చెబుతాను"

ఏమిటి అని అడగలేదు కృషి. విశ్వా లాంటి మేధావి చాలా ముఖ్యమైతే తప్ప ఇలాంటి ఓ పథకం గురించి మాట్లాడడు.

"ఓ.కే విశ్వా. . . డబ్బుతో చాలా చేయగల చౌదరిలాగే అదే డబ్బు పరపతితో గ్రాండ్‌పా కూడ చాలా చేయించగలడని నాకు తెలుసు. నువ్వడిగింది పెద్ద ఇబ్బందికరమైందేమీ కాదుగా - గ్రాండ్‌పా చేత కమీషనర్‌కి ఫోన్ చేయించి వెంటనే ఆ ఏర్పాట్లు చేస్తాను."

ఆమె వెళ్ళబోతుంటే "మరో విషయం" అన్నాడు.

"ఏమిటి"

"మనం ఇంకా ప్రత్యర్థులమే"

విస్మయంగా చూసింది.

"పత్రికలకి, అక్కడనుంచి చౌదరికి మనం ప్రత్యర్థులమే అన్న విషయం తెలియ చేయాలి కృషీ. . . ఎందుకంటే మనమధ్య సయోధ్య కుదిరినట్టు తెలిస్తే చౌదరి మీద నేను సంధించబోయే అస్త్రం గురితప్పే అవకాశముంది."

వివరంగా చెప్పాడు ఏం చెయ్యాలీ అన్నది.

"థేంక్స్" అంది చివరిగా.

"దేనికి"

ఆమె తల వంచుకుంది. "నేను కోరుకుంటున్న మనిషి నేను కోరినట్టుగా ఆలోచిస్తున్నందుకు. . ."

ఆ తర్వాత కృషి అక్కడ నిలబడలేదు. ఆ ద్వారంలో నుంచి బయటికి వస్తూనే ఆగింది ఎవరో పట్టి ఆపేసినట్టుగా.

అది సంశయం కాదు. . . భయం. ఫలానా అని చెప్పలేని ఆందోళన ఎందుకని... శరీరం కంపించి పోతూందేం. . . ఏ కాంక్షా తెలీని కళ్ళతో ఏకాంత జీవితపు సరిహద్దుల్ని కొలుస్తూ బ్రతికేసిన తనకు ఇప్పుడీ మనిషి గురించి ఇంత అలజడిగా వుందేం... చెక్కిళ్ళపై ఇప్పుడిప్పుడే కదలాడే కలల నీడలు రేపి నిజంకావేమో అన్న భయమా. . . లేక ఉవ్వెత్తున లేస్తున్న ఈ ఉద్రిక్త చైతన్యం ఏ ప్రమాదంలో చిక్కుకుంటూందో అన్న దిగులా. . .

"ఏమైంది" అడిగాడు నెమ్మదిగా.

"జాగ్రత్త" కృషి గొంతు వణికిందెందుకో.

చెప్పలేదు విశ్వా. . . నిజానికి అతడికీ కంగారుగానే వుంది. అందులోనూ తను ఎదుర్కోబోతున్న వ్యక్తి సామాన్యుడు కాడు.

"ఒడ్డున కెరటం విసిరి కొడుతున్నా సముద్రంలోకి దూసుకుపోవడం జాలరి మనస్తత్వం కృషి. . . వాడికి అది బ్రతుకుతెరువైనా ఆ విషయం తెలిసి సముద్రం ఒక్కోసారి ఆ జాలరినీ బలి తీసుకుంటుంది."

"ఎందుకిలా మాట్లాడుతున్నావు"

"మళ్ళీ మాట్లాడే అవకాశం రాదేమో అన్న భయం కృషి"

"అంత ప్రమాదమనిపించినప్పుడు ఈ పోరాటం దేనికి?"

"కృషి" నిర్వేదంగా నవ్వేశాడు. " తెలిసో తెలియకో చాలా రోజుల క్రితమే నేను పులి మీద స్వారీ మొదలు పెట్టాను. నేను క్రిందకి దిగితే పులి మూలంగానే ప్రమాదం ఎదురవుతుంది. ఇలా ఎందుకంటున్నాను అంటే మీ గ్రాండ్‌పాని నేను సాధించాలనుకున్నాను. అలా అనుకుని చౌదరిలాంటి పులితో స్నేహం చేశాను. దురదృష్టవశాత్తూ మీ గ్రాండ్‌పాకన్నా చౌదరే నా మూలంగా ఎక్కువ సమస్య కొనితెచ్చుకున్నాడు కాబట్టి నన్ను అంత సులభంగా వదిలి పెట్టడు."

కనిపించని ఏ దేవుడి గురించో కృషి ఆలోచించిన తొలి క్షణమది.

0 0 0

సాయంకాలం ఐదు గంటల సమయం. . . నెత్తురు పొత్తిళ్ళలో నిర్నిద్రంగా తలెత్తి చూస్తున్న బిడ్డలా సూర్యుడు అస్తమిస్తున్న వేళ .. .

ఓ అణువులాంటి క్షణం విస్ఫోటనం చెందబోతున్నట్టు పోలీస్ కంట్రోల్ రూం ఆవరణ టెన్షన్‌తో నిండివుంది.

కృషి లోపలనుంచి నెమ్మదిగా బయటకు నడుచుకువస్తూంటే పత్రికా విలేకర్లు చుట్టుముట్టారు.

అప్పటికే ఆమె విశ్వ చెప్పిన పథకంలోని అంశాల్ని అమలుచేసింది.

మధ్యాహ్నానికల్లా చౌదరికి చెందిన ఆరుగురు నేరస్తుల్ని మాథుర్ ఓ అజ్ఞాత ప్రదేశంలో దాటేసాడు కమీషనర్ ఆదేశం పై. అలా కమీషనర్ ఆదేశించింది ఉపాధ్యాయ అభ్యర్ధన మీదనే.... అజ్ఞాతంలో వుంచమన్నది కేవలం రెండు రోజులే కాబట్టి అదో పెద్ద అభ్యంతర మనిపించలేదు.

చౌదరి పంపిన లాయర్లు బెయిలు కోసం ప్రయత్నిస్తుండగానే తెలిసింది పోలీసులు వారిని విడిచిపెట్టినట్టు. ముందు షాక్ తిన్నది చౌదరే. పోలీసు డిపార్టుమెంటులో తనకున్న పరపతితో వాళ్ళని వదిలిపెట్టారని అనుకున్నాడు తప్ప జరిగిందేమిటో ఆలోచించలేకపోయాడు.....

అంతకుమించి తన దగ్గరకు తిరిగిరాని ఆ వ్యక్తులు విశ్వా ఆధీనంలో వున్నారేమో అని పొరపాటు పడ్డాడు కూడా.

"మేడమ్" ఓ విలేఖరి అడిగాడు "చౌదరిగారి మనుష్యుల్ని విడిచిపెట్టామంటున్న పోలీసుల గురించి మీ అభిప్రాయం ఏమిటి"

"నాకూ ఇప్పుడే తెలిసిందా విషయం. . . అయినా అది వాళ్ళ చట్టానికి సంబంధించిన విషయం. నేనేం కామెంట్ చెయ్యగలను."

"ఉపాధ్యాయగారు చౌదరిగార్ల మధ్య సాగిన కార్పొరేట్ వార్‌లో మీరు కీలకమైన పాత్ర వహించారని అందరూ అనుకుంటున్నారు. మీ కామెంట్"

మృదువుగా నవ్వింది. "దీనిలో ప్రత్యేకించి నా పాత్ర ఏమీ లేదు. మీది అనుకున్న మీ వస్తువుపై ఎవరయినా దాడి చెయ్యటానికి ప్రయత్నించినప్పుడు మీరెలా రియాక్టవుతారో నేనూ అలాగే రియాక్టయ్యాను అంతే."

"ఇప్పుడు చౌదరిగారి పరిస్థితి విషమించిందని మా అభిప్రాయం... మీరేమంటారు."

"సక్రమమైన మార్గంలో కాక అక్రమమైన పద్ధతిలో ఎదగాలనుకునే ప్రతి వ్యక్తి ఏదో ఓ రోజు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోక తప్పదు. పైగా కోట్ల సంఖ్యలో పసిపిల్లల ప్రాణాలకు హాని తలపెట్టే చాక్‌లెట్స్ ఉత్పత్తి చేసే వ్యక్తిని విడిచిపెడితే యీ ప్రభుత్వాన్ని ప్రజలు సైతం

అర్జెంటుగా ఓ నివేదికని అందించమని శాస్త్రజ్ఞుల్ని ఆదేశించారూ అంటే ఇది సామాన్యమైన యిష్యూ కాదుగా."

"విశ్వా అనబడే ఓ వ్యక్తి మీద దాడి చేయటానికి చౌదరిగారు తన మనుషుల్ని పంపేడని అతడు స్టేట్‌మెంటిచ్చాడు."

"దాని గురించి నన్నెందుకడుగుతున్నారు."

"ఆ రాత్రి మీరూ అక్కడ అతనితో బాటు వున్నారని తెలిసింది." ఈ ప్రశ్న అడిగింది చౌదరికి చాలా ఆత్మీయుడైన విలేకరి.

ఇది ఆమె వూహించని ప్రశ్న అయినా తొణక్కుండా జవాబు చెప్పింది. "ఎస్. . . అక్కడ వున్నాను. ఎందుకంటే కార్పొరేట్ చర్చలో సంధి చేసుకోవడమూ ఓ ముఖ్య సూత్రమే కాబట్టి."

"సంధి అవసరమైతే మీరు వెళ్ళాల్సింది చౌదరి దగ్గరికి."

"నిజమే. కాని ఈ విశ్వా అనబడే వ్యక్తి యిప్పుడు చౌదరి ఎంపైర్‌ని నేలమట్టం చేయటానికి సాహసించినా తొలి నుంచి చౌదరి మనిషే. . . చౌదరి డబ్బు గూండాయిజం తప్ప మేధస్సుతో పోరాడే శక్తి లేనివాడు కాబట్టి విశ్వా అనబడే ఓ ఎడ్యుకేటెడ్ రోగ్‌ని. . . ." ఇబ్బందిగా ఉచ్చరించింది. "రోగ్ అనే పదాన్ని హైర్ చేసుకుని మాయ పోరాటానికి దింపాడు. కొన్నాళ్ళు చౌదరి గెలుపుకి కారణమైన ఆ తర్వాత యిద్దరికి బెడిసి కొట్టడంతో భస్మాసురుడిలా చౌదరి నెత్తిమీదనే చేయిపెట్టాడు."

"మరి" నెమ్మదిగా అడిగాడు ఓ విలేకరి. "ఆ రాత్రి మీకూ, విశ్వాకి సంధి కుదిరిందా"

"లేదు" టక్కున జవాబు చెప్పింది. "ఎందుకంటే ఒకనాడు తన తండ్రి మోహన్‌గాంధీ హత్యకి కారణం మా గ్రాండ్‌పా అని ఇంకా అతడు నమ్ముతూండబట్టి. కాని నిజానికి అది జరిగింది ఎవరి మూలంగానో నేను నిరూపిస్తానని ఛాలెంజ్ చేసాను..."

"యూనియన్ లీడర్ మోహన్‌గాంధీ మరణం ఆత్మహత్యగా. . ."

కారుని చేరుకున్న కృషి అంతకుమించి వివరాలు చెప్పడం ఇష్టం లేనట్టుగా అంది చేతులు జోడించి "ప్లీజ్ యింతకు మించి నేను మరేమీ చెప్పలేను. చౌదరి మూలంగా జరిగిన అనర్థాలెన్నో ఏమిటో మీరు అతి త్వరలో తెలుసుకోబోతున్నారు అంతవరకూ వెయిట్ చెయ్యండి. . ."

కృషి వెళ్ళిపోయింది. . . నిజానికి ఆ సమావేశాన్ని తెలివిగా ఏర్పాటు చేయించింది కృషి అని చాలామందికి తెలియదు. . . తెలిసింది ఓ ప్రముఖ దిన పత్రిక్కి చెందిన విలేకరికి. ఉపాధ్యాయకి ఆత్మీయుడైన వ్యక్తి అతను. . .

సరిగ్గా మరో అరగంటకి చౌదరికి యిక్కడి కృషి మాట్లాడిన విషయాలన్నీ తెలిసిపోయాయి.

బుల్లెట్‌తో దెబ్బతిన్న పులిలా గాండ్రించాడు. . . నచ్చ చెప్పబోయిన లాయర్ రంగధాం

ఏమిటి తన గురించి కృషి తెలియజేయబోతున్నది.

పిల్లకాకిలా ఈ దేశంలో అడుగుపెట్టి రాబందులా మీద విరుచుకుపడ్డాక ఏ పథకాన్నీ అడ్డుకోలేక పోయిన చౌదరి యిప్పుడు ఎంత ఆందోళన పడ్డా అణువంత ఉపశమనంలా ఆనందించింది ఒక్క విషయంలోనే. . .

విశ్వా కృషికింకా ప్రత్యర్థిగానే నిలబడి వున్నాడు.

తన తండ్రిని హత్య చేయించింది ఉపాధ్యాయ అని ఇంకా నమ్ముతున్నాడు. ..

కాదు ఆ హత్య చేయించింది చౌదరి అని కృషి చెప్పి వుండొచ్చు. నమ్మించాలని ప్రయత్నించినా ఎప్పుడో ముగిసిన కథకి యిప్పుడు సాక్ష్యాధారాలెక్కడివని. . .

చౌదరి యిక్కడ యిలా ఆలోచిస్తున్న సమయానికి దేవి ఇంటిలో ఫోన్ రింగయింది.

భక్తులతో ఆధ్యాత్మిక చింతనలో మునిగి వున్న దేవి అలాంటివేళ ఫోన్ కాల్‌కి రెస్పాండ్ చేయదు. . . కాని ఫోన్ వచ్చింది ముఖ్యమంత్రి సెక్రటేరియట్ నుంచి అని ఆమె శిష్యురాలు రహస్యంగా చెప్పగానే అణువంత ఉద్విగ్నతకి లోనయ్యింది.

భక్తులతో కొలువు ముగించి బెడ్‌రూంలోకి నడిచింది.

"దేవి మాట్లాడుతున్నది."

"నేను ముఖ్యమంత్రిగారి పియ్యేని. . "

"ముఖ్యమంత్రిగారు ఢిల్లీలో వున్నారుగా" దేవి భృకుటి ముడిచి అడిగింది.

"ఉన్నారు మేడమ్. కాని నాకు ఫోన్ చేసి మీకు అర్జంటుగా ఓ విషయం చెప్పమన్నారు."

ఎంతో అవసరం ఉంటే తప్ప ఇలా జరగదన్నట్టుగా కొద్దిగా కంపించింది దేవి

"ఏమిటది?"

"చౌదరిగారి చాక్‌లెట్ కంపెనీ గొడవ మీకు తెలుసుగా"

"విన్నాం"

"ఇప్పుడు చౌదరి పూర్వం చేయించిన మోహన్‌గాంధీ హత్య అతని కొడుకు జీవితని హత్య చేసిన ఉదంతాల్లో మీ పాత్రల గురించి ఉపాధ్యాయ మనుమరాలు కృషి రహస్యంగా పరిశోధిస్తోందట. అప్పుడే కొంత సేకరించిందట. . . మిమ్మల్ని జాగ్రత్తగా వుండమని చెప్పమన్నారు."

క్లిక్ మన్న చప్పుడు వినిపించింది. . . సుఖంగా సాగిపోతున్న బంగారు నావలాటి జీవనయానం తుఫానులో చిక్కుకున్నట్టు కలవరపడిపోయింది దేవి. . .

తన పథకంలో రెండో మెట్టుని పూర్తి చేసిన విశ్వ ఫోన్ క్రెడిల్ చేసిన రెండు నిముషాల వరకూ అలాగే నిలబడిపోయాడు.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిదిగంటలు కావస్తూంది.

విశ్వ అంచనా తప్పు కాలేదు. . .

దేవి వెంటనే చౌదరికి ఫోన్ చేసింది.

మరో అరగంట కల్లా దేవి బంగళాకి వచ్చాడు చౌదరి.

విశ్శు ప్రణాళికలోని ఆఖరి ప్రమాదకరమైన ఘట్టం ప్రారంభమయ్యేది యిక్కడే...

0 0 0

కదులుతున్న సుప్తభుజంగంలాంటి నిశిరాత్రి. . .

ప్రచండ ఝంఝా ప్రభంజనానికి ముందు దశలా వీస్తున్న గాలి దేవి సువిశాలమైన భవంతిలో స్మశాన స్థబ్దతని నింపుతూంది.

ఇన్నేళ్ళ పరిచయంలో దేవిలో కంగారు చూడటం తొలిసారి కావడంతో చౌదరి కూడా సన్నగా కంపిస్తున్నాడు.

ఎన్నో అతి ముఖ్యమైన నిర్ణయాలు కోట్ల ఖరీదు చేసే వ్యాపార లావాదేవీల్ని దేవి ఏ గదిలో చక్కబెట్టగలిగిందో యిప్పుడు అదే గదిలో ఆమె దిక్కు తోచనట్టు దిక్కులు చూస్తూంటే అసహనంగా అడిగాడు చౌదరి "నువ్వు చెప్పింది నిజమేనా"

"మా మనసు కూడా కీడు శంకిస్తుంది."

ఏదన్నా చేయగలదు, ఎవరినన్నా శాసించగలదనుకునే దేవి అలా మాట్లాడ్డం చౌదరికి అస్సలు నచ్చలేదు. అయినా ధైర్యాన్ని చిక్కబట్టుకుంటూ ఆమెను చూశాడు. అది క్షణంపాటే. ఆ తర్వాత వాతావరణాన్ని కాస్త తేలికపర్చితే తప్ప తన అంతర్మధనమూ చల్లారదనిపించి ఆమెను దగ్గరకు లాక్కోబోయాడు.

ప్రతిసారీ గదిలోకి వచ్చిన రెండు నిముషాలకే నగ్నంగా మారి 'ముందు ఐక్యమౌదాం' అని చెప్పే దేవి ఇప్పుడు చౌదరి తనే చనువు తీసుకుని నియమాన్ని ఉల్లంఘిస్తున్నాడని ఆలోచించటం లేదు. ఓ మామూలు ఆడదానిలా "మా మనసు మనసులో లేదు" అంది ఆమెను నగ్నంగా మార్చే అతడి ప్రయత్నాన్ని వారించబోతూ.

అతడు వినలేదు. ఎవరిమీద కోపమో అతడ్ని ఉద్వేగ పరుస్తూంటే మానభంగానికైనా తనిప్పుడు సిద్ధమే అన్నట్టు ఆమె కాషాయ వస్త్రాల్ని లాగేసాడు. . .

ముందు సహకరించలేదు కాని రెండు నిముషాల వ్యవధిలో దేవి రగులుతున్న మొగలి పొదలా మారిపోయింది. కొండచిలువలా అతడ్ని చుట్టేసింది.

నిజానికి అది అనుభవం కాదు. ఆందోళనతో దహించుకుపోతున్న రెండు మనసుల్ని జోకొట్టే రాక్షస రతి.

గడ్డ కట్టుకుపోతున్న గుండె నిబ్బరానికి కోరి రక్తనాళాల స్పందనని అందించటానికి శస్త్రకారుడిలా చౌదరి శ్రమిస్తున్నాడు.

అతడి కదలికలు లోహ రాక్షసుల పద ఘట్టనలంత వివశత్వాన్ని కలిగిస్తుంటే దేవి గొంతునుంచి జాలువారే మూలుగు ఢంకాధ్వానాలై ఆ గదిని వేడి సెగలతో  నింపుతున్నాయి.

అయిదు నిముషాలు గడిచింది. . .

బుజంగం విషం కక్కింది.

కదం తొక్కిన తురగం సొమ్మసిల్లిపోయింది.

చల్లారిన కుంపటిలా పైకిలేచిన దేవి ఇప్పుడు కొంత ఉపశమించిందేమో "కృషి ముందు మనం ఓడిపోకూడదు చౌదరీ" అంది. . .

"నమ్మలేకపోతున్నాను దేవీ"

"ఏమిటీ"

"హత్య చేసిన వ్యక్తుల్ని సైతం రక్షించే శక్తిగల నువ్వు యిప్పుడిలా ఓ ఆడపిల్లని చూసి భయపడుతున్నందుకు."

"నేనూ ఆడదాన్నే చౌదరీ.  ఓ ఆడపిల్ల శక్తి తెలిసిన దాన్ని"

"కాని కృషి నీలాగా పదిమందితో సంబంధం పెంచుకోలేదు. ఒంటరిగా పోరాడే అమ్మాయి"

"ఒంటరిగానే నీ సామ్రాజ్యాన్ని కుదిపేసిన కృషి సామాన్యురాలై వుండదు చౌదరీ. ఒకనాడు నువ్వు చేయించిన మోహన్‌గాంధీ హత్యని తప్పకుండా నిరూపించి తీరుతుంది."

"ఎలా" అసహనంగా చూసాడు చౌదరి "ఆధారం ఏముందని. . . ఉపాధ్యాయ ఫ్యాక్టరీకి ఎదురుగా నిరాహారదీక్ష చేస్తూ టెంట్‌లో కూర్చున్న మోహన్‌గాంధీని నేను హత్య చేయించాను.... నువ్వు ఇదే బెడ్‌రూంలో ముఖ్యమంత్రితో ఐక్యమై అది నేను చేయించిన హత్యని పోలీసులు కేసుపెట్టకుండా ఆపగలిగావు."

"అదే ముఖ్యమంత్రి ఆ తర్వాత మోహన్‌గాంధీది ఆత్మహత్యని ఉపాధ్యాయ నిరూపించటానికి సహకరించాడు."

నవ్వేడు చౌదరి "పార్టీ కోసం కోట్ల రూపాయల ఫండ్స్ ఇచ్చేది నేనొక్కడ్నే కాదు దేవీ. . . ఉపాధ్యాయ కూడా యిస్తుంటాడుగా. . . అందుకే ముఖ్యమంత్రి అతడ్నీ కాపాడాలనుకున్నాడు కాపాడేసాడు. అయితే బయట ప్రపంచం మోహన్‌గాంధీది హత్యే అంది. . . ఆ అవసరం ఉన్నది ఉపాధ్యాయకి కాబట్టి హత్య చేయించింది ఉపాధ్యాయ ఆత్మహత్యగా నిరూపించాడని అతడ్ని తప్పుబట్టింది."

క్షణం ఆగి అన్నాడు చౌదరి "మోహన్ గాంధీ కొడుకు విశ్వ కూడా ఇప్పటివరకూ ఉపాధ్యాయ హత్య చేయించాడు అని నమ్ముతుంటే కృషి కాదని ఎలా నిరూపించగలదు.  పైగా అది నేను చేయించిన హత్య అని ఆమె అన్నా నీ ద్వారా నాకు సహకరించిన ముఖ్యమంత్రీ సంబంధిత పోలీసులూ అంతా ఇరుక్కున్నట్టేగా."

కాని ఎవరైనా తమకు వ్యతిరేకంగా ఏం చేయగలరని. . .

ఓ సమస్య గట్టెక్కినట్టుగా అంది దేవి "జీవితనే ఆడపిల్లని మీ వాడు హత్య చేయించిన విషయాన్నీ కృషి పరిశోధిస్తోందట."

"అసంభవం దేవి. . . ఎందుకంటే అది చాలా పకడ్బందీగా అమలుచేయబడిన హత్య కాబట్టి" చెప్పాడు వివరంగా. . . .

దేవి మృదువుగా నవ్వేసింది . . . ఇప్పుడు ఆమెకు అసలు ఏమీ జరగనంత ఆహ్లాదంగా వుంది.

"అయితే కృషి నన్ను సాధించగలిగేది ఒకే ఒక్క విషయంలో. అది నా చాక్‌లెట్ ఫ్యాక్టరీకి సంబంధించిన గొడవలో. నిజానికి నన్ను ఇబ్బంది పెట్టింది కృషి కూడా కాదు విశ్నూ. అయినా జంకాల్సింది ఆలోచించాల్సింది కృషి విశ్నూల గురించి కాదు దేవి. నన్ను ఇరుకున పెట్టబోతున్న ప్రభుత్వం గురించి. . . ఈ విషయంలో నీ సహాయం కావాలి"

అభయం యిస్తున్నట్టుగా చౌదరిని నేలపైకి నెట్టి ఉత్సాహంగా ఐక్యం కావాలనే కార్యక్రమంలో నిమగ్నమైంది దేవి. "నీ సమస్యకి సంబంధించిన వ్యక్తులంతా కేంద్రప్రభుత్వంలోని వాళ్ళే అయితే ఎవరెవర్ని కలుసుకోవాలో వివరంగా మాకు తెలియచేయి చౌదరీ. కొంత కాలం దేశ రాజధానిలో మకాం వేసి మొత్తం సాధిస్తాం. . ."

"నువ్వా హామీ యివ్వు దేవీ - మిగతాది నాకు వదిలెయ్. . ." ఉద్వేగంగా అన్నాడు జ్వలిస్తున్న నాదంలా.

"ఇంత వయసులో కూడా నీ వేడి నిట్టూర్పులు మాకు అమితమైన ఆనందాన్ని అందిస్తున్నాయి చౌదరీ" ఆమె లేచింది బడలికగా "మాకు అమితమైన ధైర్యాన్ని అందించావు చౌదరీ. అందుకే ఈ రాత్రంతా మీతో ఐక్యమౌతూ ఉల్లాసంగా గడపాలనుకుంటున్నాం."

"సాధ్యం కాదు" వాచీ చూసుకుంటూ పైకిలేచాడు. ..

దేవి భృకుటి ముడివడింది. తమ కటాక్షం కోసం అనుక్షణం తపించే ఏ వ్యక్తికైనా ఇలా 'వలదూ' అనటం తొలిసారి.

"ఏమైంది నీకు. . ."

"అయ్యేది నాకు కాదు దేవీ. మరో అరగంట దాటితే మీకూ ఏదయినా అయ్యే ప్రమాదముంది."

అర్థం కానట్టు చూసింది.

"ప్రమాదం ఇంత దూరం దాకా వ్యాపించక పోవచ్చు దేవీ. ఐనా మనం ఈ రాత్రికి ఓ యాభై కిలోమీటర్ల దూరం దాకా వెళ్ళి విశ్రమించడం నయం"

"ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది."

రగులుకుంటున్న రాక్షసి బొగ్గులా చౌదరి నేత్రాల్లో ఎరుపు జీరలు చోటుచేసుకున్నాయి

సామ్రాజ్యాన్ని శాశ్వతంగా సమాధి చేయబోతున్నాను దేవి. . . దానికి సరిగ్గా ఈ రాత్రి పన్నెండు గంటలకి ముహూర్తం నిర్ణయించాను.”

రణరక్త ప్రవాహసిక్తమైన నరజాతి చరిత్రకి చివరి పుటలా చౌదరి పెదవులపై నవ్వు మెరిసింది. బీభత్సరస ప్రధానమైన ఆఖరి అంకం గురించి చెప్పాడు చౌదరి ఉన్మాదిలా . “బోపాల్‌లోని ఓ అర్ధరాత్రి అంతా ఆదమరచి నిద్రపోతున్న సమయంలో ఓ మందుల కంపెనీలో గ్యాస్ లీకై కొన్ని వేలమంది ప్రాణాలు బలితీసుకుంది దేవీ - ఆ గ్యాస్ పేరు మిథైల్ ఐసో సైనేడ్ ..... ఆ తర్వాత జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అదెంత అలజడిని సృష్టించిందో నీకు తెలుసుగా.....”

దారుణాలు చేయటం అలవాటైన దేవి మొహంలో సైతం అలజడి పేరుకుంది.

“ఈ రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకి ఉపాధ్యాయ మందుల కంపెనీలోని అలాంటి గ్యాస్ టాంకర్ బరస్ట్ కాబోతూంది. సెకెండ్ల వ్యవధిలో అది మైళ్ళ తరబడి వ్యాపిస్తుంది. ఫ్యాక్టరీ కార్మికులతో బాటు ఆదమరిచి నిద్రపోతున్న నగరంలోని చాలా మంది జనం ఆ గ్యాస్‌కి ఆహుతి కాబోతున్నారు.”

ఈర్ష్య స్పర్ధ వైషమ్యం స్వార్ధ పరత్వాలు ఎలాంటి నరమేధానికి కారణమౌతున్నదీ చెప్పిన చౌదరి ఇక ఆలస్యం చేయలేదు “నాతో బయలుదేరుతున్నావా. . . ”

సిద్ధమౌతూనే అంది దేవి “మీ వాళ్ళంతా. . .”

“నా వాళ్ళనుకున్న మనుషులంతా ఇప్పటికే నగరం వదిలి వెళ్ళిపోయారు దేవీ... పాతిక లక్షల రూపాయల డబ్బుకాశించిన ఆత్మహత్యాదళం మాత్రం ఈ పాటికే ఫ్యాక్టరీని చేరుకుని వుంటుంది. మరో అరగంటలో మొత్తం ఆపరేషన్ పూర్తి చేస్తారు.”

సన్నగా కంపిస్తూనే దేవి అతడితో బయలుదేరబోయింది కాని అదిగో అప్పుడు వినిపించింది కేకలు.

ఉద్విగ్నంగా దేవి, చౌదరి ఇద్దరూ గది బయటికి వచ్చారు.

“అమ్మా. . . అతను. . .” శిష్యుల బృందం ఆందోళనగా చెబుతుంటే అప్పుడు చూసాడు చౌదరి. . .

విశ్వ ప్రహరీ వేపు పరుగెడుతున్నాడు చేతిలోని ఓ కేసెట్‌తో.

అదిరిపడ్డాడు చౌదరి.

అంతే. . .

ఇంతసేపూ జరిగిన కార్యక్రమం చర్చ అంతా రికార్డ్ చేసాడా. . .

అది కాదు. . . ఆ కేసెట్‌లో తను సృష్టించాలనుకున్న మారణ హోమపు వివరాలు కూడా రికార్డ్ చేయబడి వుంటాయి.

అదే తన బ్రతుకు యితిహాసంలో ఆఖరి చీకటి కోణం అనిపించిందేమో గాభరాగా ఫోన్ అందుకున్నాడు . . . గుండె కొట్టుకుంటుంది మృదంగనాదంలా . . . “కేసెట్‌తో పారిపోతున్న

విశ్వా బ్రతకకూడదు. అది మాత్రమే కాదు. వాడి చేతిలోని కేసెట్‌ని లాక్కోవాలి. . .  అది కేసెట్ కాదు. . .  నా సామ్రాజ్యాన్ని పేల్చేసే అణ్వాయుధం. . . మన వాళ్లనందర్నీ అలర్ట్ చెయ్. . . పోలీసు స్టేషన్‌ల కెళ్ళే మార్గాల్తో బాటు ముఖ్యంగా ఉపాధ్యాయ ఫ్యాక్టరీ రూట్స్‌లో కాపలా వుండండి. . . కనిపించగానే కాల్చేయండి. . .  వెంటనే. . . ”

చౌదరి ఫోన్‌లో ఎవరికి ఆదేశిస్తున్నదీ దేవికి అర్థం కలేదు.

ఇప్పుడు దేవి కూడా వణికిపోయింది. . . ఏ కేసెట్ గురించి చౌదరి భయపడు తున్నాడో అదే కేసెట్ తన చరిత్ర కాఫిన్ బాక్స్‌ని మూసేయగల చివరి మేకు అవుతుంది.

చౌదరి ఆదేశించిన అయిదు నిముషాలలో నగరం రగిలిన చితాగ్ని గుండమైంది.

కొన్ని దశాబ్దాలుగా అతడు పెంచిన ముష్కరులు యమకింకరుల్లా రంగంలోకి దిగారు.

సాయుధులైన చౌదరి గూండాలు అన్ని వేపుల నుంచి విశ్వాని చుట్టుముట్టడానికి సిద్ధపడ్డా ముఖ్యంగా కాపలా కాసింది ఉపాధ్యాయగారి ఫ్యాక్టరీకి వెళ్ళే మార్గాల్లో. . .

కారణం అప్పుడు సమయం రాత్రి పదకొండు గంటల నలభై నిముషాలు. . .

అంటే చౌదరి అనుకున్న నరమేధానికి మిగిలిన వ్యవధి కేవలం ఇరవై నిముషాలు మాత్రమే.

విశ్వాలాంటి వ్యక్తి మిగిలిన గడువులో ఉపాధ్యాయ ఫ్యాక్టరీకి వెళ్ళాలని ప్రయత్నిస్తాడు తప్ప పోలీసుల్ని కలుసుకోవటానికి ప్రయత్నించడు. . .

చౌదరి అంచనా తప్పు కాలేదు.

0 0 0

ఆందోళనగా చీకటిలో దూసుకుపోతున్న విశ్వా టైం చూసుకున్నాడు.  రాత్రి పదకొండు గంటల నలభై ఏడు నిముషాలు.  మిగిలింది పదమూడు నిముషాలు. . .

ఉపాధ్యాయ ఫ్యాక్టరీ వున్నది సరిగ్గా తొమ్మిదిన్నర కిలోమీటర్లు దూరంలో . . .

అంతే. . .

చౌదరి ఆత్మాహుతి దళం ఈపాటికే ఫ్యాక్టరీని సమీపించి వుంటుంది. . .

నగరం ఆదమరిచి నిద్రపోతున్న నిశిరాత్రి. . .  ఒకటి అరా వెళ్ళే కార్ల రొద తప్ప అంతా ప్రశాంతంగా వుంది. . .

మృత్యువు కబళించటానికి మిగిలింది స్వల్పకాలం.

పరుగెడుతున్న విశ్వ కనీసం ఒక్క టాక్సీ అయినా దొరుకుతుందేమో అని చూసాడు.

ప్రయోజనం లేకపోయింది. . .

ఆర్తితో వూపిరి ఆగిపోయినట్టయింది. . .

దూరంగా ఓ జీపు వేగంగా దూసుకువస్తుంటే ఆపటానికి ప్రయత్నించబోయి అనుమానంగా చీకటిలోకి తప్పుకున్నాడు.

విశ్వా ఆ క్షణంలో చేసిన తెలివైన పని అదే. . .  అయితే చౌదరికి చెందిన ఆ దళంలో

ఒకడు విశ్వని గమనించాడు అనుకోకుండా.

అది ఊహించిన విశ్వా ఆ జీపుని పట్టించుకోకుండా ఓ మూలనున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోకి ప్రవేశించాడు.

టెన్షన్‌లో కృషి ఫోన్ నెంబర్ గుర్తుకు రాలేదు. . . తేరుకోవడానికి ఇంకో రెండు నిముషాలు పట్టింది.

కౌంట్‌డౌన్ మొదలైనట్టు రిస్టు వాచీ పదకొండు యాభై సూచిస్తూంది.

"కృషీ" ఆయాసంతో రొప్పుతూ అన్నాడు. "నేను విశ్వాని మాట్లాడుతున్నాను."

"చెప్పండి" అతడికన్నా ఉద్వేగంగా అడిగింది కృషి అవతల వేపునుంచి.

టెలిగ్రాఫిక్ కోడ్‌లా చెప్పాడు అంతా. . .

"చౌదరి నేరస్థుడని నిరూపించే బలమైన ఆధారం కేసెట్ రూపంలో నా దగ్గరుంది కృషీ. కాని యిప్పుడు మనకి అది అవసరం కాదు . . . లక్షల మంది ప్రాణాలు మిగలాలి అంటే నేను ఫ్యాక్టరీని చేరుకోవాలి. అది నాకు సాధ్యమయ్యే పని అవునో కాదో నాకూ తెలీదు. అయినా ప్రయత్నిస్తాను. ఈ లోగా నువ్వు పోలీసుల్ని, ప్రజల్ని అలర్ట్ చేయటానికి ప్రయత్నించు. ఉన్న గడువులో అది నీకు సాధ్యమయ్యేపని కాకపోవచ్చు. బట్. . . తప్పదుగా. . .చివరిగా ఒక్కమాట. . ."

కృషి కళ్ళనుండి నీళ్ళు రాలుతున్నాయి ఆందోళనగా.

"నేను నిన్ను మళ్ళీ కలుస్తానో లేదు చెప్పలేను. కాని నా పరంగా జరిగిన పొరపాట్లకి మాత్రం నన్ను మన్నించమని చివరిసారిగా అభ్యర్ధిస్తున్నాను . . . బై కృషీ " కంపించిపోతున్నాడు విశ్వా కూడా "ఐ లవ్యూ. . . "

స్వేదంతో తడిసిపోతున్న విశ్వా అప్పుడు చూసాడు . . . ముందు జీపు హెడ్ లైట్స్ కనిపించాయి. అది తను నిలబడి వున్న బూత్‌వేపే దూసుకు వస్తుందని గ్రహించటానికి పెద్ద టైం అవసరం లేకపోయింది. కాని అప్పటికే ఆలస్యమైంది. . .

అతడు అప్రతిభుడై చూస్తూండగానే టెలిఫోన్ బూత్‌ని గుద్దింది బలంగా. . .

ఓ ఆర్తనాదం తో నిశిరాత్రి ప్రతిధ్వనించింది.

0 0 0

అర్ధరాత్రి పదకొండు గంటల ఏభై రెండు నిముషాలు. . .

కృషి కారులో ఫ్యాక్టరీ వేపు దూసుకువస్తూంది.

ఆమె కళ్ళ నుంచి నీళ్ళు దార కడుతున్నాయి. రోడ్డు సరిగ్గా కనిపించలేదు. అప్పటికే ఆమె కమీషనర్‌కి ఫోన్ చేసింది. . . హోం సెక్రటరీకి, డి.జి.పి.కి., ఫైర్ సర్వీస్ ఇన్‌చార్జికి, ముఖ్యమంత్రి యింటికి విడిచిపెట్టకుండా జరగబోయే అనర్థం గురించి తెలియచేసింది.

ఈ ప్రోసెస్‌లో ఆమె సుమారు నాలుగు నిముషాలు ఖర్చు చేసింది. . . ఫ్యాక్టరీ సెక్యూరిటీకి ఫోన్ చేసింది కాని ఏమైందో తెలియనట్టు కంటీన్యూగా ఎంగేజ్ వస్తుంది.

నగరమంతా కాకపోయినా అతి ముఖ్యమైన పాలనా యంత్రాంగాన్ని ఆమె నిద్ర లేపగలిగింది కాని ఎవరు ఎంతవరకూ సాయపడగలరూ అన్నది ఆమె ఊహించలేదు. . .

కంట్రోల్ రూం ద్వారా ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ సిస్టమ్ సహాయంతో ఉపాధ్యాయ ఫ్యాక్టరీ పరిసరాలలో పోలీసుల్ని అప్రమత్తం చేసాడు కమీషనర్.

కాని వెంటనే ఏం చెయ్యాలో వారికీ అర్థం కాలేదు. . . కృషి చెప్పిందే నిజమైతే మరికొన్ని నిముషాలలో విష వాయువు ఫ్యాక్టరీ నుంచి నలుదిక్కులా వ్యాపిస్తుంది. చిన్న పెద్దా అనే తేడా లేకుండ అందరి ప్రాణాల్నీ తీస్తుంది. అందుకే పోలీసులు ప్రజల్ని అప్రమత్తం చేయటానికి బదులు తమ తమ కుటుంబాల్ని దూరప్రాంతాలకి తరలించడంలో నిమగ్న మైపోయారు.

రాష్ట్ర హోం సెక్రెట్రీ డిజీపీలు నిజాయితీగా రియాక్టయి మిలటరీ కంటోన్‌మెంటుని సంప్రదించి సహాయక చర్యలకోసం ప్రయత్నించారు కాని వాళ్ళూ తమ నిస్సహాయతని వ్య క్తం చేసి మిగిలిన గడువులో తమని తాము కాపడుకోటానికి మార్గాలు అన్వేషించడం ప్రారంభించారు.

కృషి ఇవేమీ పట్టించుకోవడం లేదు.

మరణమే తప్పనిసరయితే అది పోరాటం ద్వారానే పొందాలి తప్ప పిరికిదానిలా తను పారిపోలేదు.

అందుకే ఏక్సిలేటర్ నొక్కింది మరింత బలంగా.

విశ్వ గుర్తుకొచ్చాడు.

ఏమయ్యాడు.

ఫ్యాక్టరీని చేరగలిగి ఉంటాడా.

లేక ఇంకా చేరే ప్రయత్నంలోనే వున్నాడా.

"భగవంతుడా" మరణయాతనలాంటి స్థితిలో దేవుడ్ని ధ్యానించింది కృషి. "ఈ క్షణంలో నేను ఆలోచిస్తున్నది నా గెలుపు గురించి కాదు. నువ్వు పొందకూడని ఓటమి గురించి. అవునయ్యా మృత్యువును ఆపగలిగేశక్తి నీకు మాత్రమే వుంటే ప్రాణాలు కోల్పోవటానికి సిద్ధంగా వున్న లక్షలమందిని కాపాడాల్సిన బాధ్యత నీది. ఏ దుష్టశక్తి విజృంభించినా శిష్టుల్ని రక్షించడం అవతార పురుషుడివైన నీ బాధ్యత అయితే యిదిగో నువ్వు దేవుడివని నిరూపించుకోవాల్సిన క్షణాలు సమీపించాయి"

మేధస్సుతో గాక కేవలం దైవికంగానే ఆగాల్సిన ఓ ఘోరం గురించి కృషి అశ్రుశిక్త నయనాలతో విధిని అడుగుతున్నప్పుడు టైం రాత్రి పదకొండు గంటలుదాటి ఏభై ఏడు

ఓ మారణహోమానికి మిగిలింది కేవలం మూడే మూడు నిముషాలు. . .

0 0 0

తూటాల మోతతో నిశిరాత్రి వణికిపోయింది.

తుఫాను మేఘంలా కదిలిన ఆత్మాహుతి దళం ఫ్యాక్టరీ సెక్యూరిటీ గేట్‌ను దాటి అప్పటికే ఆరుగురు సిబ్బందిని కడతేర్చేసారు. ఉన్నట్టుండి వినిపించిన బుల్లెట్ల చప్పుడికి అర్థం తెలీని ఫ్యాక్టరీ కార్మికులు కకావికలై పరుగెడుతున్నారు.

ఎటు చూసినా రక్తం. ఆ పైన హోరులాంటి హడావిడి. దుండగులు నిశీధిలోని టాంకర్ వేపు కదులుతున్నారు వేగంగా.

మరో అరనిముషంలో టేంకర్ వాల్వ్‌ని చిన్నాభిన్నం చేసేవారే.

అదిగో అప్పుడు జీపుతో లోపలికి దూసుకొచ్చాడు విశ్వ. టెలిఫోన్ బూత్ దగ్గర జీపుతాకిడికి ఓ చేయి అప్పటికే విరిగిపోయింది. పైబడిన గూండాల కత్తిపోట్లకి పొట్టనుంచి రక్తం చిమ్ముతూంది. అయినా పోరాడి జీపుని స్వాధీనం చేసుకున్నాడు. కడగంటిపోతున్న ప్రాణాలతో వేగంగా దూసుకురాగలిగాడు ఫ్యాక్టరీ దాకా.

వ్యవధిలేదు. చివరి ఘట్టానికి సన్నద్ధుడు కావాలి. ఆ క్షణంలో విశ్వకి దేవుడు గుర్తుకి రాలేదు. మరికొన్ని లిప్తల్లో ప్రాణాలు కోల్పోయే వేల లక్షలమంది అమాయకులైన వ్యక్తులు జ్ఞప్తికొచ్చారు. కాలావధులతో పోరాడాల్సిన నిరవధిక నిశీధిలో చివరిసాక్ష్యంగా మిగిలిన కేసెట్‌ని జీపులోనే వుంచి కిందికి దుమికాడు నీరసంగా.

కెరటంలా క్షీణించిపోతూ కడలిగా మారాలని చేస్తున్న విఫల ప్రయత్నంలో పద్మవ్యూహాన అడుగుపెట్టిన అభిమన్యుడయ్యాడు.

అనుకోని అవాంతరం క్షణంపాటు దూసుకొస్తున్న విశ్వ కథని ముందు పూర్తిచేయాలని వెనక్కి తిరిగారు.

నిశ్శబ్దంపై శబ్దంలా తూటాలు వర్షించాయి. చీకటిలోకి తప్పుకున్నాడు విశ్వ.

అదీ అరక్షణమే. వెనువెంటనే ఉత్పాతమై కదిలి ఓ మూల నిలబడ్డ ఆగంతుకుడిపై బడ్డాడు. విశ్వ వృక్షఛాయల ఉఛ్వాసంలా ముందుకురికిన ఓ వ్యక్తి నుంచి తనను తాను కాపాడుకోటానికి పట్టింది రెండు లిప్తలు. అయినా ఓతూటా భుజాన్ని చీల్చింది విషాదజంత్ర సంగీతంలా.

ఆక్రందనకి సైతం అవకాశంలేని గ్రీష్మాగ్నికీల. అతడు కనురెప్పలు బరువుగా వాలిపోతుంటే మృత్యు రంగస్థలంపై కదిలే సూర్యశిశువులా శక్తిని కూడగట్టుకున్నాడు.

పేలిన భృకుటిలో నుంచి పైకురికిన మూడో నేత్రమై ప్రత్యర్థి చేతిలోని స్టెన్‌గన్ అందుకున్నాడు ఒక్క వుదుటున.

అంతే. . .

"తన్నా దేహాంతర ప్రాప్తి

ర్ధీర స్త్రత్ర సమూహ్యాతి”

ఓ దేవుడా దేహనాశనం గురించి నేను ఇప్పుడు ఆలోచించటం లేదు. మరణానికైనా నేను సిద్ధమే కాని మారణహోమాన్ని ఆపేశక్తిని ప్రసాదించు.

ధాత్రి నిస్తబ్దతని చెరిపేస్తూ దగ్ధగీతమై ప్రత్యర్ధులపై తూటాల వర్షం కురిపిస్తున్నాడు.

“తస్మాత్యర్వాణి భూతాని

నత్వం శోచియ మర్హసి ”

నేనున్నది సర్వప్రాణులలోనే అయినప్పుడు నేను పోతేనేం ఆ ప్రాణుల్ని కాపాడే అవకాశాన్ని నాకు దక్కించు”

మృత్యు మస్తిష్కపు వాకిలిముందు నిలబడి బడలికతో తూలిపోతూ ఇంకా పోరాడుతూనే వున్నాడు. ఏమౌతున్నదీ అర్థం కావడం లేదు ప్రత్యర్ధుల్లో. ఎందరు నేలకూలింది తెలీడం లేదు. అసలతను ఇంకా బ్రతికే వున్నాడా లేక స్వప్నగర్భస్థమైన స్థితిలో కదులుతున్నాడా అన్నది తోచడం లేదు.

తను బిందువా లేక పగిలిన సింధువా అన్నది నిర్ణయించుకునే లోగానే కాలఘంటాద్వానాలకి దూరంగా సుదూరంగా దేవుడు ఆశీర్వదించిన ఉపనిషద్వాక్యంలా నేలకూలిపోయాడు.

ఏమైంది దేవుడూ. . .

నేను అనుకున్నది సాధించానా, నరమేధాన్ని ఆపగలిగానా. . .

ఓ భ్రాంతిలాంటి భావం.

అదిగో అప్పుడు కనిపించారెవరో మసకగా -

0 0 0

అపోలో హాస్పటల్. . .

ఇరవై నాలుగుగంటల సుదీర్ఘ పోరాటం తర్వాత కళ్ళు తెరిచిన విశ్వకి ముందు కనిపించింది కృషి.

శరీరం నిండా శవానికి చుట్టినట్లు తెల్లని బేండేజ్.

తను ఇంకా బ్రతికేవున్నాడా.

ఎన్ని యుగాల నిరీక్షణ తర్వాతనో కోరిన మనిషి తిరిగి దక్కినంత సంతృప్తితో కృషి లాలనగా అతడివేపు చూసింది.

అయితే తాను బ్రతికాడన్న మాట.

ఇంత మొండిపిల్లే. కృషి కూడా కంటతడి పెట్టగలదా.

“థేంక్యూ విశ్వా. . .థేంక్యూ” గొణుగుతుంది వెక్కిపడుతూనే.

“ఏమైంది ఆ ప్రమాదం. . .” ఆ క్షణంలో సైతం విశ్వ అడిగింది తన స్థితి గురించి కాదు

తను ఆపాలనుకున్న మారణ హోమం గురించి

"నీకు నా అభినందనలు విశ్వా" ఆప్యాయంగా తలనిమురుతూ పరామర్శిస్తున్నాడో వ్యక్తి.

అతడెవరో ముందు పోల్చుకోలేదు. పోల్చుకునేవాడే కాని గాయాలతో మెదడూ శరీరం మొద్దుబారిపోయింది.

"లక్షలమంది ప్రాణాలను కాపాడటానికి నీ ప్రాణాల్ని అర్పించాలనుకున్న నీ ప్రయత్నం చారిత్రాత్మకమైనది. ప్రత్యర్థుల్ని పట్టించావు. ఓ ఉప్పెన్ని ఆపగలిగావు. థేంక్స్ అండ్ కంగ్రాట్స్"

విశ్వ అప్పుడు గుర్తించాడు అభినందించిన వ్యక్తెవరో.

"థేంక్యూ ప్రైమ్ మినిస్టర్"

భాషకందని అభినందన బాష్పమైతే ఇప్పుడు విశ్వాని పరామర్శించటానికి ప్రత్యేకంగా రాష్ట్ర రాజధాని తరలివచ్చిన ప్రధాని నేత్రాలు చెమ్మగిల్లుతున్నాయి.

"యూ లౌ ఈచదర్" కృషి విశ్వని చూసి నవ్వింది. ప్రధానమంత్రి "బట్ ఐ లవ్ బోతాఫ్ యూ" ఆశీస్సుల్ని అందించి నెమ్మదిగా బయటకి నడిచారు.

హాస్పటల్లోని ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ ఖాళీ అయింది మరో రెండు నిముషాలలో.

ఇంకోలిప్తలో జీవితకాలం నీకేర్ నాదే అన్నట్టు కృషి పెదవులు విశ్వ పెదవులతో కలిసి వూపిరి నింపే ప్రయత్నంలే నిమగ్నమయ్యాయి.

-: శుభం :-